
'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50

సంపుటి: 18 | సంచిక: 163

బుధవారం 3-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పిల్లలకు పోషకాలు ఇలా...

ఐసీఎమ్‌ఆర్, ఎన్‌ఐఎన్ తల్లిదండ్రులకు ఇస్తున్న సూచనలపై కథనం -13లో



ప్రపంచాన్ని మార్చే చిప్!

భారత్‌లో తయారైన చిప్ ప్రపంచాన్నే మార్చేస్తుందన్న ప్రధాని మోదీ -15లో



ప్రజలు క్షమించరు

'నా తల్లిని అవమానించిన ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలను నేను క్షమిస్తానేమోగానీ ప్రజలు క్షమించబోరు' అని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



తప్పించుకున్న ఆప్ ఎమ్మెల్యే

పంజాబ్‌లోని అధికార ఆప్‌నకు చెందిన ఎమ్మెల్యే నాటకీయ పరిణామాల నడుమ పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకున్నాడు.

వివరాలు 6లో ▸



వెయ్యి మందిని మింగేసిన మట్టి

సూడాన్‌లో కొండచరియలు పడి ఓ గ్రామం తుడిచిపెట్టుకుపోయి వెయ్యిమంది చనిపోగా ఒక్కడు ప్రాణాలతో బయటపడ్డాడు.

వివరాలు 6లో ▸



నేడు 'ఇందిరమ్మ' గృహ ప్రవేశం

ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్తున్నారు.

వివరాలు 3లో ▸

కవిత సస్పెన్షన్

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం

ప్రకటన విడుదల చేసిన పార్టీ నేతలు

హరీశ్, సంతోష్‌పై వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన కేసీఆర్

ఆమె తీరు పార్టీకి నష్టం కలిగించేలా ఉందనే అభిప్రాయం

సాక్షి, హైదరాబాద్

ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై బీఆర్‌ఎస్ సస్పెన్షన్ వేటు వేసింది. పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు.. బీఆర్‌ఎస్ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు, పార్టీ ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవలి కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు నష్టం కలిగించే రీతిలో ఉన్నాయని బీఆర్‌ఎస్ అధిష్టానం భావించింది. కవిత వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేసీఆర్..ఆమెను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కవిత వ్యాఖ్యలపై కేసీఆర్ సీరియస్!

మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ లక్ష్యంగా కవిత చేసిన వ్యాఖ్యలను పార్టీ అధినేత కేసీఆర్ తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ, సీబీఐకి అప్పగించాలనే నిర్ణయం నేపథ్యంలో కవిత చేసిన ఆరోపణలు పార్టీకి తీవ్ర నష్టం కలిగించాయనే అభిప్రాయం ఆయన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సోమవారం అర్ధరాత్రి వరకు ఎర్రవల్లి నివాసంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మరికొందరు సీనియర్ నేతలతో సుదీర్ఘంగా

మిగతా 2వ పేజీలో ▶



కవిత కొత్త పార్టీ 'తెలంగాణ జాగృతి'!

- బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్‌తో భవిష్యత్ కార్యాచరణపై దృష్టి
- 'తెలంగాణ జాగృతి' సంస్థకే రాజకీయ పార్టీ రూపం
- తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన వారిని కలుపుకొని వెళ్లే యోచన
- నేడు మధ్యాహ్నం 12 గంటలకు మీడియా సమావేశంలో ప్రకటన

2 లో

రజతోత్సవాల నుంచే రగడ

నాడు ఎల్కతుర్తి సభపై కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత

- లేఖ లీక్ కావడంతో బీఆర్‌ఎస్‌లో కలకలం
- 4 నెలలుగా పార్టీ కీలక నేతలే లక్ష్యంగా వ్యాఖ్యలు
- సోదరుడు కేటీఆర్‌పైనా పరోక్ష విమర్శలు.. తాజాగా కాళేశ్వరంపై హరీశ్, సంతోష్ లక్ష్యంగా ఆరోపణలు

2 లో

కేంద్రం అంగీకరిస్తేనే..

హోం శాఖ నోటిఫికేషన్ ఇచ్చాకే కాళేశ్వరంపై సీబీ'ఐ'

- తొలుత ప్రాథమిక వివరాల సేకరణ..ఎఫ్ఐఆర్ నమోదు
- అనంతరం క్షేత్రస్థాయిలో దర్యాప్తు షురూ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు కేసు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వెళ్లింది. రాష్ట్రంలో రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసిన ఈ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కాగా ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఈ నెల 1న సీబీఐ డైరెక్టర్‌కు, కేంద్ర హోంశాఖకు పంపారు. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 6 ప్రకారం ఈ కేసు దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలియజేస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 51 (రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సీబీఐ రాష్ట్రంలోకి

మిగతా 12వ పేజీలో ▶

సుప్రీమే సర్వోన్నతం

రాష్ట్రపతితో రగడపై సీజేఐ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



- న్యాయం కోసం ఏ ఆదేశాలైనా ఇస్తాం
- అవసరమైతే చట్టాలనూ పక్కన పెడతాం
- రాష్ట్రపతి లేఖ ఫక్తు 'రాజకీయ' వివాదమే
- అయినా సమాధానమిచ్చి తీరతాం: సీజేఐ
- న్యాయసమీక్ష 'మౌలిక నిర్మాణం'లో భాగం
- ఆర్టికల్ 142 కట్టబెట్టిన అసాధారణ అధికారం
- రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై జస్టిస్ గవాయ్
- బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు తొక్కిపట్టజాలరు
- తమిళనాడు, బెంగాల్ తరపున సిబల్, సింఘ్వీ వాదనలు
- కేంద్రం తరపున తీవ్ర అభ్యంతరం తెలిపిన ఎస్‌జీ మెహతా
- పలు రాష్ట్రాల్లో రాజ్యాంగాన్ని పదేపదే తుంగలో తొక్కారు
- ఆ మురికిమయమైన గతాన్నంతా మేం తవ్వాల్సి ఉంటుంది
- రాష్ట్రాలవారీగా ఆధారాలను కోర్టుకు సమర్పిస్తామన్న మెహతా
- వ్యక్తిగత ఉదంతాలు ఎందుకు లెమ్మంటూ వారించిన సీజేఐ
- రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించేందుకే పరిమితమవుతామని వెల్లడి

6 లో

ఆ నివేదిక ఆధారంగా చర్యలొద్దు

కాళేశ్వరంపై కమిషన్ నివేదికను సీబీఐకి రిఫర్ చేయొద్దు

- ఎన్‌డీఎస్‌ఏ, ఇతర రిపోర్టుల ఆధారంగా దర్యాప్తు జరపవచ్చు.. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌కు ఊరట
- ఐఏలపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలన్న ధర్మాసనం
- విచారణ అక్టోబర్ 7కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ నివేదిక ఆధారంగా పిటిషనర్ల (కేసీఆర్, హరీశ్‌రావు)పై ఎలాంటి చర్యలు చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ ఘోష్ నివేదికను సీబీఐకి రిఫర్ చేయవద్దని స్పష్టం చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), ఇతర నివేదికలపై

మిగతా 12వ పేజీలో ▶

అవినీతిపరులకు బీజేపీలో చోటు లేదు

కాళేశ్వరం అవినీతిపై సీబీఐ దర్యాప్తు కోరడం సముచితం: ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: 'బీజేపీలో అవినీతిపరులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటు ఉండదు' అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్ స్పష్టం చేశారు. 'మొన్న కాళేశ్వరం కూలింది... నిన్న బీఆర్ఎస్ కూలింది. కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలితే, బీఆర్ఎస్ మూడు ముక్కలైంది' అని ఆయన ఎద్దేవా చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడం సముచిత నిర్ణయం అని లక్ష్మణ్ స్వాగతించారు. అయితే, ఈ నిర్ణయాన్ని తీసుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి 22 నెలలు ఆలస్యం చేసినందుకు ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు బీఆర్ఎస్ అవినీతిపై ఆధారాలు ఉన్నాయని చెప్పిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఆ ఆధారాలను సీబీఐకి అప్పగించి విచారణకు సహకరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఢిల్లీలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత బహిరంగంగానే హరీశ్‌రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారని, వారిని అవినీతి అనకొండలుగా అభివర్ణించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంకోసం యువత, ఉద్యోగులు చేసిన త్యాగాలను కేసీఆర్ కుటుంబం క్యాష్ చేసుకుందని లక్ష్మణ్ ఆరోపించారు.

కవితను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

కాంగ్రెస్‌ను కూడా నాశనం చేస్తుంది: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



జడ్చర్ల: బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ కవితను కాంగ్రెస్‌లోకి చేర్చుకోవద్దని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆమె తన తండ్రి పెట్టిన పార్టీనే నాశనం చేసింది.. కాంగ్రెస్‌లోకి వస్తే ఈ పార్టీని కూడా నాశనం చేస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం ఆయన జడ్చర్లలో మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వ రం పంచాయితీ ఇప్పుడు బీఆర్ఎస్ ఇంటి పంచాయితీగా మారిందన్నారు. తనకు రావాల్సిన కమీషన్లు రాలేదని కవిత రోడ్డుకెక్కిందని, సీబీఐ విచారణ జరిగితే తమ అవినీతి అక్రమా లు బయటకు వస్తాయని భావించిన బీఆర్ఎస్ ధర్నాలు చేపట్టిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఒక టీఎంసీ సామర్థ్యం పెంపు కోసం అదనంగా రూ.32 వేల కోట్లు వెచ్చించారని తెలిపారు. ఎంపీ ఎన్నికల సమయంలో బీజేపీకి మద్దతిచ్చి 8 స్థానాల్లో గెలిచేందుకు కారణమైన బీఆర్ఎస్.. ఇప్పుడు మోదీ దగ్గరికి వెళ్లి పైరవీలు చేసి క్లీన్‌చిట్ తెచ్చుకోవాలన్నారు.

ఇంకా చూస్తే



చిరు వ్యాపారి అయిన నీకు ఈ నోటీసు ఇచ్చి పెద్ద వ్యాపారిని చేశాం.. సంతోషించి వెంటనే చెల్లించు..!

మరిన్ని రాష్ట్ర వార్తలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో..



వైఎస్సార్‌కు ఘన నివాళి

ఇడుపులపాయలోని ఘాట్ వద్ద అంజలి ఘటించిన కుటుంబ సభ్యులు

సాక్షి కడప: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలోని ఘాట్ వద్ద వైఎస్సార్ కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు, శ్రేణులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, తనయుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కోడలు వైఎస్ భారతీరెడ్డి, సోదరుడు వైఎస్ సుధీకర్‌రెడ్డి, దివంగత డాక్టర్ ఈసీ గంగిరెడ్డి సతీమణి డాక్టర్ ఈసీ సుగుణమ్మ, కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి, వైఎస్ సమీప బంధువు వైఎస్ యువరాజ్‌రెడ్డిలతో పాటు పలువురు వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పించి రాజశేఖరరెడ్డి సేవలను స్మరించుకున్నారు.



తల్లి విజయమ్మతో వైఎస్ జగన్

నాన్న.. నిన్ను చాలా మిస్ అవుతున్నాను

వైఎస్సార్‌కు నివాళులర్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఘన నివాళులర్పించారు. 'నిన్ను చాలా మిస్ అవుతున్నాను' అంటూ పోస్టు చేశారు. వైఎస్సార్‌తో తాను కలిసి ఉన్న ఫొటోలు, వైఎస్సార్ ఘాట్ వద్ద కుటుంబసభ్యులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి నివాళులర్పిస్తున్న ఫొటోలను పోస్టుకు ట్యాగ్ చేశారు.

రజతోత్సవాల నుంచే రగడ

ఎల్కతుర్తి సభపై కేసీఆర్‌కు లేఖ రాసిన కవిత

- లేఖ లీక్ కావడంతో బీఆర్ఎస్‌లో కలకలం
- 4 నెలలుగా పార్టీ కీలక నేతలే లక్ష్యంగా ఎమ్మెల్సీ వ్యాఖ్యలు
- సోదరుడు కేటీఆర్‌పైనా పరోక్ష విమర్శలు
- తాజాగా కాళేశ్వరంపై హరీశ్, సంతోష్ లక్ష్యంగా ఆరోపణలు



సాక్షి, హైదరాబాద్: పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాది ఏప్రిల్ 27న ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభపై చేసిన వ్యాఖ్యలతో.. తొలిసారి ఎమ్మెల్సీ కవిత తన అసంతృప్త స్వరాన్ని విన్పించారు. తన తండ్రి, బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌కు మే 5న కవిత రాసిన లేఖ బయటకు రావడం, ఆ లేఖలో ఎల్కతుర్తి సభపై ఆమె చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. కేసీఆర్ ప్రసంగం 'పంచ్ లేకుండా' ఉందని, బీజేపీపై స్పష్టంగా విమర్శలు చేయలేదని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకపోవడానికి బీజేపీతో సంబంధమే కారణమై ఉండవచ్చని కార్యకర్తలు భావించారని పేర్కొన్నారు. కాగా ఈ లేఖ ఎవరు బహిర్గతం చేశారనే చర్చ జరగ్గా, బీఆర్ఎస్‌లో అంతర్గత విభేదాలను లేఖ బయటపెట్టిందనే అభిప్రాయం వ్యక్తమైంది.

మీడియాకు లేఖ లీక్‌పై సంచలన వ్యాఖ్యలు

అమెరికా పర్యటన నుంచి మే 29న తిరిగి వచ్చిన కవిత శంషాబాద్ విమానాశ్రయంలో లేఖ లీక్ వెనుక పార్టీ లోపలి వ్యక్తులే ఉన్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఉన్న కోవర్టులు పార్టీని బలహీనం చేస్తున్నారని ఆరోపించారు. తాను జైలులో ఉన్న సమయంలో బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసే ప్రతిపాదనలు వస్తే వ్యతిరేకించినట్లు వెల్లడించారు. మరోవైపు తన సోదరుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వ శైలిని కూడా పరోక్షంగా విమర్శిస్తూ పార్టీ ట్విట్టర్‌కు పరిమితం కావద్దని అన్నారు. తాను కొత్తగా పార్టీ పెట్టే అవకాశాన్ని ఆమె ఖండించకపోవడం అప్పట్లోనే ఊహాగానాలకు తెర లేపింది.

పార్టీ నేతలపైనా ధ్వజం

కేటీఆర్‌పై పరోక్ష విమర్శలు గుప్పించిన కవిత పార్టీతోనూ అంటీముట్టనట్లుగానే వ్యవహరిస్తూ వచ్చారు. రక్షాబంధన్ సందర్భంగా గత నెల 9న కేటీఆర్ ఢిల్లీ పర్యటనకు వెళ్లడం విభేదాలను మరింత స్పష్టం చేసిందనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. కాగా ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవిత చేసిన వ్యాఖ్యలను ప్రశ్నించిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పార్టీ నేత కార్తీక్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ బలహీనంగా ఉండటానికి జగదీశ్‌రెడ్డే బాధ్యుడని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గత నెల 16న కవిత అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో.. సింగరేణి కాలరీస్‌లో బీఆర్ఎస్ అనుబంధ ట్రేడ్ యూనియన్ (టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న కవితను తొలగించి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను నియమించారు. దీనిపై కవిత తీవ్రంగా స్పందిస్తూ, తన లేఖ లీక్‌లో పాల్గొన్న 'కుట్రదారులు' తనను హింసిస్తున్నారని ఆరోపించారు. ఇక సోమవారం అమెరికా నుంచి తిరిగి వచ్చిన తర్వాత.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కేసీఆర్‌కు అవినీతి మరక అంటడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్ కారణమని ఆరోపించడంతో పార్టీలో కలకలానికి కారణమయ్యారు.

కవిత కేంద్రంగా వివాదాలు

2023లో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కవిత కేంద్రంగా వివాదాలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో 2023 మార్చి 11, 21 తేదీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కవితను ప్రశ్నించింది. ఆమె సౌత్ గ్రూప్‌లో భాగమైనట్లు ఈడీ ఆరోపించింది. అయితే కవిత.. తనపై ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో తనిఖీలు చేసిన ఈడీ మార్చి 15న ఆమెను అరెస్టు చేసింది. సుమారు ఐదున్నర నెలల తర్వాత జైలు నుంచి విడుదలైన కవిత తనను రాజకీయ కారణాలతో అరెస్టు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచి వచ్చిన తర్వాత కొంతకాలం మౌనంగా ఉన్న కవిత.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే అంశంపై ఈ ఏడాది జూన్‌లో ఆందోళనలు నిర్వహించారు.

కవిత కొత్త పార్టీ 'తెలంగాణ జాగృతి'!

- బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై దృష్టి
- 'తెలంగాణ జాగృతి' సంస్థకే రాజకీయ పార్టీ రూపం
- తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన వారిని కలుపుకొని వెళ్లే యోచన
- ఎమ్మెల్సీ పదవికి రాజీనామాపై సన్నిహితులతో మంతనాలు
- నేడు మీడియా సమావేశంలో కీలక ప్రకటన

సాక్షి, హైదరాబాద్: కొంత కాలంగా పార్టీ కీలక నేతలు లక్ష్యంగా ఘాటు విమర్శలు చేస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ఆమె దృష్టి సారించారు. ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో సంస్థాగత అంశాలు, పార్టీ కీలక నేతలు లక్ష్యంగా విమర్శలు చేస్తుండగా.. ఇకపై బహుముఖ వ్యూహాన్ని అనుసరించే యోచనలో ఉన్నారు. ప్రస్తుతానికి బీజేపీ, కాంగ్రెస్ సహా ఏ ఇతర పార్టీలోనూ చేరకూడదని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం తాను అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్న 'తెలంగాణ జాగృతి' సంస్థకు రాజకీయ పార్టీ రూపం ఇవ్వడం ద్వారా భవిష్యత్ రాజకీయ ప్రస్థానం ప్రారంభించాలని నిర్ణయించారు. తెలంగాణ ఆత్మ గౌరవం, అస్తిత్వం ఎజెండాతో ప్రజల్లోకి వెళ్లేలా కొత్త పార్టీ కార్యాచరణ ఉండే అవకాశముంది. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలంగా పనిచేసిన వ్యక్తులు, సంస్థలతో పాటు కలిసి వచ్చే వారిని కలుపుకొని రాజకీయంగా అడుగులు ముందుకు వేయడంపై కవిత కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. తెలంగాణ జాగృతి కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్న మీడియా సమావేశంలో ఈ మేరకు కీలక ప్రకటన చేసే అవకాశముందని ఆమె సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. కాగా తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటు సమయంలో తన తండ్రి కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన రీతిలోనే.. కవిత కూడా బీఆర్ఎస్ ద్వారా సంక్రమించిన ఎమ్మెల్సీ పదవిని వదులుకునే యోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనిపై తన సన్నిహితులతో మంతనాలు సాగిస్తున్నట్లు సమాచారం.

సాంస్కృతిక ఉద్యమానికి పదును

ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ ఆత్మ గౌరవ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సాంస్కృతిక ఉద్యమానికి పదును పెట్టాలని కవిత భావిస్తున్నారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు 20కి పైగా దేశాల్లో సంబురాలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిసింది. అంతేకాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించే అవకాశమున్నట్లు తెలిసింది.

జాగృతి కార్యాలయం వద్ద నిరసన

కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్‌రావు దిష్టిబొమ్మలు దగ్ధం చేసి నినాదాలు చేశారు. మరోవైపు కవిత మంగళవారం జాగృతి నేతలతో భేటీ అయ్యారు.

కవిత సస్పెన్షన్

▶ మొదటి పేజీ తరువాయి



కవితను సస్పెండ్ చేస్తూ బీఆర్ఎస్ ప్రకటన

చర్చించిన కేసీఆర్.. పార్టీ ప్రయోజనాలు, కేడర్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కవితపై సస్పెన్షన్ వేటుకు ఆదేశించినట్లు సమాచారం. ఇకపై కవిత చేసే ఆరోపణలు, విమర్శలకు స్పందించాల్సిన అవసరం లేదనే అభిప్రాయం కేసీఆర్ వ్యక్తం చేసినట్లు తెలిసింది.

కేసీఆర్ ప్రజల సొత్తు అంటున్న నేతలు

కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీకి చెందిన అన్ని స్థాయిల నేతలు స్వాగతించారు. పార్టీ కోసం కన్నబిడ్డను కూడా వదులుకున్న నేత కేసీఆర్ అంటూ పలువురు నాయకులు కొనియాడారు. కేసీఆర్ ప్రతిష్టపైనే బీఆర్ఎస్ మనుగడ, 60 లక్షల మంది కేడర్ భవిష్యత్తు ఆధారపడి ఉందనే విషయాన్ని కవిత మరిచిపోయి విమర్శలు చేశారంటూ పలువురు నేతలు ప్రకటనలు విడుదల చేశారు. కేసీఆర్ ప్రతిష్టను మసకబార్చేలా ఆమెను ఎవరో మానసిక ఒత్తిడికి గురి చేసి ఉంటారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఒకరు వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో కవిత చేసిన ఆరోపణలు కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న విమర్శలకు ఊతమిచ్చేలా ఉన్నాయనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమవుతోంది. కేసీఆర్‌కు, పార్టీకి బాధ కలిగించే అంశమైనప్పటికీ సస్పెన్షన్ తప్ప నిసరి అని పార్టీ అధినేత భావించారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ కీలక భేటీ

కేటీఆర్‌తోపాటు పలువురు హాజరు

హైకోర్టు విచారణపై పార్టీ అధ్యక్షుడి ఆరా



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం ఎర్రవల్లి నివాసంలో సమావేశం నిర్వహించారు. రెండు రోజులుగా ఎర్రవల్లి నివాసంలోనే ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు పలువురు పార్టీ ముఖ్య నేతలు సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌కు ఆదేశించిన కేసీఆర్, ఇతర అంశాలపైనా చర్చించినట్లు తెలిసింది. హైకోర్టు లో పీసీ ఘోష్ కమిషన్‌పై న్యాయ విచారణ, కోర్టు ఆదేశాలు తదితరాలపై కేసీఆర్ ఆరా తీశారు. రాష్ట్రంలో సీబీఐ అడుగుపెట్టకుండా గత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఎత్తి వేస్తూ ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కేసీఆర్ చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ఆదేశించడం ద్వారా ప్రభు త్వం చేస్తున్న కుట్రలు ప్రజలకు వివరించాలని కేసీఆర్ సూచించారు. సీబీఐ విచారణపై న్యాయ పోరాటం చేయడానికి ఉన్న అవకాశా లపై కేసీఆర్ చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో పాటు పలువురు సీనియర్ నేతలు పాల్గొన్నారు. కాగా తన కూతురును కాలేజీలో చేర్పించేందుకు లండన్‌కి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు ఈనెల 7న తిరిగి హైదరాబాద్‌కు రానున్నారు.

కవిత పాత్రతో కొత్త నాటకం

- కేసీఆర్ ఆజ్ఞ లేనిదే ఆయన కుటుంబంలో చీమ కూడా కదలదు
- కాంగ్రెస్ నిర్ణయాలతో బీఆర్ఎస్, బీజేపీ నేతల గుండెల్లో రైళ్లు
- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్




సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ కవిత పాత్రను ముందుపెట్టి కేసీఆర్ కుటుంబం కొత్త నాటకానికి తెరతీసిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు. కవిత పేరుతో కేసీఆర్‌ను రక్షించే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే ఆమె చిలక పలుకులు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఆజ్ఞ లేనిదే ఆ కుటుంబంలో చీమ కూడా కదలదని అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు. దొంగల ముఠా వాటాలు పంచుకోవడంలో తేడాలు వచ్చినందునే కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు మొదలయ్యాయని ఆరోపించారు. మొన్నటివరకు కేటీఆర్ మీద ఆరోపణలు చేసిన కవిత.. ఇప్పుడు అస్త్రాన్ని హరీశ్‌రావు వైపు మరల్చడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

కేసీఆర్‌దే కాళేశ్వరం బాధ్యత: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి కర్త, కర్మ, క్రియ అన్నీ తానేనని చెప్పుకున్న కేసీఆర్.. అందులో జరిగిన అవినీతికి కూడా బాధ్యత వహించాల్సిందేనని మహేశ్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఆ అవినీతిలో కేసీఆర్, హరీశ్‌రావు, ఇతరుల వాటాలు ఎంతో సీబీఐ విచారణలో తేలుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందన్న బీజేపీ నేతలు.. ఇప్పుడు నిజాలు నిగ్గు తేల్చాలని సవాల్ చేశారు. బంతి ఇప్పుడు సీబీఐ కోర్టులోకి వచ్చిందని, వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే బీజేపీ, బీఆర్ఎస్‌లు కూడబలుక్కుని రాజకీయాలు చేస్తున్నాయని భావించాల్సి వస్తుందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో హరీశ్‌రావు, కేటీఆర్, కవితతో పాటు అప్పట్లో ఉన్న కొందరు ఎమ్మెల్యేల పాత్ర కూడా ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. ముస్లింలను బూచిగా చూపి బీసీల నోటికాడి ముద్దను లాక్కునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు.


దివంగత నేతకు ఘన నివాళి: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా.. కాంగ్రెస్ పార్టీ ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే దానం నాగేందర్‌లతో పాటు సీనియర్ నేతలు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకే కవిత సస్పెన్షన్: ఎమ్మెల్యే పల్లా



జనగామ: బీఆర్ఎస్ పార్టీలోని 60 లక్షల మంది కార్యకర్తల అభిప్రాయం మేరకే ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. జనగామలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కవిత పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టంచేశారు. కల్వకుంట్ల కుటుంబాన్ని చీల్చేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని, ఇందులో భాగంగానే కవిత వ్యాఖ్యల వెనక ఆ పార్టీ నేతల హస్తం ఉందని రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలను చీల్చి వారి కుటుంబాల్లో చిచ్చు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. కర్ణాటక, తమిళనాడులో ఇదే పద్ధతిని అవలంబించారన్నారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ మాటలను నమ్మి కవిత లొంగిపోయిందని రాజేశ్వర్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కవిత సస్పెన్షన్‌ను స్వాగతిస్తున్నారన్నారు.

పార్టీ కోసం కన్నబిడ్డను వదులుకున్న నాయకుడు కేసీఆర్: ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: నాడు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడి, నేడు పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద వ్యాఖ్యానించారు. కన్న కూతురు కంటే పార్టీ ముఖ్యమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయం హర్షించదగినదని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పార్టీ కంటే ఎవరూ పెద్ద వారు కాదనే విషయం స్పష్టమైందన్నారు. కూతురు కంటే కూడా కష్ట కాలంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని వివేకానంద తెలిపారు.

డబ్బు పంపకాల్లో తేడాలతో విభేదాలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



నల్లగొండ జిల్లా గుండ్రాంపల్లిలో అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న రాంచందర్‌రావు

చిట్యాల: బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్లలో దోచుకున్న డబ్బుల పంపకాల్లో తేడాలు రావటంతోనే కేసీఆర్ కుటుంబంలో విభేదాలు వచ్చాయని, దీంతోనే ఆ పార్టీ నాయకులపై ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపణలు చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాంచందర్‌రావు హాజరై మాట్లాడారు. గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అవినీతికి పాల్పడ్డారని బీజేపీ చెబుతూ వచ్చిందని, ఇప్పుడు కవిత చెప్పడంతో నిర్ధారణైందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతితో పాటు ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

పార్టీలో కవిత.. ఉంటే ఎంత.. పోతే ఎంత?

కేసీఆర్ కుమార్తెగా ఆమె గౌరవాన్ని నిలుపుకోలేకపోయారు

- పార్టీ అధ్యక్షుడికి మచ్చ తెచ్చి పార్టీకి నష్టం చేశారు
- కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు: సత్యవతి రాథోడ్



మీడియాతో మాట్లాడుతున్న సత్యవతి రాథోడ్. చిత్రంలో మాలోత్ కవిత, గొంగిడి సునీత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు కుమార్తెగా కవిత ఎక్కడకు వెళ్లినా ప్రజలు స్వాగతించారని, కానీ ఆ గౌరవాన్ని ఆమె నిలుపుకోలేక పోయారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. పార్టీ ఉంటే ఎంత.. పోతే ఎంత అని మాట్లాడిన కవిత.. పార్టీలో ఉంటే ఎంత.. పోతే ఎంత అని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయన్నారు. కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత మచ్చ తెచ్చారని, ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత తదితరులతో కలిసి సత్యవతి రాథోడ్ మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

పార్టీకి కవిత ఎంతో నష్టం చేశారు..

'గడిచిన మూడు నెలలుగా కవిత బీఆర్ఎస్ శ్రేణులను బాధపెట్టి పార్టీకి ఎంతో నష్టం చేశారు. పేగు బంధం కన్నా తనను నమ్ముకున్న కోట్లాదిమంది ప్రజలే ముఖ్యమని కేసీఆర్ నిరూపించారు. కార్యకర్తలకన్నా కుటుంబ సభ్యులు ఎక్కువ కాదని పార్టీ తర్వాతే ఎవరైనా అనే సందేశాన్ని ఇచ్చారు. కవితకు నచ్చచెప్పాలని చూసినా వినకపోవడంతో కేసీఆర్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. కేసీఆర్‌కు కుడి ఎడమ భుజాల వంటి సంతోష్, హరీశ్‌రావుపై కవిత నిరాధార ఆరోపణలు చేశారు' అని సత్యవతి రాథోడ్ అన్నారు.

ప్రజలే కేసీఆర్‌కు బాస్‌లు

ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్‌కు ప్రజలే బాస్‌లు అని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. కవిత చేసిన వ్యాఖ్యలపై కేడర్ ఆగ్రహంతో ఉందని, కవిత తన గొయ్యి తానే తవ్వుకున్నారని మండిపడ్డారు. కవితకు పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని, ఆమెను సస్పెండ్ చేయడాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు హర్షిస్తున్నారని మాలోత్ కవిత తెలిపారు.

స్టార్టింగ్ ప్రాబ్లమా

స్టార్టింగ్ ప్రాబ్లం.. మనం తరచూ వినే డైలాగ్. తలపెట్టిన పనులను తరచూ వాయిదా వేస్తుంటారు కొందరు. వారిని ఆట పట్టించడానికి 'స్టార్టింగ్ ప్రాబ్లమా' అని అంటుంటాం. వ్యాయామం, ఇంటి పనుల వంటివి ప్రారంభించడం కష్టంగా అనిపిస్తుందా? యూకేలోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ హాస్పిటల్స్‌లో న్యూరాలజీ వైద్యులు, న్యూరో సైంటిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఫేయ్ బెగేటి ఓ చక్కటి, సులభ పరిష్కారాన్ని ప్రతిపాదిస్తున్నారు. మెదడు శక్తిని పెంచడానికి, మానసిక అడ్డంకులను తొలగించడానికి నిబద్ధతతో కూడిన ఓ '5 నిమిషాలు' చాలు అంటున్నారు.



- సాక్షి, స్పెషల్ డెస్క్

రేపట్నుంచి వాకింగ్‌కు వెళ్తా..
డిసెంబర్ 31 నాడు.. 'జనవరి 1 నుంచి వాకింగ్ లేదా వ్యాయామం చేస్తా'
రేపట్నుంచి ఉదయం ఆరింటికే నిద్ర లేస్తా..
పోటీ పరీక్షలకు రేపట్నుంచి ప్రిపరేషన్ మొదలుపెడతా..

.. ఇలాంటి నిర్ణయాలు చాలామంది తీసుకుంటారు. కానీ, బద్ధకం వాటిని అమలు చేయనివ్వదు. అలాంటి కష్టమైన పనులను చేయడంలో మనసు, మెదడు.. రెండూ మొండికేస్తుంటాయి. మరి, దీన్ని అధిగమించడం ఎలా?
5 నిమిషాల నియమం.. మనసును సిద్ధం చేసే ఓ చిట్కా. ఇది వాయిదా వేసే మనస్తత్వాన్ని మారుస్తుంది. తద్వారా మానసిక అలసట తగ్గుతుందని బెగేటి అంటున్నారు. ఒక పనిని ప్రారంభించడానికి మనసు సన్నద్ధంగా లేనప్పుడు.. ఆ పనిని కేవలం 5 నిమిషాల సేపు చేసి చూడాలి. సాధారణంగా మన మెదడు పని కష్టాన్ని ఎక్కువగా అంచనా వేస్తుంది. అందువల్ల ఎక్కువ సేపు చేస్తే అలసిపోతానని ముందే ఊహించుకుంటుంది. కాబట్టి 5 నిమిషాల పాటు నిబద్ధతతో పనిచేస్తే మెదడు అలవాటు పడి, తరవాత ఆ పని కొనసాగించేలా ప్రేరేపిస్తుంది.

మానసిక అలసటే పెద్ద సమస్య

శారీరక అలసట ఉన్నా పర్వాలేదు గానీ.. మానసిక అలసట ఉంటే మాత్రం మెదడు పనిచేయనివ్వదు. మెదడు అలసటను.. స్మార్ట్‌ఫోన్ 'లో బ్యాటరీ' మోడ్‌తో పోల్చారు బెగేటి. లో బ్యాటరీ ఉన్నా మనం పనిచేస్తుంటే.. 'బ్యాటరీ లో' అని ప్రతిసారీ అరుస్తున్నట్టే.. 'నేను చేయను/చేయడానికి సిద్ధంగా లేను' అని మెదడు కూడా మొరాయిస్తుంది. సోషల్ మీడియా స్క్రోలింగ్ వంటి తక్షణ వినోదాన్ని అందించే సాధారణ కార్యకలాపాలను ఎంచుకోవడం ద్వారా.. మెదడు తక్కువ కష్టమైన పనులవైపు మొగ్గు చూపుతుంది. '5 నిమిషాల' నియమం.. మెదడుకున్న ఈ బద్ధకానికి చక్కటి చిట్కాలా పనిచేస్తుంది. '5 నిమిషాలే కదా చేసేద్దాం' అని చేసేస్తుంది.

దినచర్యగా మారుతుంది

ఏదైనా పనిని ప్రారంభించినప్పుడు మెదడు డోపమైన్‌ను విడుదల చేస్తుంది. ఇది ప్రేరణతోపాటు ఆనందం ఇచ్చే రసాయనం. ఈ 5 నిమిషాల ప్రక్రియ.. మనలో జోష్ నింపి ఆ సమయం తరవాత కూడా పని చేయడానికి ప్రేరేపిస్తుంది. ఇది ఒక దినచర్యగా అలవాటైతే.. దీర్ఘకాలంలో మెదడు చురుగ్గా, మరింత ప్రభావవంతంగా పనిచేసేందుకు దారితీస్తుందని బెగేటి పేర్కొన్నారు. వ్యాయామం, ఇంటి బాధ్యతలతో సహా ఏదైనా సవాలుతో కూడిన, శక్తిని వినియోగించే పనికి ఈ నియమం రోజువారీ సాధనంగా పనిచేస్తుంది. 5 నిమిషాల నియమం.. వాయిదా వేసే విధానానికి చెక్ పెట్టడంలో సహాయపడుతుంది. అదే సమయంలో నిర్ణయం తీసుకోవడంలోనూ , దృష్టి కేంద్రీకరించిన పని వల్ల వచ్చే అలసటను తగ్గించి మెదడును చురుగ్గా ఉంచుతుంది.



చిన్న చిన్న ప్రయత్నాలు

చిన్న చిన్న ప్రయత్నాలతో మెదడును సిద్ధం చేయండి. అవి నిరంతరం పనిని కొనసాగించేలా ప్రేరేపిస్తాయి.

రోజూ కేటాయించే ఆ 5 నిమిషాలు.. అంటే సంవత్సరానికి సుమారు 30 గంటల అభ్యాసంతో స్థిరంగా చేసే చిన్న పనులు పెద్ద ఫలితాలను ఇస్తాయి.

పనులను మరింత సులువుగా మొదలుపెట్టేందుకు ఈ చిట్కా తోడ్పడుతుంది.

మెదడు.. చేయనని మొండికేసే స్థితి నుంచి నేను చేయగలననే చురుకైన స్థితికి మారడానికి ఈ నియమం దోహద పడుతుంది.

జస్ట్ 5 నిమిషాల టైమ్ కేటాయించండి	వాయిదాలకు చెక్ పెట్టే మార్గం ఇదే	పనిని నిబద్ధతతో ప్రారంభిస్తే చాలు	రోజువారీ సాధనంగా సులభ నియమం

ఇలా విజయవంతం చేయండి

1. చేయాల్సిన పూర్తి పని నుంచి ఒక నిర్దిష్ట చిన్న విభాగాన్ని మీ ప్రారంభ సాధనంగా ఎంచుకోండి
2. ఇందుకోసం టైమర్‌లో అయిదు నిమిషాల సమయాన్ని సెట్ చేయండి
3. మీ దృష్టిని మరల్చే వాటిని గుర్తించి తొలగించండి.
4. 5 నిమిషాల తర్వాత పురోగతిని చెక్ చేయండి. దీనిని బట్టి ఆ పనిని కొనసాగించాలా వద్దా అని నిర్ణయించుకోండి.

వారంలోగా 118 ఏపీపీ ఉద్యోగాలకు నోటిఫికేషన్

హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టుల భర్తీకి వారంలోగా నోటిఫికేషన్ జారీ చేస్తామని హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం నివేదించింది. మొత్తం 262 ఏపీపీ పోస్టులు ఖాళీగా ఉండగా 118 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ జూన్‌లోనే ఆమోదం తెలిపిందని.. అయినా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ నోటిఫికేషన్ జారీ చేయడం లేదంటూ దాఖలైన 'పిల్'మంగళవారం సీజే ధర్మాసనం విచారణ సందర్భంగా ఏజీపీ సురేంద్రకుమార్ ఈ మేరకు వాదనలు వినిపించారు. ఈ వాదనలను నమోదు చేసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది. ఆలోగా నోటిఫికేషన్ వివరాలను తమ ముందు ఉంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది. రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఆధ్వర్యంలో ఈ పోస్టుల భర్తీ జరగనుంది.

సాక్షి జర్నలిస్టుకు తెలుగు వర్సిటీ 'కీర్తి పురస్కారం'



పురస్కారం అందుకుంటున్న ఆంజనేయులు

సాక్షి, హైదరాబాద్: వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు అందజేసే ప్రతిష్టాత్మకమైన తెలుగువిశ్వవిద్యాలయ కీర్తి పురస్కారం 'సాక్షి'సీనియర్ జర్నలిస్టు పగిడిపాల ఆంజనేయులుకు లభించింది. నాంపల్లిలోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగువిశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన కీర్తి పురస్కారాలు–2023 ప్రదానోత్సవంలో ఉపకులపతి ఆచార్య వెలిదండ నిత్యానందరావు ఈ అవార్డును ప్రదానం చేశారు. మలేసియాలో తెలుగు భాషా సంస్కృతుల అభివృద్ధి, విస్తరణ కోసం నాలుగు దశాబ్దాలకు పైగా విశేష కృషి చేస్తున్న మలేసియా తెలుగు సంఘం పూర్వ అధ్యక్షుడు దత్తో డాక్టర్ అచ్చయ్యకుమార్‌రావు జీవిత అనుభవాలపై రాసిన 'అలలెత్తిన కలల ప్రపంచం'అనే గ్రంథానికి.. జీవితచరిత్ర విభాగంలో తెలుగు విశ్వవిద్యాలయం ఈ పురస్కారాన్ని అందజేసింది.

ట్రాన్స్‌జెండర్లకు 'ఆసరా'పై జాప్యమెందుకు?

వివరణ ఇవ్వాలని హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్లకు ఆసరా పింఛన్లు, రిజర్వేషన్లు కల్పించడంలో ఆలస్యంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. తెలంగాణ నపుంసకుల చట్టం 1329 ఫస్లీ రాజ్యాంగ విరుద్ధమని.. ఆసరా పింఛన్లను లింగమార్పిడి వ్యక్తులకు విస్తరించాలని, విద్యాసంస్థలు, ప్రభుత్వ నియామకాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించేలా చర్యలు తీసుకోవాలని 2023లో సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. టాన్స్‌జెండర్ల కోసం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి సభ్యుడిగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని.. ఇందులో సభ్యకార్యదర్శి శాశ్వత సభ్యుడిగా ఉంటారని.. ఇతరులకు కాలపరిమితి విధించవచ్చని స్పష్టంచేసింది. అయితే ఈ తీర్పునిచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు వాటిఅమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. ఉద్దేశపూర్వకంగా కోర్టు ఆదేశాలను పాటించట్లేదంటూ దాఖలైన ధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

కేడర్ స్ట్రెంత్ నిర్ణయంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామపంచాయతీలను గ్రేడింగ్ చేసి.. క్యాడర్ స్ట్రెంత్ నిర్ణయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ (టీపీఎస్ఏ) హర్షం వ్యక్తం చేసింది. ఈ ప్రక్రియలో భాగంగా గ్రామ కార్యదర్శుల పదోన్నతులకు అంగీకరించినందుకు ప్రభుత్వానికి సంఘం అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు

'ఇందిరమ్మ' గృహప్రవేశానికి సీఎం రేవంత్

- బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను నేడు ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి
- రెండు గంటలపాటు భద్రాద్రి జిల్లాలో పర్యటన

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామానికి రానున్నారు. గృహప్రవేశం అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం ఇందిరమ్మ లబ్ధిదారులతో సమావేశం అవుతారు. మధ్యాహ్నం 3:15 గంటలకు రోడ్డు మార్గంలో అదే మండలంలోని దామరచర్ల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. గంటపాటు బహిరంగ సభలో పాల్గొంటారు.

ఏర్పాట్లలో బిజీబిజీ..

రెండు రోజులుగా సీఎం టూర్ షెడ్యూల్ ఉన్న ప్రాంతాల్లో బురదను తొలగించడం, జంగిల్ క్లియరెన్స్‌తో పాటు సభాస్థలిలో బురద నీళ్లు తోడటం వంటి పనులు నిర్విరామంగా జరుగుతున్నాయి. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సీఎం పర్యటన నేపథ్యంలో కొత్తగూడెం – విజయవాడ జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ మార్గంలో వెళ్లాల్సిన వాహనాలను కల్లూరు-తల్లాడ-ఏన్కూరు మీదుగా దారి మళ్లించారు.



భద్రాద్రి జిల్లా బెండాలపాడులో సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్న ఇందిరమ్మ ఇళ్ల పైలాన్

ప్రారంభం కూడా ఇక్కడే..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 మార్చి 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ పథకం ప్రారంభించిన జిల్లాలోనే ఇప్పుడు గృహప్రవేశ కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుండటం గమనార్హం.

ఎస్‌జీడీ ఫార్మా రెండో యూనిట్ ప్రారంభోత్సవానికి...

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాకు రానున్నారు. మూసాపేట మండలం వేముల శివారులో ఉన్న ఎస్‌జీడీ ఫార్మా కార్నింగ్ టెక్నాలజీస్ కంపెనీ రెండో యూనిట్‌ను సీఎం ప్రారంభిస్తారు. హైదరాబాద్‌లో ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30గంటలకు వేముల ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ వద్దకు చేరుకుంటారు. రెండో యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత కొద్దిసేపు పరిశ్రమ ఉద్యోగులు, ఇతర అధికారులతో సీఎం ముచ్చటిస్తారు. అనంతరం 12.45 గంటలకు హెలికాప్టర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళతారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం, బహిరంగ సభ అనంతరం సాయంత్రం 4:25 గంటలకు చంద్రుగొండ నుంచి హైదరాబాద్‌కు హెలికాప్టర్‌లో సీఎం తిరుగు ప్రయాణం అవుతారు.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేశ్ బజాజ్

వైస్ చైర్మన్‌గా మోహిత్ జైన్ ఎన్నిక



కరుణేశ్ బజాజ్

హైదరాబాద్: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్ (ఏబీసీ) కొత్త చైర్మన్‌గా ఐటీసీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కరుణేశ్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన 2025–26 కాలానికి ఆ పదవిలో కొనసాగుతారని ఏబీసీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. బెన్నెత్ కోల్‌మన్ కంపెనీ సీఓఓగా పనిచేస్తున్న మోహిత్ జైన్‌ను డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు వెల్లడించాయి. ఏబీసీ అడ్వర్టైజింగ్ రిప్రజెంటేటివ్ విభాగంలో సభ్యులుగా చైర్మన్ కరుణేశ్ బజాజ్‌తోపాటు టీవీఎస్ మోటార్స్‌కు చెందిన అనిరుద్ధ హల్దార్, మారుతి సుజుకీ నుంచి పార్థో బెనర్జీ ఉంటారు. పబ్లిషర్స్ రిప్రజెంటేటివ్ విభాగంలో సభ్యులుగా మోహిత్ జైన్‌తోపాటు ఏబీపీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి ధ్రుబ ముఖర్జీ, మలయాళ మనోరమకు చెందిన రియాద్ మాథ్యూ, డీబీ కార్ప్ నుంచి గిరీశ్ అగర్వాల్, జాగరణ్ ప్రకాశన్‌కు చెందిన శైలేష్ గుప్త, లోక్‌మత్ మీడియా నుంచి కరణ్ గుర్గ్, దినమలార్‌కు చెందిన ఆదిమూలమ్ కొనసాగుతారని ఏబీసీ వర్గాలు తెలిపాయి.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

సిమెంట్, స్టీల్ పరిశ్రమల యజమానులతో డిప్యూటీ సీఎం భట్టి



సమావేశంలో మాట్లాడుతున్న భట్టివిక్రమార్క. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: ప్రజాప్రభుత్వం మహోన్నత ఆశయంతో మానవీయకోణంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సంక్షేమ పథకం విజయవంతానికి రాష్ట్రంలోని సిమెంట్, స్టీల్ పరిశ్రమలు భాగస్వామ్యం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్, స్టీల్ పరిశ్రమల యజమానులు, ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రూ.22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటికే వేగంగా ఇళ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. స్టీల్, సిమెంట్ పరిశ్రమలను ఈ రాష్ట్రంలో ఎంతగానో ప్రోత్సహించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించి, భారీ భవంతుల నిర్మాణానికి ఏవిధమైన నాణ్యతతో సరఫరా చేస్తారో అలాగే రాజీ పడకుండా ఇందిరమ్మ ఇళ్లకు కూడా ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములై చేయూతనివ్వాలని శ్రీధర్‌బాబు కోరారు. పెద్ద, చిన్న అనే అంతరం లేకుండా కంపెనీలన్నీ ఒకే ధరకు సిమెంట్, స్టీల్ సరఫరా చేయాలన్నారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రభుత్వ పథకాలకు సిమెంట్ కంపెనీలు అందిస్తున్న ధరలపై సమావేశంలో సమీక్షించారు. 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల సిమెంట్, 27.75 లక్షల మెట్రిక్ టన్నుల స్టీల్ అవసరం అవుతుందని అధికారులు పరిశ్రమల యజమానులు, నిర్వాహకులకు వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రోత్సాహం అందించే అవకాశం కలగడం అదృష్టంగా భావిస్తున్నామని సిమెంట్, స్టీల్ కంపెనీల యజమానులు, ప్రతినిధులు తెలిపారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో వీలైనంత త్వరగా సమావేశమై ధరలు ఫైనల్ చేస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.

రేవంత్‌కు హైకోర్టులో ఊరట

ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు

సాక్షి, హైదరాబాద్: కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2021లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (నాడు ఎంపీ)పై దాఖలైన కేసులో హైకోర్టు ఊరటనిచ్చింది. ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేసింది. 2021లో కేంద్రం ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయడంతో పాటు పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించాలంటూ రాజ్‌భవన్ ముట్టడికి కాంగ్రెస్ పిలుపునిచ్చింది. అందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. పాత సచివాలయం నుంచి రాజ్‌భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ రేవంత్‌రెడ్డి సహా మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాజకీయ కక్షలో భాగంగా నమోదు చేసిన ఈ కేసును కొట్టేయాలంటూ రేవంత్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు.

కేటీఆర్‌కు కూడా ఊరట..

అమృత్ టెండర్ల విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించేలా ఎమ్మెల్యే కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ వ్యాపారవేత్త సృజన్‌రెడ్డి నాంపల్లి కోర్టులో ప్రైవేట్ పిటిషన్ వేశారు. 2011లో శోధ కన్‌స్ట్రక్షన్స్ ప్రారంభమైందని.. ఆ కంపెనీకి ఎండీగా కందాల దీప్తిరెడ్డి వ్యవహరిస్తున్నారని ఆయన తెలిపారు. శోధ కన్‌స్ట్రక్షన్స్‌తో తనను లింక్ చేస్తూ కేటీఆర్ అందరినీ తప్పుదారి పట్టిస్తున్నారంటూ సృజన్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను కొట్టివేయాలంటూ కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు ఇస్తూ నోటీసులు జారీ చేశారు.

తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టి తీరతాం

వైఎస్సార్ ఆలోచనను సాకారం చేస్తాం

- డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ అవార్డు ప్రదాన కార్యక్రమంలో సీఎం రేవంత్



పాలేకర్‌కు అవార్డు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో హరియాణా మాజీ సీఎం భూపేందర్‌సింగ్

సాక్షి, హైదరాబాద్: తుమ్మిడిహెట్టి వద్ద గోదావరిపై ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి సాగునీరు అందించాలనే దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనను తమ ప్రభుత్వం సాకారం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ ప్రారంభించిన ఎస్సెల్బీసీ టన్నెల్ పథకం పూర్తి చేస్తామని అన్నారు. మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ 16వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని హోటల్ దస్‌పల్లాలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ అవార్డు–2025 ప్రదానోత్సవ కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేంద్రీయ వ్యవసాయంలో ప్రఖ్యాతి గాంచిన పద్మశ్రీ సుభాష్ పాలేకర్ (విదర్భ), డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, డాక్టర్ సుధలకు అవార్డులు అందజేశారు. అవార్డు కింద సుభాష్ పాలేకర్‌కు రూ.5 లక్షల నగదు అందజేశారు. హరియాణ మాజీ ముఖ్యమంత్రి భూపేందర్‌సింగ్ హుడా మాట్లాడుతూ..భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా సర్ ఆర్థర్ కాటన్ తరహాలో గ్రామీణ ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు మార్చేందుకు వైఎస్సార్ కృషి చేశారని చెప్పారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ మంత్రి ఎన్.రఘువీరారెడ్డి, సుభాష్ పాలేకర్ తదితరులు మాట్లాడారు. మాజీ ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, ఉండవల్లి అరుణ్‌కుమార్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు. కాగా..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌లో వైఎస్సార్ పేరు చేర్చిన కాంగ్రెస్ నాయకులు.. హఠాత్తుగా ఆయనపై ప్రేమ ఒలకబోయడంపై సభకు హాజరైన పలువురు వైఎస్సార్ అభిమానులు విస్మయం వ్యక్తం చేశారు. ఇప్పుడు వైఎస్సార్‌ను కీర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి.. గతంలో టీడీపీలో ఉన్నప్పుడు ఆయనపై చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకున్నారు. దాదాపు పదేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌లో జరిగిన టీడీపీ సభలో మాట్లాడుతూ..'ఒకనాడు తెలుగు దేశం పార్టీని ఫినిష్ చేస్తామన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 48 గంటల్లో పావురాల గుట్టలో పావురమై ఎక్కడికి పోయాడో తెలియదు..'అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలను గుర్తుకు తెచ్చుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పట్లో ఆ విధంగా హేళన చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు వైఎస్‌ను కీర్తించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

బస్సు యాత్ర, చలో హైదరాబాద్ వాయిదా

- కేబినెట్ సబ్ కమిటీతో భేటీ అనంతరం మీడియాతో ఉద్యోగుల జేఏసీ



మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్వర్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్న నేపథ్యంలో ఈనెల 8న బస్సు యాత్ర, 12న చలో హైదరాబాద్ పేరుతో నిర్వహించాలని తలపెట్టిన కార్యక్రమాలను వాయిదా వేసు కున్నట్టు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ (టీజేఏసీ) ప్రకటించింది. సచివాలయంలో మంగళవారం ఉద్యోగుల జేఏసీతో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అధ్యక్షతన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేశవరావులతో కూడిన కమిటీ, అధికారు ల కమిటీతో కలిసి ఉద్యోగుల వాదనలు విన్నది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘాలు సమర్పించిన డిమాండ్లను ఈ సమావేశంలో చర్చించారు. ఉద్యోగులకు రావాల్సిన డీఏ, బకాయిలు, ఆరోగ్య కార్డులు, ఏసీబీ కేసుల్లో రెండు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం సస్పెన్షన్‌లో ఉన్న వారిని తిరిగి విధుల్లో చేర్చుకునే అంశంతోపాటు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ తదితర అంశాలపై చర్చ జరిగింది. అయితే పలు అంశాలపై సానుకూల వైఖరి ప్రభుత్వం నుంచి వచ్చిందని టీజేఏసీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో టీజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు వెల్లడించారు. ఉద్యోగ సమస్యలపై సబ్‌కమిటీ ప్రతి అంశంపై సానుకూల వైఖరితో స్పందించిందని వివరించారు. ఈనెల 8న ఉద్యోగుల హెల్త్‌కార్డుల మంజూరుపై ఉద్యోగ సంఘాలతో సీఎస్ భేటీ అయ్యి విధివిధానాలు ఖరారు చేస్తామని చెప్పారన్నారు. పెండింగ్ బిల్లులను నెలకు రూ.700 నుంచి 750 కోట్లు క్లియర్ చేస్తామని, నర్సింగ్ డైరెక్టరేట్‌ను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం పేర్కొందని చెప్పారు. విజిలెన్స్, ఏసీబీ కేసులు ఎదుర్కొంటున్న ఉద్యోగులు.. రెండేళ్లుగా సస్పెన్షన్‌లో ఉన్నవారికి క్రమంగా పోస్టింగ్‌లు ఇవ్వడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని ఉద్యోగ సంఘాల నాయకులు వెల్లడించారు. మంత్రులతోపాటు సీఎస్ కె.రామకృష్ణారావు, అధికారుల కమిటీ చైర్మన్ నవీన్‌మిత్తల్, సందీప్‌కుమార్ సుల్తానియా, బీఎండీ ఎక్క, లోకేశ్‌కుమార్, క్రిస్టినా జెడ్ చోంగ్తూ, రఘునందన్‌రావు, కృష్ణభాస్కర్ తదితరులు హాజరయ్యారు. జేఏసీ తరపున దాదాపు 32 మంది నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ క్రీడా అక్రమాలపై నేడు లోకాయుక్త విచారణ

హాజరుకానున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: డీఎస్సీ క్రీడా అక్రమాలపై బుధవారం లోకాయుక్త విచారణ జరపనుంది. 2024 డీఎస్సీ ఎస్జీటీ స్పోర్ట్స్ నియామకాల్లో షాట్స్, విద్యాశాఖ అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని భూపాలపల్లి జిల్లా సామాజికవేత్త జోరు తిరుపతి 90 పేజీలతో అప్పటి విద్యా శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, అదనపు డైరెక్టర్ లింగయ్య, క్రీడా శాఖకు వీసీ ఎండీ సోనీ బాలదేవి, డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి మొత్తం ఐదుగురిపై లోకాయుక్త కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. జీవో 74కు వ్యతిరేకంగా జాతీయ క్రీడాకారులను పక్కనపెట్టి అక్రమంగా జిల్లా, రాష్ట్ర క్రీడాకారులకు ఉద్యోగాలు కట్టబెట్టారని, నకిలీ స్పోర్ట్స్ సర్టిఫికెట్ అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. స్పందించిన లోకాయుక్త పూర్తి రిపోర్టుతో హాజరుకావాలని అధికారులకు ఆర్డర్ జారీ చేసింది.

కొడంగల్ మెడికల్ కాలేజీకి గ్రీన్ సిగ్నల్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయతలపెట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాల అడ్మిషన్లు ఈ ఏడాది నుంచే ప్రారంభం కానున్నాయి. మొత్తం 50 సీట్లతో ఈ కళాశాల నిర్వహణకు అనుమతినిస్తూ నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తెలంగాణ జాబితాలో 35వ మెడికల్ కళాశాల చేరింది. సుప్రీంకోర్టులో స్థానికత సమస్య కూడా తీరిన నేపథ్యంలో ఈ 35 కళాశాలల్లోని 4,140 సీట్లకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఒకట్రెండు రోజుల్లోనే ప్రారంభం కానుంది. ఈ మేరకు కాళోజీ వైద్య వర్సిటీ నోటిఫికేషన్ జారీ చేయనుంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా ఆలిండియా కోటా కింద 15 శాతం సీట్లు పోను మిగిలిన సీట్లకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 26 మెడికల్ కళాశాలలకు ఫ్యాకల్టీ, ఇతర సమస్యల విషయంలో ఎన్ఎంసీ నోటీసులు జారీ చేసినప్పటికీ ఆ తర్వాత అనుమతినిచ్చిన విషయం తెలిసిందే.

వేతన వెతలు

- ఓపీఎస్‌లకు ఐదారు నెలలుగా జీతాల్లేవు
- ఉపాధి సిబ్బందికి 4, 5 నెలలుగా అందని వేతనాలు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది కొన్ని నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచా యతీల్లో ఓపీఎస్ (ఔట్‌సోర్సింగ్ పంచాయ తీ సెక్రెటరీలు)గా పనిచేస్తున్న వారికి ఐదారునెలలుగా వేతనాలు అందడం లేదు. వివిధ జిల్లాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు ఖాళీగా ఉన్నచోట్ల..2020–21 నుంచి ఓపీఎస్‌లను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నెలకు రూ.18 వేల జీతంతో నియమించారు. ఏ జిల్లాకు ఆ జిల్లా ఓ ఏజెన్సీ ద్వారా వీరి నియామకాలు చేపట్టారు. అయితే కొన్నిచోట్ల ప్రతీనెలా వేతనాలు చెల్లించే పరిస్థితులు ఉండడం లేదు. మొత్తంగా 1,500 మంది ఓపీఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారు.

గ్రీన్ చానల్... ఆచరణకు నో

గ్రీన్‌చానల్ ద్వారా వేతనాలు ఇస్తామని చెబుతున్నా, ఆచరణలో అది అమలుకు నోచుకోవడం లేదు. ఓపీఎస్‌లకు సంబంధించినంత వరకు చూస్తే ఏ ఏడాదికి ఆ ఏడాది వారి కాంట్రాక్ట్‌లు రెన్యూవల్ చేయకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. వీరిని జూనియర్ పంచాయతీ సెక్రెటరీలు (జేపీఎస్)గా కన్వర్ట్ చేయాలనే డిమాండ్ కూడా పెండింగ్‌లో ఉంది.

ఉపాధి సిబ్బందికి తిప్పలే...

ఉపాధి హామీ పథకంలో పనిచేసే సిబ్బందికి సాంకేతిక సమస్యలతో జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ పథకంలో 2,150 మంది టెక్నికల్ అసిస్టెంట్లు (టీఏ), 850 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంట్స్ ఆపరేటర్లు, 340 ఈసీలు, 550 మంది అటెండర్లు పనిచేస్తున్నారు. సాట్ (సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ అకౌంటబిలిటీ అండ్ ట్రాన్స్‌పరెన్సీ)లో 250 మంది, కొందరు ఔట్ సోర్సింగ్‌ఉద్యోగులు కొనసాగుతున్నారు. ఈ ఉద్యోగులు, సిబ్బందికికూడా నాలుగైదు నెలలుగా జీతాలు అందడం లేదని తెలుస్తోంది. గతంలోనూ వేతనాల చెల్లింపులు నిలిచిపోగా వారు ఆందోళనకు దిగారు. ఆ తర్వాత వారికి కొంతకాలం పాటు జీతాలు చెల్లించినా, మళ్లీ ఇప్పుడు అదే సమస్య పునరావృతమవుతోంది.





కోపాన్ని పట్టుకోవడం అంటే వేరొకరిపై విసిరే ఉద్దేశ్యంతో వేడి బొగ్గును పట్టుకోవడం లాంటిది ; మీరు కాలిపోతారు.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 3 సెప్టెంబర్ 2025

అఫ్గాన్‌కు ఆపత్సమయం

అంతరిక్షాన్ని దాటి గ్రహాలను పలకరించి, సూర్యుడిపై సైతం నిశితంగా చూపు సారించేందుకు తహతహలాడుతున్న మనిషి తన కాళ్లకిందనున్న నేలలో జరిగే కల్లోలం ఏమిటో, అది ఎప్పుడు ఎందుకు కంపించి పెను విపత్తుల్ని తెచ్చిపెడుతున్నదో తెలియని నిస్సహాయ స్థితిలో ఉంటున్నాడు. అంతా అయినాక భూకంప కేంద్రం ఎక్కడో, దాని తీవ్రత ఏపాటో చెప్పగలుగుతున్నా ముందుగా పసిగట్టడం అసాధ్యంగానే ఉంది. సోమవారం అఫ్గానిస్తాన్‌లో సంభవించిన భూకంపంలో ఇంతవరకూ 1,400 మందికి పైగా మరణించగా వేలాది మంది గాయపడ్డారు. ఆకలి, అనారోగ్యం, పేదరికం వంటి అనేకానేక క్లేశాలతో కొట్టుమిట్టాడుతున్న అఫ్గాన్ ప్రజలకు అక్కడి తాలిబన్ పాలకులు అదనపు సమస్య. వారి విధానాలను సాకుగా చూపి పలు దేశాలు ఇప్పటికీ తాలిబన్ ప్రభుత్వాన్ని గుర్తించలేదు. భారత్ గుర్తించకపోయినా వివిధ రూపాల్లో దౌత్యం నెరపుతున్నది. ఇప్పుడు తక్షణ సాయం అందించింది. 2021 ఆగస్టులో తాలిబన్‌లు కూలదోసిన అష్రాఫ్ ఘనీ సర్కారే చాలా దేశాల దృష్టిలో 'నిజమైన' ప్రభుత్వం. చాలా దేశాల్లో ఘనీ ప్రభుత్వ రాయబార కార్యాలయాలే ఉన్నాయి. అఫ్గాన్‌కు ఆ దేశాలు అందించాల్సిన సాయమంతా ఐక్యరాజ్యసమితి సంస్థలకే వెళ్తుంది. వాటిని స్వచ్ఛంద సంస్థలు స్వీకరిస్తాయి. అఫ్గాన్‌ను 2001–21 మధ్య తన ఉక్కు పిడికిట్లో బంధించి, ఆ దేశాన్ని అనేక విధాల ధ్వంసం చేసి నిష్క్రమించిన అమెరికా... యూఎస్‌ఎయిడ్ కింద ఏటా అఫ్గాన్‌కిచ్చే 380 కోట్ల డాలర్ల మానవీయ సాయానికి ఈ ఏడాది జనవరి నుంచి కోత విధించింది. పర్యవసానంగా ఆ సాయం 76 కోట్ల డాలర్లకు పడిపోయింది. అందుకే ఇప్పుడు తక్షణమే అందాల్సిన వైద్యసాయం మొదలుకొని పునరావాసం వరకూ అన్నిటికన్నీ పడకేశాయి.

ప్రపంచంలో అత్యంత ప్రమాదకర రీతిలో క్రియాశీలంగా ఉన్న భూకంప ప్రాంతాల్లో అఫ్గాన్ ఉన్న హిందూకుష్ పర్వత శ్రేణి ప్రాంతం ఒకటి. ఇక్కడ భారత పలక, యూరేసియా పలకలు పరస్పరం ఢీకొంటున్నాయి. పర్యవసానంగా ఏర్పడే రాపిడి వల్ల శక్తి విడుదలై అది తరంగాల రూపంలో భూ ఉపరితలానికి చేరటంతో ప్రకంపనలు జనం అనుభవంలోకొస్తాయి. భూకంప కేంద్రం భూ ఉపరితలానికి దగ్గరలో ఉంటే ఆ ప్రకంపనల తీవ్రత అధికంగా ఉండి పెను ప్రమాదాన్ని తెచ్చిపెడతాయి. తాజాగా సంభవించిన భూకంప కేంద్రం ఉపరితలానికి కేవలం 8 కిలోమీటర్ల లోతులో ఉందంటున్నారు. అందువల్లే తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6గా నమోదైనా, ప్రాణనష్టం, ఆస్తినష్టం ఎక్కువున్నాయి. లోలోతు పొరల్లో సంభవించే భూకంపాల వల్ల విడుదలయ్యే తరంగాలు ఉపరితలానికి చేరేలోపే తమ శక్తిని చాలాభాగం కోల్పోతాయి. కనుకనే నష్టం తక్కువుంటుంది. ఉత్తర అఫ్గాన్‌లోని పామీర్–హిందుకుష్ ప్రాంతంలో భూకంపాల తీవ్రత ఎక్కువ. కానీ అవి దాదాపు 200 కిలోమీటర్ల లోతులో సంభవిస్తుంటాయి. ఇందుకు భిన్నంగా పశ్చిమ పాకిస్తాన్, ఆగ్నేయ అఫ్గాన్ ప్రాంతంలోని సులేమాన్ పర్వత శ్రేణి వద్ద భూ ఉపరితలానికి సమీపంగా భూకంప కేంద్రాలుంటాయి.

భూకంపాలు వాటంతటవే ప్రమాదకరమైనవి కాదు. అవి సంభవించినప్పుడు ఆ ప్రాంతంలో ఉండే కట్టడాలు, ఆ విపత్తు విషయంలో అక్కడి పౌరుల్లో ఉండే అవగాహన నష్టం తీవ్రతను తగ్గిస్తాయి. భూకంపాల విషయంలో ఎంతో అనుభవాన్ని గడించి, ప్రాథమిక విద్యాస్థాయి నుంచీ విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్న జపాన్ ఇందుకు ఉదాహరణ. అక్కడ భూకంపాన్ని తట్టుకునే విధంగా భవంతులు నిర్మించటం తప్పనిసరి. అందువల్లే భూకంప తీవ్రత ఎక్కువున్న సందర్భాల్లో సైతం జపాన్‌లో ప్రాణనష్టం కనిష్ఠంగా ఉంటున్నది. మెరుగైన, శాస్త్రీయమైన ఆవాసాల నిర్మాణానికయ్యే అధిక వ్యయాన్ని భరించే స్తోమత దారిద్య్రంలో కొట్టుమిట్టాడే అఫ్గాన్ ప్రజలకు లేదు. అందుకే స్థానికంగా లభించే మట్టి, రాళ్లు, ఇటుకలతో ఇళ్లు నిర్మించుకుంటారు. పైగా అవి పర్వత సానువుల్లో ఉంటాయి. విపత్తుల సమయాల్లో ఒక్కసారిగా కుప్పకూలి పౌరులకు బయటపడే వ్యవధినీయవు. ఈ ఆపత్సమయంలో అఫ్గాన్‌ను ఆదుకోవటం ప్రపంచ దేశాల బాధ్యత. సాధారణ సమయాల్లో ఏం చేసినా చెల్లుతుందిగానీ, విపత్తులు విరుచుకు పడినప్పుడు అందరూ ఏకం కావాలి. మానవీయతను చాటుకోవాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.1.24 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పూర్వాషాఢ రా.9.31 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, **వర్జ్యం:** ఉ.6.11 నుండి 7.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.34 నుండి 12.25 వరకు, **అమృత ఘడియలు:** సా.4.24 నుండి 6.06 వరకు, **పరివర్తనైకాదశి.**

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఏకాకిని చేయడమే ట్రంప్ లక్ష్యం

కామెంట్



కరణ్ థాపర్

కొన్నాళ్ళుగా మన కళ్ళెదుట నిలుస్తున్న ఒక ప్రశ్నకు జవాబు కనుగొనవలసిన సమయం ఆసన్నమైంది. భారతదేశం పట్ల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కక్ష సాధింపు వైఖరిని అవలంబిస్తున్నారా? మన దేశం రోగం కుదిర్చానని ఆయన అనుకుంటున్నారా? ఔనన్నదే దానికి జవాబు అయితే, మనం భావిస్తున్న దానికన్నా పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉన్నట్లే లెక్క.

రష్యన్ చమురును దిగుమతి చేసుకుంటున్నందుకు భారత్‌పై 25 శాతం సెకండరీ సుంకాలు విధించినట్లు అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ప్రకటించారు. రష్యాను దృష్టిలో పెట్టుకుని ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు 'సమరశీల ఆర్థిక లివరేజి' కింద ఆ సుంకాలు మోపుతున్నట్లు చెప్పుకొన్నారు. భారతదేశానికి అనుషంగిక నష్టం వాటిల్లుతోందనీ, మన దేశానికి ఏం జరిగినా ట్రంప్ పట్టించుకోదలచుకోలేదనీ అది సూచించడం లేదా?

ఒకవేళ, రష్యాపై 'సమరశీల ఆర్థిక లివరేజి'యే లక్ష్యమైతే, భారతదేశం కన్నా ఎక్కువగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న చైనాపై సెకండరీ సుంకాలు విధించలేదు ఎందుకని? పైగా, ''రష్యా నుంచి చమురు దిగుమతులను చైనా కొనసాగించడం మంచిదే. అది అంతర్జాతీయ ఇంధన ధరలలో ద్రవ్యోల్బణం రాకుండా నివారిస్తుం''దని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. ఇవి ద్వంద్వ ప్రమాణాలు కావా? చైనాకు ఒక న్యాయం, భారతదేశానికైతే మరో న్యాయమా?

ఇది ప్రతీకారం కాదా?

ఇంకా విడ్డూరం ఏమిటంటే, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి భారత్ ద్వారానే నిధులు అందుతున్నాయని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్ ఆరోపించడం. భారత్‌పై ఆంక్షలు విధించాలని యూరప్‌ను బిసెంట్ కోరారు. రష్యన్ చమురును కొనుగోలు చేయడం ద్వారా అమెరికా జాతీయ భద్రతకు భారత్ ముప్పు వాటిల్లజేస్తోందనీ, ''భారతదేశానికి ఏది ఎక్కువ నష్టదాయకమో అక్కడే దెబ్బ కొట్టడం'' తమ అభిమతమనీ ట్రంప్‌కు వాణిజ్య సలహాదారు పీటర్ నవారో చెప్పారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆయన ఇపుడు ''మోదీ చేస్తున్న యుద్ధం''గా అభివర్ణించారు. ''శాంతికి రహదారి న్యూఢిల్లీ గుండానే పడుతుంది'' అంటున్నారు. భారతదేశపు ''మృతప్రాయ'' ఆర్థిక వ్యవస్థ నట్టేట మునిగినా తాను పట్టించుకోనని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఇది కక్ష సాధింపునూ, ప్రతీకారాన్నీ సూచించడం లేదా?

భారత్‌పై 50 శాతం సుంకాలు విధించడంలో, చైనాకు ట్రంప్ ఇవ్వదలచుకున్న సందేశం ఇమిడి ఉందనీ, అది కూడా భారతదేశానికి అనుషంగిక నష్టం వాటిల్లజేసేదేననీ స్ట్రాట్‌ఫర్ సంస్థ మాజీ చైర్మన్ జార్జ్ ఫ్రైడ్‌మ్యాన్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో చెప్పారు. చైనాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ తహతహలాడుతున్నారు. చైనాకు వ్యతిరేకంగా తాము భారత్ పక్షాన చేర బోమనే ట్రంప్ సందేశంలోని ఆంతర్యమని ఫ్రైడ్‌మ్యాన్ చెప్పారు. ట్రంప్ మనసులో ఉన్న విస్తృత భౌగోళిక రాజకీయ తంత్రంలో, రష్యా, చైనాలకు ప్రాధాన్యం ఉంది. అందుకే భారతదేశాన్ని ''విడిచి పెట్టేయవచ్చు''.



◆ భారతదేశం కన్నా ఎక్కువగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్న చైనాపై సెకండరీ సుంకాలు విధించలేదు ఎందుకని? చైనాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ తహతహలాడుతున్నారు. అందుకే చైనాకు వ్యతిరేకంగా తాము ఇండియా పక్షాన చేరబోమని సందేశం ఇస్తున్నారు. ట్రంప్ మనసులో ఉన్న విస్తృత భౌగోళిక రాజకీయ తంత్రంలో, రష్యా, చైనాలకు ప్రాధాన్యం ఉంది. దానికోసం ఇండియాను "విడిచి పెట్టేయవచ్చు".

ఫ్రైడ్‌మ్యాన్ మాటలే నిజమైతే, రష్యాను హెచ్చరించేందుకు, చైనాకు పూర్తిగా వేరే రకమైన సందేశం పంపేందుకు భారతదేశాన్ని వాడుకున్నారు. రెండిందాలా భారతదేశానికే నష్టం. ట్రంప్ లెక్క లేనట్లే వ్యవహరిస్తున్నారు.

ఎంతమాత్రం ప్రీతిపాత్రులం కాము!

అయితే, సుంకాలు, చమురు, భౌగోళిక–రాజకీయాలను మించిన సంకట స్థితినే మనం ప్రస్తుతం ఎదుర్కొంటున్నాం. భారత–అమెరికాల మధ్య సంబంధాలకు పునాది అయిన రెండు దేశాల మధ్య ప్రజా సంబంధాలను ట్రంప్ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోంది. హెచ్1బి వీసా విధానంలో మార్పు తేదలచినట్లు అమెరికా వాణిజ్య మంత్రి హొవార్డ్ లట్‌నిక్ ప్రకటించారు. దాని ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో 70 శాతం మంది భారతీయులే కనుక, అది మనపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. విద్యార్థుల వీసాలను నాలుగేళ్ళ కాలానికి మాత్రమే పరిమితం చేయాలని అమెరికా ఆంతరంగిక భద్రతా శాఖ యోచిస్తోంది. అది భారతీయ విద్యార్థుల సంఖ్యను కుంచింపజేస్తుంది. అమెరికాలోని విదేశీ విద్యార్థులలో భారతీయులు పెద్ద వర్గంగానే ఉన్నారు. మరోవైపు ఇపుడున్న సంఖ్య కన్నా దాదాపు మూడింతలు ఎక్కువగా 6,00,000 మంది చైనా విద్యార్థులకు ప్రవేశం కల్పించే అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో, భారతదేశంలో అమెరికా కొత్త రాయబారిగా సెర్గియో గోర్ నియామకాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది? ఆయన ట్రంప్‌కు చాలా సన్నిహితుడు. కానీ ఆయనకు దౌత్యపరమైన అనుభవం గానీ, భారతదేశం పట్ల ముందస్తు అవగాహన గానీ లేవు. హెచ్చరించే విరామం తీసుకోకుండా, లేదా ప్రత్యామ్నాయాలను సూచించకుండా ట్రంప్ ఎంచుకున్న బాటలో సెర్గియో పరుగులు పెడతారని చాలామంది భయ పడుతున్నారు. అది మనకు శుభ సూచకం ఏమీ కాదు.

ఆయన బాధ్యత అంతటితో తీరిపోవడం లేదు. దక్షిణ, మధ్య ఆసియాకు ప్రత్యేక దూతగా కూడా సెర్గియోను నియమించారు. ఈ అసాధారణ చర్య దేన్ని సూచిస్తోంది? భారతదేశానికి ఇష్టం లేని పనిని బలవంతంగా ఒప్పించడానికి చేస్తున్న ప్రయత్నంగా దీన్ని భావించాలా? సూటిగా చెప్పాలంటే, భారత–పాకిస్తాన్‌ల మధ్య తమ మధ్యవర్తిత్వానికి ఒప్పుకోవాల్సిందేనని చెప్పడమా?

ఇది దాడి చేయడమేననే భయం నాలో మొదలైంది. అనేక స్థాయిలలో, అనేక విధాలుగా భారతదేశంపై గురిపెడుతున్నారు. ట్రంప్‌కు ఇక మనం ఎంతమాత్రం ప్రీతిపాత్రులం కాము. అంచనాలు తలకిందులవడంతో ఆయన ఖంగు తిన్నట్లున్నారు. మనపై కోపానికి కూడా లోనై ఉంటారు.

సరిదిద్దుకోలేని తప్పు చేస్తున్నారని ట్రంప్‌కు ధైర్యంగా చెప్పగలిగినవారు, భారతదేశం పక్షాన నిలిచేందుకు సుముఖంగా ఉన్నవారు అమెరికాలో ఎవరైనా ఉన్నారా? డెమొక్రాటిక్ పార్టీ నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సందేహం లేదు! కానీ, అమెరికాను మళ్ళీ గొప్పదిగా చేయడమనే(మాగా) వర్గంలోని వారి నుంచి గొంతుక వినిపించడం లేదు. అమెరికాలో నివసిస్తున్న భారతీయుల గొంతు పెగలకపోవడం మరింత కలవరపరుస్తోంది.

మనల్ని క్లిష్ట పరిస్థితుల్లో వదిలేయాలని ట్రంప్ చూస్తున్నారా? నా వద్ద స్పష్టమైన జవాబు లేదు. కానీ, అలానే అనిపించడం లేదా?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

ఆకాశమే హద్దుగా దేశాభివృద్ధిలో...

'యోగక్షేమం వహామ్యహం' (ప్రజల యోగక్షేమాలకు నేనే బాధ్యత వహిస్తాను) అనే నినాదంతో మొదలై 2025 సెప్టెంబర్ 1 నాటికి 69 ఏళ్ళు పూర్తి చేసుకుని 70వ ఏడాదిలోకి ఎల్ఐసీ ఘనంగా అడుగుపెట్టింది. 1956లో ఈ సంస్థ ఆవిర్భవించిన నాటి నుండి 'ప్రజల పొదుపు ప్రజా సంక్షేమానికి' అనే నినాదంతో, ఉన్నత లక్ష్యాలతో పని చేయబట్టే, నేడు ప్రజల, పాలసీదారుల చిరస్మరణీయమైన నమ్మకం చూరగొంది.

స్వాతంత్ర్యం వచ్చేనాటికి మన దేశ బీమా రంగంలో ఘోరమయిన పరిస్థితులు నెలకొని ఉన్నాయి. జీవిత బీమా రంగంలో పట్టాదారుల సొమ్ముకు ప్రైవేట్ బీమా కంపెనీల చేతుల్లో భద్రత లభించదని నిర్ధారణకు వచ్చిన ప్రభుత్వం, 1956 జనవరి 19న జీవిత బీమా రంగాన్ని జాతీయీకరణ చేస్తూ ఆర్డినెన్సు తీసుకు వచ్చింది. అదే ఏడాది సెప్టెంబర్ 1న 245 ప్రైవేటు బీమా కంపెనీలను మిళితం చేసి ఎల్ఐసీని ఏర్పరిచారు.

1956లో కేవలం రూ. 5 కోట్ల మూలధనంతో ప్రారంభమయిన ఎల్ఐసీ నేడు రూ. 57 లక్షల కోట్ల ఆస్తులను సమకూర్చుకుంది. ప్రపంచంలోనే పేరొందిన యాపిల్, జనరల్ ఎలక్ట్రిక్ సంస్థల కన్నా, ఐక్యరాజ్యసమితిలోని 75 శాతం దేశాల ఆర్థిక వ్యవస్థల కన్నా ఎల్ఐసీ పెద్దది. మొత్తం 40 కోట్ల (వ్యక్తిగత, గ్రూప్) పాలసీదారులతో ఎల్ఐసీ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలుస్తుంది.



◆ దేశీయ బీమా రంగంలో ప్రైవేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 25 ఏళ్ళయినా, పాలసీలలో 64% వాటాతో ఎల్ఐసీ ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోంది.

దేశీయ బీమా రంగంలో ప్రైవేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 25 ఏళ్ళు అయినా, పాలసీలలో 64% మార్కెట్ వాటాతో ఎల్ఐసీ ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో 2 కోట్ల మెచ్యూరిటీ క్లెయిమ్‌లను, 8 లక్షల డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించి దాదాపు రూ 2 లక్షల కోట్లను పాలసీదారులకు క్లెయిమ్‌ల రూపంలో చెల్లించింది.

1956లోనే ప్రభుత్వం ఎల్ఐసీకి సావరిన్ గ్యారెంటీ (ప్రభుత్వ గ్యారంటీ) కల్పించినా, ఇంతవరకూ ఎల్ఐసీ ఈ గ్యారెంటీని ఉపయోగించుకోలేదు. 'బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్–2025' వారి తాజా నివేదిక ప్రకారం ఎల్ఐసీ, బలమైన ఇన్సూరెన్స్ బ్రాండ్‌గా ప్రపంచంలో మూడవ స్థానం, అత్యంత విలువైన భారత బ్రాండ్‌గా 4వ స్థానం కైవసం చేసుకుంది. 1956 నుండి ఇప్పటివరకు దేశ ఆర్థిక వ్యవస్థలో దాదాపు 51 లక్షల కోట్ల రూపాయల పైబడి పెట్టుబడులుగా పెట్టింది. దేశ అంతర్గత వనరుల సమీకరణలో ఎల్ఐసీ వాటా 25 శాతం పైమాటే! కేవలం లక్ష లోపల ఉద్యోగులను మాత్రమే కలిగిన ఎల్ఐసీ సంస్థ దాదాపు 27 కోట్ల వ్యక్తిగత పాలసీలకు సేవలు అందిస్తోంది. ఎల్ఐసీ సంస్థ కోసం పని చేసే 14.86 లక్షల ఏజెంట్లలో 49% పైబడి గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నారు.

అయితే కస్టమర్ సేవలలో మరింత మెరుగుదల తీసుకురావడానికీ, దేశంలోని నిరుద్యోగ యువతకు ఉపశమనం కలిగించడానికీ ఎల్ఐసీలో మూడు, నాలుగు తరగతుల ఉద్యోగుల నియామకాలు తక్షణం చేపట్టాలి. 69 ఏళ్లుగా దేశ ఆర్థిక పరిపుష్టికి, స్వావలంబనకు కృషి చేస్తున్న ఎల్ఐసీకి ప్రభుత్వం మరింత సహకారం అందించి, బలోపేతం చేయాలి.

– పి. సతీష్ । ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షులు
(సెప్టెంబర్ 1 నుండి 6 వరకు ఎల్ఐసీ వారోత్సవాలు)

సోషల్ టాక్


మాటలు



మాటల శక్తిని గుర్తించండి. మాటలు సంఘర్షణను పెంచ గలవు, శాంతిని స్థాపించ గలవు. మాటల్లో దూకుడు, ద్వేషం, పక్షపాతం లేకుండా జాగ్రత్త పడితే చాలు... సామాజిక, రాజకీయ హింసల పునాదులు వాటంతటవే కదిలిపోతాయి.

– పోప్ లియో, వాటికన్ చర్చి అధిపతి

ప్రేమ లేమి



ప్రపంచంలో చాలా మంది ఆకలితో ఉండటానికి కారణం ఆహారం లేకపోవటం కాదు. మానవ హృదయాలలో ప్రేమ, శ్రద్ధ లేక పోవటం!

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

చదువు



మేకను ఆస్తిగా, ఆడపిల్లను బరువైన బాధ్యతగా భావించే వారు ఇప్పటికీ గ్రామాల్లో ఉన్నారు. అనారోగ్యాల నుంచి అప్పుల వరకు కుటుంబంపై వచ్చిపడే ఏ విపత్తు అయినా మొదట నష్టం కలిగించేది ఆడపిల్ల చదువుకే!

– సఫీనా హుస్సేన్, 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఫౌండర్

మెరుపు



బంగారం ఎంతో తీవ్రమైన ఉష్ణోగ్రత స్థాయిని తట్టుకుంటేనే గానీ అంతలా మెరిసి, తళుకులీనదు. అలాగే ఒకరు తమ జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకున్నారంటే, ఆ స్థాయి వెనుక వారు తమాయించుకుని నిలబడిన పరిస్థితులు ఎన్నో ఉండి ఉంటాయి.

– కైలాష్ ఖేర్, నేపథ్య గాయకుడు

ఇల్లు



దీర్ఘమైన ప్రయాణాలను ముగించుకుని నేను ఇంటికి చేరినప్పుడు ఇల్లు నన్ను వెచ్చగా తనలోకి తీసుకుంటుంది. నాలోని గందరగోళాన్ని తనలోకి లాగేసుకుని, తనలోని ప్రశాంతతను నా కోసం మెత్తటి పరుపులా పరుస్తుంది.

– సారా టాడ్, సెలబ్రిటీ షెఫ్

ఇంట్లో వద్దు!



వారపు చివరి సెలవులన్నవి నిద్రపోవటానికో, ఇంట్లో కూర్చొని తేనీరు సేవించటానికో కాదు. అవి – మన పొరుగునే ఉండి, మనకు ఎప్పటికీ అపరిచితంగా ఉండిపోయే మార్కెట్లు, ఆహార దుకాణాలలోని ఉత్సాహభరితమైన వాతావరణాన్ని ఆస్వాదించటానికి మళ్లీ మళ్లీ వస్తుండే అవకాశాలు.

– అనీషా సహజ్‌వాలా, కాలమిస్ట్

బీసీలంతా ఏకమైతేనే...

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే బిల్లును తెలంగాణ శాసనసభ ఆమోదించింది. అయితే ఆ అమలు ఎంతవరకు జరుగుతుందో తొందర్లోనే తెలిసిపోతుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే విషయంలో పార్టీలన్నీ కట్టుబడి ఉన్నామంటే కుదరదు. దాన్ని అమలు చెయ్యడానికి నడుం బిగించాలి. 'కామారెడ్డి డిక్లరేషన్'లోని ప్రతి అంశాన్నీ చేర్చి పూర్తి స్థాయిలో చట్టాన్ని రూపొందించి అమలు చేయాలి. బీసీలకు మంచి చేస్తే తప్పకుండా కృతజ్ఞతలు చెప్తారు. చట్టం చేయకపోతే మాత్రం ఉద్యమ కార్యాచరణకు దిగుతారు. తెలంగాణ పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు అసెంబ్లీలో పాస్ చేస్తే చాలదు. చట్టం చేసి అమలు చెయ్యాలి. అది అమలు జరగటం కోసం 2 కోట్ల మంది బీసీలు ఎదురు చూస్తున్నారు.

బీసీ సంఘాలు, బీసీ ఆలోచనా వేదికలు అన్నీ తక్షణం ఒక్క వేదికపైకి వచ్చి జాగరూకతతో ఉండాలి. రాజకీయ పార్టీలు దశాబ్దాలుగా బీసీలను మోసం చేస్తూనే ఉన్నాయి. తమకు చట్టపరంగా న్యాయం జరగకపోతే మౌనంగా ఉండేవాళ్లను బీసీ సమాజం మన్నించదు. రాజకీయ పార్టీలు ధోకా చేస్తే వారు ఈసారి ఊరుకోరు. ఇది ఆఖరి మోకా అని ఢంకా భజాయిస్తారు.




రాష్ట్రంలో ఉన్న 130 బీసీ కులాలు ఐక్యం కావని ఇప్పటికీ రాజకీయ పార్టీలు గట్టి అభిప్రాయంతో ఉన్నాయి. ఆ అభిప్రాయాన్ని బద్దలు కొడుతూ బీసీలంతా ఒక్కటి కావాలి. ఒకే గొంతుక కావాలి. ఒకే వేదిక కావాలి. భిన్న భావాలు, భిన్న తాత్త్వికతలతో, భిన్న రాజకీయ దృక్పథాలతో, పలు రాజకీయ పార్టీలలో ఉన్న బీసీలంతా ఏకమవ్వాలి. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు 'మా వాటా మాకే'నన్నదే 130 కులాల ఏక నినాదం కావాలి. బీసీల ఐక్యవేదిక దగ్గరకు నాయకులు రావాలి తప్ప వాళ్ల చుట్టూ బీసీలు తిరిగే కాలానికిక ఫుల్‌స్టాప్ పెట్టాలి. ఇక చేసిన విజ్ఞప్తులు చాలు. 78 ఏళ్లుగా మోసపోయింది చాలు. బీసీలు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను నమ్మి ఓటేశారు. కాంగ్రెస్ గెలుపంటే అది కామారెడ్డి డిక్లరేషన్ వల్లనే అన్నది నిజం. దానికి నైతికంగా కట్టుబడి దాన్ని అమలు చేయవలసిన బాధ్యత కాంగ్రెస్‌దే. వాళ్లు చేయలేకపోయిన పనిని వేరే వాళ్లపై వేసి తప్పుకుందామంటే కుదరదు. ఇది మొత్తం బీసీ సమాజం గుండె దండోరా.

బడుగుల పక్షాన నిలిచే కవులూ, రచయితలూ, కళాకారులూ, అన్ని పార్టీలలోని సృజనకారులూ, ఆధిపత్య కులాల్లో ఉన్న ప్రగతిశీల వాదులంతా బీసీల ఐక్య ఉద్యమం పక్షాన నిలవాలి. బీసీ ఉద్యమం ముసురులాగా పట్టింది. బీసీలు చేసే ఉద్యమానికి సకలజనం సంఘీభావంగా నిలవాలి.

– జూలూరు గౌరీశంకర్ । తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్

డేటా పాయింట్



వానర గీత



హనుమంతుని స్తుతించే స్తోత్రం 'వానర గీత'. ఇది వానర ప్రముఖులు చేసిన స్తుతి. హనుమ తత్వం గురించి చెబుతుంది. మైత్రేయ మునికి పరాశర మహర్షి ఈ స్తోత్రం గురించి చెప్పినట్టు ఓ పురాణ గాథ. 'భూలోక రావణుడు, పాతాళంలో మైరావణుడు, ఆకాశంలో శతకంఠ రావణుడు అని ముగ్గురు రావణులున్నారు. ఈ ముగ్గురినీ సంహరిస్తేనే లోకాలకు రాక్షస బాధ తొలగుతుంది. భూలోక రావణుని కంటే పది రెట్లు బలమున్న మైరావణుని ఆంజనేయుడు సంహరించాడు. వీళ్లిద్దరి కంటే వంద రెట్లు బలవంతుడు శతకంఠ రావణుడు. అతని సంహారం తక్షణం జరగాలి' అని ఆకాశవాణి రామునితో పలుకుతుంది.

రాముడు, ఆయన సోదరులు ఆకాశం మీదకు వెళ్లటం ఎలా అని అనుకుని హనుమని కీర్తించి, దారి చూపించమన్నారు. హనుమంతుడు తన దేహాన్ని ఆకాశమంత ఎత్తు పెంచి, తన రోమాలను మెట్లుగా చేసుకుని, వానర సైన్యాన్ని పైకి రమ్మన్నాడు. సీతారాములను తన భుజాలపై కూర్చోబెట్టుకున్నాడు. ఆకాశవాణి 'శతకంఠ రావణుని లంక అగ్ని ప్రాకారం కలిగినది. పైకి వెళ్ళగానే అగ్ని బాధకు లోనవుతారు' అని హెచ్చరిస్తుంది. హనుమంతుడు తన తోకతో వాయు వేగాన్ని పెంచి, ఆ అగ్ని ప్రాకారాన్ని చెల్లా చెదరు చేసి సముద్రంలోకి విసరి, చల్లార్చాడు. యుద్ధంలో శ్రీరాముడు స్పృహ తప్పి పడిపోతే సీత, హనుమత్ ద్వాదశ శ్లోక మంత్రాన్ని జపించి, తాను కాళిక రూపం ధరించి యుద్ధం చేసి, శత కంఠ రావణ సంహారం చేస్తుంది. సీత – హనుమంతులను దేవతలు ప్రశంసిస్తారు. ఆంజనేయుని శక్తిని ప్రత్యక్షంగా చూసిన వానరులు రామ నామ జపంతో పాటు, హనుమ నామ జపం కూడా చేసుకోవటం ప్రారంభిస్తారు. వారు అప్పుడు చేసిన ఆంజనేయ స్తుతి 'వానర గీత'గా ప్రసిద్ధమైందని 'పరాశర సంహిత' చెబుతోంది. సుగ్రీవుడు, సుషేణుడు, అంగదుడు, నీలుడు, మైందుడు, ద్వివిదుడు వంటి వానర ప్రముఖులు చేసిన స్తుతి 'వానర గీత'.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి


జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు


మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో క్యూలో నిల్చున్న రైతుకు ఫిట్స్ రావడంతో ప్రథమ చికిత్స అందిస్తున్న పోలీసులు


మహబూబాబాద్ జిల్లా కురవిలో నాలుగు వరుసల్లో బారులుతీరిన రైతులు

నిరీక్షించి... నీరసించి

యూరియా కోసం గంటల తరబడి క్యూలైన్‌లో రైతులు

ఓ అన్నదాతకు ఫిట్స్...అనేకమంది అస్వస్థతకు లోనవుతున్న వైనం


మెదక్ జిల్లా శివ్వంపేట పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

సాక్షి నెట్‌వర్క్ : యూరియా కష్టాలు రైతులను వెంటాడుతున్నాయి. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడుతున్న వారు అనారోగ్యం పాలవుతున్నారు.

- మహబూబాబాద్ జిల్లా బయ్యారంలోని వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్ట్ వద్ద ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రైతులు యూరియా కోసం నాలుగు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. మహబూబాబాద్ పట్టణంలోని పీఏసీఎస్ వద్ద మంగళవారం కూడా రైతులు బారులుతీరారు. కురవి సొసైటీ వద్ద కూపన్ల కోసం క్యూలో నిలబడి రైతులు నానా అవస్థలు పడ్డారు. కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి పీఏసీఎస్ వద్దకు సోమవారం అర్ధరాత్రి సుమారు రెండు వేల మంది రైతులు యూరియా కోసం వచ్చారు. క్యూలో ఉన్న గాంధీనగర్‌కు చెందిన ఆవుల నారాయణ అనే రైతుకు ఫిట్స్ వచ్చింది. నర్సింహులపేటలో కూపన్లు ఇవ్వకపోవడంతో రైతులు పట్టాపాస్ బుక్కుల జిరాక్స్ కాపీలను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు.
- వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి.
- మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన కార్యాలయానికి ఎదురుగా ఉన్న ఆగ్రో సేవా కేంద్రం దుకాణం వద్దకు వెళ్లారు. యూరియా కోసం పడిగాపులు పడుతున్న రైతులు ఒక్కసారిగా క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు యూరియా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులను సముదాయించి మాట్లాడిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వెంటనే కలెక్టర్ విజయేందిరకు ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. సాయంత్రంలోగా యూరియాను అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.
- దేవరకద్రలో తెల్లవారుజామున 4 గంటలకు వచ్చినా టోకెన్లు ఇచ్చి వెనక్కి పంపుతున్నారని, యూరియా మాత్రం ఇవ్వడం లేదని ఆందోళన చేపట్టారు. ఉదయం 6 గంటలకే రాయచూర్ జాతీయరహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రాయచూర్–మహబూబ్‌నగర్ వైపు వెళ్లే వందలాది వాహనాలు నిలిచిపోయాయి.
- వనపర్తి జిల్లావ్యాప్తంగా యూరియా ఆందోళనలు కొనసాగాయి. ఖిల్లాఘనపురంలో రైతులు రోడ్డెక్కి ధర్నా చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో యూరియా కోసం రైతులు ఆందోళనలు, ధర్నాలు చేపట్టారు. అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.
- గద్వాల సింగిల్‌విండో కార్యాలయానికి దాదాపు 400 మంది రైతులు మంగళవారం ఉదయం 8 గంటల వరకే చేరుకున్నారు. యూరియా లేదని అధికారులు చెప్పడంతో అంబేడ్కర్ చౌక్‌లో రోడ్డుపై బైఠాయించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద యూరియా లేకపోవడంతో రైతులు రాస్తారోకో చేశారు.
- కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీ వద్ద లారీ లోడ్ వచ్చిందని సమాచారం అందుకున్న రైతులు అక్కడకు వెళ్లారు. సోమవారం టోకెన్లు ఇచ్చామని చెప్పడంతో రైతులు రాజీవ్ రహదారిపై ధర్నాకు దిగారు.

రైతు సమస్యలపై అదే నిర్లక్ష్యం

- ఏఐసీసీ సీనియర్ నేత మాణిక్కం ఠాగూర్

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో రైతు సమస్యలపై నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉందని, ప్రధాని మోదీ హామీలు జుమ్లాలుగానే మిగిలిపోతున్నాయని ఏఐసీసీ ఏపీ ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ విమర్శించారు. ఆంధ్ర, తెలంగాణ రైతులకు జుమ్లాలు అవసరం లేదని.. వారికి కావలసింది సమయానికి ఎరువులేనన్నారు. ఏపీ, తెలంగాణకు కలిపి ఏటా సుమారు 24–25 ఎల్‌ఎంటీ యూరియా అవసరం ఉంటుందని ఠాగూర్ గుర్తు చేశారు. అయినప్పటికీ ప్రతి విత్తన సీజన్‌లో.. ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఎరువు కొరత తలెత్తుతోందని చెప్పారు. రైతులు గంటల తరబడి బారులు తీరాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఎస్‌సీవో వంటి అంతర్జాతీయ వేదికల్లో ఫొటోలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. రైతుల కోసం దీర్ఘకాలిక ఎరువుల సరఫరా ఒప్పందాలు కుదుర్చేందుకు ఈ వేదికలను ఉపయోగించే ఆలోచన ఆయనకు ఉందా? అని ఠాగూర్ ప్రశ్నించారు.

ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేస్తాం

మరో వారం రోజుల్లో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా: మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచడానికి కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. సోమవారం, 9,000 మెట్రిక్ టన్నులు, మంగళవారం మరో 5,000 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరిందన్నారు. ఈ యూరియా రైల్వే రేక్ పాయింట్లయిన సనత్‌నగర్, వరంగల్, జడ్చర్ల, నాగిరెడ్డిపల్లి, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్ ప్రాంతాలకు చేరుకుంటుందని తెలిపారు. వచ్చే వారంరోజుల్లో కరాయికల్, గంగవరం, ధామ్ర పోర్టుల ద్వారా మరో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ ఎరువులను రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. అదేవిధంగా ఇటీవల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వరదలతో నష్టపోయిన రైతులకు అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకోసం పంట నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, 5 రోజుల్లోపు పంటనష్టంపై పూర్తి నివేదికను పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

క్లుప్తంగా...

ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నారని..


- ఉరేసుకుని బాలుడి ఆత్మహత్య


విష్ణువర్ధన్ (ఫైల్)

జగిత్యాల క్రైం: సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దన్నందుకు ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్న ఘటన జగిత్యాల పట్టణ శివారులోని లింగంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై కుమారస్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మామిడిపల్లి రాజమురళి, సరిత దంపతులకు కుమారుడు విష్ణువర్ధన్, కుమార్తె ఉన్నారు. విష్ణువర్ధన్ జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మూడేళ్ల క్రితం బాలుడిపై ప్రహరీ కూలడంతో తలకు బలమైన గాయాలుకాగా, అప్పటినుంచి చదువులో వెనుకబడ్డాడు. కొద్దిరోజులుగా సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ చదువును నిర్లక్ష్యం చేస్తుండటంతో తల్లి సరిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలుడి మృతితో లింగంపేటలో విషాదం చోటుచేసుకుంది. తండ్రి ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గొంతు నులిమి.. దిండుతో అదిమి..

- భార్యను హతమార్చిన భర్త


మహిమూదా (ఫైల్)

బూర్గంపాడు: కుటుంబాన్ని పోషించేందుకు పనిచేయాలని చెప్పడంతోపాటు అప్పులు ఎలా తీరుస్తావని ప్రశ్నించిన భార్యను భర్త కిరాతకంగా హతమార్చాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. పాల్వంచ సీఐ సతీశ్ వెల్లడించిన వివరాల ప్రకారం బూర్గంపాడుకు చెందిన షంషీర్ పాషా, మహిమూదా బేగంకు పన్నెండేళ్ల క్రితం పెళ్లయింది. ఆటో నడిపే షంషీర్ పాషా చెడు వ్యసనాలకు లోనై అప్పులు చేశాడు. నెల క్రితం అప్పులవాళ్లు ఆటో లాక్కెళ్లడంతో కుటుంబ పోషణ కష్టమైంది అప్పులు ఎలా తీరుస్తావని సోమవారం రాత్రి మహిమూదా నిలదీయడంతో షంషీర్ భార్యను మంచంపైకి నెట్టేసి గొంతు నులిమి ఆపై దిండుతో అదిమి చంపి ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

ఉబికొచ్చిన భూగర్భ జలాలు

- ఆగస్టులో సాధారణం కంటే 26% అధికంగా వర్షపాతం
- రాష్ట్రంలో 1.71 నుంచి 11.38 మీటర్లు రేంజ్‌లో భూగర్భ జలాల లభ్యత
- 2024 ఆగస్టులో 6.84 మీటర్ల సగటు లోతులో లభ్యత.. ఈ ఏడాది 1.06 మీటర్లు వృద్ధి



సాక్షి, హైదరాబాద్: సాధారణానికి మించి వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు ఉబికి పైకొచ్చాయి. భూగర్భ జలాల రాష్ట్ర సగటు లోతు మేలో 10.07 మీటర్లకు పడిపోగా, వర్షాకాలం ప్రారంభం కావడంతో జూన్‌లో 9.47, జూలైలో 8.37 మీటర్లకు వృద్ధి చెందాయి. తాజాగా కురిసిన భారీ వర్షాలతో ఆగస్టులో ఏకంగా 5.78 మీటర్ల లోతుకు ఉబికివచ్చాయి. 2024 ఆగస్టులో 6.84 మీటర్ల లోతులో భూగర్భ జలాలు లభ్యం కాగా, 2025 ఆగస్టులో 1.06 మీటర్ల మేర వృద్ధితో 5.78 మీటర్ల లోతుల్లోనే లభ్యం కావడం గమనార్హం. అంటే గతేడాది కంటే ఈ ఏడాది భూగర్భ జలాలు మెరుగ్గా ఉన్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర భూగర్భ జలశాఖ జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో భూగర్భ జలాల స్థితిగతులను పరిశీలించి తాజాగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడించింది. అన్ని మండలాల్లో ఏర్పాటు చేసిన 1,771 పీజో మీటర్ల ద్వారా భూగర్భ జలాల స్థితిగతులను ప్రతి నెలా సమీక్షించి, తర్వాతి నెలలో నివేదికలను విడుదల చేస్తూ ఉంటుంది.

ఆదిలాబాద్‌లో భారీగా వృద్ధి

ఆదిలాబాద్ జిల్లాలో 1.71 మీటర్ల లోతుల్లోనే భూగర్భ జలాల లభ్యత ఉండగా, సిద్దిపేట జిల్లాలో అత్యధికంగా 11.38 మీటర్ల లోతుల్లో అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలోని జిల్లాలను సగటు భూగర్భ జలమట్టాన్ని 0–5 మీటర్లు, 5–10 మీటర్లు, 10 మీటర్లపైన లోతు.. అనే మూడు కేటగిరీలుగా వర్గీకరిస్తారు.

- భూగర్భ జలాలు 0– 5 మీటర్లలోపు లోతులో ఉంటే సురక్షిత స్థాయిలో ఉన్నట్టు భావిస్తారు. 18 జిల్లాల్లో 0–5 మీటర్ల లోతులోనే భూగర్భ జలమట్టం ఉందని గుర్తించారు. 13 జిల్లాల్లో 5–10 మీటర్ల లోతులో, 2 జిల్లాల్లో 10–15 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నట్టు తేలింది.
- 10 మీటర్లకన్నా లోతుకు భూగర్భ జలాలు పడిపోయిన జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా భావిస్తారు.

సాధారణం కంటే అధికంగా...

ఆగస్టులో రాష్ట్ర వార్షిక సగటు వర్షపాతం 574 మి.మీ.లు కాగా, 2025 ఆగస్టులో 721 మి.మీ.ల సగటు వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 26 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైందని స్పష్టమవుతోంది. 18 జిల్లాలు సాధారణం కంటే అధికం (21శాతం నుంచి 90 శాతం వరకు), మిగిలిన 15 జిల్లాలు సాధారణ (–13% నుంచి 16 శాతం) వర్షపాతాన్ని నమోదు చేశాయి.

గతేడాది కంటే మెరుగే...

2024 ఆగస్టుతో పోల్చితే 2025 ఆగస్టులో రాష్ట్రంలోని 23 జిల్లాల్లో భూగర్భ జలాలు మెరుగైన స్థితిలో ఉండగా, 10 జిల్లాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. అత్యధికంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో 5 మీటర్లు, అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 0.02 మీటర్ల వృద్ధి నమోదైంది.

431 మండలాల్లో మెరుగుదల

రాష్ట్రంలో మొత్తం 621 మండలాలు ఉండగా, దశాబ్ద కాల సగటుతో పోలిస్తే.. గత ఆగస్టు నెలలో 528 మండలాల్లో (86 శాతం) 0.01 నుంచి 19.64 మీటర్ల వరకు భూగర్భ జలాలు వృద్ధి చెందాయి. మిగిలిన 93 మండలాల్లో (21 శాతం) 0.01 నుంచి 20.92 మీటర్ల వరకు భూగర్భ జలమట్టం పతనమైందని గణాంకాలు చెబుతున్నాయి.

లండన్‌లో ఇద్దరు తెలంగాణ విద్యార్థుల మృతి

- గణేశ్ నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- నాదర్‌గుల్‌కు చెందిన చైతన్య, ఫీర్జాదిగూడకు చెందిన రిషితేజ దుర్మరణం
- మరో ఏడుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు


రిషితేజ (ఫైల్)


చైతన్య యాదవ్ (ఫైల్)

బడంగ్‌పేట్/ ఉప్పల్: లండన్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తెలంగాణ యువకులు దుర్మరణం పాలయ్యారు. మృతులను నాదర్ గుల్‌కు చెందిన చైతన్యయాదవ్ (అభి), పీర్జాదిగూడకు చెందిన రిషితేజ (21)గా గుర్తించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌కు చెందిన తర్రె బలయ్యయాదవ్, మంగమ్మ దంపతులకు చిన్న కుమారుడు చైతన్యయాదవ్ (23) బీటెక్ పూర్తి చేసి, ఉన్నత చదువుల కోసం ఈ ఏడాది జనవరిలో లండన్ వెళ్లాడు. బోడుప్పల్ లోని పీర్జాదిగూడ మున్సిపాలిటీ అమృత కాలనీలో నివా ముండే రాపోలు రవీందర్‌రావు, కిరణ్మయి దంపతుల కుమారుడు రిషితేజ (21)హైదరాబాద్‌లో బీబీఏ పూర్తిచేసి ఉన్నత చదువుల కోసం గత మే నెలలో లండన్ వెళ్లాడు. వీరు మరికొందరు తెలుగు విద్యార్థులతో కలిసి అక్కడ నివా సం ఉంటున్నారు. వినాయక చతుర్థిని పురస్కరించుకుని స్నేహితులంతా గణనాథున్ని ప్రతిష్ఠించారు. ఆదివారం సాయంత్రం నిమజ్జనం కోసం 9 మంది రెండు కార్లలో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు మలుపు వద్ద వారి కారును వెనక నుంచి వచ్చిన మరో కారు ఢీకొట్టింది. వెనుక వస్తున్న ట్రక్కు రెండు కార్లను ఢీకొట్టడంతో కార్లు నుజ్జునుజ్జు అయ్యాయి. ఈ ఘటనలో చైతన్య యాదవ్, రిషితేజ మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

రెండు కుటుంబాల్లో విషాదం

ఇద్దరు యువకుల మరణంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. చైతన్యయాదవ్ మరణవార్తతో తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించారు. బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రిషితేజ చివరగా తల్లి కిరణ్మయితో ఆదివారం మాట్లాడాడు. 'నిద్ర వస్తోంది.. లేచాక మాట్లాడతాను అని చెప్పిన మాటలే చివరివి అయ్యాయి'అని అతడి తండ్రి రవీందర్‌రావు కన్నీరు మున్నీరయ్యాడు.

సమన్వయంతో పనిచేసి టార్గెట్ చేరుకోవాలి

- ఏరియా జీఎంలకు సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్ : బొగ్గు రంగంలో పోటీని తట్టుకునేందుకు ఉద్యోగులంతా తమవంతు బాధ్యతగా బొగ్గు నాణ్యత పెంపునకు, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడానికి కృషి చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో అన్ని విభాగాలు, అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, ఇందులో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తి, నూతన ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం సింగరేణి భవన్ నుంచి అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల వల్ల ఉత్పత్తికి విఘాతం కలిగిందని, ఈ నష్టాన్ని పూడ్చుకొని, ప్రస్తుత లక్ష్యాలను సాధించడానికి ఇకపై రోజుకు 1.8 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 2.10 లక్షల టన్నుల బొగ్గు రవాణా సాధించాలని లక్ష్యం నిర్దేశించారు. రోజుకు 12.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలన్నారు. వర్షాకాలం ఓపెన్ కాస్టు గనుల ఉత్పత్తిపై ప్రభావం చూపుతున్న నేపథ్యంలో భూగర్భ గనుల్లో ఉత్పత్తిని పెంచేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వరద సాయం రూ.200 కోట్లు

ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇటీవలి భారీ వర్షాలకు అతలాకుతలమైన జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జీలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు వెంటనే మరమ్మతులు చేపట్టేందుకు తక్షణ సాయంగా ప్రభుత్వం రూ.200 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖలోని ప్రకృతి విపత్తుల నిర్వహణ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కొన్ని జిల్లాల్లో 50 సెంటీమీటర్ల కంటే అధిక వర్షపాతం నమోదైతే.. వాటి సమీప జిల్లాల్లో 20 నుంచి 25 సెంటీమీటర్ల వర్షం కురిసిందని తెలిపారు. తీవ్రంగా నష్టపోయిన కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రూ.10 కోట్ల చొప్పున, మిగిలిన అన్ని జిల్లాలకు రూ.5 కోట్ల చొప్పున విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. భారీ వర్షాలతో ప్రాణ, ఆస్తి, పశు, పంట నష్టం సంభవించిందని.. చెరువులు, రిజర్వాయర్లు పూర్తిగా నిండి పొంగిపొర్లాయని తెలిపారు. ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. పునరావాస, మరమ్మతులకు తక్షణమే నిధులు కావాలని జిల్లాల కలెక్టర్లు కోరడంతో నిధులు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

నేను క్షమించినా ప్రజలు క్షమించరు

ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు నా తల్లిని అవమానించారు

- ఇది దేశంలోని తల్లులు, సోదరీమణులకు జరిగిన అవమానం
- ప్రతి వీధిలో, పట్టణంలో ఈ నేతలను గట్టిగా నిలదీయండి
- బిహార్ ప్రజలకు మోదీ పిలుపు
- మహిళా స్వయంసహాయక సంస్థ ఆవిర్భావంలో ప్రసంగించిన మోదీ



పట్నా: బిహార్‌లో రాహుల్‌గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో మోదీ తల్లి దివంగత హీరాబెన్‌నుద్దేశిస్తూ కొందరు విపక్షనేతలు అవమానకరంగా మాట్లాడిన ఉదంతంపై ప్రధాని మోదీ తొలిసారిగా ఆవేదనాభరితంగా స్పందించారు. బిహార్‌లో మహిళల నైపుణ్యాభివృద్ధికి కృషిచేసే కొత్త 'బిహార్ రాజ్య జీవిక నిధి సహకార సంఘ్ లిమిటెడ్‌'ను మంగళవారం ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించి లక్షలాది మంది మహిళలనుద్దేశించి మోదీ ప్రసంగించారు. '' దివంగత నా మాతృమూర్తికి రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదు. రాజకీయాలకు దూరంగా ఉండిపోవడమే ఆమె చేసిన తప్పా? ఆమెను మాత్రమే దూషించాల్సిన అవసరం ఏమొచ్చింది?'' అంటూ గద్గద స్వరంలో మోదీ తన ప్రసంగాన్ని మొదలెట్టారు. '' నా తల్లిని అవమానించిన బిహార్ ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలను నేను క్షమిస్తానేమోగానీ దేశంలోని ప్రజలెవ్వరూ వారిని క్షమించబోరు. ఒకరి తల్లిని దూషించిన వారిని ఇంకొకరు పొరపాటున కూడా క్షమించబోరు. తల్లిపై దారుణదూషణోదంతంలో ఆర్జేడీ-కాంగ్రెస్ పార్టీలను బాధ్యులను చేయాల్సిన కనీస బాధ్యత బిహార్‌లోని ప్రతి ఒక్క కుమారుడిపై ఉంది. ఆర్జేడీ-కాంగ్రెస్ నేతలు ఏ వీధిలోకి వెళ్లినా, ఏ పట్టణంలో ప్రచారంచేసినా అక్కడ మాతృమూర్తులు, సోదరీమణులను అవమానిస్తే అస్స లు ఊరుకోబోమని, సహించబోమని గట్టిగా, స్పష్టంగా తెలిసేలా చేయండి'' అని బిహార్ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు. '' తల్లిపై దుర్భాషలాడిన ఆర్జేడీ-కాంగ్రెస్ నేతలను బిహార్‌లోని తల్లులు, సోదరసోదరీమణులు వీధుల్లోకి వచ్చిమరీ నిలదీయాలి. ఇలాంటివి అస్సలు సహించబోమని స్పష్టంచేయాలి. నన్ను విమర్శించే క్రమంలో తల్లిని, మహిళను తిడితే ఎవ్వరూ ఊరుకోబోరని, తిట్లదండకానికి తెరదించుతామని మీరంతా నిరూపించాలి'' అని మహిళలకు మోదీ పిలుపునిచ్చారు. బిహార్ రాజ్య జీవిక నిధి సహకార సంఘ్ లిమిటెడ్ అనేది మహిళా స్వయంసహాయక బృందాలకు తక్కువ వడ్డీలకు రుణాలను అందిస్తూ వారి నైపుణ్యాభివృద్ధికి కృషిచేస్తుంది.

జానకీమాతకు జన్మస్థలి

''బిహార్ అనేది జానకీమాతకు జన్మస్థలి. బిహార్ రాష్ట్రం ఎల్లవేళలా మహిళలను గౌరవిస్తుంది. ఆర్జేడీ-కాంగ్రెస్ సంయుక్త రాజకీయ కార్యక్రమం నా తల్లిని అవమానించేందుకు వేదికగా మారడం, అందునా బిహార్‌లో ఈ కార్యక్రమం జరగడాన్ని అస్సలు ఊహించలేదు. ఇది నిజంగా బిహార్ తల్లులు, సోదరీమణులను అవమానించడమే. ఇలాంటి నేతలను బిహార్ ప్రజలు అస్సలు క్షమించరు'' అని మోదీ అన్నారు. '' ఆర్జేడీ పాలనా కాలంలో తల్లులు, మహిళలు ఎన్నో అవస్థలు పడ్డారు. నేరస్తులు, రేపిస్టులు, హంతకులను ఆర్జేడీ ప్రభుత్వం కంటికిరెప్పలా కాపాడుకుంది. తమ కుటుంబసభ్యులు క్షేమంగా రోజూ ఇంటికి తిరిగొస్తారో లేదోనని బిహార్ మహిళలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. అందుకే తర్వాత మహిళా ఓటర్లు ఆర్జేడీ సర్కార్‌ను ఇంటికి సాగనంపారు. నాడు ఆర్జేడీ కూటమిని ఇంటికి సాగనంపిన అదే మహిళాలు ఇప్పుడు నా తల్లికి జరిగిన అవమానాకి ప్రతీకారం తీర్చుకుంటారు. దర్భంగాలో జరిగిన దుర్ఘటన విపక్షాల కూటమి దారుణాలకు దర్పణం పడుతోంది. రాష్ట్రంలో మహిళలు దోపిడీ, అణచివేతకు గురవుతున్నారు'' అని మోదీ అన్నారు. '' కొడుక్కి తన తల్లి అంటే దేవత, దైవంతో సమానం'' అని భోజ్‌పురీ సామెతను రాబోయే నవరాత్రి, ఛాత్ పండుగలను పురస్కరించుకుని మోదీ గుర్తుచేశారు. ''సూర్యభగవానుని మహిళారూపంలో ఏడుగురు దుర్గామాత అక్కచెల్లెళ్ల రూపంలో బిహార్ ప్రజలు పూజిస్తారు. అలాంటి ప్రజలకు కాంగ్రెస్-ఆర్జేడీ క్షమాపణలు చెప్పాల్సిందే'' అని మోదీ అన్నారు. '' దేశసేవకు నా జీవితాన్ని అంకితం చేస్తానని మా అమ్మతో చెప్పినప్పుడు ఆమె అందుకు అడ్డుచెప్పలేదు. పైగా దేశసేవ చేస్తానన్నందుకు అభినందించి ప్రోత్సహించారు. కుటుంబ బాధ్యతల నుంచి తప్పుకుంటానని చెబితే వారించలేదు. పేద తల్లి కుమారుడు అధికారాన్ని(ప్రధాని పదవిని) స్వీకరించడం పేరుగొప్ప నేతలకు అస్సలు నచ్చట్లేదు. మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతినీ వాళ్లు ఓర్వలేకపోతున్నారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిగా ఆసీనులైన ద్రౌపదీముర్మును సైతం అవమానించడానికి వాళ్లు దుస్సాహసం చేశారు. నాకంటే 20 ఏళ్ల జూనియర్ అయిన(రాహుల్‌గాంధీ) ఓ వ్యక్తి ఓ పదిహేను రోజులు ఎస్ఐఆర్‌పై పోరు పేరు చెప్పి యాత్రచేశారు'' అని రాహుల్‌గాంధీని పరోక్షంగా విమర్శించారు.

సుప్రీంకోర్టే సర్వోన్నతం!

రాష్ట్రపతితో రగడపై సీజేఐ ధర్మాసనం

- న్యాయం కోసం ఏ ఆదేశాలైనా ఇస్తాం
- అవసరమైతే చట్టాలనూ పక్కన పెడతాం
- రాష్ట్రపతి లేఖ ఫక్తు 'రాజకీయ' వివాదమే
- అయినా సమాధానమిచ్చి తీరతాం: సీజేఐ
- న్యాయసమీక్ష 'మౌలిక నిర్మాణం'లో భాగం
- ఆర్టికల్ 142 కట్టబెట్టిన అసాధారణ అధికారం
- రాష్ట్రపతి, గవర్నర్లకు గడువుపై జస్టిస్ గవాయ్
- బిల్లులను రాష్ట్రపతి, గవర్నర్లు తొక్కిపట్టజాలరు
- తమిళనాడు, పశ్చిమబెంగాల్ ప్రభుత్వాల సీనియర్ న్యాయవాదులు సిబల్, సింఘ్వీ
- కేంద్రం తరఫున ఎస్‌జీ మెహతా తీవ్ర అభ్యంతరం

న్యూఢిల్లీ: రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, సుప్రీంకోర్టుల్లో ఎవరు సుప్రీం అన్న అత్యంత కీలకమైన అంశంపై ఆ రెండు వ్యవస్థల నడుమ కొన్ని నెలలుగా నివురుగప్పిన నిప్పులా సాగుతున్న పెను వివాదం ముదురుపాకాన పడింది. ఈ విషయమై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం అత్యంత కీలక వ్యాఖ్యలు చేసింది. ఏ కేసులోనైనా సరే, సంపూర్ణ న్యాయం చేకూర్చేందుకు అవసరమైన అన్ని రకాల ఆదేశాలూ ఇచ్చి తీరతామని కుండబద్దలు కొట్టింది. ''అందుకోసం అవసరమతే ప్రస్తుత చట్టాల్లోని లోపాలను బేఖాతరు చేయాల్సి వచ్చినా ఏ మాత్రమూ వెనకాడబోం. ఎందుకంటే ఆర్టికల్ 142 కింద సుప్రీంకోర్టుకు స్వయానా రాజ్యాంగమే కట్టబెట్టిన అసాధారణమైన విచక్షణాధికారమది'' అని కుండబద్దలు కొట్టింది. అంతేగాక, అత్యున్నత న్యాయస్థానానికి దఖలు పడ్డ న్యాయ సమీక్షాధికారం రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని చరిత్రాత్మకమైన మినర్వా మిల్స్ కేసును ఉటంకిస్తూ గుర్తు చేసింది. తద్వారా, సుప్రీంకోర్టు అధికార పరిధికి అంతిమంగా రాష్ట్రపతి కూడా లోబడాల్సిందేనని చెప్పకనే చెప్పింది. అసెంబ్లీలు ఆమోదించే బిల్లులపై నిర్ణయం తీసుకునేందుకు గవర్నర్లతో పాటు ఏకంగా రాష్ట్రపతికి కూడా 3 నెలల గడువు విధిస్తూ సీజేఐ ధర్మాసనం ఇటీవల వెలువరించిన తీర్పు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించడం తెలిసిందే. దానిపై కీలక రాజ్యాంగపరమైన సందేహాలు లేవనెత్తుతూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేరుగా సుప్రీంకోర్టుకే లేఖ రాయడం మరింత సంచలనంగా మారింది. దానిపై సీజేఐ ధర్మాసనం ఎదుట మంగళవారం ఆరో రోజు కూడా విచారణ కొనసాగింది. రాజ్యాంగపరమైనవంటూ ఈ విషయమై రాష్ట్రపతి లేవనెత్తిన సందేహాలు వాస్తవానికి రాజకీయ పరమైనవవేనని ఈ సందర్భంగా ధర్మాసనం తేల్చేసింది. అయినా సరే, రాష్ట్రపతి లేవనెత్తిన 'రాజ్యాంగపరమైన' ప్రశ్నలకు సమాధానం నిరాకరించజాలమని పేర్కొంది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులను ఆమోదించే విషయంలో రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తూ ఆదేశాలిచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందో లేదో తేల్చాలంటూ ఆర్టికల్ 143(1) కింద దఖలు పడ్డ విచక్షణాధికారాలను వాడుకుంటూ ద్రౌపదీ ముర్ము గత మే నెలలో సీజేఐకి లేఖ రాసింది.



వారికి ఆ అధికారాల్లేవ్!

గవర్నర్లు బిల్లులకు ఆమోదం తెలపకుండా తొక్కిపెట్టడం ప్రజాభీష్టాన్ని కాదనడమేనని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతూ చరిత్రలోనే మొదటిసారిగా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందన్నారు. ''ఒక వ్యవస్థ మరో వ్యవస్థకు అవరోధంగా మారేందుకు రాజ్యాంగంలోని ఏ సూత్రమూ అనుమతించదు. అసలు విచక్షణ అనే భావనే ఆర్టికల్ 200కు ఫక్తు విరుద్ధం. గవర్నర్ నిర్వర్తించేది రాజ్యాంగ విధి, అంతే తప్ప స్వేచ్ఛాయుత ఎంపిక కాదు' అని వాదించారు. రాష్ట్రపతి, గవర్నర్ల చర్యలు రాజ్యాంగ సమీక్షకు అతీతమని కేంద్రం భావిస్తోందంటూ తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ మండిపడ్డారు. అలా బిల్లులను ఆపేసేందుకు రాష్ట్రపతికి, గవర్నర్లకు ఎలాంటి స్వతంత్ర అధికారాలూ లేవని వాదించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల్లో తలెత్తిన న్యాయ వివాదాలను సింఘ్వీ తన వాదనకు మద్దతుగా ప్రస్తావించారు. దాన్ని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తీవ్రంగా తప్పుబట్టారు.''అలాంటి కేసులనే వాదనలకు ఆధారంగా చూపదలిస్తే మేం (కేంద్రం) కూడా లిఖితపూర్వకంగా సమాధానం సమర్పించాల్సి వస్తుంది. స్వతంత్రం వచ్చిన నాటినుంచీ కొన్ని రాష్ట్రాల్లో రాజ్యాంగాన్ని అడ్డంగా తుంగలో తొక్కుతూ వచ్చారు. ఆ మురికమయమైన గతాన్ని తవ్విపోయాలనే మీరు భావిస్తుంటే అందుకు సంబంధించిన పూర్తి రికార్డులను మేం కోర్టు ముందుంచుతాం'' అని సింఘ్వీ, సిబల్‌లను ఉద్దేశించి స్పష్టం చేశారు. సీజేఐ కల్పించుకుని వాతావరణాన్ని చల్లబరిచే ప్రయత్నం చేశారు. ''ఆంధ్రప్రదేశ్ కావచ్చు, తెలంగాణ, కర్నాటక కావచ్చు, మేం కేవలం రాజ్యాంగంలోని నిబంధనలకు నిర్వచిస్తామంతే. అంతకంటే మరేమీ లేదు'' అంటూ వాదనలను రాజ్యాంగపరమైన అంశాలపైకి మళ్లించారు. విచారణ బుధవారం కూడా కొనసాగనుంది.

మినర్వా కేసు.. మైలురాయి!

న్యాయసమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమంటూ ధర్మాసనం ఉటంకించిన మినర్వా మిల్స్ కేసును భారత న్యాయచరిత్రలోనే అతి కీలక మైలురాయిగా పేర్కొంటారు. ఏ విషయంపై అయినా నిర్ణయాలు తీసుకునే విషయంలో రాజ్యాంగ మౌలిక నిర్మాణ సిద్ధాంతమే సర్వోన్నతమంటూ సుప్రీంకోర్టు వెలువరించిన చరిత్రాత్మక తీర్పుకు మినర్వా కేసే నిమిత్తంగా నిలిచింది.

సొంత ఖాతాలోకి రూ. 232 కోట్లు బదిలీ

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఉద్యోగి అరెస్టు

జైపూర్: ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉద్యోగి ఒకరు రూ.232 కోట్లు స్వాహా చేశారు. జైపూర్ విమానాశ్రయంలో ఫైనాన్స్ ఇన్‌చార్జ్‌గా పనిచేస్తున్న రాహుల్ విజయ్.. గతంలో డెహ్రాడూన్ విమానాశ్రయంలో సీనియర్ మేనేజర్‌గా పనిచేశాడు. 2019-20, 2022-23 మధ్య కాలంలో అధికారిక, ఎలక్ట్రానిక్ రికార్డులను తారుమారు చేస్తూ పథకం ప్రకారం మోసానికి పాల్పడ్డాడు. నకిలీ, కల్పిత ఆస్తులను సృష్టించి, వాటి విలువలను పెంచి, కొన్నిసార్లు ఎంట్రీలకు సున్నాలను జోడించి రికార్డులను తారుమారు చేశాడు. ఆ రికార్డుల నుంచి దాదాపు రూ.232 కోట్ల ప్రజా నిధులను తన వ్యక్తిగత ఖాతాలకు మళ్లించాడు. ఆ తర్వాత నిందితుడు ఆ డబ్బును ట్రేడింగ్ ఖాతాల్లోకి బదిలీ చేశాడు. ఈ మోసాన్ని గుర్తించి సీబీఐకి ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సీబీఐ అధికారులు ఆగస్టు 28న, జైపూర్‌లోని విజయ్ అధికారిక, నివాస ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించారు. ఈ దాడిలో స్థిరాస్తులు, విలువైన సెక్యూరిటీలకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రజా నిధుల దుర్వినియోగం కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు.

వెయ్యి మందిని మింగిన మట్టి

- సూడాన్‌లో ఓ గ్రామంపై విరిగిపడిన కొండచరియలు
- వెయ్యి మందికిపైగా సజీవ సమాధి
- ప్రాణాలతో బయటపడిన ఒకే ఒక్క వ్యక్తి



కొనసాగుతున్న అన్వేషణ

కైరో: అంతర్యుద్ధంతో తల్లడిల్లుతున్న ఆఫ్రికా దేశం సూడాన్‌లో ఘోర ప్రకృతి విపత్తు చోటుచేసుకుంది. డార్ఫుర్‌రీజియన్‌లోని మర్రాహ్ పర్వతాల్లో ఆదివారం ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడటంతో తరసిన్ అనే గ్రామం మొత్తం తుడిచిపెట్టుకుపోయింది. ఈ విపత్తులో వెయ్యి మందికి పైగా సజీవ సమాధి అయినట్లు ఆ ప్రాంతంలో అధికారంలో ఉన్న సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఆర్మీ ప్రకటించింది. ఈ ఘోర ప్రమాదం నుంచి ఒకే ఒక్క వ్యక్తి ప్రాణాలతో బయటపడినట్లు వెల్లడించింది. తరసిన్ గ్రామం మర్రాహ్ పర్వతాల్లో 3000 మీటర్ల ఎత్తులో ఉంది. కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారీస్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రాంతం సూడాన్ రాజధాని ఖార్టూమ్‌కు 900 కిలోమీటర్ల దూరంలో ఉంది. మృతదేహాలను వెలికితీసేందుకు సూడాన్ లిబరేషన్ మూవ్‌మెంట్ ఆర్మీ అంతర్జాతీయ సాయం కోరింది.

మరుభూమిగా ప్రపంచ వారసత్వ ప్రాంతం

మర్రాహ్ పర్వతాలను యూనిసెఫ్ గతంలో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది. ఎత్తయిన ఈ పర్వతాల్లో చల్లని వాతావరణంతోపాటు భారీ వర్షాలు కురుస్తుంటాయి. ఇవన్నీ పురాతన అగ్నిపర్వత ప్రాంతాలు. ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణానికి పెట్టింది పేరు. సూడాన్‌లో 2023 ఏప్రిల్ నుంచి సైన్యానికి, పారామిలిటరీ దళమైన ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ (ఆర్ఎస్ఎఫ్)కు మధ్య భీకర యుద్ధం జరుగుతోంది. దీంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి భారీగా వలస వెళ్లారు. తీవ్ర కరువు కారణంగా ఈ ప్రాంతంలో ప్రజలు గడ్డి తిని బతుకుతున్నారని కొన్నాళ్ల క్రితమే ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తంచేసింది. యుద్ధం కారణంగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఐరాస కార్యకలాపాలు కూడా నిర్వహించటం లేదు. దీంతో తక్షణ సాయం అందించటం సాధ్యం కావటం లేదని సూడాన్ అధికార వర్గాలు తెలిపాయి. కొండలపై నుంచి మట్టి, రాళ్లు భారీ మొత్తంలో జారిపడటంతో తరసిన్ గ్రామం చాలా లోతులో కూరుకుపోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. అక్కడ ఒక గ్రామం ఉన్న ఆనవాళ్లు కూడా కనిపించటం లేదు. ఇటీవలి కాలంలో సూడాన్‌లో అతిపెద్ద ప్రకృతి విపత్తుల్లో ఇదీ ఒకటిగా నిలిచింది.



ఎమ్మెల్యే హర్మీత్ సింగ్



వాహనంలో దొరికిన పిస్టళ్లు

తప్పించుకున్న ఆప్ ఎమ్మెల్యే

- రేప్ కేసులో అరెస్టు చేసి తరలిస్తుండగా ఘటన
- పోలీసుల పైకి రాళ్లు రువ్వి, కాల్పులకు దిగిన అనుచరులు

పటియాలా: పంజాబ్‌లోని అధికార ఆప్‌కు చెందిన ఎమ్మెల్యే నాటకీయ పరిణామాల నడుమ పోలీస్ కస్టడీ నుంచి తప్పించుకోవడం సంచలనంగా మారింది. అత్యాచారం కేసు కావడంతో అరెస్ట్ చేయడానికి వెళ్లిన పోలీసులపైకి ఆయన అనుచరులు తుపాకులతో కాల్పులు జరుపుతూ, రాళ్లు రువ్వారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే పోలీసు కస్టడీ నుంచి తప్పించుకున్నారు. హరియాణాలోని కర్నాల్ జిల్లా దబ్రి గ్రామంలోని నివాసంలో ఉన్న హర్మీత్ సింగ్‌ను అదుపులోకి తీసుకునేందుకు మంగళవారం పటియాలా పోలీసు బృందం అక్కడికి చేరుకుంది. అనంతరం పోలీస్ స్టేషన్‌కు ఎమ్మెల్యేను తరలిస్తుండగా కొందరు గ్రామస్తులు పోలీసుల పైకి రాళ్లు రువ్వడంతోపాటు కాల్పులకు దిగారు. ఇదే అదనుగా ఎమ్మెల్యే తప్పించుకున్నారు. ఘటనలో ఒక పోలీసు గాయపడ్డారు. స్కార్పియో వాహనంలో ఎమ్మెల్యే తప్పించుకునే క్రమంలో ఓ పోలీసుపైకి వాహనాన్ని డ్రైవ్ చేశారని అధికారులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనుచరుడు బల్వీందర్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని మూడు తుపాకులు, ఫార్చునర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పరారయ్యేందుకు ఎమ్మెల్యే వాడిన వాహనాన్ని అనంతరం అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఆయన కోసం పెద్ద ఎత్తున గాలింపు చేపట్టారు. భార్య నుంచి విడాకులు తీసుకున్నట్లు నమ్మించి, తనతో హర్‌ప్రీత్ సింగ్ సంబంధం కొనసాగించాడని జిరాక్‌పూర్‌కు చెందిన ఓ మహిళ ఆరోపించింది. అనంతరం 2021లో పెళ్లి చేసుకున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన ప్రైవేట్ చిత్రాలు చూపుతూ బెదిరిస్తున్నట్లు ఆరోపించింది. ఈ మేరకు పోలీసులు ఎమ్మెల్యేపై రేప్, మోసం తదితర ఆరోపణలపై కేసు నమోదు చేశారు. వరద సహాయక చర్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆయన ఇటీవల పలు ఆరోపణలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు కల్పించిన వ్యక్తిగత భద్రతను సైతం ఉపసంహరించుకుంది.

పొంగి పొర్లుతున్న యమున

- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వరద
- సిద్ధంగా ఉన్నామన్న ఢిల్లీ ముఖ్యమంత్రి



ఓల్డ్ రైల్వే వంతెన వద్ద ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్న యమున

న్యూఢిల్లీ: వజీరాబాద్, హత్నికుండ్ బ్యారేజీల నుంచి నీటి భారీగా విడుదల చేయడంతో దేశ రాజధాని ఢిల్లీలోని యమునా నది పొంగి పరవళ్లు తొక్కుతోంది. దీంతో, బాధిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా ప్రకటించారు. మంగళవారం ఉదయం ఢిల్లీలోని ఓల్డ్ రైల్వే వంతెన వద్ద నీటి మట్టం ప్రమాద స్థాయిని మించి 205.68 మీటర్ల మేర నమోదైందని, సాయంత్రం 4 గంటల సమయానికి 206.03 మీటర్లకు చేరుకుందని అధికారులు తెలిపారు. వరద ఉధృతి నేపథ్యంలో ఇప్పటికే ఈ వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. 2023లో యమునా నదికి రికార్డు స్థాయిలో 208.66 మీటర్ల వరద వచ్చింది. నది నీటి మట్టం 206 దాటిన వెంటనే లోతట్టు ప్రాంతాల ప్రజల తరలింపును ప్రారంభించారు. తరలింపు చర్యలను సీఎం గుప్తా స్వయంగా పర్యవేక్షించారు. మున్ముందు వరద మరింత పెరిగే అవకాశముందని సెంట్రల్ ఫ్లడ్ కంట్రోల్ రూం పేర్కొంది. ఉత్తరాఖండ్‌లో జన్మించిన యమున హిమాచల్, హరియాణా, ఢిల్లీ, యూపీల మీదుగా ప్రవహిస్తోంది. ఎగువనున్న ప్రాంతాల్లోని జలాశయాల నుంచి విడుదల చేసిన వరద ఢిల్లీకి చేరుకునేందుకు కనీసం 50 గంటల సమయం తీసుకుంటుంది.

1988 తర్వాత అత్యధిక వరద

1988 తర్వాత పంజాబ్‌లో అత్యంత తీవ్రంగా వరదలు సంభవించాయి. తీవ్రంగా ప్రభావితమైన ఫిరోజ్‌పూర్ జిల్లాలో గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మంగళవారం పర్యటించి, సహాయక పునరావాస కార్యక్రమాలను పరిశీలించారు. రాష్ట్రంలో వరదలకు సంబంధించిన ఘటనల్లో ఇప్పటి వరకు 29 మంది చనిపోగా, 2.56 లక్షల మంది ప్రభావితులయ్యారు. భారీ వర్షాలతో సట్లెజ్, బియాస్ ఉపనదులు పొంగి ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల్లోకి పెద్దగా ఎత్తున వరద చేరింది. మొత్తం 12 జిల్లాలు వరదలకు ప్రభావితమయ్యాయి. మంగళవారం చైనా నుంచి ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ పంజాబ్ సీఎం భగవంత్ మాన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వరదలు ఒక వైపు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తుండగా మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలకు కురిశాయి. వరద బాధిత ప్రజలకు సాయంగా ఆప్ ఎమ్మెల్యేలు, ఎంపీలు నెల వేతనం విరాళంగా సీఎం సహాయక నిధికి అందించారని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ వెల్లడించారు.

బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు రూ.102 కోట్ల జరిమానా

బెంగళూరు: బంగారం స్మగ్లింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కన్నడ సినీ నటి రన్యారావుకు డైరెక్టరేట్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) రూ.102 కోట్ల భారీ జరిమానా విధించింది. ఆమెతోపాటు హోటల్ యజమాని తరుణ్ కొండరాజుకు రూ.63 కోట్లు, సాహిత్ సకారియా, భరత్ కుమార్ జైన్ అనే బంగారు నగల వ్యాపారులకు రూ.56 కోట్ల చొప్పున జరిమానా విధించినట్లు డీఆర్ఐ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. బెంగళూరు సెంట్రల్ జైలులో ఉన్న వీరికి డీఆర్ఐ అధికారులు నోటీసులు అందజేశారు. ఆరోపణలకు బలం చేకూర్చే 11 వేల పేజీలతో కూడిన పత్రాలను సైతం వీరికి అందజేశామన్నారు. మార్చి 3వ తేదీన దుబాయ్ నుంచి కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న రన్యా రావు వద్ద 14.8 కిలోల బంగారం పట్టుబడిందని డీఆర్ఐ వర్గాలు వెల్లడించాయి. ఆమె మొత్తం 127 కిలోల బంగారాన్ని విదేశాలకు తరలించినట్లు విచారణలో తేలింది. కర్నాటక డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్ర రావు సవతి కుమార్తె రన్యా రావు. విదేశీ మారక నిల్వలను అక్రమంగా కలిగి ఉన్న నేరానికి గాను రన్యారావుకు ఏడాది జైలు శిక్ష పడింది. మంగళవారం జరగాల్సిన ఈ కేసు విచారణను కర్నాటక హైకోర్టు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసిందని డీఆర్ఐ వర్గాలు వివరించాయి.

రిజర్వేషన్లపై ఉప సంఘం.. దీక్ష విరమించిన జరాంగే

ముంబై: మరాఠాలకు రిజర్వేషన్లను కల్పించే విషయంలో కేబినెట్ ఉపసంఘాన్ని నియమించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించటంతో హక్కుల కార్యకర్త మనోజ్ జరాంగే మంగళవారం ఎట్టకేలకు ఐదో రోజు తన నిరాహార దీక్షను విరమించారు. జరాంగే డిమాండ్లలో కీలకమైనదైన మరాఠాలకు కున్బీ కుల ధ్రువీకరణ పత్రాలను అందజేసేందుకు సీఎం ఫడ్నవీస్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జరాంగే ప్రకటించారు. మహారాలకు ఓబీసీ జాబితాలో చోటుదక్కేందుకు అవకాశం ఏర్పడిందని జరాంగే అన్నారు. జరాంగే దీక్ష విరమణ ప్రకటనపై ముంబై వాసులు ఉత్సవాలు జరుపుకున్నారు. మరాఠాల డిమాండ్లపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే తాము ముంబైని వీడతానని జరాంగే గతంలోనే ప్రకటించారు. అంతకుముందు, ఆజాద్ మైదానంలో దీక్ష చేపట్టిన జరాంగే అనుచరులు వెంటనే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలంటూ ముంబై హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే, బుధవారం ఉదయం వరకు దీక్ష కొనసాగించేందుకు వీలు కల్పించాలన్న జరాంగే వినతిపై కోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ అంశంపై మహారాష్ట్ర ప్రభుత్వ వైఖరిని న్యాయస్థానం తప్పుబట్టింది. మరాఠాలకు ఓబీసీ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ జరాంగే వందలాది మంది అనుచరులతో ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్షకు దిగారు.

భారత్ మా దారికి రావాల్సిందే

ట్రంప్ వాణిజ్య సలహాదారు నోటిదురుసు

వాషింగ్టన్: దిగజారుడు మాటలతో తరచూ అపఖ్యాతి బురదలో పొర్లాడే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాటలోనే ఆయన అనుచరగణం నడుస్తోంది. తాజాగా ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సైతం భారత్‌ను కించపరిచేలా మాట్లాడారు. ముడి చమురు కొనుగోళ్ల మొదలు ఏ వస్తూత్పత్తిని ఏ దేశం నుంచి కొనాలో, ఎవరికి ఏ సరకును ఎగుమతి చేయాలనే పూర్తి సారభౌమాధికారమున్న భారత్ తీసుకున్న నిర్ణయాలను తప్పుబడుతూ పీటర్ నవారో చేసిన వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. '' షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) వేదికగా యుద్ధపిపాసి పుతిన్‌ను, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను కలిసి భారత ప్రధాని మోదీ ఘోర తప్పిదానికి పాల్పడ్డారు. అసలు మోదీ ఏం ఆలోచిస్తున్నారో నాకైతే అర్థంకావట్లేదు. ముడి చమురు కొను గోలుచేస్తూ పుతిన్‌తో మోదీ అంటకాగుతున్నారు. గల్వాన్ ఘర్షణలను మరచి జిన్‌పింగ్‌తోనూ దోస్తీ కడుతున్నారు. చివరకు ఈ ముగ్గురి దోస్తీ, మూడు దేశాల మధ్య మైత్రి తారుమారుకావడం ఖాయం. చివరకు భారత్ అమెరికాతో కలిసి నడవాల్సిందే. మేం అదే ఆశిస్తున్నాం'' అని పీటర్ వ్యాఖ్యానించారు.

అదొక టారిఫ్‌ల మహారాజు

''ఇతర దేశాలపై భారత్ భారీగా టారిఫ్‌లు మోపుతుంది. అందుకే ఆ దేశం టారిఫ్‌ల మహారాజు. అతిపెద్ద ఆర్థికవ్యవస్థల ఉన్న దేశాల్లో అత్యధిక టారిఫ్ మోపుతున్న వాటిల్లో భారత్ కూడా ఒకటి. కానీ భారత్ ఈ చేదు నిజాన్ని ఎన్నటికీ ఒప్పుకోదు. ఇది అబద్ధమని అందరికీ చెప్పుకుని తిరుగుతుంది. కానీ ఇదే నిజం. మాతో వాణిజ్యం చేస్తున్న ఇతర భాగస్వాముల్లాగా భారత్ మసలుకోవట్లేదు. ఇందుకు ట్రంప్ ఏమాత్రం ఒప్పుకోరు'' అని అన్నారు.



జిన్‌పింగ్‌తో పుతిన్

స్నేహబంధం బలోపేతం

- అమెరికా టారిఫ్ సవాళ్ల వేళ రష్యా, చైనా దేశాధినేతల కీలక భేటీ
- బీజింగ్‌లో పుతిన్, జిన్‌పింగ్ ద్వైపాక్షిక చర్చలు
- రష్యా పర్యాటకులకు 30 రోజుల వీసారహిత సదుపాయం కల్పిస్తామన్న చైనా
- చైనాలో మరో సహజవాయు పైప్‌లైన్ నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్న రష్యా

బీజింగ్: అమెరికా విసిరిన టారిఫ్‌ల సవాళ్లతో ఇక్కట్లు ఎదురవుతున్న వేళ చైనా, రష్యా తమ చిరకాల స్నేహబంధాన్ని మరింత బలపరుచుకుంటున్నాయి. చైనాలోని తియాంజిన్‌లో సోమవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు జరిగిన మర్నాడే ఇరు దేశాలు మంగళవారం మరోసారి సమావేశమై ద్వైపాక్షిక చర్చలు చేపట్టాయి. పలు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. చర్చల కోసం రాజధాని బీజింగ్ చేరుకున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సాదర స్వాగతం పలికారు. పుతిన్‌ను 'చిరకాల మిత్రుని'గా అభివర్ణించారు. పుతిన్ సైతం తన ప్రసంగంలో జిన్‌పింగ్‌ను ప్రియ స్నేహితునిగా సంబోధించారు. 'నాడు మేము కలిసే ఉన్నాం.. ఇప్పుడు కూడా కలిసే ఉంటాం'అని పుతిన్ చెప్పుకొచ్చారు. ఇరు దేశాధినేతల లాంఛన సమావేశం అనంతరం చైనా అధికార కేంద్ర స్థానమైన ఝోంగన్‌హాయ్‌లో ఇరుపక్షాల ఉన్నతాధికారుల మధ్య తేనీటి విందు భేటీ జరిగింది. రష్యా పర్యాటకులకు ఈ నెల నుంచి 30 రోజులపాటు వీసారహిత సదుపాయం కల్పించనున్నట్లు చైనా ప్రకటించింది. అలాగే చైనాకు మరో సహజవాయు పైప్‌లైన్‌ను నిర్మించేందుకు ఆ దేశంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నట్లు రష్యా ప్రభుత్వ రంగ చమురు సంస్థ గాజ్‌ప్రోం సీఈఓ అలెక్సీ మిల్లర్ తెలిపారు. ప్రస్తుత పైప్‌లైన్ మార్గాల ద్వారా సహజ వాయు సరఫరాను మరింత పెంచేందుకు కూడా ఒప్పందాలు చేసుకున్నాయి.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 3 । సెప్టెంబర్ । 2025



డెత్ స్పాట్స్!

నగరంలో రోడ్డు ప్రమాదాలు, మరణాలు నివారించడానికి సన్నాహాలు చేస్తున్న నగర ట్రాఫిక్ విభాగం అధికారులు బ్లాక్ స్పాట్స్‌పై దృష్టి పెట్టారు.

-10లో



హై 'రెంట్' సిటీ..

హైదరాబాద్ అంతర్జాతీయ ఆర్థిక, ఆధునిక అంశాల్లో ప్రశస్తిని చాటుతున్న గ్లోబల్ సిటీ. ఇక్కడ ఉన్న అంతర్జాతీయ సంస్థల కార్యాలయాలు చెల్లిస్తున్న అద్దెలే తార్కాణం.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
29.0/22.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

హెచ్‌ఎండీఏ ప్రీ బిడ్‌కు విశేష స్పందన



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) నిర్వహించిన ప్రీబిడ్ సమావేశానికి విశేషమైన స్పందన లభించింది. తుర్కయంజాల్, బాచుపల్లిల్లోని ప్రభుత్వ స్థలాల విక్రయానికి హెచ్‌ఎండీఏ ఇదివరకే నోటిఫికేషన్ వెలువరించిన సంగతి తెలిసిందే. ఆన్‌లైన్ బిడ్డింగ్ ద్వారా విక్రయించనున్న ఈ స్థలాల కోసం మంగళవారం ప్రీబిడ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తుర్కయంజాల్‌లోని 12 ప్లాట్ల అమ్మకాలపై అనూహ్యమైన స్పందన లభించింది. ఆసక్తి గల కొనుగోలుదార్లు, పలు నిర్మాణ, రియల్ ఎస్టేట్ సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి వేలం ప్రక్రియ గురించి వివరించారు. ఎమ్మెస్టీసీ ప్రతినిధులు ఆన్‌లైన్ బిడ్డింగ్ గురించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సమావేశంలో హెచ్‌ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధన్‌మోహన్ సింగ్, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణ, ప్రజాసంబంధాల అధికారి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటు

- ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ పరిధిలో సేవలు
- నగరం తూర్పు భాగంలోని ప్రజలకు సౌలభ్యం
- ఈ నెల 15వ తేదీన గానీ, 16న గానీ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో మరో పాస్‌పోర్టు సేవా కేంద్రం (పీఎస్‌కే) ఏర్పాటవుతోంది. మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) మెట్రో స్టేషన్‌లో ఇది సిద్ధమైంది. ఈ నెల 15వ తేదీనగానీ, 16న గానీ దీన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి గానీ, సహాయ మంత్రి గానీ హాజరయ్యే అవకాశముంది. ప్రస్తుతం నగరంలో మూడు పీఎస్‌కేలు ఉన్నాయి. అమీర్‌పేట, బేగంపేట, టోలిచౌకి కేంద్రంగా ఇవి పని చేస్తున్నాయి. పాతబస్తీతోపాటు తూర్పు భాగంలో ఉండే ప్రజలకు ఉపయుక్తంగా ఓ పీఎస్‌కేను ఏర్పాటు చేయాలనే డిమాండ్ కొన్నేళ్లుగా వినిపిస్తోంది. పాస్‌పోర్టు దరఖాస్తు, జారీని సులభతరం చేస్తూ రీజినల్ పాస్‌పోర్టు కార్యాలయం అనేక చర్యలు తీసుకుంటోంది. వాటిలో భాగంగా పీఎస్‌కేలతోపాటు పోస్టాఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు, మొబైల్ పాస్‌పోర్టు సేవా కేంద్రాల సంఖ్యను పెంచాలని కోరుతూ కొన్నాళ్ల క్రితమే విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిశీలించిన ఉన్నతాధికారులు ప్రాథమికంగా హైదరాబాద్‌లో నాలుగో పీఎస్‌కే ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దీంతో ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ మొదటి అంతస్తులో ఈ కార్యాలయం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే పంజగుట్ట మెట్రో స్టేషన్‌లో వివిధ దేశాలకు సంబంధించిన వీసా జారీ కేంద్రాలు ఉన్నాయి. ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్‌లో పీఎస్‌కే ఏర్పాటుతో వచ్చిపోయే ప్రజల రాకపోకలకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ పీఎస్‌కే ప్రారంభోత్సవంతోపాటు మరికొన్ని కీలక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అంశాలూ అందుబాటులోకి రానున్నాయి.

ప్రయాణికులు ఒకవైపు.. సిటీ బస్సులు మరోవైపు...

- రద్దీ రూట్లలో బస్సుల కొరత
- శివారు కాలనీలకు అరకొర సేవలు
- రోజు రోజుకూ ప్రజారవాణా తగ్గుముఖం

బస్.. లెస్!



ఉదయం, సాయంత్రాలు మాత్రమే..

ఘట్‌కేసర్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్, కుత్బుల్లాపూర్, చేవెళ్ల, మొయినాబాద్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు, విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు నిరంతరం రాకపోకలు సాగిస్తున్నారు. కానీ, చాలా కాలనీలకు ఉదయం , సాయంత్రం మాత్రమే రెండు, మూడు బస్సులు నడుస్తున్నాయి. మిగతా సమయాల్లో ప్రయాణికులు సెవెన్ సీటర్ ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఐటీ కారిడార్‌లలోని ఉద్యోగుల కోసం బస్సుల సంఖ్యను పెంచినట్లుగానే నగర శివారు ప్రాంతాల్లో ఉన్న కాలనీలకు కూడా ట్రిప్పులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సాక్షి, సిటీబ్యూరో

నగరశివారులకు ఆర్టీసీ సిటీ బస్సుల కొరత తీవ్రంగా ఉంది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సుల సంఖ్య లేదు. సిటీ బస్సుల కొరత ప్రజారవాణాకు సవాల్‌గా మారింది. సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న వందల కొద్దీ కాలనీలకు ప్రజారవాణా సదుపాయం అరకొరగా ఉంది. మరోవైపు ప్రయాణికుల రద్దీ ఉన్న రూట్లలో డిమాండ్ మేరకు బస్సులు లేవు. బస్టాపుల్లో ప్రయాణికులు చాలాసేపు పడిగాపులు కాయాల్సి వస్తోంది. గంటకు ఒక బస్సు కూడా అందుబాటులో ఉండటం లేదని, ఎప్పుడో ఒకసారి వచ్చే బస్సులో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సి వస్తోందని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోఠి నుంచి లింగంపల్లి వైపు రాకపోకలు సాగించే రూట్(216)లో ప్రయాణికుల డిమాండ్ భారీగా ఉంటుంది. ఈ బస్సు కోఠి నుంచి టోలిచౌకి, కాజాగూడ, ల్యాంకో హిల్స్, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, గచ్చిబౌలి చౌరస్తా నుంచి లింగంపల్లి వరకు రాకపోకలు సాగిస్తుంది. సెంట్రల్ యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులతోపాటు పలు ఐటీ సంస్థల ఉద్యోగులు కూడా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు.

ట్రిప్పులు తగ్గుముఖం...

కాంప్రహెన్సివ్ మొబిలిటీప్లాన్(సీఎంపీ)పై హెచ్ఎండీఏ ఏర్పాటు చేసిన లీ అసోసియేషన్ అధ్యయనం ప్రకారం సుమారు 7,250 చదరపు కిలోమీటర్ల పరిధిలో అనేక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాలు విస్తరిస్తున్నాయి. నగర జనాభా సైతం 2 కోట్లకు చేరువవుతోంది. ఈ క్రమంలో ప్రజల అవసరాల మేరకు రవాణా సదుపాయాలు పెరగాల్సి ఉండగా ఈ దిశగా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం . దేశంలోని పలు మెట్రోపాలిటన్ నగరాల్లో ఇప్పటికే మెట్రో రైలు రెండు, మూడో దశలను పూర్తి చేసుకుంది. హైదరాబాద్‌లో మాత్రం రెండోదశకే ఆటంకాలు ఎదురవుతున్నాయి. లీ అధ్యయనం మేరకు 2050 నాటికి 665 కి.మీ.లకు పైగా మెట్రో విస్తరణ చేపట్టాల్సి ఉంది. అదే సమయంలో ఇప్పుడున్న జనాభా మేరకు కనీసం 10 వేల పర్యావరణహిత బస్సులు అవసరం. కానీ, 2,800 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. అందులో ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య 250 మాత్రమే. ఇప్పటికిప్పుడు ప్రయాణికుల డిమాండ్ మేరకు 6 వేల బస్సులను సమకూర్చాల్సి ఉందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ఉన్న బస్సులు, ట్రిప్పులతో 20 లక్షల మందికి కూడా సేవలు లభించడం లేదు. నగరంలో మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన తరువాత అనూహ్యంగా డిమాండ్ పెరిగింది.

ఐటీ సంస్థలకు ఆర్టీసీ అద్దె బస్సులు

త్వరలోనే 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి...

- ఐటీ సంస్థల ప్రతినిధుల సమావేశంలో సజ్జనార్



ఐటీ సంస్థల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఐటీ కారిడార్‌లో ప్రజా రవాణా సేవలను మరింత విస్తరించనున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రస్తుతం 200 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో ఉన్నాయని, త్వరలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు.

టీఎస్ఆర్టీసీ, అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా(అసోచామ్), తెలంగాణ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ కౌన్సిల్(టీఎఫ్ఎంసీ) సంస్థలు సంయుక్తంగా ఐటీ కారిడార్‌లో మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనపై సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాయి. హైటెక్ సిటీలోని టెక్ మహీంద్ర క్యాంపస్‌లో జరిగిన ఈ సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ మాట్లాడుతూ ఐటీ కారిడార్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల రవాణా అవసరాలకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఐటీ కంపెనీలకు ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మెట్రో డీలక్స్ బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రైవేట్ వాహనాల వినియోగం వల్ల ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవడం ఒక్కటే ట్రాఫిక్ నివారణకు ప్రత్యామ్నాయమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదం చేసినట్లవుతుందన్నారు. ప్రతి ఐటీ సంస్థ ప్రజా రవాణా వ్యవస్థపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని, వినియోగించినవారికి ప్రోత్సాహకాలు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. కార్యక్రమంలో అసోచామ్ సదరన్ సెక్టార్ కో చైర్మన్, వర్చుసా వైస్ ప్రెసిడెంట్ కృష్ణ ఏదుల, టీఎఫ్ఎంసీ ప్రెసిడెంట్ సత్యనారాయణ మదాల, హెచ్ఆర్ హెడ్, టెక్ మహీంద్రా వినయ్ అగర్వాల్, ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, రాజశేఖర్, సీటీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రద్దీ.. ఇక రద్దు

నానల్‌నగర్-రేతిబౌలి జంక్షన్ వద్ద 'మల్టీ'ఫ్లై ఓవర్లు

- మెహిదీపట్నం-టోలిచౌకి వైపు..
- అత్తాపూర్ నుంచి మెహిదీపట్నం వైపు..
- లంగర్‌హౌస్ నుంచి మెహిదీపట్నం వైపు
- అంచనా వ్యయం రూ.398 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నం, పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే, టోలిచౌకి, గచ్చిబౌలి మార్గంలో రద్దీ తగ్గించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ట్రాఫిక్ చిక్కులకు, రద్దీకి చెక్ పెట్టేందుకు చర్యలు చేపట్టింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హైసిటీ) ప్రాజెక్టులో భాగంగా రేతిబౌలి- నానల్‌నగర్ జంక్షన్ వద్ద మల్టీ లెవెల్ ఫ్లైఓవర్లు, గ్రేడ్ సెపరేటర్లు నిర్మించనుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రయాణికులకు సిగ్నల్ ఫ్రీ కారిడార్‌తో వాహనాల రాకపోకల వేగం పెరగనుందని, ముఖ్యంగా ఐటీ కారిడార్ వైపు వెళ్లే వారికి ఇది గణనీయమైన ప్రయోజనం కలిగించనుందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.398 కోట్లు కాగా, రూ.220 కోట్లు నిర్మాణ పనులకు కేటాయించారు. మిగతా నిధులతో భూసేకరణ, వివిధ పైపులైన్లు, విద్యుత్ కేబుళ్ల తరలింపు, శబ్ద నిరోధక గోడలు, కన్సల్టెన్సీ ఫీజులు తదితరమైన వాటికి వినియోగించనున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో కాంట్రాక్టు ఏజెన్సీ రెండేళ్లలో పనులు పూర్తి చేయాల్సి ఉంది. మరో రెండేళ్లపాటు ఏవైనా లోపాలు తలెత్తినా వాటిని సరిచేయాలి.

ప్రాజెక్టు ఇలా..

- మెహిదీపట్నం- టోలిచౌకి ఫ్లైఓవర్
  ఒక వైపు ప్రయాణానికి మూడు లేన్ల ఫస్ట్ లెవెల్ ఫ్లై ఓవర్, వెడల్పు: 12.50 మీటర్లు (11.50 మీటర్లు క్యారేజ్ వే)
- లంగర్‌హౌస్ - మెహిదీపట్నం ఫ్లైఓవర్
  లంగర్‌హౌస్-మెహిదీపట్నం వైపు రెండు లేన్లతో నానల్‌నగర్ జంక్షన్ మీదుగా నిర్మిస్తారు. క్యారేజ్ వే 9 మీటర్లు.
- అత్తాపూర్ - మెహిదీపట్నం ఫ్లైఓవర్
  ఇది కూడా రెండు లేన్లతో అత్తాపూర్ - మెహదీపట్నం వైపు రేతిబౌలి జంక్షన్ మీదుగా వెళ్తుంది. క్యారేజ్ వే 9 మీటర్లు.
- ఈ రెండు రేతిబౌలి వద్ద కలసి, అక్కడి నుంచి మెహిదీపట్నం వైపు మూడు లేన్ల ఫ్లైఓవర్ (12.50 మీటర్ల వెడల్పు)గా కొనసాగుతుంది.

ప్రయోజనాలు

ప్రాజెక్టు పూర్తయిన తర్వాత మెహిదీపట్నం, టోలిచౌకి, లంగర్‌హౌస్, అత్తాపూర్, గచ్చిబౌలి మార్గాల్లో ప్రయాణించే వాహనదారులకు సిగ్నల్ ఫ్రీ ప్రయాణం సాధ్యం కానుంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ దిశగా ప్రయాణించే వేలాది మంది ఉద్యోగుల ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుందని జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

'జూబ్లీహిల్స్' ముసాయిదా విడుదల

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక నేపథ్యంలో ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. అందులో భాగంగా నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితాను మంగళవారం హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ విడుదల చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం 3,92,669 మంది ఓట్లర్లు ఉన్నారని తెలిపారు.

- సెప్టెంబర్ 17వ తేదీ వరకూ అభ్యంతరాల స్వీకరణ, మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం
- సెప్టెంబర్ 25 వరకూ ఫిర్యాదులు, అర్జీల పరిష్కారం, సెప్టెంబర్ 30న తుది జాబితా విడుదల

సెప్టెంబర్ 17వరకూ అభ్యంతరాల స్వీకరణ...

జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన డ్రాఫ్ట్ ఫొటో ఓటర్ల జాబితా కాపీని సంబంధిత ఈఆర్‌ఓ కార్యాలయం, పోలింగ్‌స్టేషన్లలో అందుబాటులో ఉంచారు. అభ్యంతరాలు ఉంటే ఫారం-6, ఫారం-7, ఫారం-8లో సమర్పించాలి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ముసాయిదా ఓటర్ల జాబితాపై సెప్టెంబర్ 2 నుంచి 17వ తేదీ వరకూ అభ్యంతరాలు స్వీకరించనున్నారు. 2025 జూలై 1 తేదీ నాటికి 18 ఏళ్ళ వయసు నిండిన వారందరూ సెప్టెంబర్ 17వ తేదీలోగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్‌లో సైతం నమోదు చేసుకొనేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల మార్పు చేసుకోవాలనుకునే వారు దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం ఇస్తున్నారు. సెప్టెంబర్ 25 వరకూ ఫిర్యాదులు, అర్జీలు పరిష్కరించి, సెప్టెంబర్ 30న తుదిఓటర్ల జాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

ముసాయిదా వివరాలు..

లొకేషన్లు : 139
పోలింగ్ స్టేషన్లు : 407
పురుష ఓటర్లు : 2,04,288
మహిళా ఓటర్లు : 1,88,356
ఇతరులు : 25
మొత్తం ఓటర్లు : 3,92,669



ప్రాజెక్టుల పనులు వేగవంతం

అధికారులకు జీహెచ్ఎంసీ కమిషనర్ దిశానిర్దేశం



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హైసిటీ), వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి పథకం(ఎస్సార్డీపీ) పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ ప్రాజెక్టులను చేపట్టింది. పనుల్ని నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళవారం సంబంధిత జోనల్ కమిషనర్లు, ప్రాజెక్టుల ఇంజినీర్లు, ప్లానింగ్, భూసేకరణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంజినీరింగ్ అధికారులు ఆయా పనుల పురోగతిని పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ప్రతిబంధకాలు, సవాళ్లు, పెండింగ్ పనులు, అందుకు కారణాలను తెలిపారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. యుటిలిటీ షిఫ్టింగ్, పెండింగ్ భూసేకరణ పనుల్ని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే ప్రదేశాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, బోర్కడే హేమంత్ సహదేవ్ రావు, హేమంత్ పాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, రవికిరణ్, ప్రాజెక్ట్స్ చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ప్రత్యేక ఉప కలెక్టర్ రాములు నాయక్, పలువురు ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఇన్‌హౌస్ డిజైనింగ్ వింగ్..

హైసిటీ, ఎస్సార్‌డీపీ పనుల డిజైన్ల రూపకల్పనకు ప్రైవేట్ కన్సల్టెంట్లపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు, డిజైన్లను వేగంగా ఖరారు చేసేందుకు సీనియర్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారుల నేతృత్వంలో ఐఐటీ, ఎన్ఐటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలలో చదువుకున్న జీహెచ్ఎంసీ ఇంజనీర్లు 10 మందితో ఇన్‌హౌస్ డిజైన్ వింగ్ ఏర్పాటు చేశారు.

హైడ్రా టోల్ ఫ్రీ 1070

అందుబాటులోకి వచ్చిన నంబర్

- ఆపదలో సహాయ సహకారాల కోసమూ ఫోన్ చేయొచ్చు
- కొనసాగనున్న ఆ మూడు ఫోన్ నంబర్ల సేవలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా) టోల్‌ఫ్రీ నంబర్ 1070 ఏర్పాటు చేసింది. ఇది మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చినట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. జలవనరుల పరిరక్షణలో సాధారణ ప్రజలనూ భాగస్వాముల్ని చేస్తున్న అధికారులు ఈ టోల్‌ఫ్రీ నంబర్‌కు రూపమిచ్చారు. చెరువులు, నాలాలతోపాటు పార్కులు, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే ఆ సమాచారాన్ని ఈ టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా హైడ్రాకు అందించవచ్చు. చెట్లు పడిపోవడం, వరద ముంచెత్తడం, అగ్ని ప్రమాదాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ ఈ నంబర్‌ను సంప్రదించడం ద్వారా హైడ్రా సేవలు, సహాయ సహకారాలు పొందవచ్చని కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. దీంతోపాటు ఇప్పటికే అమలులో ఉన్న మరో మూడు ఫోన్ నంబర్లు సైతం పనిచేస్తాయని, వాటి సేవలూ కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఓఆర్ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం 8712406899ను నేరుగా, వాట్సాప్ ద్వారా సంప్రదించవచ్చు. ఆయా ఆక్రమణలు, ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సైతం ఈ నంబర్‌కు షేర్ చేయవచ్చు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినప్పుడు, , అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వెంటనే 8712406901, 9000113667 నంబర్లకు కూడా ఫోన్ చేయవచ్చు. ఈ మూడు సెల్ నెంబర్లతోపాటు టోల్ ఫ్రీ నెంబర్ నిర్విరామంగా పని చేస్తూ ఉంటాయని రంగనాథ్ స్పష్టం చేశారు.

'జంట'కు ట్రీట్‌మెంట్

మురుగు ముప్పు తప్పించేందుకు..

- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ ఎగువ ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీల నిర్మాణం
- శుద్ధ జలమే లక్ష్యంగా జలమండలి చర్యలు
- రూ.82.23 కోట్లతో శరవేగంగా సాగుతున్న నిర్మాణ పనులు
- వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేసే యోచన

మొయినాబాద్: హైదరాబాద్‌కు తాగునీరు అందించే హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జంట జలాశయాల్లో మురుగునీరు చేరకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఎస్టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.82.23 కోట్లతో జలాశయాల ఎగువ ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీల నిర్మాణ పనులు మొదలు పెట్టింది. వచ్చే ఏడాది మార్చి నాటికి వాటిని పూర్తి చేయడమే లక్ష్యంగా జలమండలి అధికారులు శరవేగంగా పనులు చేపడుతున్నారు.

కాలుష్యాన్ని అరికట్టేందుకు..

నగరవాసుల దాహార్తి తీర్చేందుకు నిజాంకాలంలో నిర్మించిన జంట జలాశయాలను మురుగు ముప్పు వెంటాడుతోంది. కొన్నేళ్లుగా జలాశయాల ఎగువ ప్రాంతాలైన మొయినాబాద్, శంషాబాద్, శంకర్‌పల్లి, గండిపేట మండలాల్లో కొత్త కాలనీలు ఏర్పడ్డాయి. మరోవైపు ఫాంహౌస్‌లు, విల్లాలు, ఇళ్లు, పరిశ్రమలు, హోటళ్లు, విద్యాసంస్థలు పెద్ద సంఖ్యలో వెలుస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల నుంచి భారీగా మురుగునీరు వచ్చి చేరుతుండడంతో జలాశయాలు కలుషితంగా మారుతున్నాయి. నిత్యం గండిపేట జలాశయంలోకి 29 లక్షల లీటర్లు, హిమాయత్‌సాగర్ జలాశయంలోకి 43.5 లక్షల లీటర్ల వ్యర్థజలాలు కలుస్తున్నట్లు జలమండలి అధికారుల పరిశీలనలో తేలింది. దీన్ని అరికట్టేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై సివరేజ్ బోర్డు ఎస్టీపీల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.82.23 కోట్లతో నాలుగు సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్మించాలని నిర్ణయించింది. అందులో భాగంగా ఒక్కో జలాశయం ఎగువ ప్రాంతంలో రెండు ఎస్టీపీల చొప్పున నిర్మాణ పనులను మొదలు పెట్టింది.



హిమాయత్‌నగర్‌లో గండిపేట జలాశయం వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ కేంద్రం

జలమండలి ప్రణాళికలు

జంట జలాశయాల్లో శుద్ధజలమే లక్ష్యంగా జలమండలి చేపడుతున్న ఎస్టీపీల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. గండిపేట జలాశయం పరిధిలో మొయినాబాద్ మున్సిపాలిటీలోని హిమాయత్‌నగర్ వద్ద 5 ఎంఎల్‌డీ, శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ వద్ద 4 ఎంఎల్‌డీ, హిమాయత్‌సాగర్ జలాశయం పరిధిలోని మొయినాబాద్ మండలం నాగిరెడ్డిగూడ వద్ద 5 ఎంఎల్‌డీ, శంషాబాద్ మున్సిపాలిటీలోని కొత్వాల్‌గూడ వద్ద 6 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఎస్టీపీలను నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి వాటి నిర్మాణం పూర్తిచేయడమే లక్ష్యంగా పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే ఎగువ ప్రాంతంలోని గ్రామాలు, విల్లాలు, హోటళ్ల నుంచి వచ్చే మురుగు నీటిని ఎస్టీపీల్లోకి మళ్లించి శుద్ధి చేయనున్నారు. 2050 నాటికి ఉత్పన్నమయ్యే మురుగునీటి అంచనాతో మన్నెగూడతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో ఎస్టీపీలు నిర్మించేందుకు జలమండలి ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఎస్టీపీల నిర్మాణం భేష్



గండిపేట, హిమాయత్‌సాగర్ జలాశయాల్లో మురుగునీరు చేరకుండా ప్రభుత్వం ఎస్టీపీల నిర్మాణం చేపట్టడం అభినందనీయం. ఎగువ ప్రాంతంలోని గ్రామాల నుంచి మురుగునీరు వచ్చి జలాశయాల్లోకి చేరకుండా అరికట్టొచ్చు. తద్వారా జలాశయాలు కలుషితం కాకుండా ఉంటాయి. ఇది భవిష్యత్ తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– పల్లగొల్ల అశోక్‌యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, హిమాయత్‌నగర్



నాగిరెడ్డిగూడలో హిమాయత్‌సాగర్ జలాశయం వద్ద నిర్మిస్తున్న ఎస్టీపీ కేంద్రం

మా వారిని విడుదల చేయించండి


లేఖను ప్రదర్శిస్తున్న ఖైదీల కుటుంబ సభ్యులు

పంజగుట్ట: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి ఏళ్ల తరబడి జీవిత ఖైదు అనుభవిస్తున్న తమ వారిని క్షమాభిక్ష ప్రసాదించి జైలు జీవితం నుంచి విముక్తి కలిగించాలని జీవిత ఖైదీల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖైదీల కుటుంబ సభ్యులు స్వప్న, బీచుపల్లి షరీఫ్, రాజేష్, అనీల్ కుమార్ మాట్లాడుతూ .. క్షణికావేశంలో చేసిన నేరాలతో జైలు జీవితాన్ని అనుభవిస్తున్న వారి పరిస్థితి ఒకలా ఉంటే వారిపై ఆధారపడ్డ వారి పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. భర్త దూరమై ఒకరు, తండ్రి దూరమైన పిల్లలు, సోదరుడు దూరమై, వృద్ధాప్యంలో ఉన్న వారు కొడుకులను దూరమై నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవతాదృక్పథంతో స్పందించి గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న తమ వారికి క్షమాభిక్ష ప్రసాదించి సాధారణ జీవితాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సెంట్రల్ లైటింగ్ పోల్ మీదపడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దుర్మరణం


స్వాథిక్ (ఫైల్)


విరిగిన పడిన విద్యుత్ స్తంభం


మల్లాపూర్: విద్యుత్ సెంట్రల్ లైటింగ్ పోల్ మీద పడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి చెందిన సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున స్థానిక వీఎస్టీ కాలనీకి చెందిన భజరంగ్ యూత్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్నారు. అదే సమయంలో కార్తికేయనగర్‌కు చెందిన స్వాథిక్ (23) బైక్ ఆ మార్గంలో వెళుతున్నాడు. మార్గమధ్యలో పంజాబ్ నేషనల్ బ్యాంక్ సమీపంలో వినాయకుడిని తరలిస్తున్న లారీ రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభానికి కట్టిన కేబుల్ వైర్‌ను తాకింది. దీంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి, ఒక స్తంభం గణేష్ విగ్రహంపై పడగా, మరో స్తంభం విరిగి సాథ్విక్ తలపై పడటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వాహనం డ్రైవర్ ఏడుకొండలు, భజరంగ్ యూత్ ఆసోసియేషన్ ఆర్గనైజర్ వెంకటేష్‌పై పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

వినాయక చవితికి వచ్చి అనంతలోకాలకు..

స్వాథిక్ పూణేలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. గణేష్ నవరాత్రి ఉత్సవాలకు నాచారం వచ్చిన అతను బెంగళూరు నుంచి వచ్చిన తన స్నేహితుడి కలిసేందుకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా మృత్యువాత పడ్డాడు.

రుణం తీసుకుని... ఖాతా ఖాళీ చేసి!

- యజమాని ప్రమేయం లేకుండానే ఈ వ్యవహారం
- రూ.12.75 లక్షలు నష్టపోయిన సికింద్రాబాద్ వాసి
- మరో ఉదంతంలో సెక్స్టార్షన్ ద్వారా రూ.లక్ష స్వాహా
- సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరగాళ్లు నానాటికీ తెలివి మీరుతున్నారు. బాధితులు ఊహించని, వారి ఊహకు అందని విధంగా పంజా విసురుతున్నారు. సెల్‌ఫోన్లలోని ఏపీకే ఫైల్స్ పంపి, వారి ఖాతాలకు ఖాళీ చేస్తున్న నేరాలు ఇటీవల కాలంలో వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయితే ఓ బాధితుడి నెట్ బ్యాంకింగ్‌ను వాడి, అతడి పేరుతో రుణం తీసుకుని, ఖాతాలో పడిన తర్వాత, సేవింగ్స్‌తో కలిపి రూ.12.75 లక్షలు స్వాహా చేసిన ఉదంతం తొలిసారిగా నమోదైంది. సికింద్రాబాద్‌కు చెందిన వ్యక్తి (41) ఫోన్‌కు ఏపీకే ఫైల్స్‌తో కూడిన లింకు పంపిన సైబర్ నేరగాళ్లు దానిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీని ద్వారా ఆయన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నెట్ బ్యాంకింగ్‌ను యాక్సస్ చేశారు. తమ ఖాతాను బెనిఫిషియరీ ఖాతాగా యాడ్ చేసుకోవడంతో పాటు నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.10,95,204 రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మొత్తం మంజూరై బాధితుడి ఖాతాలో పడింది. దీంతో పాటు అప్పటికే ఖాతాలో ఉన్న సేవింగ్స్ రూ.1.8 లక్షలు కలిపి స్వాహా చేశారు. అనుమానాస్పద సందేశాలు, ఫోన్ కాల్స్ అందుకున్న బాధితుడు బ్యాంకు సిబ్బందిని అప్రమత్తం చేసినా సైబర్ నేరగాళ్లు తెలివిగా కాజేశారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన యువకుడిని (25) వీడియో కాల్ ద్వారా ట్రాప్ చేసిన సైబర్ కేటుగాళ్లు సెక్స్టార్షన్‌తో రూ.లక్ష కాజేశారు. ఈ యువకుడికి గత నెల 24న ఓ అపరిచిత నెంబర్ నుంచి వీడియో కాల్ వచ్చింది. కొద్దిసేపు మాట్లాడిన ఓ యువతి అసభ్యంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించింది. సదరు యువకుడిని సైతం అభ్యంతరకరంగా వ్యవహరించేలా రెచ్చగొట్టి ఆ దృశ్యాలను రికార్డు చేసుకుంది. ఆపై పోలీసు అధికారిగా, యూట్యూబ్‌కు చెందిన ఉద్యోగిగా బాధితుడిని సంప్రదించిన సైబర్ నేరగాళ్లు తమ వద్ద ఉన్న వీడియో వైరల్ చేస్తామని బెదిరించారు. అలా కాకుండా ఉండాలంటే తాము కోరినంత చెల్లించాలంటూ ఐదు లావాదేవీల్లో రూ.లక్ష కాజేశారు. ఈ ఇద్దరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో కేసులు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

అకౌంట్ సప్లయర్ అరెస్టు...

నగరానికి చెందిన వృద్ధుడికి వాట్సాప్ ద్వారా ఎర వేసి, పెట్టుబడుల పేరుతో వర్చువల్ యాప్ షేర్ చేసి, రూ.43 లక్షలు కాజేసిన కేసులో ఓ నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. విశాఖపట్టణానికి చెందిన బొబ్బరి శ్రీనివాసరావు హౌసింగ్ లోన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. ఆన్‌లైన్ ద్వారా సూత్రధారులకు పరిచయమైన ఇతగాడు తన పేరుతో బ్యాంకు ఖాతాలు తెరిచి, మరికొందరితో తెరిపించి ఆ వివరాలను వారికి పంపాడు. బాధితుల నుంచి స్వాహా చేసే సొమ్మును ఆయా ఖాతాల్లో డిపాజిట్ చేయించుకుంటున్న నేరగాళ్లు ఆపై విత్‌డ్రా చేసుకుంటున్నారు. ఆ మొత్తం నుంచి శ్రీనివాస్‌కు కొంత కమీషన్ ఇస్తున్నారు. ఈ తరహా నేరాలకు సంబంధించి శ్రీనివాస్‌పై రాష్ట్రంలో రెండు, దేశ వ్యాప్తంగా 19 కేసులు నమోదయ్యాయి. సిటీలో నమోదైన రూ.43 లక్షలతో ముడిపడిన కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్ ఎస్.మట్టంరాజు నేతృత్వంలోని బృందం నిందితుడిని అరెస్టు చేసింది. అతడి నుంచి 13 చెక్‌బుక్స్, ఏడు డెబిట్‌కార్డులు, మూడు పాస్‌పుస్తకాలు తదితరాలు స్వాధీనం చేసుకుంది.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం


ఆక్రమిత స్థలాన్ని పరిశీలిస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని జలమండలి తట్టిఖానా వాటర్ రిజర్వాయర్ సమీపంలోని ప్రభుత్వ స్థలాన్ని రెండు గ్రూపులు ఆక్రమించేందుకు యత్నించడమేగాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను తుడిచేసి కబ్జాదారులు తమ పేర్లను రాసుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో దాడి చేసిన బంజారాహిల్స్ పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. షేక్‌పేట మండలం, బంజారాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఎదురుగా ఐదెకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ స్థలం ఉంది. సదరు స్థలానికి రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఇందులో ఎకరన్నర స్థలాన్ని జలమండలికి కేటాయించారు. మిగతా మూడున్నర ఎకరాల స్థలం మండల రెవెన్యూ ఆధీనంలో ఉంది. రూ.400 కోట్ల విలువైన ఈ స్థలాన్ని ఆక్రమించేందుకు పార్థసారథి, అతడి కుమారుడు విజయ్ భార్గవ్‌లు పలుమార్లు ప్రయతి్నంచారు. అంతటితో ఆగకుండా రౌడీలను నియమించుకుని సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి చుట్టూ బ్లూషీట్స్ కూడా నిర్మించుకున్నారు. రెవెన్యూ అధికారులు గతంలోనే మూడుసార్లు ఈ స్థలంలోకి వెళ్లి ఆక్రమణలను తొలగించి పార్థసారథి, విజయ్‌భార్గవ్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినా వారు తమ వైఖరి మార్చుకోలేదు. ఇటీవల జలమండలి, రెవెన్యూ అధికారులు ఈ స్థలంపై జోక్యం చేసుకోవద్దంటూ స్టే కూడా తీసుకువచ్చారు. అయితే రెండు రోజుల క్రితం పార్థసారథి అనుచరులు ఒకవైపు, ఇదే స్థలాన్ని తనదిగా పేర్కొంటున్న విద్యాసాగర్ అనుచరులు మరోవైపు..ఈ స్థలంలోకి చొరబడ్డారు. ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడమే కాకుండా స్థలంలో తమ పేర్లతో బోర్డులను కూడా ఏర్పాటుచేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువర్గాలకు చెందిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే విజయ్‌భార్గవ్ సోమవారం రాత్రి ఈ స్థలంలోకి చొరబడి వీఆర్ ఇన్‌ఫ్రా పేరుతో మరోసారి ఆక్రమణలకు యత్నించడంతో సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ డీసీపీ మంగళవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. స్థలంలో ఎవరూ ఉండవద్దని హెచ్చరించారు. స్థలాన్ని కాపాడుకోవాలని జలమండలిని ఆదేశించారు. కబ్జాదారులపై మరోమారు ఫిర్యాదు చేసేందుకు షేక్‌పేట తహశీల్దార్ సిద్ధమవుతున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా ఆటకట్టు

- 8 మంది నిందితుల అరెస్ట్
- పరారీలో ప్రధాన సూత్రధారులు



పోలీసుల అదుపులో నిందితులు

అమీర్‌పేట: ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు నిర్వహిస్తూ అమాయకులను మోసం చేస్తున్న 8 మంది ముఠా సభ్యులను సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఇద్దరు ప్రధాన నిందితులు పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి సెల్ ఫోన్లు, బ్యాంక్ పాస్‌పుస్తకాలు, ఏటీఎం కార్డులు, రూ.29.81 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కరీంనగర్‌కు చెందిన రాజేష్, అస్లాం బతుకు దెరువుకు నగరానికి వలస వచ్చారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు వీరు ఖేలో స్టార్,ఖేలో 24, ఖేలో ఎక్స్చైంజ్, ఖేలో స్పోర్ట్స్, విన్‌మ్యాచ్ తదితర వెబ్స్, మొబైల్ అప్లికేషన్ల ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నారు. కమీషన్ పద్ధతిలో కొంత మంది పంటర్లను నియమించుకుని వారికి యూజర్ ఐడీలు,పాస్‌వర్డ్‌లతో మొబైల్ ఫోన్లు ఇచ్చి పందాలు నిర్వహిస్తున్నారు. పలువురు యువకులను ఆన్‌లైన్ గేమింగ్ ఉచ్చులోకి దింపడమే కాకుండా డబ్బులు బదిలీ చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తుల బ్యాంక్ అకౌంట్లను ఉపయోగిస్తున్నారు. ఇప్పటి వరకు 235 యూజర్ ఐడీలను వినియోగించి బెట్టింగ్‌లు నిర్వహించినట్లు గుర్తించారు. వీరి దందాపై సమాచారం అందడంతో సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎస్ఆర్‌నగర్ పోలీసులతో కలిసి దాడి చేసి అమీర్‌పేటలో ఉంటున్న వినయ్‌కుమార్, సాయివర్ధన్‌గౌడ్, వేల్పుల ఆకాష్, పెద్దపల్లి జిల్లాకు చెందిన డి.రాహుల్,జశ్వంత్, జోడ వేణుగోపాల్, కోలరామ్, డి.ప్రణయ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితులు రాజేష్, అస్లాం పరారీలో ఉన్నట్లు తెలిపారు.వీరి నుంచి 18 సెల్ ఫోన్లు,3 బ్యాంక్ పాస్ బుక్స్, 13 ఏటీఎం కార్డులు, వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.29.81 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఆన్‌లైన్ గేమింగ్ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిట్టి గుండెను కాపాడుకుందాం..

నవజాత శిశువుల నుంచి..14 ఏళ్ల పిల్లల వరకు

- చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు
- యూకే వైద్య బృందం ఆధ్వర్యంలో నిర్వహణ
- వీక్లీ క్యాంప్‌లో భాగంగా 25 మందికి ఉచిత శస్త్రచికిత్సలు
- 14 నుంచి 20 వరకు కొనసాగనున్న శిబిరం



లక్డీకాపూల్ : కొందరు చిన్నారులు పిల్లలు పుట్టుకతోనే వ్యాధులతో బాధపడుతుంటారు. వాటిలో గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయి. ఆర్థికంగా స్థోమత ఉన్నవారు పెద్ద పెద్ద ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకోగలుగుతారు. కానీ పేద , మధ్యతరగతి కుటుంబాల పరిస్థితి మాత్రం చాలా కష్టంగా ఉంటుంది. అలాంటి వారికి నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(నిమ్స్) ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నది. అప్పుడే పుట్టిన శిశువుల మొదలు 14 ఏళ్ల చిన్నారులకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయనున్నారు. ఇందుకు గాను బ్రిటన్ వైద్యులు నిమ్స్‌కు రానున్నారు. ప్రముఖ వైద్యులు, తెలంగాణకు చెందిన డాక్టర్ రమణ దన్నపనేని నేతృత్వంలోని ఈ బృందం ఏటా సెప్టెంబర్‌లో వారం రోజుల పాటు ఉచిత గుండె ఆపరేషన్ల శిబిరాన్ని నిర్వహిస్తుంది. కార్డియోథొరాసిక్ వైద్యుల సమన్వయంతో నిర్వహించే శిబిరాన్ని ఈ నెల 14 నుంచి 20 వరకు నిమ్స్‌లో నిర్వహించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. కొన్ని క్లిష్టమైన సర్జరీలను సైతం యూకే డాక్టర్ల చేత నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా చిన్నారులకు ఉచితంగా 2డి ఎకోకార్డియోగ్రామ్ స్క్రీనింగ్‌లు చేస్తున్నట్లు తెలిపారు.

నిమ్స్ పీడియాట్రిక్ విభాగంలో నెలకు 25 సర్జరీలు

పీడియాట్రిక్ కార్డియాలజీ ఐసీయూ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు వెయ్యికి పైగా గుండె ఆపరేషన్లు చేశామని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. రెండేళ్ల నుంచి నెలకు 20 నుంచి 25 సర్జరీలు చేయగా ప్రస్తుతం నెలకు 35 సర్జరీలు చేస్తున్నామన్నారు. శిశువు పుట్టిన వెంటనే చేసే సర్జరీల నుంచి, ఏడాదికి, రెండేళ్లు, ఐదేళ్లకు ఇలా పరిమిత సమయంలోపే చేసే సర్జరీలు కూడా ఉంటాయన్నారు. ఆ సమయంలోగా చేయకపోతే ఆ సమస్యలు ముదిరి తీవ్ర అనారోగ్యానికి దారితీస్తాయన్నారు.

రిజిస్ట్రేషన్ ఇలా చేసుకోండి..

నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప



గుండె సంబంధిత సమస్యలున్న చిన్నారుల తల్లిదండ్రులు 040-23489025లో సంప్రదించవచ్చని డైరెక్టర్ బీరప్ప తెలిపారు. నిమ్స్ పాత భవనంలోని సీటీవీఎస్ కార్యాలయంలో కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అరమేశ్వర రావు, డాక్టర్ ప్రవీణ్ డాక్టర్ గోపాల్‌లను మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంప్రదించాలని, పూర్వపు రిపోర్టులు తమ వెంట తీసుకురావాలని సూచించారు. రికార్డు అందుబాటులో లేకుంటే.. ఆస్పత్రిలోనే అవసరమైన స్క్రీనింగ్ నిర్వహిస్తామన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో 25 మంది చిన్నారులకు మాత్రమే శస్త్రచికిత్సలు చేసినా.. ఆ తర్వాత కూడా దశల వారీగా నిమ్స్ వైద్యులు ఆపరేషన్లు కొనసాగిస్తారని చెప్పారు. ఈ క్రమంలో ఈ ఏడాది దాదాపు 350 మంది చిన్నారులకు గుండె ఆపరేషన్లు చేశామన్నారు. ఈ చికిత్సలకు అయ్యే ఖర్చును ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు.

నిమ్స్‌కు వచ్చే కేసులు ఎక్కువగా క్రిటికల్‌లో ఉన్నవే వస్తుంటాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా గుండె మార్పిడి చికిత్సల నుంచి రోబోటిక్ చికిత్సలను చేస్తున్నామన్నారు.

వ్యత్యాసాలను సరిదిద్దండి

- 'నమిత 360'కి హైకోర్టు ఆదేశం..
- స్టే ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, ఇజ్జత్‌నగర్‌లోని సర్వే నంబర్ 12/పీ, 13/పీలో హైటెక్ సిటీకి చేరువలో నిర్మిస్తున్న నమిత 360 లైఫ్ ప్రాజెక్టు పనులు నిలిపివేస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసింది. అయితే మంజూరైన ప్లాన్‌కు ఏవైనా వ్యత్యాసాలు ఉంటే నిర్మాణదారు వెంటనే సరిదిద్దే చర్యలు చేపట్టాలని ఆదేశించింది. హైటెక్ సిటీకి చేరువలో నమితా హోమ్స్ 25 అంతస్తుల్లో 360 లైఫ్ ప్రాజెక్టు పేరుతో నిర్మాణాన్ని చేపట్టింది. ఈ ప్రాజెక్టు ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండానే జీహెచ్‌ఎంసీ కమిషనర్ జూన్ 11న జారీ చేసిన ఉత్తర్వులు చట్ట విరుద్ధమని, స్టే విధించాలని కోరుతూ బోయిన్‌పల్లికి చెందిన విజయ్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్ సేన్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. గతంలో ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేశారు. ఉల్లంఘనలు ఉంటే వెంటనే సరిదిద్దాలని నిర్మాణ సంస్థను ఆదేశించారు.

సిటీలో యాపిల్ విస్తరణ...

ఐటీ పార్క్ వేవ్‌రాక్‌లో నూతనంగా 64,125 చ.అ స్థలం లీజు

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గ్లోబల్ సంస్థ యాపిల్ హైదరాబాద్ నగరంలో తన ఉనికిని, సేవలను మరింత విస్తరించింది. ఇందులో భాగంగా నగరంలోని ఐటీ పార్క్ వేవ్‌రాక్‌లో నూతనంగా 64,125 చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ విస్తరణతో సంస్థ మొత్తంగా 5 లక్షల చదరపు అడుగులకు చేరుకుంది. అయితే వేవ్‌రాక్ టవర్‌లో యాపిల్ 64,125 చదరపు అడుగుల అదనపు కార్యాలయ స్థలానికి రూ.80.15 లక్షల నెలవారీ అద్దె చెల్లించేలా ఐదేళ్లకు లీజుకు తీసుకున్నట్లు సమాచారం. ఇందుకుగాను చదరపు అడుగుకు రూ.125 చొప్పున చెల్లించనుంది. హైదరాబాద్‌లోని టీఎస్ఐ బిజినెస్ పార్క్స్ లిమిటెడ్ ద్వారా ప్రాజెక్ట్‌లో ఉన్న యాపిల్ ప్రస్తుత కార్యాలయాలను విస్తరించింది. ప్రాప్‌స్టాక్ ప్రకారం., యాపిల్ కంపెనీ ఈ ప్రాజెక్ట్‌లో అనేక కార్యాలయ స్థలాలను మల్టీ లీజ్‌లో భాగంగా మొత్తం 5 లక్షల చదరపు అడుగుల తీసుకుంది.

విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక కృషి


మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

నాంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఆసిఫ్‌నగర్‌లో తెలంగాణ మైనార్టీస్ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ, హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో రూ.8.7 కోట్లతో హాస్టల్ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. త ద్వారా 160 మంది విద్యార్థులకు ఆధునిక విద్యా, వసతి సదుపాయాలు అందనున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో మైనార్టీ గురుకులాలు, జూనియర్ కళాశాలలు, వసతి గృహాల నిర్మాణం శరవేగంగా జరుగుతుందని. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 20 శాతం పనులు పూర్తి చేయడానికి రూ.40 కోట్లు అవసరమని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశాన్ని మైనార్టీల సంక్షేమ శాఖ కార్యదర్శి బి.షఫీవుల్లా, టీజీఎంఆర్ ఈఐఎస్ అధ్యక్షులు ఫహీం ఖురేషీతో కలిసి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో రూ.200 కోట్లతో యంగ్ ఇండియా కాన్సెప్ట్ కింద ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకులాల అభివృద్ధి జరుగుతోందని, ఒకే క్యాంపస్‌లో ప్రాథమిక స్థాయి నుండి డిగ్రీ వరకు విద్యా సదుపాయాలు కల్పించే సమగ్ర ప్రణాళికతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తున్నారని, ఇది వర్సిటీ వందేళ్ల చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందన్నారు. గురుకులాల్లో ఆహార నాణ్యతపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని, అల్యూమినియం పాత్రల స్థానంలో స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు వినియోగానికి రూ.7 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. డైట్ ఛార్జీలు, స్కాలర్‌షిప్ మొత్తాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, ఆర్డీవో రామకృష్ణ, డిప్యూటీ సెక్రటరీ జుబేదా తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

పోచారం: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చౌదరిగూడలోని సాయిబాబానగర్‌కు చెందిన కొమ్ము వంశీ (21) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి అతను కొర్రెముల్ నుంచి చౌదరిగూడకు వస్తుండగా శ్రీసాయి ఎన్‌క్లేవ్ వద్ద ఎదురుగా వస్తున్న పల్సర్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు.

అనాథ శరణాలయం పేరుతో టోకరా

బంజారాహిల్స్: తాను అనాథ శరణాలయం నుంచి ఫోన్ చేస్తున్నానని, శరణాలయానికి రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11,100 జమ అవుతుందని నమ్మించి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..బంజారాహిల్స్ ఉదయ్‌నగర్‌కు చెందిన గోపిరెడ్డి మహేశ్వర్ వ్యవసాయ శాఖలో పని చేస్తున్నాడు. గత నెల 31న రాత్రి అతడికి గుర్తుతెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను అనాథ శరణాయం నుంచి ఫోన్ చేస్తున్నానని, రూ.10,157 చెల్లిస్తే ప్రతినెలా మీ ఖాతాలో రూ.11.100లు జమ అవుతాయని చెప్పాడు. అతడి మాటలు నమ్మిన మహేశ్వర్ ఆ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా పంపించాడు. ఆ తర్వాత పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన అతను పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైట్ సూపర్‌వైజర్‌పై దాడి..

బంజారాహిల్స్: సైట్ సూపర్‌వైజర్‌పై నలుగురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజరాహిల్స్ రోడ్డునెంబర్-10లోని బసవతారకం హాస్పిటల్ ఎదురుగా ఉన్న సైట్‌లో లంగర్‌హౌస్ వినాయక్‌నగర్‌కు చెందిన తేజ (31) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున నలుగురు వ్యక్తులు సైట్‌లోకి చొరబడిపై తేజపై ఇనుపరాడ్డుతో దాడి చేయడంతో అతడికి తీవ్రగాయాలయాయి. అనంతరం కట్టర్ మిషన్‌ను చూపించి బెదిరించడంతో తేజ వారి బారి నుంచి తప్పించుకున్నారు. మంగళవారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలుకిందపడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య


బూక్యా పట్నాయక్ మృతదేహం

సికింద్రాబాద్: రైలుకిందపడి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రైల్వే సికింద్రాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడిని మహబూబ్‌నగర్ జిల్లా, నెల్లికుదురుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బూక్యా పట్నాయక్ (28) గా గుర్తించారు. నెల్లికుదురు గ్రామానికి చెందిన రైతు బూక్యా బాలాజీ కుమారుడు పట్నాయక్ నగరంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ చెంగిచెర్లలోని తన సోదరి ఇంట్లో ఉంటున్నాడు. మృతుడి వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు 20 ఏళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: ప్రేమ, పెళ్లి పేరుతో యువతిపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు 20ఏళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ 13వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి యం. వాణి మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు ఏపీపీ మంజుల దేవి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. ఒడిశా రాష్ట్రానికి చెందిన యువతి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. అదే రాష్ట్రానికి చెందిన స్వాగత్ కుమార్ బోయ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. దీనిని ఆసరాగా తీసుకుని అతను సదరు యువతిని ప్రేమ పెళ్లి పేరుతో ఆమెను నమ్మించి పలు మార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. అయితే ఆ తర్వాత స్వాగత్ కుమార్‌కు మరో యువతితో పెళ్లి కుదిరినట్లు తెలియడంతో బాధితురాలు అతడిని నిలదీసింది. దీంతో స్వాగత్ ఆమెతో పాటు ఆమె తల్లిదండ్రులపై దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం నిందితుడికి పై విధంగా శిక్ష విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పింది. బాధితురాలికి రూ. 2లక్షలు పరిహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

డ్రై ఫ్రూట్స్‌తో విజయగణపతి స్వామి అలంకరణ



బంజారాహిల్స్: బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలోని శ్రీ విజయగణపతి స్వామి ఆలయంలోని స్వామివారిని అర్చకులు డ్రై ఫ్రూట్స్‌తో మంగళవారం అలకరించారు. దీంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అంతకుముందు వేకువజామున పంచామృతాలతో అభిషేకంతో పాటు గణపతి హోమం నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులు షురూ



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ రోడ్డునంబర్–75లో సీసీ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. ఇటీవల ఈ రోడ్డులో 200 మీటర్ల మేర 250 ఎంఎం డయా డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణాన్ని రూ.24 లక్షల వ్యయంతో పూర్తి చేశారు. ఇప్పుడు ఇదే రోడ్డులో 200 మీటర్ల మేర రూ.24 లక్షల తో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఇదే రోడ్డులో నివసించే జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్ సెక్రటరీ కిలారు రాజేశ్వరరావు పలుమార్లు జలమండలి, జీహెచ్ఎంసీ అధికారుల చుట్టూ తిరిగి నిధులు మంజూరు చేయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న బాబా ఫసియుద్దీన్, జీహెచ్ఎంసీ ఈఈ, డీఈ

రహమత్‌నగర్ : బంజానగర్‌లో కొనసాగుతున్న సీసీ రోడ్ల పనులను మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలతో పనులు సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. జీహెచ్ఎంసీ ఈఈ భద్రు, డీఈ భాను, ఏఈ భరత్, కాంగ్రెస్ నాయకులు అశోక్, మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి



ప్రతాప్‌నగర్‌లో మండపాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ మురళీకృష్ణ

బంజారాహిల్స్: వినాయక నిమజ్జనానికి మరో మూడు రోజులే ఉందని, మండపాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పంజగుట్ట ఏసీపీ మురళీకృష్ణ సూచించారు. పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతాప్‌నగర్ బస్తీలో మంగళవారం మండపాలను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు. మండపాల వద్ద రాత్రి వేళల్లో ఇద్దరు నిర్వాహకులు ఖచ్చితంగా ఉండాలన్నారు. ఆయన వెంట పంజగుట్ట సీఐ శోభన్ ఉన్నారు.

మహా గణపతి హుండీ లెక్కింపు



ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతి హుండీ లెక్కింపును అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. మహా గణపతి తయారీ మొదలు నిమజ్జనం అయ్యేవరకు చేసే ఖర్చు అంతా భక్తులు ఇచ్చే కట్న కానుకలతోనే జరుగుతోంది.

మరింత సులభంగా అర్థమయ్యేలా..



• విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనకు పరికరాలు • రూపొందించిన ఉపాధ్యాయులు • ఆకట్టుకుంటున్న టీఎల్‌ఎం ప్రదర్శనలు

బంజారాహిల్స్: విద్యార్థులకు సులభంగా పాఠ్యాంశాలు అర్థమయ్యేలా విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం వారికి దృశ్య, కథనరూపంలో బోధించేందుకు బోధన–అభ్యాసన పరికరాలు (టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్)ను తయారు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. దీంతో ఉపాధ్యాయులు తీర్చిదిద్దిన బోధనా అభ్యాసన పరికరాలను ప్రదర్శన రూపంలో మండలాల వారీగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో షేక్‌పేట మండల పరిధి కిందకు వచ్చే 20 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన టీచర్లతో పాటు యాక్టివ్‌గా ఉండే విద్యార్థులు బోధనా అభ్యాసన పరికరాలను రూపొందించి ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రదర్శించారు. వారం క్రితం ఖైరతాబాద్–1 మండల పరిధిలోని 8 పాఠశాలలకు చెందిన టీఎల్‌ఎం ప్రదర్శన రాజ్ భవన్ ప్రైమరీ స్కూల్‌లో జరిగింది.

ఉపయోగాలు..

◆ బోధన ప్రక్రియను సులభం చేయడం, విద్యార్థుల అభ్యాసాన్ని ఆకర్షణీయంగా, అర్థవంతంగా చేసేందుకు ఉపయోగించే సహాయక వస్తువులు, పరికరాలు, దృశ్యాలు లేదా కార్యకలాపాలనే బోధనా అభ్యాసన పరికరాలు అంటారు.



ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రదర్శన తిలకిస్తున్న దృశ్యం

◆ క్లిష్టమైన అంశాలను కూడా సులభంగా అర్థమయ్యేలా బోధన అభ్యాస పరికరాలు ఉపయోగపడుతాయి.
◆ విద్యార్థుల్లో ఆసక్తి కలిగించడం, నేర్చుకోవాలనే ఆసక్తిని పెంచుతాయి.
◆ శాశ్వత జ్ఞానం–చూపిన వస్తువులు, దృశ్యాలు ఎక్కువ కాలం గుర్తుంటాయి.
◆ ఇంద్రియాల వినియోగం, చూపడం, వినిపించడం, తాకడం వంటివాటితో అభ్యాసం బలపడుతుంది.

బోధన–అభ్యాసన పరికరాల రకాలు..

◆ దృశ్య పరికరాలు (విజివిల్ ఎయిర్స్) చిత్రాలు, మ్యాపులు, చార్ట్‌లు, ఫ్లాష్ కార్డులు, బ్లాక్ బోర్డు
◆ శ్రావ్య పరికరాలు, రేడియో, టేప్‌రికార్డ్‌లు, గీతాలు, కథలు.
◆ దృశ్య శ్రావ్య పరికరాలు టెలివిజన్, సినిమాలు, కంప్యూటర్, ప్రొజెక్టర్
◆ కార్యకలాప పరికరాలు ఆటలు, ప్రయోగాలు, పాత్రాభినయాలు, మోడళ్లు, ఫీల్డ్ ట్రిప్స్.

ఉదాహరణకు.. గణితంలో జామెట్రీ బాక్స్

◆ సైన్స్‌లో ప్రయోగ సామగ్రి, మోడళ్లు, భాషల్లో ఫ్లాష్ కార్డులు, కథా చిత్రాలు.
◆ సామాజిక శాస్త్రాల్లో మ్యాపులు, గ్లోబులు ఇలా మొత్తానికి బోధనా అభ్యాసన పరికరాలు ఉపాధ్యాయుల బోధనను సమర్థవంతం చేయడంతో పాటు విద్యార్థుల అభ్యాసాన్ని మరింత మెరుగుపరుస్తాయి. అందుకే అన్ని మండలాల పరిధిలో నిర్వహించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య సమన్వయం కుదిరితే బోధన చక్కగా సాగడమే కాకుండా సులువుగా అర్థమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సులువైన బోధన కోసం రూపొందించిన కృత్యాలను ఇక్కడ ప్రదర్శించి విశేషంగా ఆకట్టుకున్నారు.

మున్నూరు కాపు మహిళలు రాజకీయంగా ఎదగాలి



బండి పద్మకు సభ్యత్వం ఇస్తున్న పురుషోత్తం పటేల్

పంజగుట్ట: మున్నూరు కాపు మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షుడు పూటం పురుషోత్తమ పటేల్ పేర్కొన్నారు. సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బండి పద్మ పటేల్‌కు మంగళవారం సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బండి పద్మ నేతృత్వంలో సభ్యులుగా చేరాలన్నారు. బండి పద్మ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మహిళలను సంఘటితం చేసి బలమైన మహిళా శక్తిగా రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆకుల సంధ్యారాణి, తోట జ్యోతి, గాజుల ఉమా, ఏనుముల శైలజ తదితరులు పాల్గొన్నారు.

నారాయణి గోసేవా సదన్‌కు స్టీల్ ప్లేట్ల వితరణ



స్టీల్ ప్లేట్లను అందజేస్తున్న సతీశ్ తదితరులు

బంజారాహిల్స్: ప్లాస్టిక్ ప్లేట్లలో భోజనం చేయడం హానికరమని బర్కత్‌పుర అరుణ ఫొటో స్టూడియో యజమాని నిమ్మల సతీశ్ ఉచితంగా స్టీల్ ప్లేట్లను సోమవారం పంపిణీ చేశారు. మూసారాంబాగ్ శాలీవాహననగర్‌లోని నారాయణి గోసేవా సదన్‌కు సొంత ఖర్చుతో 100 స్టీల్ ప్లేట్లను కొనుగోలు చేసి అందజేశారు. అన్నదానాలకు అందరూ స్టీల్ ప్లేట్లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో నారాయణి గోసేవా సదన్ నిర్వాహకులు అమన్ సోని, డీపీ తివారీ, మోహన్‌బాబు, సజ్జన్‌డాగా, పవన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

‘పాణకా కనకమ్మకు భారతరత్న ఇవ్వాలి’

పంజగుట్ట: బాలికల విద్య కోసం వందేళ్ల క్రితమే రూ. 2500 కోట్ల విలువైన ఆస్తిని రాసిచ్చిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు పాణకా కనకమ్మకు భారతరత్న ఇవ్వాలని పాణకా కనకమ్మ ఆశయసాధన సమితి కన్వీనర్ బి.సురేంద్ర నాథ్ రెడ్డి కోరారు. ఏటా ఆమె పేరుపై ఇచ్చే 6 అవార్డులను ఈ యేడు నుంచి మరొకటి జత చేసి ఏడు అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అవార్డుల వివరాలను మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, కొండా లక్ష్మీకాంత్ రెడ్డి, మంజునాథ రెడ్డి, దయాకర్ రెడ్డితో కలిసి వెల్లడించారు. వారు మాట్లాడుతూ.. కనకమ్మకు భారతరత్న ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన స్పందించి కేంద్రానికి ఆమె పేరును సిఫార్సు చేశారని కేంద్రం భారతరత్న ప్రకటించాలని కోరారు. ఈ యేడు పాణకా కనకమ్మ సంగీత సాహిత్య అవార్డు, జమీన్ రైతు పత్రిక స్మారక అవార్డు, ఆచార్య ఎన్.జీ.రంగా రైతుబంధు అవార్డు, నిజాయతీ అధికారి అవార్డు, సాహిత్య అవార్డు, హరిజన సేన అవార్డు, సాహిత్య గ్రంథాలయ అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీటిని ఐదుగురు సభ్యులతో కూడిన జ్యూరీ ఎంపిక చేస్తుందని అవార్డు గ్రహీతలకు రూ. 25 వేల నగదు బహుమతి, జ్ఞాపిక ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.



అవార్డుల వివరాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల

వేతనాలు వెంటనే విడుదల చేయాలి

ఖైరతాబాద్: రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఆరు నెలలుగా వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ 1వ తేదీనే జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ముట్టడి కార్యక్రమంలో వెంకటేశ్, నందగోపాల్, వేముల రామకృష్ణ, బీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ వెంకటేశ్, కొండయ్య, రామకృష్ణ, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

గోషామహల్‌లో ఫ్లాగ్‌మార్చ్

అబిడ్స్: గోషామహల్ డివిజన్‌లో మంగళవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సౌత్ వెస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ కృష్ణగౌడ్, ఏసీపీ సుదర్శన్, గోషామహల్, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, మహేష్ గౌడ్, వెంకటర్‌రెడ్డితో పాటు పలువురు ఎస్ఐలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఆగాపురా, గోషామహల్, బోయిగూడ కమాన్, మంగళ్‌హాట్, ధూల్‌పేట్, ఎంజే బ్రిడ్జ్, ఛత్రి, బేగంబజార్‌లతో పాటు పలు ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి ప్రజల్లో మనోధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ..నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు.

ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

నాంపల్లి: రాష్ట్రంలోని సాంకేతిక, వృత్తి విద్యా కళాశాలల్లో బ్లాక్ పీరియడ్(2025–28) ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్, ఫీజుల పెంపు నిర్ణయ పునర్ విచారణ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. తరగతులు ప్రారంభమైనందున పెంచిన ఫీజులు అమలు చేసినట్లయితే విద్యార్థుల తల్లిదండ్రుల మీద భారం పడుతుందని కావున ఫీజు పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం పునరాలోచన చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దూదిమెట్ల బాలరాజుయాదవ్, సాంబశివగౌడ్, హరీష్ గౌడ్, కేతూరి వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, నీరడి సూర్యం, కరుణాకర్‌రెడ్డి, కొప్పుల రాజు, శ్రీకాంత్ గౌడ్, కాటం శివ, చరణ్ కుమార్, జూలూరి మహేష్ పాల్గొన్నారు.

మహాగణపతికి నైవేద్యం సమర్పణ



మహాగణపతికి ప్రసాదాన్ని నైవేద్యంగా అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

ఖైరతాబాద్: ఖైరతాబాద్ విశ్వశాంతి మహాశక్తి గణపతిని దర్శించుకునేందుకు వస్తున్న లక్షలాది మంది భక్తులకు ప్రతిరోజు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు. అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిరోజు 50వేల మంది భక్తులకు 9రోజుల పాటు 9 రకాల ప్రసాదాలు, మహాగణపతి వద్ద విధులు నిర్వహిస్తున్న వివిధ రకాల డిపార్ట్‌మెంట్లకు చెందిన 4 వేల మంది సిబ్బందికి 3పూటలా తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ తీర్థ ప్రసాదాన్ని మహాగణపతికి సమర్పించిన అనంతరం భక్తులకు పంపిణీ చేశారు.

‘దేశానికి దిక్సూచిగా ఉపరాష్ట్రపతి ఎన్నిక’

పంజగుట్ట: దేశంలోని పౌరుల హక్కులు బలహీనమౌతున్న నేపథ్యంలో ప్రస్తుతం జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక దేశ ముఖచిత్రానికి దిక్సూచిగా నిలవాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతుగా జర్నలిస్టులు, ప్రముఖ సామాజిక కార్యకర్తల నుంచి సేకరించిన సంతకాల పత్రాన్ని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు రామచంద్ర మూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్యతో కలిసి మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు విద్యావంతులు, మేధావులు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు 125 మంది సంతకాలు చేశారని, త్వరలోనే ఆ సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాజ్యాంగ పరిరక్షణకు సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. రామచంద్ర మూర్తి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సుదర్శన్ రెడ్డికి మద్దతు లభిస్తుందన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్



‘సాక్షి’ ప్రధాన కార్యాలయంలోని గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న సిబ్బంది

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

వినాయక నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు.. కుంకుమార్చనలు చేశారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పలుచోట్ల గణనాథులను నిమజ్జనాలు చేశారు.

– బంజారాహిల్స్





ప్రతాప్‌నగర్ బస్తీలో పూజల్లో పంజగుట్ట ఏసీపీ మురళీకృష్ణ, సీఐ శోభన్



ఫిలింనగర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

• మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ • మహా నేతకు ఘనంగా నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు

శ్రీనగర్‌కాలనీ: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలుగు రాష్ట్రాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ఆదర్శప్రాయమని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిగూడలో మంగళవారం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలు వైఎస్సార్ మరిచిపోరని, తెలుగు రాష్ట్రాల్లో ఆయన అభిమానులు లక్షల్లో ఉన్నారన్నారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నేతలు నవీన్‌యాదవ్, ఉపేందర్‌రెడ్డి, సమైక్యాంధ్ర పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కుమార్‌చౌదరి యాదవ్, కార్పొరేటర్ వనం సంగీత, చిన్న శ్రీశైలం యాదవ్, గొంటి శ్రీనివాస్‌యాదవ్, గొంటి సాయినాథ్‌యాదవ్ పాల్గొన్నారు.



వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్

వైఎస్సార్‌కు ఘన నివాళి

పంజగుట్ట: పంజగుట్ట కూడలిలోని వైఎస్సార్ విగ్రహానికి ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని సిటీ సెంటర్ చౌరస్తాలో వైఎస్సార్ విగ్రహానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాజీ కార్పొరేటర్ భారతీనాయక్‌తో కలిసి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు బాబా నాయక్, రాములు చౌహాన్, ముజ్జు, ఆంటోని, జావెద్, రాంజీ చౌహాన్, మహేందర్ పాల్గొన్నారు.


ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేశ్ ఆధ్వర్యంలో నేతలు, కార్యకర్తలు పంజగుట్ట చౌరస్తాలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలతో చెరగని ముద్ర

లిబర్టీ: సంక్షేమ పథకాలతో వైఎస్సార్ తెలుగు ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వెన్న సదానందు అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కష్టాల్లో ఉన్న కాంగ్రెస్‌ను అధికారంలో తీసుకువచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడారని కొనియాడారు.



నివాళులర్పిస్తున్న విజయారెడ్డి



నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నేతలు



సిటీ సెంటర్ చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం

నిలోఫర్‌లో టైఫాయిడ్ పరిశీలన కేంద్రం ప్రారంభం



నాంపల్లి: నగర ఆధారిత ప్రయోగశాల మద్దతుతో నగరంలోని ఏడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో టైఫాయిడ్ పరిశీలన కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వీటిలో రెడ్‌హిల్స్‌లోని ప్రముఖ నవజాత శిశు సంరక్షణ కేంద్రం నిలోఫర్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభించారు. ఇందులో టైఫాయిడ్ పరిశీలన కోసం నిలోఫర్‌ను ప్రధాన నోడల్ కేంద్రంగా గుర్తించారు. ఈ మేరకు మంగళవారం నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌ఓ) రాష్ట్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారితో కలిసి టైఫాయిడ్ పరిశీలన కేంద్రాన్ని ప్రారంభించారు. నిలోఫర్ ఆస్పత్రిని టైఫాయిడ్ పరిశీలన కేంద్రంగా గుర్తించడం సంతోషంగా ఉందని డాక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నిలోఫర్ ఆస్పత్రి పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర, ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డిప్యూటీ సీఎస్ ఆర్‌ఎంఓ డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్, పీడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ సురేష్, డాక్టర్ సౌమ్య, డాక్టర్ నిఖిల, డాక్టర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'రైతునేస్తం' పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: 'రైతునేస్తం' వ్యవసాయ కుటుంబ మాసపత్రిక 21వ వార్షికోత్సవం సందర్భంగా సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత పద్మశ్రీ డా.ఐవీ సుబ్బారావు పేరిట వ్యవసాయ, అనుబంధ రంగాలలో విశేష సేవలు అందిస్తున్న శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తరణ అధికారులను త్వరలో జరగబోయే వార్షికోత్సవ వేడుకలో అవార్డులతో సత్కరించనున్నట్లు పత్రిక ఎడిటర్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వ్యవసాయ, అనుబంధ రంగాల శాస్త్రవేత్తలు, విస్తరణ అధికారులు, అగ్రి ఇన్నోవేషన్స్ రైతులు 'రైతునేస్తం' వెబ్‌సైట్ https://rythunestham.in/awards నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని పూరించి, దానికి వారి పరిశోధనా వ్యాసాలను, సాగు అనుభవాలను జతపరచి సెప్టెంబర్ 15 వ తేదీలోగా 'ఎడిటర్, రైతునేస్తం, 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచారసభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్ – 500004. లేదా 'రైతునేస్తం', ఇంటి నెం.8-198, పుల్లడిగుంట దగ్గర, కొర్నెపాడు పోస్టు, వట్టిచెరుకూరు మండలం , గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 522 017, చిరునామాలకు పంపవచ్చని తెలిపారు. లేదా editor@rythunestham.inకు ఇ–మెయిల్ చేయవచ్చని పేర్కొన్నారు.

సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

లక్డీకాపూల్: సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. బేగంపేట్‌లోని ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణికి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో బాధిత సర్పంచ్‌లు పెద్ద ఎత్తున తరలివచ్చిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదయ్య గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచులు చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. చేసిన పనులకు ఏళ్ల తరబడి బిల్లులు బకాయి పడటంతో చాలామంది సర్పంచులు రుణాలకు వడ్డీలు చెల్లించలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. సీఎం ప్రజావాణి నోడల్ అధికారి దివ్య దేవరాజ్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి వేడబోయిన గణేష్, బకీరు బీరప్ప, మన్నే పద్మారెడ్డి, పూర్ణచందర్ గౌడ్ పాల్గొన్నారు.

మెట్రో రైలులో ఆర్గాన్స్ తరలింపు



బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను వైద్యుల పర్యవేక్షణలో మంగళవారం రాత్రి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మెట్రో రైలులో ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రి నుంచి మాదాపూర్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు.

–సాక్షి, సిటీబ్యూరో

బిగ్ స్టోరీ: డెత్ స్పాట్స్!

నగరంలో రోడ్డు ప్రమాదాలు, మరణాలు తగ్గించడానికి సన్నాహాలు చేస్తున్న నగర ట్రాఫిక్ విభాగం అధికారులు బ్లాక్‌స్పాట్స్‌పై దృష్టి పెట్టారు. తరచూ ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి, కారణాలను అధ్యయనం చేయడంతో పాటు నివారణ చర్యలకు కసరత్తు చేస్తున్నారు. నగరంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో నిర్వహించిన స్టడీ ఆధారంగా 54 బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్లు గుర్తించారు. గడిచిన రెండేళ్ల గణాంకాల ఆధారంగా దీన్ని నిర్ధారించారు.

– సాక్షి, సిటీబ్యూరో

'ఇన్నర్'లోనే అత్యధికంగా..

నగర ట్రాఫిక్ కమిషనరేట్ పరిధిలో 28 ట్రాఫిక్ పోలీసుస్టేషన్లు ఉన్నాయి. వీటిలోని కేవలం కొన్నింటిలో మాత్రమే బ్లాక్‌స్పాట్స్ లేవని తేలింది. అత్యధిక ఠాణాల పరిధిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే బ్లాక్‌స్పాట్స్ ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. వీటిలోనూ ఒక ఠాణా పరిధిలో ఐదు, మరోదాని పరిధిలో నాలుగు, నాలుగు పోలీసుస్టేషన్ల పరిధిలో మూడేసి, తొమ్మిదింటిలో రెండు చొప్పున యాక్సిడెంట్స్ స్పాట్స్ ఉన్నట్లు ట్రాఫిక్ విభాగం అధికారులు గుర్తించారు. ప్రధానంగా ఇన్నర్ రింగ్ రోడ్డు(ఐఆర్ఆర్)లో విస్తరించి ఉన్న ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధుల్లోనే బ్లాక్‌స్పాట్స్ ఎక్కువగా ఉంటున్నాయని తేలింది.



సిటీలో బ్లాక్‌స్పాట్స్‌గా పరిగణించే ప్రమాదకరమైన ప్రాంతాలను గుర్తించడానికి ట్రాఫిక్ పోలీసులు శాంతిభద్రతల విభాగం అధికారులతో సమన్వయం ఏర్పాటు చేసుకున్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నిరోధానికి ట్రాఫిక్ పోలీసులు పని చేస్తారు. అయితే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు దానిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేసేది మాత్రం లా అండ్ ఆర్డర్ పోలీసులే. ఈ నేపథ్యంలోనే వారితో కలిసి ట్రాఫిక్ పోలీసులు అధ్యయనం చేశారు. 2023–24లో సిటీలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల జాబితాలను సేకరించారు. ఒకే ప్రాంతం లేదా స్ట్రెచ్‌లో రెండు కంటే ఎక్కువ యాక్సిడెంట్స్ చోటు చేసుకున్న ఏరియాలను గుర్తించారు. వీటిలో యాదృచ్ఛికంగా జరిగిన వాటిని మినహాయించారు. ఇంజినీరింగ్ సహా ఇతర లోపాల వల్ల చోటు చేసుకున్న ప్రమాదాలకు ప్రాధాన్యం ఇస్తూ బ్లాక్‌స్పాట్స్‌గా నిర్ధారించారు.



నగరంలోని బ్లాక్ స్పాట్స్‌పై అధ్యయనానికి ట్రాఫిక్ విభాగంలో ఇంజినీరింగ్ సెల్ పని చేస్తోంది. మృతులతో కూడిన ప్రమాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి అధ్యయనం చేస్తున్నాం. ప్రమాదాలకు కారణాలను గుర్తించి బల్దియా, జాతీయ రహదారుల సంస్థలకు సిఫార్సులు చేస్తున్నాం. ప్రతి మూడు నెలలకు కలెక్టర్



ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ సహకారంతో..

నేతృత్వంలో జరిగే రోడ్ సేఫ్టీ మీటింగ్స్‌లో వీటిని ప్రతిపాదించడంతో పాటు పనుల పురోగతినీ సమీక్షిస్తున్నాం. ప్రమాదాలను నియంత్రించేందుకు షార్ట్‌టర్మ్, లాంగ్‌టర్మ్ వ్యూహాలు సిద్ధం చేస్తున్నాం. స్వల్ప మార్పు చేర్పులను ట్రాఫిక్ అధికారులే చేపడతారు. పెద్ద మొత్తంతో ముడిపడిన వాటి విషయంలో స్వచ్ఛంద సంస్థల సహాయం కోరుతున్నాం. ఇప్పటికే ఈ కోణంలో సర్వే జనా ఫౌండేషన్ సహాయం అందిస్తూ కొన్ని చర్యలు తీసుకుంటోంది. బ్లాక్‌స్పాట్స్‌ను నిర్మూలించడంతో పాటు నగరంలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి తీసుకోవాల్సిన చర్యల్ని సూచించాల్సిందిగా ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాను కోరాం. ప్రస్తుతం వాళ్లు నగరవ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నారు. నివేదిక అందిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– జోయల్ డెవిస్, హైదరాబాద్ ట్రాఫిక్ చీఫ్

అనేకం 'చావు'రస్తాలే..

నిత్యం ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో అత్యధికం చౌరస్తాలు, జంక్షన్లే ఉంటున్నాయి. రద్దీ వేళలు, సిగ్నల్స్ యాక్టివ్‌గా ఉండే సమయంలో కంటే మిగిలిన సమయాల్లోనే ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ 54 బ్లాక్‌స్పాట్స్‌లో దాదాపు 40 శాతం చౌరస్తాల్లో ఉన్నవే. ఆ ప్రాంతాలు సైతం హైదరాబాద్–సైబరాబాద్–రాచకొండ సరిహద్దుల్లో ఉన్నవి కొన్ని ఉండటం గమనార్హం. వీటిలో చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో మరణించిన/క్షతగాత్రులైన వారిలో 40 శాతం పాదచారులు, మరో 40 శాతం ద్విచక్ర వాహనచోదకులే ఉంటున్నారు.



ఏ ఠాణా పరిధిలో ఎన్ని, ఎక్కడ?

- బోయిన్‌పల్లి: 5 (డెయిరీ ఫాం ఎక్స్ రోడ్, బోయిన్‌పల్లి చెక్‌పోస్టు, బోయిన్‌పల్లి ఎక్స్ రోడ్, సీటీఓ)
- లంగర్‌హౌస్: 4 (బాపూఘాట్, లక్ష్మీనగర్, మొఘల్ క నాలా, దర్గా)
- గాంధీనగర్: 3 (ట్యాంక్‌బండ్‌పైన చిల్డ్రన్ పార్క్, బడేమియా కబాబ్, లేపాక్షి)
- ఎస్సార్‌నగర్: 3 (ఈఎస్ఐ, ఉమేష్‌చంద్ర స్టాట్యూ, మైత్రీవనం)
- అఫ్జల్‌గంజ్: 3 (అఫ్జల్‌గంజ్ టి జంక్షన్, సీబీఎస్, చాదర్‌ఘాట్ చౌరస్తా)
- బేగంపేట: 3 (హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, పీఎస్‌టీ, రసూల్‌పుర చౌరస్తా)
- చాదర్‌ఘాట్: 2 (నల్లగొండ చౌరస్తా, మలక్‌పేట గంజ్)
- మలక్‌పేట: 2 (మూసరాంబాగ్ చౌరస్తా, వైభవ్ బస్టాప్)
- బహదూర్‌పుర: 2 (పురానాపూల్ శ్మశానవాటిక, జూపార్క్ చౌరస్తా)
- తిరుమలగిరి: 2 (తిరుమలగిరి చౌరస్తా, లోతుకుంట)
- బంజారాహిల్స్: 2 (కేబీఆర్ పార్క్, రోడ్ నెం.3 జంక్షన్)
- చాంద్రాయణగుట్ట: 2 (బండ్లగూడ చౌరస్తా, ఒమర్ హోటల్)
- గోపాలపురం: 2 (గురుద్వార, రైల్ నిలయం)
- నల్లకుంట: 2 (విద్యానగర్ చౌరస్తా, తిలక్‌నగర్ చౌరస్తా)
- ఉస్మానియా యూనివర్సిటీ: 2 (హబ్సిగూడ చౌరస్తా, తార్నాక చౌరస్తా)
- జూబ్లీహిల్స్: 1 (జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు)
- చిక్కడపల్లి: 1 (వీఎస్‌టీ చౌరస్తా)
- గోల్కొండ: 1 (రామ్‌దేవ్‌గూడ)

నగరంలో 54 బ్లాక్‌స్పాట్స్

ఇక్కడే తరచూ ప్రమాదాలు | రెండేళ్ల గణాంకాలతో నిర్ధారణ

- కార్ఖానా: 1 (బోయిన్‌పల్లి మార్కెట్ యార్డ్)
- లాలాగూడ: 1 (మెట్టుగూడ చౌరస్తా)
- బొల్లారం: 1 (అల్వాల్ రైతుబజార్)
- సైఫాబాద్: 1 (ఓల్డ్ సైఫాబాద్ ఠాణా)
- బేగంబజార్: 1 (ఎంజే మార్కెట్)
- చాంద్రాయణగుట్ట: 1 (కేశవగిరి టి జంక్షన్)
- హుమాయున్‌నగర్: 1 (రేతిబౌలి)
- కాచిగూడ: 1 (నిబోలిఅడ్డా వద్ద పాత ఠాణా)
- అంబర్‌పేట్: 1 (త్రిశూల్ బార్)
- మహంకాళి: 1 (ప్లాజా చౌరస్తా)
- సుల్తాన్‌బజార్: 1 (కోఠి ఆంధ్రాబ్యాంక్)
- సంతోష్‌నగర్: 1 (పిసల్‌బండ చౌరస్తా)

నగరంలో ప్రమాదాలు, మరణాలు ఇలా..

ఏడాది	ప్రమాదాలు	మరణాలు	తీవ్రగాయాలు	స్వల్ప గాయాలు
2023	2548	327	281	1940
2024	2745	215	203	2322

ఇవే ప్రధాన కారణాలు

- పరిమితికి మించిన వేగం (ప్రధానంగా ఐఆర్ఆర్‌లో..)
- మద్యం తాగి వాహనాలు నడపటం
- మలుపులు ఉన్న చోట్ల డివైడర్లు, మీడియమ్స్ లేకపోవడం
- అత్యంత సమస్యాత్మకంగా(బ్లైండ్) ఉన్న మలుపులు
- కీలక సూచనలు చేసే సైనేజ్ బోర్డులు లేకపోవడం
- ఇరుకైనా రోడ్లు, ఆపై అక్కడే ఉంటున్న ఆక్రమణలు
- రోడ్డు ఇంజినీరింగ్‌ను పట్టించుకోకుండా రహదారి నిర్మాణం
- రహదారులపై హఠాత్తుగా చేపడుతున్న మరమ్మతులు
- క్యారేజ్ వేలో తొలగించకుండా వదిలేసిన చెట్లు, కరెంటు స్తంభాలు
- అవసరమైన స్థాయిలో విద్యుత్ దీపాలు లేకపోవడం
- వాహనచోదకులు రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయడం
- నో–ఎంట్రీలోకి వాహనాలతో దూసుకుపోవడం
- రోడ్ మార్కింగ్ పక్కగా లేకపోవడం, శాస్త్రీయత కొరవడటం

తెలుగువారి గుండెల్లో.. చెరగని ముద్ర వైఎస్సార్

- ఏపీ మాజీ మంత్రి శైలజానాథ్
- వైఎస్ పాలన స్వర్ణయుగం
- వైఎస్సార్ సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర ప్రసాద్ రెడ్డి

కుత్బుల్లాపూర్/సుభాష్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మనకు దూరమై 16 సంవత్సరాలు గడుస్తున్నా, తెలుగువారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని ఏపీ మాజీ మంత్రి శైలజానాథ్ అన్నారు. గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన వీరాభిమాని విగ్రహదాత పి.రామచంద్రారెడ్డి, విగ్రహ వ్యూహకర్త సాతాల గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం వైఎస్ఆర్ విగ్రహావిష్కరణ నిర్వహించారు. కార్యక్రమానికి స్థానికంగానే కాకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయ నాయకుల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తిరుగులేని నాయకుడిగా నిలిచారన్నారు. పేదవారి గుండెబాధ, ఆకలి, కష్టం, అవమానాలను తొలగించిన వ్యక్తి వైఎస్ఆర్ అని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను అతడి తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు వై.ఈశ్వర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రుణమాఫీ, ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, పెన్షన్లు, జలయజ్ఞం, పరిశ్రమలు ఇన్ని పథకాలు చేపట్టినా నిధుల విషయంలో ఎలాంటి సమస్య రాకుండా పథకాలను ముందుకు తీసుకెళ్లిన గొప్పనేత అని గుర్తు చేశారు. వైఎస్ఆర్ హయాంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రం కళకళలాడి స్వర్ణ యుగంలా




గాజులరామారం మహాదేవపురంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ మాజీ మంత్రి శైలజానాథ్ తదితరులు

మారిందన్నారు. హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ పేదవారి సంక్షేమం కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడని తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్యామల మాట్లాడుతూ వైఎస్సార్ స్థానం ప్రజల గుండెల్లో సుస్థిరమని, ఆయన ఆశయాలను మనందరం భుజస్కంధాలపై వేసుకొని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. శేరిలింగంపల్లి టికెట్ కోసం ఎంతో మంది పోటీపడగా ఆయన వల్లే తన ఇంటికి టికెట్ వచ్చిందని, ఉదయం లేవగానే కుటుంబ సభ్యులంతా ఆయన విగ్రహాన్ని దర్శించుకుంటామని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మన నుంచి వెళ్లి 16 సంవత్సరాలు గడిచినా ఆయన ఆశయాలు పదిలంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ సుబ్బారెడ్డి, మల్లు సురేంద్రరెడ్డి, సునీల్ రెడ్డి, బీజేపీ నేత రవికుమార్ యాదవ్, కూన శ్రీనివాస్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, వెంకట్‌రెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజర్ వెంకటస్వామి రెడ్డి, రాఘవరెడ్డి, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళి

పంజగుట్ట: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి సందర్భంగా పంజగుట్ట కూడలిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అట్లూరి లక్ష్మణ్, కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రారావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, సోమాజిగూడ డివిజన్ అధ్యక్షుడు నారికెల నరేష్‌కుమార్, హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్‌గౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ చేసిన సేవలు గుర్తుచేసుకున్నారు.



10న గో విజ్ఞాన పరీక్షలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో మంగళవారం గో సేవా విభాగం తెలంగాణ ఆధ్వర్యంలో గో విజ్ఞాన పుస్తకాలను తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ గుమ్మడిపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో విజ్ఞాన పరీక్షలు నిర్వహిస్తున్నామని, 10 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరూ రాయవచ్చని తెలిపారు. ఈ నెల 10వ తేదీన పాఠశాలలో పరీక్ష ఉంటుందని, తర్వాత జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీ ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.25 వేలు ఉంటాయని అన్నారు. ఆవు, వ్యవసాయం, పర్యావరణం, సేంద్రీయ



గో విజ్ఞాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ గుమ్మడిపల్లి శ్రీనివాస్ తదితరులు

ఎరువులు, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై పరీక్ష ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో గో సేవా విభాగం ప్రతినిధులు నక్కా రాజేష్, నరేందర్ గౌడ్, లక్ష్మీకాంత్, రామ్, సెయింట్ అగధ స్కూల్ కరస్పాండెంట్ సుకృత్ కుమార్, సెయింట్ మేరీ జోసెఫ్ హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్: 63040 85950.

సీఎం ప్రజావాణిలో 243 దరఖాస్తులు

దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్



'డబుల్' ఇళ్ల బాధితులతో మాట్లాడుతున్న సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణిలో మొత్తం 243 దరఖాస్తులు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 57, రెవెన్యూ శాఖకు 33, ఇందిరమ్మ ఇళ్ల కోసం 87, ప్రవాసి ప్రజావాణికి 3 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. తుక్కుగూడ, మంఖాల్ గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు మంజూరు చేసినప్పటికీ హైకోర్టు ఆదేశాలతో ఆ మంజూరు ఉత్తర్వులు రద్దు కావడంతో పెద్ద ఎత్తున లబ్ధిదారులు మంగళవారం ప్రజాభవన్‌కు వచ్చారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తామని చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్ లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు.

సీఎం ప్రజావాణికి బ్యాటరీ కారు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి విజయవంతంగా ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ప్రజావాణికి రాష్ట్ర ప్రభుత్వం బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేసింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్ ఆ వాహనానికి పూజలు నిర్వహించి ప్రారంభించారు. సమస్యలను వివరించేందుకు సీఎం ప్రజావాణికి హాజరయ్యే వృద్ధులు, వికలాంగులకు ఈ వాహనం సేవలు అందిస్తుందని ఆమె తెలిపారు.



బ్యాటరీ కారును పరిశీలిస్తున్న చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్

ప్రజాపోరాట యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి

– సంస్మరణ సభలో పలువురు వ్యక్తులు



బంజారాహిల్స్: ప్రజాపోరాట యోధుడు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఆయన మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికే తీరని లోటన్నారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో కమ్యూనిస్టు దిగ్గజం, సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు నిర్మించడంలో సురవరం సుధాకర్‌రెడ్డి అగ్రగణ్యుడని అన్నారు. ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంత ఉద్యమాలు చేశారని తెలిపారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వ ఫాసిస్టు ధోరణులను ముందే పసిగట్టిన మొట్టమొదటి వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. విద్యార్థి యువజన నేతగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన అంచలంచలుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగిన కమ్యూనిస్టు ఉద్యమ గొప్ప నేత అని కొనియాడారు. రావి నారాయణరెడ్డి ఆడిటోరియం ప్రాంగణంలో సుధాకర్‌రెడ్డి పేరుతో స్మారక హాల్ ఏర్పాటు చేయాలని, ఇందుకు ట్రస్ట్ సభ్యులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ చివరి క్షణం వరకు ఉద్యమాలే ఊపిరిగా జీవించిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. పార్లమెంట్ సభ్యులుగా నల్లగొండ జిల్లాకు కృష్ణా జలాల తరలింపు ద్వారా ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాపరెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్ రావు, సురవరం సుధాకర్‌రెడ్డి సతీమణి బీవీ విజయలక్ష్మి, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ ఎస్.వి. సత్యనారాయణ, సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, సీనియర్ జర్నలిస్టు మల్లెపల్లి లక్ష్మయ్య, రిటైర్డ్ జడ్జి కాంతయ్య పాల్గొన్నారు.



వీనుల విందు.. శ్రీరాం కీర్తనలు..

సప్తపర్ణిలో పరవశింపజేసిన గాత్రకచేరి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.8లోని సప్తపర్ణిలో సంగీత క్షీరసాగరం ఆధ్వర్యంలో జరుగుతున్న సంగీత మహోత్సవాలు వీనుల విందుగా సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా సప్తపర్ణి వేదికపై ప్రముఖ యువ సంగీత విద్వాంసుడు జేఎస్ శ్రీరాం ఆలపించిన కీర్తనలు సంగీత కళాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆయనకు తోడుగా మృదంగంపై పలివెల విద్యాసాగర్, వయోలిన్‌పై ఎస్‌వీపీజీ శివాని, టీ.బాల సుబ్రమణ్య అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీరాం ఎనిమిది రకాల రాగాలతో కళాభిమానులను ఓలలాడించారు. పూర్వీ కళ్యాణి, బహుదారి, వసంత భైరవి, సారంగ, లవంగి, కేదారగౌల, సుమనసరంజని, సురతి తదితర రాగాలతో విశేషంగా ఆకట్టుకున్నారు.



6న ఆకాష్ గుప్తా 'డైలీ కా కామ్ హై'

సాక్షి, సిటీబ్యూరో : ప్రముఖ స్టాండప్ కామెడీ స్టార్ ఆకాష్ గుప్తా కార్యక్రమం నగరంలో నిర్వహించనున్నారు. సెప్టెంబర్ 6న నగరంలోని శిల్పకళావేదికలో రాత్రి 8గంటలకు హిందీ, ఇంగ్లిష్‌లో భాషల్లో దీనిని నిర్వహించనున్నారు. గంటన్నరపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి చిన్న పిల్లలకు అనుమతి లేదు. 16ఏళ్లు పైబడిన వారినే అనుమతించనున్నారు. తన బాల్యం నుంచి గ్రాడ్యుయేషన్ వరకూ జరిగిన పరిణామాలను, విద్యాభ్యాసం అనంతరం ఎంఎన్‌సీలో ఉద్యోగం తదితర సందర్భాల్లో దైనందిన జీవితంలో జరిగిన అంశాల ఆధారంగా ఈ స్టాండప్ కామెడీ ఉంటుందని చెబుతున్నారు నిర్వాహకులు. ఆసక్తి కలిగిన వారు దీనికి సంబంధించిన ఎంట్రీ పాస్‌లు బుక్‌మై షోలో పొందవచ్చని నిర్వాహకులు చెబుతున్నారు.



హైదరాబాద్..! ప్రపంచ దేశాల్లో కేవలం ఒక ప్రముఖ నగరం మాత్రమే కాదు.. కాలాతీతంగా మారుతున్న జీవనశైలి, అంతర్జాతీయ ఆర్థిక, ఆధునిక, విజ్ఞాన, వ్యాపార అంశాల్లో ఎప్పటికప్పుడు తన ప్రశస్తిని చాటుతున్న గ్లోబల్ సిటీ. నగరంలోని పలు అంతర్జాతీయ సంస్థల ప్రధాన కార్యాలయాలు, ఆయా సంస్థలు చెల్లిస్తున్న అద్దెలే ఇందుకు తార్కాణం.. పలు గ్లోబల్ సంస్థలు నగర కేంద్రంగా లక్షల చదరపు అడుగుల వీస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే కాదు.. ఆ స్థలాలకు ప్రతి నెలా కోట్ల రూపాయల్లో అద్దె చెల్లిస్తున్నాయి. ఆయా గ్లోబల్ సంస్థల వింతలు, విశేషాలు..

– సాక్షి, సిటీబ్యూరో

హైరెంట్ సిటీ..

ప్రతి నెలా 4 నుంచి 5 కోట్లు చెల్లిస్తున్న గ్లోబల్ సంస్థలు

- అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక అద్దెలు
- నగరంలో మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్, ఐబీఎం వంటి సంస్థల ప్రధాన కార్యాలయాలు
- లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆఫీసులు
- భవనాలకు ఐదేళ్లకు పైనే లీజ్ ఒప్పందాలు
- నగరంలోని అధునాతన జీవనశైలి కూడా ప్రధాన కారణమంటున్న టెక్ నిపుణులు

మైక్రోసాఫ్ట్ (ఆర్ అండ్ డీ): ప్రముఖ ఐటీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంస్థ నగరంలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఫీనిక్స్ సెంచురస్ భవనంలో 2.64 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జూలై 2025 నుంచి కార్యాలయాన్ని లీజుకు తీసుకుంది. ఇందులో భాగంగా ప్రతి నెల రూ. 5.4 కోట్ల అద్దె చెల్లిస్తోంది. ఐదేళ్ల లీజ్ ఒప్పందంలో భాగంగా ఈ ఆఫీస్ స్పేస్ కోసం నగరంలో అత్యధిక అద్దె చెల్లిస్తున్న సంస్థ మైక్రోసాఫ్ట్ మాత్రమే.



క్వాల్కమ్: ఈ సంస్థ కార్యాలయం హై టెక్ సిటీలోని ది స్కై వ్యూ భవనంలో 4.14 లక్షల చదరపు అడుగులకు దాదాపు 3.15 కోట్ల భారీ అద్దెను చెల్లిస్తుంది. ఇది అత్యంత అధిక అద్దె తీసుకునే లీజుల్లో ఒకటి. ఈ సంస్థ కుదుర్చుకున్న ఐదేళ్ల లీజ్‌లో మొదటి ఏడాది తరువాత ఈ అద్దె 7 శాతం పెరగనుంది. అంతేకాకుండా మూడేళ్ల తరువాత మరో 15 శాతం పెరిగేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

టీసీఎస్: శేరిలింగంపల్లి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రాజ్‌పుష్ప భవనంలో అంతర్జాతీయ సేవలందిస్తున్న టీసీఎస్.. సుమారు 10.18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి రూ.4.3 కోట్ల నెలవారి అద్దె కడుతోంది. 15 ఏళ్లకుగాను కుదుర్చుకున్న ఈ లీజ్ నగరంలో అత్యధిక అద్దె కడుతున్న సంస్థల్లో మరొక ప్రధాన సంస్థగా నిలిచింది.

ఫేస్‌బుక్ (మెటా): ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఫేస్‌బుక్ (మెటా) హైదరాబాద్ నగరంలో 3.7 లక్షల చదరపు అడుగుల స్థలం కోసం దాదాపు 2.8 కోట్ల నెలవారీ అద్దెతో లీజును నవీకరించింది. రానున్న ఏడాది 2026 జనవరిలో ఈ అద్దె 15 శాతం పెరగనుంది.

ఎస్ అండ్ పీ క్యాపిటల్ ఐక్యూ ఇండియా: ఈ సంస్థ నగరంలో 2.41 లక్షల చదరపు అడుగులకు ప్రతి నెలా రూ.1.77 కోట్లు చెల్లిస్తోంది. 2024 నుంచి ఐదేళ్లకు కుదుర్చుకున్న ఈ లీజ్ రెండేళ్ల తరువాత 15 శాతం పెరుగనుంది.

ఎల్‌టీఐ మైండ్ ట్రీ: హైటెక్ సిటీలోని స్కై వ్యూ 10లో ఎల్‌టీఐ మైండ్ ట్రీ సంస్థ సుమారు 1.09 లక్షల చదరపు అడుగులకు 89.18 లక్షలు అద్దెగా చెల్లిస్తూ.. ఐటీ దిగ్గజాల సరసన నిలిచింది.

ఐబీఎం ఇండియా: గచిబౌలిలోని దివ్య శ్రీ ఓరియన్‌లో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐబీఎం ఇండియా తమ లీజులో భాగంగా 1.06 లక్షల చదరపు అడుగుల స్థలానికి ప్రతి నెలా రూ.70.23 లక్షలు చెల్లిస్తోంది. 2024లో మొదలైన ఈ లీజ్ ప్రతి ఐదేళ్లకు 4 శాతం పెరగనుంది.



ఇన్నోవేటివ్ సెంటర్..

నగరంలో అంతర్జాతీయ అగ్రగామి సంస్థలు ఇంత భారీ స్థాయిలో అద్దెలు చెల్లించడానికి ప్రధాన కారణం.. భాగ్య నగరం భారతీయ ఐటీ, గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ (జీసీసీ) హబ్‌గా, ప్రతిష్టాత్మక ఇన్నోవేటివ్ కేంద్రంగా ఎదగడమేనని నిపుణులు చెబుతున్న మాట. అంతేకాకుండా హైదరాబాద్ సిటీ అధునాతన జీవన శైలికి అనుగుణమైన లైఫ్‌స్టైల్ పర్యావరణాన్ని రోజు రోజుకు అభివృద్ధి చేసుకుంటుంది. ముఖ్యంగా హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు సమృద్ధిగా కెఫేలు, రెస్టారెంట్లు, షాపింగ్ మాల్స్, ఇంటర్నెట్, క్యాంపస్ మోడ్రన్ వాతావరణంతో అద్భుత జీవన విధానాన్ని అందజేస్తున్నాయి.

50 శాతం టెక్ లీజింగ్..

సిటీలో 2025లో నూతనంగా గ్రేడ్–ఏ ఆఫీస్ స్పేస్ సరఫరా గణనీయంగా తగ్గడంతో వేకెన్సీ ధర విపరీతంగా పెరిగింది. దీనివల్ల అద్దె చెల్లింపులు ఎక్కువగా ఉన్నాయని ఓ గ్లోబల్ సంస్థ ప్రతినిధి తెలిపారు. దీనికి తోడు ఇక్కడ లభించే సేవల సమగ్రత, దీనికి స్థానిక ప్రభుత్వ మద్దతు.. అంతకు మించి తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడులకు అందిస్తున్న ప్రోత్సాహం.. అత్యాధునిక ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. ఇవన్నీ కలిపి హైదరాబాద్‌ను యూనివర్సల్ హబ్‌గా మార్చేసింది.

మోడ్రన్ లైఫ్‌స్టైల్..

ఈ అంశాలే కాకుండా విలాసవంతమైన అధునాతన జీవనవిధానం, ఈ గ్లోబల్ కంపెనీలకు అనువైన డిజైన్‌తో కూడిన భవనాలు, సురక్షిత పార్కింగ్, ఆధునిక భవన లిఫ్ట్ సౌకర్యాలు, రెగ్యులర్ పవర్ బ్యాకప్ వంటివి తోడ్పాటును అందిస్తున్నాయి. కేవలం ఆఫీసు అధికారిక కార్యకలాపాల్లో భాగంగా పనిచేయడమే కాకుండా సమీపంలోని మోడ్రన్ లైఫ్‌స్టైల్ అలవాట్లు, కాంటినెంటల్ ఫుడ్, ఫిట్‌నెస్ సేవలు ఆ కంపెనీల ఉద్యోగులకు గ్లోబల్ లెవెల్ లైఫ్‌స్టైల్ అందిస్తున్నాయి. ఫ్యామిలీ–ఫ్రెండ్లీ వాతావరణం, ఉద్యోగులకు కుటుంబంతో ఉండేందుకు సరైన నివాస, విద్య, వినోదం వంటివి స్థానికంగానే అందుబాటులో ఉండటం కలిసొచ్చే అంశం.



నగర మార్కెట్లో బ్లాక్ చెర్రీ.

సాక్షి, సిటీ బ్యూరో : అంతర్జాతీయ ఎనర్జీ డ్రింక్ బ్రాండ్లలో ఒకటైన హెల్ ఎనర్జీ డ్రింక్ తన తాజా వేరియంట్ అయిన హెల్ ఎనర్జీ డ్రింక్ బ్లాక్ చెర్రీని నగర మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ విషయాన్ని హెల్–ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఉన్నికన్నన్ గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇది బీ–విటమిన్‌తో సహా పలు ఆరోగ్యకారకాల మేళవింపని, రుచికరంగా ఉండే తమ ఎనర్జీ డ్రింక్ నగర యువతను తప్పకుండా ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరిన్ని వెరైటీ ఉత్పత్తులను నగరానికి పరిచయం చేయనున్నామని తెలిపారు.



ఫెస్టివల్ లోనూ ఫ్యాషన్‌కే ఆదరణ

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం పండుగ సీజన్ సందర్భంగా వినియోగదారులు ప్రీమియం ఫ్యాషన్ వైపు అధికంగా మొగ్గుచూపుతున్నారు. ఈ విషయాన్ని తమ అధ్యయనం వెల్లడించిందని ఆన్‌లైన్ విపణి అమెజాన్ ఇండియా తెలిపింది. గెస్, లెవి బ్యాగులు, సీకో వాచ్‌లు, స్వరోస్కి క్యారట్ లైన్ ఆభరణాలు, స్కెచర్ ఫుట్ వేర్, శాంసనైట్ లగేజ్ వంటి ఉత్పత్తులను ఎంచుకుంటున్నారు. 'స్మార్ట్, స్టైలిష్ ఎంపికలకు నగర వినియోగదారుల ఆదరణ పెరుగుతోంది.. అందుకే విస్తృత బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నాం' అని అమెజాన్ ఫ్యాషన్ బ్యూటీ డైరెక్టర్ సిద్ధార్థ్ భగత్ వివరించారు.

నాన్న చెప్పిన కథలే.. స్ఫూర్తి..

కథలు, కవితలతోనే ప్రత్యేక గుర్తింపు

పాడ్‌కాస్టర్, రచయిత, పాపులర్ స్టోరీ టెల్లర్ లక్ష్ మహేశ్వరి



'మనలో చాలా మంది చిన్నప్పుడు కథలు వినడంలో అనుభవం పొంది ఉండము.. రాజులు, రాణులు, చెవులు రిక్కింపజేసే యుద్ధాలు, మంత్రముగ్ధులను చేసే మాయా ద్వీపాలు ఇవన్నీ కళ్లకు కట్టేలా విని ఉండము.. వింటూ వింటూనే మనం నిద్రలోకి జారుకున్న ఆనవాళ్లూ లేకపోవచ్చు.. ఒక రకంగా అంతకు ముందు తరం అనుభవించిన ఆనందాన్ని బాల్యంలో అనుభవించలేదేమో.. ఆ కథలు జోలపాట పాడుతూనే.. భవిష్యత్తు పాఠాలను కూడా నేర్పలేదు.. అందుకే ఆ కథలు ఇప్పుడు వినాల్సిందే. ఊ కొట్టాల్సిందే అంటున్నారు లక్ష్ మహేశ్వరి.

– సాక్షి, సిటీబ్యూరో



'ప్రతి ఒక్కరూ కథలు వినాలి.. ఎందుకంటే అవి మనల్ని మనలా తయారు చేస్తాయి' అంటారు లక్ష్మహేశ్వరి. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈయన పాడ్‌కాస్టర్, రచయిత, పాపులర్ స్టోరీ టెల్లర్ కూడా. నగరానికి గత కొంత కాలంగా కథలను మోసుకొచ్చే నిత్య అతిథిగా మారారు. తన కథలు, కవితల ద్వారా నగరవాసులను రంజింప చేస్తూ సిటీలో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్ ఏర్పాటు చేసుకున్నారు. గత మే 24న భాస్కర ఆడిటోరియంలో సుఫియానా సమర్పించిన లక్ష్ మరోసారి గత ఆదివారం కొండాపూర్‌లోని హార్ట్ కప్ కాఫీలో 'మై తేను ఫిర్ మిలేంగీ' పేరిట మరో ప్రత్యేక స్టోరీ టెల్లింగ్ సెషన్ సమర్పించారు. ఈ సందర్భంగా పంచుకున్న విశేషాలు ఆయన మాటల్లోనే..

నాన్న చెప్పిన కథలే..

ఎడమ చేయి లేకుండా జన్మించడంతో నా బాల్యం అంతా జీవన పోరాటాలతోనే సాగింది. సమాజపు హేళనలు, ఏదీ సాధించలేననే విమర్శలు, బెదిరింపులు ఇలా ఎన్నో ఎదుర్కొన్నా. కానీ తల్లిదండ్రులు నా పక్కన గట్టిగా నిలబడ్డారు. 'నాన్న మా కుటుంబానికి కథకుడు. మా కోసం ఎప్పుడూ కథలు షేర్–ఏ–షాయరీలను చెప్పేవాడు. చదువు పూర్తయ్యాక గుర్గావ్‌లో పెట్టుబడి బ్యాంకర్‌గా ఐదేళ్లకు పైగా పనిచేశాను. ఆదాయం బాగుంది, కానీ నేను కోరుకునే మనశ్శాంతి, సంతృప్తి దొరకలేదు. అదే సమయంలో 'తమాషా' సినిమా చూశాను. అది నాకు ఏమి చేయాలో చెప్పకపోయినా, యే తో నహి కర్ణ (ఇది చేయకూడదు) అని మాత్రం గ్రహించాను.

200కి పైగా ప్రదర్శనలు..

మీ కథలతో జనాన్ని ఎలా ఆకట్టుకోగలుగుతున్నారు? అని కొందరు అడుగుతుంటారు.. నిజాయితీగా చెప్పాలంటే, అది ఒక ట్రాన్స్ లాగా ఉంటుంది. నాకు వేదికపైకి వెళ్లి దిగడం మాత్రమే గుర్తుంటుంది. నేను 200కి పైగా ప్రదర్శనలు ఇచ్చాను. కానీ వాటిలో చాలా వాటిలో ఏం జరిగిందో నాకు గుర్తులేదు. తెలిసినదల్లా వారం పాటు ప్రదర్శన ఇవ్వకపోతే, నాకు అశాంతిగా అనిపిస్తుంది.

కథల్లోకి అడుగు..

అయితే నచ్చే మార్గాన్ని కనుగొనడానికి నాకు మరో ఎనిమిది సంవత్సరాలు పట్టింది. నేను 2023లో కథ చెప్పడం అనే మార్గంలోకి అడుగుపెట్టాను. కథ చెప్పడం అంత తేలికైన కళ కాదు. దీనికి క్రమశిక్షణ, అభిరుచి, అంతర్ దృష్టి అవసరం. 'కొన్ని కథల్లో నేను లోతుగా లీనమైపోతా. నాకు అది పూర్తిగా అర్థమయ్యేవరకూ పరిశోధన చేస్తా, మరిన్ని పుస్తకాలు చదువుతా, డాక్యుమెంటరీలు చూస్తా, నిపుణులతో మాట్లాడతా. కథ చెప్పడం అనేది ఇప్పటికీ కొనసాగుతున్న ప్రపంచంలోని పురాతన వృత్తి. సరిగా గమనిస్తే.. నేడు వ్యాపారులు తమ ఉత్పత్తులను అమ్మడం లేదు. కథలనే అమ్ముతున్నారని అర్థం అవుతుంది.

ఆ హైదరాబాదీ.. ఓ గొప్ప జ్ఞాపకం..

నా అత్యంత మరపురాని జ్ఞాపకాలలో ఒకటి హైదరాబాద్‌లో నేను ఇష్క్ సుఫియానాను ప్రదర్శించిన తర్వాత ఒక యువతి నా దగ్గరకు వచ్చి, నన్ను ఆప్యాయంగా కౌగిలించుకుంది. 'నేను ఆత్మహత్యకు ప్రయత్నించాలనుకున్నా.. ప్రదర్శనకు వచ్చి చూశాక.. ఇప్పుడు ఆ ఆలోచన మారిపోయింది' అని చెప్పారు. 'ఒక కథకుడిగా నాకింకేం కావాలి? కొంతమంది అడుగుతుంటారు.. మంచి ఆదాయం ఇచ్చే మార్గం వదిలేశారు. ఏం సాధించారు? అని.. 'నేను ఇప్పుడు మనశ్శాంతిగా.. ప్రతి రాత్రీ బాగా నిద్రపోతాను. నేటి బిజీ ప్రపంచంలో, అంతర్గత శాంతిని మించిన లగ్జరీ ఏముంది?' అనేదే నా సమాధానం.

క్లుప్తంగా...

429 గిరిజన ఆవాసాలకు రూ.700 కోట్లు

- సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




సాక్షి, హైదరాబాద్: రోడ్ల విషయంలో ప్రభుత్వం ప్రధాన దృష్టి సారించిందని, 429 గిరిజన ఆవాసాలకు రూ.700 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన తెలంగాణ సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. పదేళ్లలో గత ప్రభుత్వం గిరిజన తండాలను పట్టించుకోలేదని ఆరోపించారు. జీవో 240 ప్రకారం ఐటీడీఏ పరిధిలోని 236 గ్రామాల రోడ్లకు నిధులు మంజూరయ్యాయని వెల్లడించారు. వీటి కోసం త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఎమ్మెల్సీ కవిత పరోక్షంగా అంగీకరించారన్నారు. కక్ష సాధింపు చర్యలు చేయడంలేదని, హరీశ్‌రావు, సంతోష్‌రావు వెనుక ఉండాల్సిన అవసరంలేదని లక్ష్మణ్ పేర్కొన్నారు. కుటుంబ తగాదాలు ఆమే చూసుకోవాలని, ఇందులో తమని లాగడం సరికాదని లక్ష్మణ్ తెలిపారు.

5న వీఆర్వోలకు నియామక పత్రాలు

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో కొత్తగా 5,000 మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లకు ఈనెల 5న సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేస్తారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. కార్యక్రమానికి సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరవుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సీఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి ఎంపికైన వీఆర్వోలు మధ్యాహ్నం రెండు గంటల్లోపు హైటెక్స్ చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశామని చెప్పారు. బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణను చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అవినీతిని ఎండగడితే సాక్షిపై కేసులు పెడతారా?

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగంగౌడ్



సాక్షి, హైదరాబాద్: ఏపీలో ప్రభుత్వ వైఫల్యాలను నిలదీస్తూ, అవినీతిని ఎండగడుతున్న సాక్షి దిన పత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసు పెట్టడాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తీవ్రంగా ఖండించారు. అక్రమ కేసులు పెట్టడం అంటే రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉల్లంఘిస్తూ పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ సాక్షి ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయిస్తూ వేధించడం సరికాదని లింగంగౌడ్ పేర్కొన్నారు.

సీపీఎస్ రద్దుకు కమిటీ నియమించాలి

సాక్షి, హైదరాబాద్: సీపీఎస్ విధానం రద్దు దిశగా.. కాల పరిమితితో కూడిన కమిటీ నియమించాలని సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ కోరారు. ఆయన మంగళవారం సీపీఎస్ విధానంపై కేబినెట్ కమిటీకి వినతి పత్రం అందజేశారు. సీపీఎస్ విధానంతో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు.

ఏపీ మహేశ్ బ్యాంకు కుంభకోణంలో విచారణ వేగవంతం

బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో ఉమేశ్‌చంద్ కుమారుడి ఆస్తులు అటాచ్

సాక్షి, హైదరాబాద్: ఏపీ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్లలోని రూ.1.1 కోట్ల విలువైన రెండు స్థిరాస్తులను ఈడీ హైదరాబాద్ జోనల్ కార్యాలయం అటాచ్ చేసింది. బ్యాంకు మాజీ ఎండీ, సీఈఓ ఉమేశ్ చంద్ అసవా కుమారుడు రోహిత్ పేరిట ఈ ఆస్తులు ఉన్నాయి. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద తాత్కాలికంగా అటాచ్ చేసినట్టు ఈడీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో పేర్కొన్న ప్రకారం.. రుణాల కోసం 2 నుంచి 4 శాతం కమీషన్ వసూలు చేసిన ఆరోపణలపై బ్యాంకు మాజీ చైర్మన్ రమేశ్‌కుమార్ బంగ్, మాజీ ఎండీ, సీఈవో ఉమేష్ చంద్ అసవా, మాజీ సీనియర్ వైస్ చైర్మన్ పురుషోత్తందాస్ మంధానా, ఇతరులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ ఎఫ్‌ఐఆర్‌ల ఆధారంగా ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. కేసు దర్యాప్తులో భాగంగా తాజాగా ఈ ఆస్తులు అటాచ్ చేసినట్టు తెలిపారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు!

కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని నిలదీస్తున్న 'సాక్షి'పై ఆది నుంచీ చంద్రబాబు సర్కార్ కక్ష సాధింపు

'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై వరుసగా అక్రమ కేసులు

- రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛను కాలరాస్తున్న కూటమి సర్కార్
- ఎమర్జెన్సీ నాటి దురాగతాలను తలపిస్తోన్న రాష్ట్ర పరిస్థితి



నరసరావుపేటలో

సాక్షి దిన పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై నమోదు చేసిన అక్రమ కేసుపై ఏపీ వ్యాప్తంగా పాత్రికేయులు నిరసించారు. ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.

సాక్షి, అమరావతి: ఎన్నికల హామీల అమల్లో ఘోర వైఫల్యం.. ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం.. అంతులేని అవినీతి, అక్రమాలపై ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తున్న 'సాక్షి' మీడియాపై ఆది నుంచీ చంద్రబాబు కూటమి సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ప్రజల గొంతుకగా ప్రతిధ్వనిస్తున్న 'సాక్షి'పై పోలీసులను ఉసిగొలిపి, అక్రమ కేసులు బనాయిస్తూ బరితెగిస్తోంది. రాజ్యాంగం కల్పించిన హక్కులను యథేచ్ఛగా కాలరాస్తూ.. పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తూ.. ఎమర్జెన్సీ నాటి దురాగతాలను గుర్తు చేస్తోంది. సోమవారం 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో నమోదు చేసిన అక్రమ కేసులే ఇందుకు తార్కాణం. దీనిని అడ్డుపెట్టుకుని సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు విజయవాడ ఆటోనగర్‌లోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంలో పోలీసులు దాడికి తెగబడ్డారు. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి 2 గంటల వరకూ హల్‌చల్ చేస్తూ భయోత్పాతం సృష్టించారు. ఇంతకూ ఆ అక్రమ కేసు ఎందుకు బనాయించారంటే.. పోలీసు అధికారుల హక్కులపై 'సాక్షి' గళమెత్తినందుకే.

బరితెగింపునకు నిలువెత్తు నిదర్శనం..

రాష్ట్రంలో డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన ప్యానల్ కాల పరిమితి ఆగస్టు 31తో ముగిసింది. కానీ.. పదోన్నతులు ఇవ్వకపోవడంతో డీఎస్పీలు తీవ్రంగా నష్టపోయారు. కొందరు గత నెల 31న రిటైరయ్యారు. మళ్లీ కొత్తగా ప్యానల్ ఏర్పాటు చేసి పదోన్నతులు కల్పించే సరికి మరికొందరు రిటైరవుతారు. భారీగా ముడుపులు ఇవ్వలేదనే నెపంతోనే తమకు పదోన్నతులు ఇవ్వలేదని పలువురు డీఎస్పీలు వాపోయారు. పోలీసు శాఖ క్రమశిక్షణను గౌరవిస్తూ.. ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రకటనలు జారీ చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం 'సాక్షి'పై అక్రమ కేసులతో దాడికి తెగబడింది. ఏ పోలీసు అధికారుల హక్కుల కోసమైతే సాక్షి గళమెత్తిందో.. అదే పోలీసు అధికారులతోనే అక్రమ కేసు నమోదు చేయించి అత్యంత దుర్మార్గానికి పాల్పడింది. ఆ ఫిర్యాదు కూడా రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు జనుకుల శ్రీనివాస్‌తో చేయించి మరీ అక్రమ కేసు పెట్టడం గమనార్హం. ఆ ఫిర్యాదు మేరకు తాడేపల్లి స్టేషన్‌లో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులపై బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 196(1), 353(2) కింద కేసు(క్రైమ్ నంబరు 543/ 2025) నమోదు చేశారు.

ఆది నుంచీ అక్రమ కేసులే..

చంద్రబాబు కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి 'సాక్షి'పై అక్రమ కేసులతో దాడి చేస్తోంది. రెడ్ బుక్ రాజ్యాంగంతో యథేచ్ఛగా ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోంది. కూటమి అరాచకాలను ఎక్కడికక్కడ ప్రశ్నిస్తుండడంతో గొంతు నొక్కే దుస్సాహసానికి ఒడిగడుతోంది. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్-19(1)(ఏ)లోని భావ ప్రకటనా స్వేచ్ఛను హరిస్తోంది. అక్రమ కేసులు బనాయించడాన్ని న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు తప్పుబడుతున్నా ప్రభుత్వ తీరు మారడం లేదు. భావ ప్రకటనపై వచ్చే ఫిర్యాదుల కేసు నమోదు విషయాల్లో పాటించాల్సిన ప్రమాణాలపై పోలీసు శాఖతోపాటు జిల్లా మేజిస్ట్రేట్లకు హైకోర్టు ఇటీవల స్పష్టమైన మార్గదర్శకాలు నిర్దేశించింది. అయినా సరే.. ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖ వైఖరిలో మార్పు రావడం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతిని ఎత్తిచూపుతున్న "సాక్షి"ని అక్రమ కేసులతో వేధించడమే పనిగా పెట్టుకుంది.

ఇప్పటి వరకు 'సాక్షి'పై అక్రమంగా నమోదు చేసిన కేసులివీ..

- గత ఏడాది ఆగస్టు 31న విజయవాడను వరదలు ముంచెత్తిన సమయంలో బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యాలను నిలదీసినందుకు 'సాక్షి'పై అక్రమ కేసు నమోదు
- పల్నాడు జిల్లాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తను తెలంగాణలో దారుణంగా హత్య చేసిన ఉదంతాన్ని ప్రచురించినందుకు ఈ ఏడాది ఏప్రిల్ 9న నాగార్జునసాగర్ పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు
- కర్నూలు జిల్లాలో ప్రభుత్వ టీచర్ కుటుంబం కిడ్నాప్ ఉదంతాన్ని వెలుగులోకి తెచ్చినందుకు.. అదే జిల్లాలో ఓ ఐపీఎస్ అరాచకాలను ఎండగట్టినందుకు "సాక్షి" పత్రికపై అక్రమ కేసులు నమోదు
- అనంతపురంలో బాలికపై టీడీపీ మూకలు అత్యాచారం చేసిన దారుణాన్ని ప్రశ్నించినందుకు సాక్షి టీవీపై అక్రమ కేసు
- ఇటీవల భారీ వర్షాలకు రాజధాని ప్రాంతం ముంపునకు గురైందని వీడియో ఆధారాలతో సహా ప్రసారం చేసిన సాక్షి టీవీపై అక్రమ కేసు
- శాసనసభకు కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ తరగతులపై 'సాక్షి' ప్రచురించిన కథనంపై సభాహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- వాట్సాప్ గవర్నెన్స్ ముసుగులో గిట్టని వారికి సంక్షేమ పథకాలను నిలిపేయడం, ప్రత్యర్థి పార్టీల సానుభూతిపరుల ఓట్లను తొలగించే రాజకీయ కుతంత్రాలను ప్రశ్నిస్తూ 'సాక్షి' ప్రచురించిన కథనంపై న్యాయస్థానంలో ఫిర్యాదుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అనుమతి ఇస్తూ మార్చి 5న ఉత్తర్వులు జారీ
- మే 8న పోలీసులు ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విజయవాడలో 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలో తనిఖీల పేరుతో హల్‌చల్ (ఓ పత్రిక ఎడిటర్ నివాసంలో తనిఖీల పేరుతో వేధింపులకు దిగడం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే తొలిసారి)
- 'సాక్షి' టీవీ డిబేట్‌లో సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావు అనని మాటలను అన్నట్లుగా చిత్రీకరిస్తూ జూన్ 9న అక్రమ కేసు, అరెస్టు.

ఎన్నికల వాయిదాకే మొగ్గు?

- స్థానిక ఎన్నికలు రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచన
- అందుకోసం హైకోర్టుకు వెళ్లే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం!
- రిజర్వేషన్ల బిల్లులకు ఆమోదం రాకపోవటమే ప్రధాన కారణం

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశం ఎటూ తేలకపోవడంతో.. వాటిని మరో రెండుమూడు నెలలు వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. అందుకోసం హైకోర్టును ఆశ్రయించాలనే ఆలోచనతోప్రభుత్వం ఉన్నట్టుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ నెల 30వ తేదీలోగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలను అమలుచేయటం ఇప్పటికిప్పుడు సాధ్యం కాదని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది.

రిజర్వేషన్లు తేలకపోవటంతో..

స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తేస్తూ అసెంబ్లీలో ఇటీవల బిల్లు ఆమోదించి గవర్నర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ బిల్లుపై గవర్నర్ న్యాయ సలహా కోరుతూ న్యాయ నిపుణులకు పంపించినట్లు తెలిసింది. దీంతో బిల్లుపై నిర్ణయం తీసుకోడానికి రాజ్‌భవన్‌కు కొంత సమయం ఇచ్చి వేచిచూడాలనే యోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా అధికారవర్గాల ద్వారా తెలుస్తోంది. ఒకవేళ రాజ్‌భవన్ నుంచి ఈ బిల్లును రాష్ట్రపతికి పంపించినా వెంటనే అక్కడి నుంచి ఏదో ఒక నిర్ణయం వెలువడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. అందువల్ల మరో రెండుమూడు నెలల తర్వాత బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. వెనుకబడిన తరగతుల వారికి స్థానిక సంస్థల్లో విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ముందుగా బీసీ సంక్షేమ శాఖ జీఓ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది వచ్చాక పంచాయతీరాజ్ శాఖ రిజర్వేషన్ల ఫార్ములా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో కోటా నిర్ధారణ, ప్రభుత్వపరంగా ఎన్నికల తేదీల నిర్ణయాన్ని బట్టి ముందుకు వెళ్లాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇదంతా పూర్తి కావటానికి మరికొంత సమయం పడుతుందని అంటున్నారు. మరోవైపు ప్రభుత్వపరంగా రిజర్వేషన్ల ఖరారు, ఎన్నికల తేదీల నిర్ణయంతో సంబంధం లేకుండా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ) ఎన్నికల నిర్వహణ సన్నాహాలను వేగవంతం చేసింది.

విమాన ఇంధనాన్ని కల్తీ చేస్తారా?

- గాలిలో కూలిపోతే ఎవరు బాధ్యులు?
- ఆయిల్ కాంట్రాక్టర్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: పెట్రోల్, డీజిల్‌లో కల్తీకి పాల్పడితే వాహనాలు రోడ్డుపై ఆగిపోతాయని, విమాన ఇంధనం కల్తీ చేస్తే ఎక్కడ ఆగాలని పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కల్తీ కారణంగా విమానం కూలి మనుషుల ప్రాణాలుపోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించింది. కనీస మానవత్వం అంటూ లేకుండా అక్రమాలకు పాల్పడితే ఎలా ఉపేక్షించాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. కాంట్రాక్టు పునరుద్ధరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను ఎంత మాత్రం ఆమోదించబోమని.. కొట్టివేసింది. ట్యాంకర్లలో ఇంధనాన్ని కల్తీ చేస్తున్నారని సోషల్ మీడియాలో వచ్చిన కథనాల ఆధారంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) కాంట్రాక్టు రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ కాంట్రాక్టర్ గురునాథం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక మంగళవారం విచారణ చేపట్టారు. ఆయిల్ ట్యాంకర్లో ఏదో శబ్దం వస్తుండటంతో నిలిపి పైకెక్కి చూశారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. దీన్ని కొందరు వీడియోలు తీసి కల్తీ అంటూ సోషల్ మీడియాలో పెట్టారన్నారు. కల్తీపై విచారణ జరపకుండానే కాంట్రాక్టు రద్దు చేయడం సరికాదని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విమాన ఇంధనంలో కల్తీకి పాల్పడితే ఎలాంటి పరిణామాలు సంభవిస్తాయో తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మార్గాల్లో సంపాదించే డబ్బు తప్ప ప్రజల ప్రాణాలు కనిపించవా అని ప్రశ్నించారు. కాంట్రాక్టు రద్దు చేయడంలో జోక్యం చేసుకోబోమంటూ.. పిటిషనర్‌కు రూ. 10 లక్షల జరిమానా విధిస్తూ పిటిషన్‌ను కొట్టివేశారు.

కేంద్రం అంగీకరిస్తేనే..!

▶ మొదటి పేజీ తరువాయి

రాకుండా నిరోధిస్తూ ఇచ్చిన జీఓ)ను ఈ కేసులో సడలిస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో సీబీఐ కేసు దర్యాప్తు ప్రారంభించాలంటే కేంద్ర హోంశాఖ అంగీకరించి, అనుమతి ఇవ్వాల్సి ఉంది. ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 5 ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. ఈ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే సీబీఐ అధికారులు కేసు ప్రాథమిక వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక వివరాల ఆధారంగా ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేస్తారు. ఆ తర్వాత క్షేత్రస్థాయిలో దర్యాప్తు మొదలు పెడతారని ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి తెలిపారు.

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగానే..!

సీబీఐకి అనుమతినిస్తూ ఇచ్చిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం పలు అంశాలను ప్రస్తావించింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ పనుల్లో అవినీతి, అక్రమాలు, ప్రజాధనం దుర్వినియోగం ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరింది. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్ బ్లాక్-7 లోని 16, 17, 18, 19, 20, 21 పియర్లు కుంగినట్టు గుర్తించామని తెలిపింది. ఇందుకు కారణాలు, చోటు చేసుకున్న లోపాలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) 2025 ఏప్రిల్ 24న తుది నివేదిక ఇచ్చిందని పేర్కొంది. జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ కూడా ప్రాజెక్టుకు సంబంధించి పలువురిని విచారించి ఈ ఏడాది జూలై 31న నివేదిక ఇచ్చిందని వివరించింది. పలు లోపాలు, అక్రమాలు కమిషన్ గుర్తించినట్లు తెలిపింది. ఈ మొత్తం అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖల ప్రమేయం ఉన్నందున సీబీఐతో దర్యాప్తు జరపాలని శాసనసభ నిర్ణయించినట్లు వివరించింది. కేంద్రం నుంచి అనుమతి రాగానే సీబీఐ రంగంలోకి దిగే అవకాశాలున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా దర్యాప్తు జరపాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో..దాని ఆధారంగానే ముందుకువెళ్లే అవకాశం ఉంది.

నేడు ఢిల్లీకి భట్టి, తుమ్మల

వరద నష్టంపై కేంద్ర మంత్రులతో సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన సంభవించిన వరదలు, ఆస్తినష్టం, యూరియా సరఫరా తదితర సమస్యలపై ఇద్దరు మంత్రులు ఢిల్లీలో కేంద్రమంత్రులను కలవనున్నారు. ఇతర వ్యవసాయ, ఉద్యాన సమస్యలపై కూడా సంబంధిత మంత్రులను తుమ్మల కలుస్తారని ఆయన కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఆ నివేదిక ఆధారంగా చర్యలొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

సీబీఐ ఆధారపడవచ్చని తెలిపింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పిటిషనర్లు దాఖలు చేసిన మధ్యంతర అప్లికేషన్ (ఐఏ)లపై ప్రభుత్వ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణ సందర్భంగా అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనను ధర్మాసనం నమోదు చేసుకుంది. తదుపరి విచారణ అక్టోబర్ 7కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ నివేదికపై అసెంబ్లీలో చర్చించినా.. చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ఐఏలు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది.

సీబీఐకి ఇవ్వాలన్నది సర్కార్ నిర్ణయమే..

ప్రభుత్వం తరఫున ఏజీ, సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉండదు. నివేదికపై చర్యల్లో భాగంగా సీబీఐ దర్యాప్తు కోరలేదు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై సీబీఐ విచారణ చేస్తుంది. జస్టిస్ ఘోష్ నివేదిక అసెంబ్లీ ముందు ప్రవేశపెట్టాం.. చర్చ కూడా జరిగింది. దీని ఆధారంగా పిటిషనర్లపై ప్రస్తుతానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. సీబీఐకి ఇవ్వాలని కూడా కమిషన్ నివేదికలో లేదు. ఇది ప్రభుత్వ నిర్ణయం. సర్కార్ ఎలాంటి చర్యలు తీసుకోబోవడం లేదు. పిటిషనర్లు భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. సీబీఐ విచారణ కూడా కాళేశ్వరం ప్రాజెక్టుపైనే సాగుతుంది.. పిటిషనర్లపై కాదు. మేడిగడ్డ బరాజ్ ఐదు పిల్లర్లు కూలిపోవడానికి ఎవరు బాధ్యులో తేలుస్తుంది. కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయనే భయంతో వేసిన ఐఏలు విచారణార్హం కాదు. కొట్టివేయండి..'అని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీబీఐ దర్యాప్తునకు వీలుగా ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ కాపీని ధర్మాసనానికి అందజేశారు.

నోటిఫికేషన్‌లో ఎందుకు పేర్కొనలేదు...

కేసీఆర్, హరీశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు దామ శేషాద్రినాయుడు, ఆర్యమ సుందరం వాదనలు వినిపించారు. 'కమిషన్ నివేదికలో ఎవరు తప్పు చేశారో ఉందని, ఎవరినీ వదిలిపెట్టబోమని ప్రభుత్వం చెప్పిందని, అసెంబ్లీలోనూ ముఖ్యమంత్రి చెప్పారని ఏజీ సోమవారం చెప్పారు. ఇప్పుడేమో నివేదికపై చర్యలు ఉండవని చెబుతున్నారు. నివేదికతో పని లేనప్పుడు సీబీఐ దర్యాప్తు కోరిన నోటిఫికేషన్‌లో అలా ఎందుకు పేర్కొనలేదు? ప్రభుత్వం ఇచ్చిన హామీని రికార్డుల్లో నమోదు చేయాలి. ఆ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలి..'అని కోరారు. సీజే జోక్యం చేసుకుని.. 'కమిషన్ నివేదిక అసెంబ్లీలో పెట్టారా? చర్యలు తీసుకుంటారా?'అని ఏజీని ప్రశ్నించింది. అసెంబ్లీలో పెట్టి చర్చించారని, ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఏజీ బదులిచ్చారు. అయితే కమిషన్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోమని చెబుతూనే అందులోకి విషయాలను ప్రస్తావిస్తూ సీబీఐ దర్యాప్తు కోరారని శేషాద్రినాయుడు చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వ హామీని నమోదు చేసుకుంది. తాము తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సర్కార్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

జస్టిస్ ఘోష్ నివేదిక రద్దు చేయండి: మాజీ సీఎస్ జోషి

జస్టిస్ ఘోష్ నివేదిక రద్దు చేయాలని కోరుతూ నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి (రిటైర్డ్) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కమిషన్ సాక్షిగా మాత్రమే సమన్లు జారీ చేసిందని.. చట్టప్రకారం ఎలాంటి నోటీసులు ఇవ్వలేదని తెలిపారు. ఈ పిటిషన్‌పై సీజే ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది.

నక్సలిజంపై సీఎం వ్యాఖ్యలు సరికావు

- మాజీ నక్సలైట్లు రాష్ట్ర కేబినెట్‌లో కూర్చున్నారు
- 'ఎక్స్'లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: 'నక్సలిజం ఒక సిద్ధాంతం. దాన్ని అంతం చేయలేం'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం నక్సలైట్ల చేతిలో బలైన వేలాది అమాయక గిరిజనులు, పోలీసుల త్యాగాలను అవమానించడమేనని కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి తెలంగాణ పోలీసులకు గౌరవం ఇవ్వరా? నక్సలిజాన్ని అణచివేతలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలను గుర్తు పెట్టుకోరా?'అని ప్రశ్నించారు. మంగళవారం 'ఎక్స్'వేదికగా సీఎం వ్యాఖ్యలపై సంజయ్ స్పందిస్తూ.. మాజీ నక్సలైట్లు రాష్ట్ర కేబినెట్‌లో కూర్చున్నారని పేర్కొన్నారు. 'నక్సలైట్‌ను పద్మ అవార్డులకు సిఫారసు చేశారు. నక్సల్ భావజాలం ఉన్నవారు విద్యా కమిషన్‌లో ఉన్నారు. ఇప్పుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి కూడా అదే సిద్ధాంతానికి చెందిన వ్యక్తి. ఇది యాదృచ్ఛికం కాదు. తెలంగాణ యువతను తిరిగి నక్సలిజం వైపు మళ్లించేందుకు పన్నిన కుట్ర'అని ఆరోపించారు. కాంగ్రెస్ నేతల కుటుంబ సభ్యులే నక్సలైట్ల చేతిలో ప్రాణాలు కోల్పోయారన్నారు. 'అయితే సీఎం వంటి వారు నిశ్చింతగా ఉండండి. మేము నక్సలిజాన్ని అంతమొందిస్తాం'అని సంజయ్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 2026 నాటికి అతి తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టంగా చెప్పారన్నారు.

ఓట్ల కోసమే బీఆర్ఎస్ శంకుస్థాపనలు చేసింది

- 15 రోజుల్లో రాష్ట్రంలో యూరియా సమస్య ఉండదు
- రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి, కొండా సురేఖ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు దామోదర, పొంగులేటి. చిత్రంలో వేం, బలరాంనాయక్, రాంచంద్రునాయక్, మురళీనాయక్

సాక్షి, మహబూబాబాద్: 'ప్రజల విశ్వాసం కోల్పోయామని గ్రహించిన బీఆర్ఎస్ నాయకులు ఎన్నికలకు ముందు పనుల శంకుస్థాపనలతో ఓట్ల రాజకీయాలు చేశారు. పనులకు నిధులు కేటాయించకుండా కాలయాపన చేశారు. దాని ఫలితంగానే ఇప్పుడు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో వసతుల కల్పన ఆలస్యం అవుతోంది' అని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల హాస్టల్, క్రిటికల్ కేర్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ వైద్యం పరిమితి పెంచిందని చెప్పారు. 16 కొత్త నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని, అన్ని వైద్య కళాశాలల భవనాలు పూర్తిచేసి, కావాల్సిన మౌలిక వసతులు, ఉద్యోగులను భర్తీ చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్షలు నిర్వహిస్తున్నారని మంత్రి వివరించారు.

యూరియా ఇబ్బందులు తొలగుతాయి..

నాటి ప్రభుత్వ హయాంలో రైతులను చిన్నచూపు చూసిన బీఆర్ఎస్ నాయకులు నేడు యూరియా కొరత ఉందని రాద్ధాంతం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. 10-15 రోజుల్లో రైతులకు కావాల్సిన యూరియా వస్తుందని చెప్పారు. జిల్లాకు ఇప్పటికే 1,800 మెట్రిక్ టన్నుల యూరియా చేరిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదనపు యూరియా కోటా సాధించేందుకు మంత్రివర్గ బృందం త్వరలో ఢిల్లీ వెళ్లనుందని ఆయన వివరించారు. రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, గత ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కళాశాల మంజూరు చేసినా, అందుకు అనుగుణంగా నిధులు కేటాయించలేదని అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, స్థానిక ఎమ్మెల్యే మురళీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రంగనాయక సాగర్‌పై 100 మీటర్ల బ్యానర్

- బీఆర్ఎస్ నేతల నిరసన



చిన్నకోడూరు(సిద్దిపేట): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు ప్రచారానికి నిరసనగా మంగళవారం బీఆర్ఎస్ నాయకులు.. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని రంగనాయక సాగర్ కట్టపై నిరసన తెలిపారు. 'ఇది కదా కాళేశ్వరం.. ఇదే కదా కాళేశ్వరం' అనే 100 మీటర్ల బ్యానర్‌ను రంగనాయక సాగర్‌పై ప్రదర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక సేద్యంతో స్వావలంబన అసాధ్యం

- గ్రామాల నుంచి ఏటా తరలిపోతున్న సొమ్ము రూ. 16 లక్షల కోట్లు
- పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్




సాక్షి, హైదరాబాద్: భూతాపోన్నతి (క్లైమెట్ ఛేంజ్)ని పెంపొందించే రసాయనిక వ్యవసాయాన్ని అనుసరించినంత కాలం మన దేశం ఆహార రంగంలో సంపూర్ణ స్వావలంబన సాధించటం అసాధ్యమని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ సుభాష్ పాలేకర్ స్పష్టం చేశారు. మంగళవారం దోమల్‌గూడలోని శ్రీరామచంద్ర మిషన్ ఆడిటోరియంలో జరిగిన సుభాష్ పాలేకర్ కృషి (ఎస్పీకే) తెలుగు రాష్ట్రాల జిల్లాస్థాయి సమన్వయకర్తల సమావేశంలో ఆయన ప్రసంగించారు. భూతాపం పెచ్చుమీరినందువల్లే మేఘ విస్ఫోటనాలు జరుగుతున్నాయన్నారు.

స్వావలంబన ఎక్కడ?

వరి, గోధుమ పంటల్లో స్వయం సమృద్ధి సాధించినంత మాత్రాన స్వావలంబన సాధించినట్లు కాదని పాలేకర్ అన్నారు. వంటనూనెలు, పప్పుదినుసులు, యూరియా, వ్యవసాయ యంత్రాలను విదేశాల నుంచి భారీగా దిగుమతి చేసుకుంటూ 'ఆత్మనిర్భర భారత్' సాధించామనుకోవటం మనల్ని మనం మభ్యపెట్టుకోవటమేనని చెప్పారు. రసాయనిక వ్యవసాయంలో మాదిరిగానే ఈ ఉత్పాదకాలను కొనుగోలు చేసి సాగుచేసే సేంద్రియ వ్యవసాయం కూడా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కృంగదీసేవేనన్నారు. ఈ రెండు వ్యవసాయ పద్ధతుల్లో ఉత్పాదకాల కొనుగోలు వల్ల ఏటా రూ. 16 లక్షల కోట్ల సొమ్ము గ్రామాల నుంచి నగరాలు, విదేశాలకు తరలిపోతోందని పాలేకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయం ఎస్పీకే..

రసాయనిక ఎరువులతో భూతాపం పెరుగుతోందని.. ఎకరం పొలంలో టన్నులకొద్దీ పశువుల ఎరువు, వర్మీకంపోస్టు వేయడంవల్ల కూడా భూతాపం అంతకంతకూ పెరుగుతోందన్నారు. ఎస్పీకే పద్ధతిలో కేవలం కొన్ని కిలోల పేడ, మూత్రాన్ని వాడి ద్రవ, ఘన జీవామృతాలను తయారు చేసుకొని రైతులు వాడుకోవచ్చని చెప్పారు. ఎస్పీకే ఐదు దొంతర్ల అడవి పంటల నమూనా ద్వారా తొలి ఏడాది ఎకరానికి రూ. లక్ష ఆదాయం వస్తోందని, ఆరేళ్లలో ఇది రూ.6 లక్షలకు పెరుగుతోందని పాలేకర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సేవ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, ఎస్పీకే ప్రచారకులు విజయ్‌రామ్, శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డా.నీరజా ప్రభాకర్, మన పల్లె సంస్థ వ్యవస్థాపకుడు వెల్మ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





జాతీయ పోషకాహార వారోత్సవాలు

పిల్లలకు పోషకాలు ఇలా...

పిల్లలు ఎదుగుదల బాగుంటేనే వారి భవిష్యత్తు బంగారంగా ఉంటుందనేది ఎప్పుడూ విని, ఆచరించాల్సిన మాట. ముఖ్యంగా పోషకాహార విషయంలో తప్పనిసరి జాగ్రత్తలు తీసుకోవాలి. వారి శరీరం, మెదడు పనితీరు బాగుండి, చదువులోనూ, ఆటపాటల్లోనూ మేటిగా నిలవడానికి పోషకాహారం ఎంతో మేలు చేస్తుంది. 1-10 ఏళ్ల వయసు పిల్లలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) భారతీయ తల్లిదండ్రులకు ఇస్తున్న సూచనలు..



కార్బోహైడ్రేట్లు	- 100 నుంచి 130 గ్రాములు
ప్రొటీన్లు	- 20 – 25 గ్రాములు
క్యాల్షియం	- 500 నుంచి 800 గ్రాములు
విటమిన్ - ఎ	- 300-500 మైక్రో యూనిట్స్
విటమిన్- సి	- 15 – 25 గ్రాములు
విటమిన్ -డి	- 5 మైక్రోగ్రామ్స్ నుంచి ఉండాలి.
ఐరన్	- 7-10 గ్రాములు
జింక్	- 3-5 గ్రాములు
నీళ్లు	- 60 ఎం.ఎల్ (కేజీ శరీర బరువుకు)

వీటి ఆధారంగా పిల్లలకు ఉదయం బ్రేక్‌ఫాస్ట్, స్నాక్స్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్‌ను ప్లాన్ చేసుకోవాలి. వీటిని బేస్ చేసుకొని మేం పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్ ప్లాన్ ఇస్తాం.. శక్తిని ఇచ్చే పై పోషకాలు అన్నీ అందాలంటే పిల్లలకు రోజువారీ అందించే ప్లేట్‌లో ఈ ఆహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలి.



బ్రేక్‌ఫాస్ట్

పిల్లలకు స్కూల్ టైమ్ అయిపోయింది, తినడం లేదు.. అని బ్రేక్‌ఫాస్ట్ చేయించడం ఆపకూడదు. ఎదిగే పిల్లల్లో బ్రేక్‌ఫాస్ట్ ఇచ్చే శక్తి చాలా ముఖ్యమైనది. మెదడు చురుకుదనానికి, శరీర శక్తికి చాలా అవసరం.

ఇంట్లో తయారు చేసిన.. ఇడ్లీ, దోసె, చపాతీ, రాగితో, కిచిడీ, పొంగల్.. వంటివి ఏదైనా వారి ఇష్టం మేరకు ఎంచుకోవచ్చు. వీటికి గ్లాసుడు పాలు, ఫ్రూట్ బెర్రీస్, యాపిల్, జామ, అరటిపండు.. ఇలా ఏదైనా పండు జతగా ఉండాలి. గుడ్డు లేదంటే బాదం వంటి నట్స్ మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్‌లో ఉండాలి. నెయ్యి, బటర్ కూడా ఉండచ్చు. ఉప్మా అయితే నెయ్యి, డ్రైఫ్రూట్స్‌తో చేసి ఇవ్వచ్చు లేదా చపాతీ గుడ్డు, పిండి లేదా గింజలతో చేసేవి పిల్లలు తినదగ్గవి ఎంచుకోవచ్చు.

స్నాక్స్

బ్రేక్‌ఫాస్ట్‌కు లంచ్‌కు మధ్య ఒక బ్రేక్ టైమ్ ఉంటుంది. ఆ సమయంలో పిల్లలు స్కూల్లో ఉంటారు. అప్పుడు వారి ఆకలి తీరడానికి కేకులు, బిస్కట్లు వంటి జంక్ ఫుడ్ పెడుతుంటారు. దానికి బదులుగా ఉడకబెట్టిన పల్లీలు, సున్నుండలు, క్యారెట్ ముక్కలు, ఏదైనా పండు, మొలకెత్తిన గింజలు, డ్రై ఫ్రూట్ లడ్డు, నువ్వుల ఉండలు.. ఇలాంటివి ఇవ్వాలి. ఈ స్నాక్‌లో ఉండే పోషకాలు వల్ల పిల్లల్లో శక్తి తగ్గదు, మెదడు పనితీరు చురుగ్గా ఉంటుంది. ఈ ప్రభావం వారి చదువుపైనా ఉంటుంది.



మధ్యాహ్న భోజనం

బ్రౌన్ రైస్ లేదా చపాతీ, పప్పు వంటివి ఉండాలి. మాంసాహారులు అయితే చికెన్, గుడ్డు వంటివి ఇవ్వచ్చు. లేదా పనీర్, మిక్స్‌డ్ వెజిటబుల్ రైస్, రైతా, కర్డ్ రైస్, బీన్స్, క్యాలీఫ్లవర్, ఆలూ కర్రీ పెరుగు, బటర్ మిల్క్ ఉండేలా చూడాలి. కూరగాయలు కలిపి చేసిన ఆహారం ఇవ్వడం వల్ల ప్రొటీన్లు, మినరల్స్ అందుతాయి.

స్నాక్స్

మధ్యాహ్నం 3 లేదా 4 గంటల సమయంలో ఆకలి వేస్తుంటుంది. ఈ సమయంలో ఉదయం స్నాక్స్ టైమ్‌లో ఇచ్చిన వాటి నుంచి ఏవైనా ఎంచుకోవచ్చు.

రాత్రి భోజనం

ఈ రోజుల్లో సోషల్ మీడియా, టీవీ వల్ల పిల్లల్లోనూ స్క్రీన్ టైమ్ పెరిగింది. దీంట్లో ఇంట్లోనూ రాత్రి భోజనం చేసే సమయాల్లో మార్పులు వచ్చాయి. ఆలస్యంగా తింటే ఆహారం సరిగా జీర్ణం అవ్వక మరుసటి రోజు అది వారి దినచర్యమీద ప్రభావం చూపుతుంది. అందుకని 7 నుంచి 8 గంటల లోపు తేలికగా జీర్ణమయ్యే ఆహారం పిల్లల ప్లేట్‌లో ఉండాలి. మిక్స్‌డ్ వెజిటబుల్ రైస్, ఆకుకూరలు తీసుకోవాలి. వేపుళ్లు లేకుండా తేలికగా అరిగేవి పెడితే మంచిది. రాత్రిపూట మాంసాహారం తింటే త్వరగా జీర్ణం కాదు. పిల్లలు ఇష్టపడేలా స్టఫ్డ్ రైస్, పనీర్ టిక్కా.. వంటివి ప్లాన్ చేసుకోవాలి.



ఎముకల బలానికి, కండరాల వృద్ధికి, మెదడు ఎదుగుదలకు ఈ పోషకాలన్నీ ఉండేలా ప్లాన్ చేసుకోవాలి. దీనివల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. త్వరగా అలసి పోకుండా ఉండటానికి విటమిన్, న్యూట్రియంట్లు అందిస్తే ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. హార్ట్ సంబంధిత సమస్యలూ దూరం అవుతాయి. మైండ్ ఫుల్ ఈటింగ్ అంటే సంతృప్తినిచ్చేలా, ఆ ఆహారాన్ని ఎంజాయ్ చేయడానికి అలవాటు చేయాలి. సమతుల పోషకాహారం అనేది చాలా ముఖ్యం అని ప్రతిరోజూ దృష్టిలో పెట్టుకొని, ఈ తరహా ఫుడ్ వారి ప్లేట్‌లో ఉండేలా ప్రణాళిక చేసుకోవాలి.



– డా. సుజాతా స్టీఫెన్, న్యూట్రిషనిస్ట్

స్ఫూర్తి

ఎనభై రెండేళ్ల ఎనర్జీ!



సోషల్ మీడియా వేదికగా అసామాన్య సామాన్యుల గురించి పరిచయం చేస్తుంటారు పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రా. తాజాగా ఆయన తమిళనాడులోని పొల్లాచికి చెందిన కిట్టమ్మాళ్ గురించి పోస్ట్ పెట్టారు.

శక్తికి వయసు అడ్డుకాదని నిరూపించింది 82 సంవత్సరాల కిట్టమ్మాళ్.

పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే కిట్టమ్మాళ్ ఉత్సాహానికి కేరాఫ్ అడ్రస్.

‘ఎనభై రెండు సంవత్సరాల వయసులో ఆమె పైకెత్తేది బరువులను కాదు. మనలో దాగి ఉన్న ఆత్మవిశ్వాసాన్ని. కలలు కలడానికి, ఆ కలలు నెరవేర్చుకోవడానికి వయసు అడ్డుకాదని మరోసారి నిరూపించిన మహిళ’ అంటూ కిట్టమ్మాళ్ విల్‌పవర్‌ను కొనియాడారు ఆనంద్ మహీంద్రా.

కునియముత్తూరులో జరిగిన ‘స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ సౌత్ ఇండియా’ పోటీలో పాల్గొన్న కిట్టమ్మాళ్ 17 మంది మహిళలతో పోటీ పడింది. ఈ మహిళలందరూ 30 కంటే తక్కువ వయసు ఉన్నవారే!

డెడ్‌లిఫ్టింగ్ 50 కేజీల విభాగంలో అయిదో స్థానంలో నిలిచింది. తన మనవళ్లు రోహిత్, రితిక్ నుంచి స్ఫూర్తి పొందిన కిట్టమ్మాళ్ బామ్మ పవర్‌లిఫ్టింగ్‌లో పవర్ చాటుతోంది.

బరువులు ఎత్తడం ఆమెకు కొత్తేమీ కాదు. 25 కిలోల బియ్యం బస్తాలను అవలీలగా మోసుకెళ్లేది.

‘నేను తీసుకునే ఆహారమే నా శక్తి’ అంటున్న కిట్టమ్మాళ్ సంప్రదాయ, పోషక విలువలతో కూడిన ఆహారానికి ప్రాధాన్యత ఇస్తుంది.

పోలీసు రైటర్స్!


ప్రతి పోలీసుస్టేషన్‌లోనూ ఓ రైటర్ ఉంటారు. ఆయన ఆ ఠాణాతో పాటు కేసులకు సంబంధించిన రికార్డుల్ని నిర్వహిస్తుంటారు. ఇది అందరికీ తెలిసిందే. అయితే కొందరు పోలీసుల్లోనూ రైటర్ ఉంటున్నాడు. ఇలా రచయితలుగా మారిన అధికారులు ఎందరో ఉండగా... అతి తక్కువ మంది మాత్రమే తమ వృత్తికి భిన్నమైన అంశాలను ఎంచుకున్నారు... కుంటున్నారు. పోలీసు విభాగంలో తమకు ఎదురైన అనుభవాలు, పోలీసింగ్‌లో ఉన్న లోపాలు, చట్టాలు తదితరాలపై పోలీసులు, మాజీ పోలీసులు పుస్తకాలు రాయడం కామనే. అయితే దీనికి భిన్నంగా భాష, సాహిత్యాలపై రాస్తున్న వాళ్లు అరుదు. అలాంటి వారి జాబితాలో దివంగత బయ్యారపు ప్రసాదరావు, కొత్తకోట శ్రీనివాసరెడ్డి, చిలుకూరి రామ ఉమామహేశ్వర శర్మ ఉదాహరణలు మాత్రమే.

స్వగతం సహా ‘ఎ’న్నో కథలు



చిలుకూరి రామ ఉమా మహేశ్వర శర్మ

ఆంగ్లంలో లిటరేచర్‌తో పాటు లా కూడా పూర్తి చేసిన చిలుకూరి రామ ఉమా మహేశ్వర శర్మ ఎస్పీ హోదాలో పదవీ విరమణ చేసిన తర్వాత తెలుగు రచయితగా మారారు. అప్పట్లో ఖమ్మం, ఇప్పుడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న సత్యనారాయణపురానికి చెందిన శర్మ 1985లో ఎస్సైగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. 2019లో ఉద్యోగ విమరణ చేసిన ఆయన తన తొలి పుస్తకం ‘నేను శాంత కూడా – ఓ జీవన కథ’ను 2021లో విడుదల చేశారు. ఇందులో కేవలం తన వ్యక్తిగత జీవితం, వృత్తిపరమైన అంశాలు, ఆద్యంతం తన భార్య శాంత ఇచ్చిన సహకారం తదితరాలను ప్రస్తావించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శర్మ రెండోపుస్తకం ‘ఎ’ ఆవిష్కృతమైంది. ఇందులో సమకాలీన అంశాలను స్పృశించిన ఆయన మహిళలు, ట్రాన్స్‌జెండర్ల జీవితం, స్త్రీ, పురుష సంబంధాలు, సమాజం నిర్మించిన నైతికచట్రపు విలువలు తదితరాలను నిశితంగా ప్రశ్నిస్తూ షార్ట్ స్టోరీలు ఉంటాయి. ఒకే మూసలోకి ఒదగని ఈ కథలు చెప్పేతీరు కూడా కథ, కథకి మారుతూ మనుషుల ప్రవర్తనలను, ఆలోచనలను వాటి వెనక ఉద్దేశాన్ని చూపిస్తుంటుంది. వైవిధ్యత, వాస్తవికత, మానవీయ దృక్పథం, చక్కటి చమత్కారాలతో సాగే కథల్ని రాసిన శర్మ తనలోని మరో కోణాన్ని చూపించారు.








బయ్యారపు ప్రసాదరావు

ఫిజిక్సే కాదు..ఆంగ్లంలోనూ...

విజయవాడలో ఓ కానిస్టేబుల్ కుమారుడిగా పుట్టి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు ఆఖరి డీజీపీగా, రాష్ట్రవిభజన తర్వాత ఏపీకి మొదటి హోమ్ సెక్రటరీగా పని చేసిన డాక్టర్ బయ్యారపు ప్రసాదరావులోనూ ఓ రచయిత ఉన్నారు. తన ఇంట్లోనే ఓ పెద్ద ఫిజిక్స్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్న ఆయన ‘థీరీ ఆఫ్ లైట్’లోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ ‘న్యూ లైట్ ఆన్ లైట్’ సిద్ధాంతాన్ని ప్రపంచానికి పరిచయం చేసి డాక్టరేట్ పొందారు. 1977లో మద్రాస్ ఐఐటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి, 1979లో ఐపీఎస్‌గా ఎంపికైనా ఆయనకు ఆంగ్లం నేర్చుకోవాలన్న తపన పోలేదు. దీని కోసం అనేక ప్రయత్నాలు చేసిన ఆయన తానే సొంతంగా ఓ విధానం రూపొందించాలని అనుకున్నారు. 1984లో తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీగా ఉండగా ఓరోజు కాకినాడ నుంచి అమలాపురం ప్రయాణించారు. అప్పుడు ఆయనకు ఓ ఆలోచన వచ్చింది. ఆంగ్లపదాలను అలాగే చదివితే అవి అంతగా గుర్తుండటం లేదు. ఈ నేపథ్యంలో వీటిని వాక్యాలుగా, వ్యాసాలుగా మార్చాలని భావించారు. ఇలా తన ఇష్టమైన సబ్జెక్ట్ అయిన ఫిజిక్స్‌లోని సూత్రాలు, కొన్ని కల్పిత ఉదంతాలతో కథనాలుగా అల్లి ప్రాక్టీసు చేశారు. తొలిసారిగా 20 కొత్త పదాలతో ప్రయత్నించగా... అమలాపురం చేసేసరికి 17 తేలిగ్గా గుర్తుపెట్టుకోవడం సాధ్యమైంది. అలా ఆ మార్గం పట్టిన ప్రసాదరావు దాదాపు పదేళ్లపాటు ప్రాక్టీసు కొనసాగించారు. 11 వేల పదాలు... 500 కథనాలు... అదనపు ఎస్పీ నుంచి ఆయన హోదాలు మారుతున్నప్పటికీ ఆయన ప్రయత్నాలు మాత్రం ఆగలేదు. ఇలాంటి అంశాలతో ఆయన రాసిన పుస్తకం ‘వర్డ్ పవర్ టు మైండ్ పవర్’ 2012 సెప్టెంబర్ 12న నాటి ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆవిష్కృతమైంది. 2014లో రిటైర్ అయిన ప్రసాదరావు 2021 మేలో అమెరికాలో కన్నుమూశారు.




నవరసాలు నిండిన ‘పుంజుతోక’



కొత్తకోట శ్రీనివాసరెడ్డి

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ విభాగంలో డైరెక్టర్ జనరల్‌గా పని చేసి, తాజాగా ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారి కొత్తకోట శ్రీనివాసరెడ్డి. ముక్కుసూటి అధికారిగా పేరున్న శ్రీనివాస్‌రెడ్డి స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లాలోని కొత్తకోట. బషీర్‌బాగ్‌లోని ఉస్మానియా యూనివర్శిటీ పీజీ కాలేజీ నుంచి ఎంకాం, ఆపై ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. అహ్మదాబాద్ ఐఐఎం నుంచి చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్స్ కోర్స్, హంగేరీలో యాంటీ టెర్రరిజం అసిస్టెన్స్ కోర్స్ చేశారు. 1994లో ఐపీఎస్ అధికారిగా పోలీసు విభాగంలో అడుగుపెట్టి ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు. 30 ఏళ్ల తన సర్వీసులో ఎదురైన అనుభవాలన్నింటినీ రంగరిస్తూ ఆయన 120 కవితలుగా అక్షరీకరించారు. మొదట్లో దీనికి ‘కాక్‌టెయిల్ పద్యాలు’ అంటూ ఇంగ్లీషులో టైటిల్ పెట్టాలని భావించిన ఆయన చివరకు ‘పుంజుతోక’ అంటూ తెలుగీకరించారు. ‘అందరిలా కాదు నేను నాలాగే’ అనే కవితతో సంకలనం ప్రారంభించారు. ‘చాలామందికి కేవలం ఓ ఐపీఎస్ అధికారిగానే సుపరిచితుడిని. పదవీ విరమణ రోజు రచయితగా పరిచయం చేసుకున్నా. ఈ పుస్తకంలో నా ఆత్మ సాక్షాత్కారం ఉంటుంది. ఇన్నేళ్ల నాజీవితంలో నాకు ఎదురైన అనుభవాలకు నిజాయితీతో కూడిన అక్షర రూపమే ఈ కవితా సంపుటి. సామాజిక స్పృహ, సంఘ సంక్షేమం, ప్రకృతిపై ఉన్న ప్రేమ ప్రధానాంశాలుగా ఉంటాయి. సామాజిక, మానవతా విలువలు అంతఃసూత్రంగా సాగే కవితలివి. ఈ ‘పుంజుతోక’ పాఠకులకు నచ్చుతుందని నా విశ్వాసం’ అని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.



– శ్రీరంగం కామేష్, క్రైమ్ రిపోర్టర్, హైదరాబాద్

● లీగల్

ఈ వేధింపులను ఆపే మార్గం లేదా?

మా మామ గారు నామీద ఒక చీటింగ్ కేసు నమోదు చేశారు. అంతకుముందు నా భార్య నా మీద గృహ హింస కింద కూడా అదే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసింది. కౌన్సెలింగ్ పేరుతో చాలాసార్లు పిలిచి పోలీసు వారు వేధించారు. ఆఖరికి స్టేషన్ బెయిల్ ఇచ్చారు. ఇప్పుడు ఈ కొత్త చీటింగ్ కేసు నెపంతో తరచుగా పోలీస్ స్టేషన్‌కు పిలిచి సెటిల్మెంట్ చేయవలసిందిగా ఒత్తిడి చేస్తూ నా ఆస్తి ఒకటి రాసిమ్మని అలాగే నా వద్దనే ఉన్న నా కొడుకుని కూడా ఇచ్చేయాలి అంటూ బలవంతం చేస్తున్నారు. గంటలకొద్దీ కూర్చోబెడుతున్నారు. మా మామగారికి పోలీసులలో చాలామంది పరిచయస్తులు ఉన్నారు. వారి సహాయంతో ఇదంతా చేస్తున్నారు అని, నేను ఏమీ చేయలేను అని అందరికీ చెప్తున్నారు. ఇటీవలే స్త్రీ – శిశు సంక్షేమ శాఖ నుంచి కూడా బాబు కస్టడీ ఇవ్వాలి అంటూ ఒక నోటీసు అందింది. ఈ వేధింపులను ఆపే మార్గం లేదా?

– గణేష్, మేడ్చల్

ఫ్యామిలీ కేసు, సివిల్ కేసు అనే తారతమ్యం కూడా లేకుండా పోలీసు వారు నిందితులను తరచుగా పోలీస్ స్టేషన్‌కు పిలిచి గంటల తరబడి కూర్చోబెట్టడం, సెటిల్మెంట్ చేసుకోవాలి అని ఒత్తిడి చేయడం సరైనది కాదు – అది అధికార దుర్వినియోగం కిందకే వస్తుంది అంటూ పలు హైకోర్టులు చాలాసార్లు వివిధ పోలీసు అధికారులను మందలించాయి. ఒకవేళ మీ కేసులో కూడా ఇలాంటి ఒత్తిళ్లకు గురి చేస్తుంటే మీరు ముందుగా పై అధికారులకు ఫిర్యాదు చేయండి. అప్పటికీ కూడా మీకు పరిష్కారం లభించకపోతే పోలీసువారి అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నిస్తూ, మిమ్మల్ని వేధించడానికి వీలు లేదు అని, నోటీసులు లేకుండా పోలీస్‌స్టేషన్‌కు పిలిచి గంటలు తరబడి కూర్చోబెట్టడం అన్యాయం అని డిక్లేర్ చేయమని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయండి. హైకోర్టు మిమ్మల్ని కచ్చితంగా కాపాడుతుంది. మీ కొడుకు మీ వద్దనే ఉన్నారు అని చెప్తున్నారు కానీ అతని వయసు చెప్పలేదు. మీకు స్త్రీ – శిశు సంక్షేమ శాఖ నుండి వచ్చిన నోటీసు కూడా బహుశా సరైనది కాకపోవచ్చు. చిన్న పిల్లల పోషణకు, శ్రేయస్సుకు – రక్షణకు భంగం కలుగుతుంది అని కచ్చితమైన సమాచారం ఉంటే తప్ప, పిల్లల కస్టడీ విషయాలలో కేవలం ఫ్యామిలీ కోర్టుకు మాత్రమే అధికారం ఉంటుంది. ఏది ఏమైనా మీరు హైకోర్టులో ఆ నోటీసును కూడా ప్రత్యేకంగా రిట్ పిటిషన్ ద్వారా ఛాలెంజ్ చేయండి. సరైన పరిష్కారం దొరుకుతుంది.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

బులియన్

బంగారం 10 గ్రా.। వెండి కిలో

సెప్టెంబర్ 2న ముగింపు రూ.లలో

హైదరాబాద్		విజయవాడ		విశాఖపట్నం		రాజమండ్రి		ప్రొద్దుటూరు		చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,06,810	బంగారం (24 క్యారెట్లు)	1,08,030	బంగారం (24 క్యారెట్లు)	1,06,090	బంగారం (24 క్యారెట్లు)	1,08,030	బంగారం (24 క్యారెట్లు)	1,06,450	బంగారం (24 క్యారెట్లు)	1,06,090
బంగారం (22 క్యారెట్లు)	1,00,210	బంగారం (22 క్యారెట్లు)	97,250	బంగారం (22 క్యారెట్లు)	97,250	బంగారం (22 క్యారెట్లు)	1,00,160	బంగారం (22 క్యారెట్లు)	97,930	బంగారం (22 క్యారెట్లు)	97,250
వెండి	1,26,300	వెండి	1,26,900	వెండి	1,36,100	వెండి	1,26,900	వెండి	1,26,000	వెండి	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



అంతర్జాతీయ టి20లకు స్టార్క్ వీడ్కోలు

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ అంతర్జాతీయ టి20 క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. యాషెస్ సిరీస్, భారత్‌తో టెస్టు సిరీస్, ఐపీఎల్‌ను దృష్టిలో పెట్టుకొని స్టార్క్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. మరో రెండేళ్లలో వన్డే ప్రపంచకప్ జరగనున్న నేపథ్యంలో... టి20ల నుంచి తప్పుకున్నాడు. ఆస్ట్రేలియా తరఫున 65 టి20 మ్యాచ్‌లాడిన స్టార్క్ 79 వికెట్లు పడగొట్టాడు. ఈ ఫార్మాట్‌లో ఆసీస్ తరఫున ఆడమ్ జంపా 103 మ్యాచ్‌ల్లో 130 వికెట్లు పడగొట్టగా... ఈ జాబితాలో స్టార్క్ రెండో స్థానంలో ఉన్నాడు. 'ఆస్ట్రేలియా తరఫున టి20 ఫార్మాట్‌లో ఆడిన ప్రతి మ్యాచ్‌ను ఆస్వాదించా. ముఖ్యంగా 2021 ప్రపంచకప్‌ను ఎప్పటికీ మరవలేను. అప్పుడు ట్రోఫీ చేజిక్కించుకోవడమే కాకుండా ఆ ప్రయాణం ఎంతో గొప్పగా సాగింది. భారత్‌లో టెస్టు సిరీస్, యాషెస్ సిరీస్, 2027 వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో... ఈ ఫార్మాట్ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నా. ఇదే ఉత్తమమని అనిపించింది. అలాగే టి20 ప్రపంచకప్‌నకు ముందు జట్టు చక్కటి బౌలింగ్ బృందాన్ని ఏర్పరుచుకునేందుకు తగినంత సమయం ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఇప్పుడే నా నిర్ణయాన్ని వెల్లడిస్తున్నా' అని 35 ఏళ్ల స్టార్క్ అన్నాడు. న్యూజిలాండ్‌తో టి20 సిరీస్‌కు ఆస్ట్రేలియా జట్టును ఎంపిక చేయనున్న నేపథ్యంలో స్టార్క్ తన నిర్ణయం ప్రకటించాడు. వచ్చే ఏడాది ఆరంభంలో భారత్ వేదికగా ఐసీసీ పురుషుల టి20 ప్రపంచకప్ జరగనుంది.


జెస్సికా

సెమీస్‌లో జెస్సికా

క్వార్టర్ ఫైనల్లో క్రెజికోవాపై వరుస సెట్‌లలో విజయం

న్యూయార్క్: సొంతగడ్డపై తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ సాధించాలన్న లక్ష్యంతో బరిలోకి దిగిన అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగూలా ఆ దిశగా మరో అడుగు వేసింది. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నాలుగో ర్యాంకర్ జెస్సికా పెగూలా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో నాలుగో సీడ్ జెస్సికా 6-3, 6-3తో ప్రపంచ 62వ ర్యాంకర్, 2021 ఫ్రెంచ్ ఓపెన్, 2024 వింబుల్డన్ టోర్నీ విజేత బార్బరా క్రెజికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలుపొందింది. 86 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో గత ఏడాది రన్నరప్ జెస్సికా ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. నెట్ వద్దకు 12 సార్లు దూసుకొచ్చి పదిసార్లు పాయింట్లు గెలిచింది. మరోవైపు క్రెజికోవా ఏకంగా ఏడు డబుల్ ఫాల్ట్‌లు, 24 అనవసర తప్పిదాలు చేసింది.

కోకో గాఫ్ అవుట్

మరోవైపు ప్రపంచ మూడో ర్యాంకర్, టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన కోకో గాఫ్ (అమెరికా) ప్రిక్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన నయోమి ఒసాకా (జపాన్) 6-3, 6-2తో 2023 చాంపియన్ కోకో గాఫ్‌ను ఓడించింది. తద్వారా 2021 ఆస్ట్రేలియన్ ఓపెన్ తర్వాత ఒసాకా మరోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో రెండో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) 6-3, 6-1తో ఎకతెరీనా అలెగ్జాండ్రోవా (రష్యా)పై, కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) 6-3, 6-7 (0/7), 6-2తో మార్టా కోస్టుక్ (ఉక్రెయిన్)పై, ఎనిమిదో సీడ్ అమండ అనిసిమోవా (అమెరికా) 6-0, 6-3తో బీట్రిజ్ హదద్ మాయ (బ్రెజిల్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.


కోకో గాఫ్

సూపర్ సినెర్...

పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ (ఇటలీ) క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో సినెర్ కేవలం మూడు గేమ్‌లు కోల్పోయాడు. 81 నిమిషాల్లో ముగిసిన మ్యాచ్‌లో సినెర్ 6-1, 6-1, 6-1తో బుబ్లిక్‌ను ఓడించాడు. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ఫెలిక్స్ అలియాసిమ్ (కెనడా) 7-5, 6-3, 6-4తో 15వ సీడ్ రుబ్లెవ్ (రష్యా)పై, పదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-0, 6-1తో మునార్ (స్పెయిన్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

'టైటిల్ స్పాన్సర్' వేటలో బీసీసీఐ

- దరఖాస్తులు కోరిన క్రికెట్ బోర్డు
- స్పాన్సర్ లేకుండానే ఆసియా కప్ టోర్నీ బరిలో



న్యూఢిల్లీ: 'ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్ కార్యకలాపాలతో భారత్‌లో గానీ, విదేశాల్లో గానీ ఎలాంటి సంబంధాలు ఉండరాదు... క్రిప్టో కరెన్సీ కంపెనీలు నిషేధం... ఆల్కహాల్, టొబాకో కంపెనీలు కూడా దరఖాస్తు చేయవద్దు'... టీమిండియా ప్రధాన స్పాన్సర్ కోసం ప్రకటన ఇచ్చిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎలాంటి గందరగోళం లేకుండా తమ నిబంధనలు, షరతులపై పూర్తి స్పష్టతనిచ్చింది. టైటిల్ స్పాన్సర్‌గా 'డ్రీమ్ 11' తప్పుకున్న తర్వాత మున్ముందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తరాదని భావిస్తున్న బోర్డు ఈసారి ముందే జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆసక్తి ఉన్న కంపెనీలు సెప్టెంబర్ 12వ తేదీ లోగా దరఖాస్తును కొనుగోలు చేయవచ్చు. బిడ్డింగ్ వేసే కంపెనీ వార్షిక టర్నోవర్ గత మూడేళ్లుగా కనీసం రూ. 300 కోట్లు చొప్పున ఉండాలి. దీంతో పాటు బీసీసీఐ మరికొన్ని షరతులు కూడా విధించింది. ఇప్పటికే బోర్డుకు స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్న సంస్థలకు అదే తరహా వ్యాపారంలో పోటీదారులైన కంపెనీలు కూడా దరఖాస్తు చేయరాదు. ఉదాహరణకు క్యాంపా కోలా స్పాన్సర్‌గా ఇప్పటికే ఉంది కాబట్టి పెప్సీ లేదా కోక్‌లాంటి కంపెనీలు పోటీ పడేందుకు అర్హత లేదు. సరోగేట్ కంపెనీల పేరుతో కూడా (ఉదాహరణకు రాయల్ చాలెంజర్స్ వాటర్) దరఖాస్తు చేయవద్దని బోర్డు స్పష్టతనిచ్చింది. సెప్టెంబర్ 16లోగా స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తును దాఖలు చేయవచ్చని బీసీసీఐ తుది గడువు విధించింది. అంటే ఆసియా కప్‌లోగా ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం లేదు. కాబట్టి భారత జట్టు ఆసియా కప్‌లో ప్రధాన స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగనుంది.

దబంగ్ ఢిల్లీ శుభారంభం

బెంగళూరు బుల్స్‌కు రెండో పరాజయం

విశాఖ స్పోర్ట్స్: మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో శుభారంభం చేసింది. బుధవారం జరిగిన పోరులో ఢిల్లీ 41-34తో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. కెప్టెన్ అషు మలిక్ (15 పాయింట్లు) ముందుండి జట్టును గెలిపించాడు. రెయిడింగ్‌లో అదరగొట్టాడు. 23 సార్లు కూతకెళ్లిన కెప్టెన్ 12 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. మరో రెయిడర్ నీరజ్ నర్వాల్ (7) ఆకట్టుకున్నాడు. వీరిద్దరి శ్రమకు ఊతమిచ్చేలా... డిఫెండర్లు సౌరభ్ నందల్ (3), ఫజల్ అత్రాచలి (3), సుర్జీత్ సింగ్ (3) సమష్టిగా రాణించారు. ప్రత్యర్థి రెయిడర్లను అద్భుతంగా టాకిల్ చేశారు. బెంగళూరు జట్టులో ఆల్‌రౌండర్ అలీరెజా మిర్జాయిన్ (10), రెయిడర్ ఆశిష్ మలిక్ (8) మెరుగ్గా ఆడారు. అయితే సహచరుల నుంచి సరైన సహకారం లేక బెంగళూరు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడింది. విశాఖ అంచెలో బెంగళూరు బుల్స్ ఇంకా బోణీ కొట్టలేకపోయింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో రెండుసార్లు చాంపియన్ జైపూర్ పింక్‌పాంథర్స్ 39-36తో పట్నా పైరేట్స్‌పై గెలుపొందింది. జైపూర్ రెయిడర్లు నితిన్ కుమార్ (13), అలీ చౌబ్తరష్ (8) క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చారు. పట్నా జట్టులో రెయిడర్లు మణీందర్ సింగ్ (15), సుధాకర్ (9), అయాన్ (6) అద్భుతంగా రాణించినప్పటికీ డిఫెండర్ల వైఫల్యంతో పరాజయం తప్పలేదు. పైరేట్స్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓడింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పుణేరి పల్టన్‌తో బెంగాల్ వారియర్స్; హరియాణా స్టీలర్స్‌తో యు ముంబా తలపడతాయి. 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో ప్రస్తుతం మూడు జట్లు పుణేరి పల్టన్, యూపీ యోధాస్, యు ముంబా జట్లు నాలుగు పాయింట్లతో 'టాప్'లో ఉన్నాయి.


బెంగళూరు బుల్స్ రెయిడర్‌ను పట్టేసిన దబంగ్ ఢిల్లీ ఆటగాళ్లు

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



విజేత ప్రణవ్

ఫుజేరా (యూఏఈ): భారత యువ గ్రాండ్‌మాస్టర్, జూనియర్ ప్రపంచ చాంపియన్ ప్రణవ్ వెంకటేశ్ తన కెరీర్‌లో గొప్ప విజయం సాధించాడు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో జరిగిన ఫుజేరా గ్లోబల్ సూపర్‌స్టార్స్ చెస్ టోర్నీలో తమిళనాడుకు చెందిన 18 ఏళ్ల ప్రణవ్ చాంపియన్‌గా అవతరించాడు. 44 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య స్విస్ ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో ప్రణవ్ అజేయంగా నిలిచాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత ప్రణవ్ ఏడు పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నిహాల్ సరీన్ (భారత్), బొనెల్లి (స్పెయిన్), అల్‌కన్‌టారా (మెక్సికో), అమీన్ తబాతబాయి (ఇరాన్), అలన్ పిచోట్ (స్పెయిన్)లపై గెలుపొందిన ప్రణవ్.. సులేమాన్లి (అజర్‌బైజాన్), సనన్ సుగిరోవ్ (హంగేరి), జేకబ్సన్ (అమెరికా)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు. విజేతగా నిలిచిన ప్రణవ్‌కు 23 వేల డాలర్ల (రూ. 20 లక్షల 23 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

నేడు కొరియాతో భారత్ 'ఢీ'

రాజ్‌గిర్: సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా కప్‌లో విజేతగా నిలిచి ప్రపంచకప్ బెర్త్ సాధించాలని ఆశిస్తున్న భారత్ నేడు కీలకమైన పోరుకు సిద్ధమైంది. బుధవారం జరిగే సూపర్-4 తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాను భారత్ ఢీకొట్టనుంది. ఇప్పటివరకు ఈ టోర్నీలో భారత్ అజేయంగా నిలిచింది. ఇపుడు ఇదే జోరు కొనసాగించి ఐదుసార్లు ఆసియా కప్ విజేత అయిన కొరియాను కంగుతినిపించాలనే పట్టుదలతో భారత్ ఉంది. డిఫెన్స్, మిడ్ ఫీల్డ్, గోల్‌కీపింగ్ పటిష్టంగానే ఉన్నప్పటికీ భారత్ ఆశించిన స్థాయిలో పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచలేకపోతోంది. ఇది మినహా జట్టు ఆటతీరు మెరుగ్గానే ఉంది.

సాక్షి సినిమా


శ్రియ

'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా హిట్ అందుకున్న తేజ సజ్జా హీరోగా నటించిన తాజా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటించారు. మనోజ్ మంచు, జగపతిబాబు, శ్రియ శరణ్, జయరామ్ కీలక పాత్రలు పోషించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్,

అంబిక... చాలా పవర్‌ఫుల్

కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సినిమాలో శ్రియ శరణ్ పోషించిన అంబిక పాత్రని పరిచయం చేస్తూ ఒక ప్రత్యేక పోస్టర్‌ను మంగళవారం విడుదల చేసింది యూనిట్. ''మిరాయ్'లో సూపర్ యోధ పాత్రలో అలరించబోతున్నారు తేజ సజ్జా. ఈ సినిమాలో తేజ తల్లి పాత్రలో పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో నటించారు శ్రియ. ఈ ఎపిక్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ అడ్వెంచర్ మూవీలో ఆమె పాత్ర చాలా స్ట్రాంగ్ ఎమోషన్‌తో ఉంటుంది'' అని మేకర్స్ తెలిపారు.

మిరాయ్ ట్రైలర్ బాగుంది - రజనీకాంత్

''మిరాయ్' సినిమా ట్రైలర్ చాలా బాగుంది'' అని హీరో రజనీకాంత్ పేర్కొన్నారు. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటించిన ఈ సినిమాలో మంచు మనోజ్ విలన్ పాత్ర పోషించారు. సోమవారం ఈ సినిమా ప్రెస్‌మీట్‌ని చెన్నైలో నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌ని కలిసి, 'మిరాయ్' ట్రైలర్ చూపించారు మనోజ్. ''మిరాయ్' ట్రైలర్ చూస్తుంటే సినిమాని గ్రాండ్ స్కేల్‌లో నిర్మించారని తెలుస్తోంది. మనోజ్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉందని అర్థం అవుతోంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి... యూనిట్‌కి అభినందనలు'' అని రజనీకాంత్ పేర్కొన్నారు. ''మిరాయ్' మూవీతో రజనీకాంత్‌గారి ఆశీర్వాదాలు నాకు దక్కడం హ్యాపీగా ఉంది'' అన్నారు మంచు మనోజ్.


ఇంటర్‌నేషనల్ డ్రాగన్


ఎన్టీఆర్

'డ్రాగన్' రేంజ్ గ్లోబల్ లెవల్లో ఉంటుందట. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ సినిమా 'డ్రాగన్' (ప్రచారంలో ఉన్న టైటిల్). ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అక్టోబరులో ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ విదేశాల్లో ప్రారంభం అవుతుందని, ఈ దిశగా చిత్రయూనిట్ ఇప్పట్నుంచే సన్నాహాలు మొదలుపెట్టిందని ఫిల్మ్‌నగర్ టాక్. అంతే కాదు... తన గత చిత్రాలు 'కేజీఎఫ్'లో 'కోలార్ గోల్డ్ ఫీల్డ్', 'సలార్'లో ఖాన్సార్ ప్రాంతాలు ఉన్నట్లే 'డ్రాగన్' సినిమాలో కూడా ఓ కొత్త ప్రపంచాన్ని సృష్టిస్తున్నారట ప్రశాంత్ నీల్. 'కోలార్ గోల్డ్ ఫీల్డ్, ఖాన్సార్'ల ప్రస్తావన ఇండియా వైడ్‌గా ఉంటే, 'డ్రాగన్' చిత్రం కోసం ప్రశాంత్ నీల్ సృష్టిస్తున్న ప్రపంచానికి ఇంటర్‌నేషనల్ టచ్ ఉంటుందట. ఇందుకోసమే ఈ సినిమాను పలు విదేశీ లొకేషన్స్‌లో షూట్ చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోందని భోగట్టా. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో కల్యాణ్‌రామ్, కొసరాజు హరికృష్ణ, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది.

నీతో మాట్లాడాలని...

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఓజీ'. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రంలో ప్రియాంకా మోహన్ హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ రోల్ చేశారు. ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో ఓజాస్ గంభీర (ఓజీ) పాత్రలో పవన్ కల్యాణ్ నటించారు. సుజీత్ దర్శకత్వంలో డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. కాగా మంగళవారం (సెప్టెంబరు 2) పవన్ కల్యాణ్ బర్త్ డే. ఈ సందర్భంగా 'ఓజీ' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో 'డియర్ ఓజీ... నిన్ను కలవాలని... నీతో మాట్లాడాలని... నిన్ను చంపాలని ఎదురుచూస్తున్నా... నీ ఓమీ', 'హ్యాపీ బర్త్ డే ఓజీ' అనే డైలాగ్స్ ఉన్నాయి. ఈ సినిమాకు సంగీతం: తమన్.


పవన్ కల్యాణ్

కళాశాల రోజులు గుర్తొస్తాయి

- శివానీ నాగారం

''లిటిల్ హార్ట్స్' చిత్రంలో కాత్యాయని అనే కాలేజ్ గర్ల్‌గా చేశాను. ప్రేక్షకులు తమని తాము పోల్చుకునేలా నా పాత్ర ఉంటుంది. ఈ సినిమాలోని అఖిల్ (మౌళి తనుజ్ పాత్ర), కాత్యాయని స్నేహం, ప్రేమ చూస్తుంటే కళాశాల రోజులు, అలాగే విద్యార్థిగా మనం చేసిన పనులన్నీ గుర్తొస్తాయి... మేమూ ఇలాగే ఉండేవాళ్లం అనిపిస్తుంది'' అని శివానీ నాగారం తెలిపారు. మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా సాయి మార్తాండ్ దర్శకత్వం వహించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ సినిమాని బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 5న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శివానీ నాగారం మాట్లాడుతూ– ''లిటిల్ హార్ట్స్' సంగీత దర్శకుడు సింజిత్ యెర్రమల్లి, నేను చిన్నప్పటి నుంచి స్నేహితులం. తన ద్వారా ఈ ప్రాజెక్ట్ నా దగ్గరకు వచ్చింది. సాయి మార్తాండ్ కథ, నా పాత్ర చెప్పినప్పుడు ఎగ్జయిటింగ్‌గా అనిపించింది. మంచి కంటెంట్ ఉన్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. పూర్తి వినోదాత్మకంగా సాగుతుంది. మా సినిమా కంటెంట్ నచ్చడంతో 'బన్నీ' వాసు, వంశీ నందిపాటిగార్లు రిలీజ్ చేస్తున్నారు. దాంతో మా సినిమా ఓవర్సీస్‌లోనూ విడుదలవుతోంది. ఇక థియేటర్, ఓటీటీ అనే తేడాలు చూడను. కథ, నా పాత్ర నచ్చితే వెబ్ సిరీస్‌లు కూడా చేస్తాను. 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమా తర్వాత నేను, సుహాస్ కలిసి 'హే భగవాన్' సినిమా చేస్తున్నాం. మరో రెండు చిత్రాలు ఉన్నాయి'' అని పేర్కొన్నారు.





''అనుష్కకి దేశవ్యాప్తంగా మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. తన బలం ఏంటో మనందరికీ తెలుసు. తన చిత్రం బాగుంటే ఆ రేంజ్ ఎలా ఉంటుందో చాలా సినిమాలు నిరూపించాయి. 'అరుంధతి' నుంచి 'భాగమతి' వరకు ఐకానిక్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారామె. 'ఘాటీ' చిత్రంలో తనకి చాలా ఎగ్జయిటింగ్ క్యారెక్టర్ దొరికింది. మేమంతా నమ్మి, ఈ ప్రాజెక్ట్‌ని రాజీ పడకుండా రూపొందించాం. బిజినెస్ కూడా బాగుంది. యూనిట్ అంతా సంతోషంగా ఉన్నాం'' అని క్రిష్ జాగర్లమూడి తెలిపారు. అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటీ'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

కొత్త ప్రపంచాన్ని చూపించాం

- క్రిష్ జాగర్లమూడి

- 'వేదం' సినిమా తర్వాత స్వీటీతో (అనుష్క) మరో సినిమా చేయాలనే ఆలోచన ఉండేది. ఆ చిత్రంలో సరోజ చాలా గొప్ప పాత్ర. ఆ పాత్రని కొనసాగించాలనే ఆలోచన కూడా జరిగింది. అయితే సహజంగా ఉండే ఒక కథ కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'ఘాటీ' సరైన ప్రాజెక్ట్ అనిపించింది. చింతకింది శ్రీనివాసరావు గొప్ప రచయిత. మా కంపెనీలో 'అరేబియన్ కడలి' అనే వెబ్ సిరీస్‌కి కథ, మాటలు రాశారాయన. వేరే కథల గురించి చర్చించుకుంటున్నప్పుడు 'ఘాటీ' గురించి చెప్పారు. ఆంధ్ర– ఒరిస్సా సరిహద్దులో శీలావతి అనే గంజాయి రకం పెరుగుతుంది. దానికోసం ఒక వ్యవస్థ పని చేస్తుంటుంది. వాటిని మోయడానికి కొంతమంది కూలీలు ఉంటారు... వారినే ఘాటీలు అని పిలుస్తారు. లొకేషన్స్ కోసం తూర్పు కనుమలకు వెళ్లాను. అదంతా ఒక కొత్త ప్రపంచం. అక్కడి వారి జీవన శైలి అంతా కొత్తగా ఉంది. ఒక కొత్త ప్రపంచం, సంస్కృతిని చూపించే ఆస్కారం ఉండటంతో 'ఘాటీ' మొదలుపెట్టాం.
- 'ఘాటీ'లో శీలావతి క్యారెక్టర్‌కి అనుష్క గ్రేస్, యాటిట్యూడ్ పర్ఫెక్ట్ యాప్ట్. ఈ చిత్రకథ పూర్తిగా ఫిక్షనల్. గంజాయి అనేది ఒక సామాజిక సమస్య. దాని నిర్మూలనకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే అవన్నీ దాటి గంజాయి అనేది సమాజంలోకి వస్తోంది. దాని ప్రభావాలు చాలా తీవ్రంగా ఉంటాయి. ఐడెంటిటీ, సర్వైవల్ థీమ్స్‌తో వస్తున్న సినిమా 'ఘాటీ'. సామాజిక సమస్యల మీద ప్రభుత్వాలే కాకుండా పౌరులందరూ పోరాడాలి. ఈ చిత్రం మనందరం ఎదుర్కొంటున్న ఒక సమస్య నిర్మూలనకి ఊతమిస్తుంది. ఇందులో చాలా తీవ్రమైన భావోద్వేగాలు ఉంటాయి.
- ఈ సినిమాలో దేశీరాజు పాత్రని రాస్తున్నప్పుడే విక్రమ్ ప్రభుగారిని ఊహించుకున్నాను. ఒక సమూహానికి నాయకుడు లాంటి పాత్ర తనది. ఆయన అద్భుతంగా నటించారు. చైతన్యా రావు నటించిన '30 వెడ్స్ 20' వెబ్ సిరీస్ నచ్చి, మా సినిమాలో విలన్ పాత్రకి తీసుకున్నాను. రవీంద్ర విజయ్ అద్భుతంగా నటించారు. రాజు సుందరం మాస్టర్ కూడా ఓ పాత్ర చేశారు. రాజీవ్ రెడ్డి, సాయిబాబాగార్లు, యూవీ క్రియేషన్స్ విక్కీ–వంశీ–ప్రమోద్... కొత్త సినిమాలు ఇవ్వాలని ప్రయత్నం చేస్తుంటారు. 'ఘాటీ'ని చాలా ప్యాషన్‌తో నిర్మించారు. తూర్పు కనుమల్లోని పర్వత శ్రేణి, ప్రకృతి సౌందర్యాన్ని కెమెరామేన్ మనోజ్‌గారు బాగా చూపించారు. మ్యూజిక్ డైరెక్టర్ సాగర్ సంగీతం బాగుంటుంది... ప్రేక్షకులు చాలా కొత్త రకమైన సౌండ్‌ని అనుభూతి చెందుతారు. సాయి మాధవ్‌గారి మాటలు ప్రేక్షకుల మనసుని సూటిగా తాకుతాయి. ఈ సినిమాలో నేను మూడు పాటలు రాశాను. 'సిరివెన్నెల' సీతారామశాస్త్రిగారి దగ్గర చేసిన శిష్యరికం వల్ల ఆయన ఆశీర్వాదం వల్ల కలం విదిలించా (నవ్వుతూ).

ఆనంద నిలయంలో..?


శ్రీనిధి శెట్టి

హీరో వెంకటేశ్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాలోని నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారట త్రివిక్రమ్. కథ రీత్యా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉంటారని, ఒక హీరోయిన్‌గా శ్రీనిధి శెట్టిని సంప్రదించారని సమాచారం. కథానాయికగా ఆమె దాదాపు ఖరారు అయ్యారట. ఇక వైజాగ్ నేపథ్యంలో సాగే ఈ సినిమాకు 'వెంకటరమణ: కేరాఫ్ ఆనంద నిలయం' అనే టైటిల్‌ను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి... ఆనంద నిలయంలో 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి భాగం అయ్యారా? వేచి చూడాల్సిందే.

సాక్షి బిజినెస్
బుధవారం
3-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
207	45
80,158	24,580

విదేశీ సూచీలు

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	21,204	▽ 251
డోజోన్స్	45,204	▽ 341
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,123	▽ 73
డాక్స్	23,512	▽ 525
హాంగ్‌సెంగ్	3,858	▽ 17
నికాయ్	42,310	△ 122

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	87.70	88.72
£	బ్రిటన్ పౌండ్	117.80	120.81
€	యూరో	101.80	104.59
¥	జపాన్ యెన్ (100)	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	54.89	58.75
S$	సింగపూర్ డాలర్	66.07	69.80
SAR	సౌదీ రియాల్	22.62	24.12
UAE D	యూఏఈ దిర్హామ్	23.11	24.37
¥	చైనా యువాన్	11.46	13.29

జీఎస్‌టీ కీలక భేటీ నేటి నుంచి

- రెండు రోజుల పాటు సమావేశం
- పన్ను శ్లాబుల క్రమబద్ధీకరణపై నిర్ణయం



న్యూఢిల్లీ: జీఎస్‌టీ కౌన్సిల్ రెండు రోజుల సమావేశం బుధవారం ప్రారంభం కానుంది. జీఎస్‌టీలో ఇప్పుడున్న 5, 12, 18 28 శాతం శ్లాబుల స్థానంలో 5, 18 శాతం శ్లాబులను కొనసాగించి, మిగిలిన వాటిని ఎత్తేయాలన్నది కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదన. 12, 28 శాతం శ్లాబుల్లో ఉన్న వాటిని 5, 18 శాతం శ్లాబుల్లోకి సర్దుబాటు చేయనున్నారు. సిగరెట్, గుట్కాలు, విలాసవంతమైన కొన్ని వస్తువులపై మాత్రం 40 శాతం ప్రత్యేక పన్ను రేటును అమలు చేయాలన్నది ప్రతిపాదన. దీనికి జీఎస్‌టీ మంత్రుల బృందం ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేయగా.. జీఎస్‌టీ మండలి దీనిపై నిర్ణయం తీసుకోనుంది. 3, 4వ తేదీల్లో జరిగే జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షత వహించనున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ వాహన (ఈవీలు) కొనుగోలును ప్రోత్సహించేందుకు వీలుగా వాటిని 5 శాతం రేటు పరిధిలోకి తీసుకొచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. శ్లాబుల తగ్గింపుతో చాలా ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. దీన్ని విపక్ష పాలిత రాష్ట్రాలు ఆహ్వానిస్తూనే.. ఆదాయ నష్టం ఏర్పడితే కేంద్రం భర్తీ చేయాలని కోరుతుండడం గమనార్హం. 2017 జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా జీఎస్‌టీ అమల్లోకి వచ్చింది. అప్పట్లో జీఎస్‌టీలోకి మారడం కారణంగా రాష్ట్రాలకు ఏర్పడే ఆదాయ నష్టాన్ని భర్తీ చేసేందుకు వీలుగా కాంపెన్సేషన్ సెస్సు (1–290 శాతం మధ్య)ను విలాసవంత, హానికారక వస్తువులపై అమలు చేస్తున్నారు. దీని గడువు 2026 మార్చితో ముగిసిపోనుంది. ఆ తర్వాత కొనసాగించకూడదన్నది కేంద్రం ఉద్దేశమని తెలుస్తోంది.

ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహం: ఎలక్ట్రిక్ వాహనాలపై (రూ.10 లక్షల వరకు) 18 శాతం జీఎస్‌టీకి మంత్రుల బృందం సానుకూలంగా ఉంది. కానీ, మరింత మంది ఈవీలను కొనుగోలు చేసేందుకు వీలుగా 5 శాతం రేటుకు కేంద్ర ప్రభుత్వం అనుకూలంగా ఉందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. నెయ్యి, నట్స్, తాగు నీరు (20 లీటర్ల క్యాన్‌లు), నమ్‌కీన్, కొన్ని రకాల పాదరక్షలు, దుస్తులు, మందులు, వైద్య పరికరాలను 12 శాతం నుంచి 5 శాతం రేటు కిందకు మార్చే అవకాశం ఉంది. పెన్సిళ్లు, సైకిళ్లు, గొడుగులను సైతం తక్కువ రేటు శ్లాబులోకి తీసుకురానున్నారు. కొన్ని రకాల టీవీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు, కొన్ని రకాల వాహనాలను 28% నుంచి 18% రేటులోకి తీసుకురానున్నట్టు తెలుస్తోంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
ఐపీవోలకు కంపెనీల క్యూ..!	మరో కొత్త గరిష్టానికి బంగారం

అక్టోబర్ 9 నుంచి బడ్జెట్ కసరత్తు ప్రారంభం



న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖ 2026–27 బడ్జెట్ రూపకల్పన కసరత్తును అక్టోబర్ 9 నుంచి ప్రారంభించనుంది. ఒకవైపు అమెరికా 50 శాతం టారిఫ్ రేటును అమలు చేస్తుండడం, అంతర్జాతీయ వాణిజ్య ధోరణుల్లో మార్పుల నేపథ్యంలో తీసుకురానున్న ఈ బడ్జెట్‌లో కేంద్రం ఏవైనా కీలక సంస్కరణలను ప్రతిపాదిస్తుందేమో చూడాల్సి ఉంది. ముఖ్యంగా దేశీ డిమాండ్‌కు మరింత ఊతమివ్వడం, ఉపాధి కల్పనను విస్తృతం చేయడం ద్వారా జీడీపీ వృద్ధి రేటును 8 శాతానికి పెంచాల్సిన ఆవశ్యకత కేంద్రం ముందుంది. ఆర్థిక శాఖ వ్యయ విభాగం కార్యదర్శి అధ్యక్షతన బడ్జెట్ ముందస్తు సమావేశాలు అక్టోబర్ 9 నుంచి మొదలవుతాయంటూ ఆర్థిక వ్యవహారాల శాఖ బడ్జెట్ సర్క్యులర్‌లో పేర్కొంది. సమావేశాలు ముగిసిన అనంతరం 2026–27 బడ్జెట్ అంచనాలను ఆర్థిక శాఖ ఖరారు చేస్తుంది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను 2026 ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

ప్రపంచాన్ని మార్చే భారత్ చిప్!

- అది ఎంతో దూరంలో లేదు
- తదుపరి దశ సెమీకండక్టర్ మిషన్ రెడీ..
- చిప్స్.. డిజిటల్ డైమండ్స్
- సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: భారత్‌లో తయారైన ఓ చిన్న చిప్ ప్రపంచంలో పెద్ద మార్పును తీసుకొస్తుందని, అది ఎంతో దూరంలో లేదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సును ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడారు. భారత్‌లో రూపుదిద్దుకుని, భారత్‌లో తయారైందంటూ ప్రపంచమంతా మర్మోగే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. 18 బిలియన్ డాలర్ల విలువ చేసే 10 సెమీకండక్టర్ ప్రాజెక్టులు ప్రస్తుతం అమలు దశలో ఉన్నాయంటూ.. తదుపరి దశ భారత సెమీకండక్టర్ మిషన్ దిశగా అడుగులు వేస్తున్నట్టు ప్రకటించారు. ట్రిలియన్ డాలర్ల అంతర్జాతీయ చిప్ మార్కెట్లో స్థానాన్ని సంపాదించడమే భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. వివిధ దేశాలకు చెందిన సెమీకండక్టర్ నిపుణులు, 50 దేశాల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో భారత యువ శక్తి, ఆవిష్కరణలు ప్రస్ఫుటమవుతున్నట్టు ప్రధాని వ్యాఖ్యానించారు. భారత్‌ను ప్రపంచం విశ్వసిస్తున్నట్టు ఇది స్పష్టమైన సంకేతం పంపిస్తుందన్నారు. భారత్‌తో కలసి సెమీకండక్టర్ భవిష్యత్ నిర్మాణానికి ప్రపంచం సుముఖంగా ఉన్నట్టు చెప్పారు.

డిజిటల్ డైమండ్స్...

చిప్‌లపై ప్రధాని మోదీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''ఆయిల్ అన్నది నల్ల బంగారం. కానీ చిప్‌లు అన్నవి డిజిటల్ వజ్రాలు''అని పేర్కొన్నారు. చమురు గత శతాబ్దాన్ని మలుపు తిప్పగా, 21వ శతాబ్దాన్ని చిన్న చిప్‌లు నడిపించనున్నట్టు చెప్పారు. పరిమాణంలోనే చిన్నవే అయినా ప్రపంచ పురోగతిని వేగవంతం చేస్తాయని అభిప్రాయపడ్డారు. నోయిడా, బెంగళూరులో ఏర్పాటు చేసిన డిజైన్ కేంద్రాలు ప్రపంచంలోనే అత్యాధునికమైన చిప్‌ల అభివృద్ధిపై పనిచేస్తున్నాయని, అవి బిలియన్ల లావాదేవీలను నిల్వ చేయగలవన్నారు. ''ప్రస్తుతం ప్రపంచ సెమీకండక్టర్ మార్కెట్ 600 బిలియన్ డాలర్లుగా ఉంటే, రానున్న సంవత్సరాల్లో ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. సెమీకండక్టర్ రంగంలో సాధిస్తున్న పురోగతి దృష్ట్యా భవిష్యత్తులో ట్రిలియన్ డాలర్ల మార్కెట్లో భారత్ చెప్పుకోతగ్గ వాటాను సొంతం చేసుకుంటుంది''అని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ పెద్ద హృదయంతో ఇన్వెస్టర్లకు ఆహ్వానం పలుకుతున్నట్టు ప్రకటించారు. భారత విధానాలు స్వల్పకాలం కోసం కాదంటూ ప్రతి ఇన్వెస్టర్ అవసరాలకు అనుగుణంగా ఉంటాయన్నారు. సెమీకండక్టర్ రంగంలో వేగం ముఖ్యమంటూ.. దరఖాస్తు నుంచి ఫ్యాక్టరీ నిర్మాణం వరకు పేపర్ పని తక్కువగా ఉంటే వేఫర్ తయారీ వేగంగా సాధ్యపడుతుందని చెప్పారు. ప్రభుత్వం ఇదే ధోరణితో పనిచేస్తున్నట్టు తెలిపారు. జాతీయ స్థాయిలో సింగిల్ విండో ద్వారా అన్ని అనుమతులను ఇస్తున్నట్టు చెప్పారు. వెంటనే కార్యకలాపాలు ప్రారంభించేందుకు వీలుగా దేశవ్యాప్తంగా సెమీకండక్టర్ పార్క్‌లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. భూమి, విద్యుత్, పోర్ట్, ఎయిర్‌పోర్ట్‌లతో అనుసంధానత, నిపుణులైన మానవవనరులు ఇలా అన్ని అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. వీటితో పారిశ్రామికవృద్ధి వేగవంతం అవుతుందన్నారు. సీజీ పవర్‌కు చెందిన సెమీకండక్టర్ పైలట్ ప్లాంట్ ఆగస్ట్ 28న కార్యకలాపాలు మొదలు పెట్టిందని, కేనెస్ టెక్నాలజీ ప్లాంట్ పైలట్ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్టు చెప్పారు. మైక్రాన్ టెక్నాలజీ, టాటా ఎలక్ట్రానిక్స్ ఇప్పటికే తయారీ కార్యకలాపాలు మొదలు పెట్టాయని, వాణిజ్య చిప్ ఉత్పత్తి ఈ ఏడాదే మొదలవుతుందని ప్రధాని ప్రకటించారు.



విక్రమ్.. తొలి మేడిన్ ఇండియా చిప్

భారత్‌లో రూపుదిద్దుకుని, ఇక్కడే తయారైన విక్రమ్ 32 బిట్ మైక్రో ప్రాసెసర్‌తో పాటు ఇతర టెస్ట్ చిప్‌లను ప్రధాని మోదీకి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వని వైష్ణవ్ ఇదే కార్యక్రమంలో అందజేశారు. ఈ తొలి మేడిన్ ఇండియా చిప్ విక్రమ్‌ను ఇస్రో సెమీకండక్టర్ ల్యాబ్ అభివృద్ధి చేసింది. కఠినమైన ఉపగ్రహ ప్రయోగ పరిస్థితుల్లోనూ వినియోగించేందుకు అనుకూలంగా రూపొందించారు. సెమీకండక్టర్ మిషన్ ప్రారంభించిన మూడున్నరేళ్లలోనే ప్రపంచం భారత్‌వైపు చూసేలా పురోగతి సాధించినట్టు మంత్రి అశ్వని వైష్ణవ్ పేర్కొన్నారు.

మెర్క్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ జత



సెమీకండక్టర్ మెటీరియల్ టెక్నాలజీ దిగ్గజం మెర్క్ ఎలక్ట్రానిక్స్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తద్వారా గుజరాత్‌లోని ధోలెరాలో ఏర్పాటు చేస్తున్న చిప్ ప్లాంటుకి అవసరమైన పూర్తిస్థాయి ప్రొడక్టులు, సర్వీసులను ఔట్‌సోర్సింగ్ చేసుకోనుంది. దీనిలో భాగంగా హైప్యూరిటీ ఎలక్ట్రానిక్ మెటీరియల్స్, అడ్వాన్స్‌డ్ గ్యాస్, కెమికల్ డెలివరీ సిస్టమ్స్ తదితరాలను సమకూర్చుకోనుంది. 2025 సెమీకాన్ ఇండియా సదస్సు సందర్భంగా కేంద్ర ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమక్షంలో రెండు సంస్థలు అవగాహన ఒప్పందాన్ని (ఎంవోయూ) కుదుర్చుకున్నాయి.

ఐఎస్ఎం 2.0తో మద్దతు

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం) రెండో వెర్షన్‌లో (2.0) చిప్‌ల తయారీ ప్రాజెక్టులతో పాటు సెమీకండక్టర్ల ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే భాగస్వామ్య సంస్థలకూ తగిన ప్రోత్సాహకాలు లభిస్తాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఎక్విప్‌మెంట్, మెటీరియల్స్ తయారీ సంస్థలతో పాటు వ్యవస్థలోని అన్ని విభాగాలకు గణనీయంగా మద్దతు అందిస్తామని పేర్కొన్నారు. 'ఆటోమోటివ్, పవర్ ఎలక్ట్రానిక్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, వైద్య, రక్షణ తదితర విభాగాలన్నింటికీ తోడ్పాటునివ్వాల్సిన అవసరం ఉంది. తదుపరి విడతలో సింహభాగం వాటా ప్రొడక్టుల అభివృద్ధికి ఉంటుంది' అని మంత్రి చెప్పారు.

వివిధ స్కీముల ద్వారా డిజైన్ ప్రాజెక్టులకు సంబంధించి 278 వర్సిటీలకు అత్యాధునిక ఈడీఏ (ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్) సాధనాలను అందించామని సెమీకాన్ ఇండియా 2025లో పాల్గొన్న సందర్భంగా మంత్రి తెలిపారు. 60,000 పైచిలుకు ఇంజినీరింగ్ విద్యార్థులు వీటితో 1.3 కోట్ల గంటలు పని చేసినట్లు వివరించారు. రూ. 76,000 కోట్లతో ఐఎస్ఎం తొలి విడతను ప్రకటించగా అందులో రూ. 65,000 కోట్లను చిప్‌ల ఉత్పత్తికి, రూ. 10,000 కోట్ల మొత్తాన్ని మొహాలీలో సెమీకండక్టర్ ల్యాబొరేటరీని ఆధునీకరించడానికి, రూ. 1,000 కోట్లను డిజైన్ ఆధారిత ప్రోత్సాహక స్కీముకు కేటాయించారు. ప్రస్తుతం ఐఎస్ఎం రెండో విడతపై కసరత్తు జరుగుతోంది.

మరోవైపు, కీలకమైన సెమీకండక్టర్ల ఉత్పత్తి ప్రాజెక్టులకు సంబంధించి మొత్తం వ్యయాల్లో 70 శాతం వాటా ఇకపైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రోత్సాహకాలుగా లభించే అవకాశం ఉందని ఎలక్ట్రానిక్స్, ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ తెలిపారు. సెమీకండక్టర్ ప్రాజెక్టులకు భారత్ అసాధారణ స్థాయిలో మద్దతు అందిస్తోందని, 30 బిలియన్ డాలర్ల విలువ చేసే ప్రోత్సాహకాలు.. ఇతరత్రా ప్రయోజనాలు కల్పిస్తోందని వివరించారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

బెస్ట్ బీ స్కూల్స్‌కు మరో మార్గం..

ఎక్స్‌ఏటీ

» ఎక్స్‌ఏటీ 2026 నోటిఫికేషన్ విడుదల
» 250కు పైగా బీస్కూల్స్‌లో అడ్మిషన్స్



దేశంలోని ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశాలకు మరో చక్కటి మార్గం.. ద జేవియర్ అప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ).ప్రతిష్టాత్మక బీస్కూల్స్ ఐఐఎంల్లో ప్రవేశాలకు నిర్వహించే క్యాట్ తర్వాత అంతటి ప్రాధాన్యం ఉన్న పరీక్ష ఇది. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎక్స్‌ఏటీ స్కోర్‌తో ఎంబీఏ, పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ- జంషెడ్‌పూర్ ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఇటీవల ఎక్స్‌ఏటీ 2026 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. ఈ పరీక్షతో ప్రయోజనాలు, దరఖాస్తుకు అర్హతలు, పరీక్ష విధానం తదితర వివరాలు..

దేశంలోని ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఒకటి జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఎక్స్‌ఎల్‌ఆర్‌ఐ జంషెడ్‌పూర్). దీనితోపాటు అనుబంధ బీస్కూల్స్‌లో ప్రవేశాలకు ఎక్స్‌ఏటీ స్కోర్ తప్పనిసరి. అదేవిధంగా మరో 250కు పైగా మేనేజ్‌మెంట్ కాలేజీలు సైతం ఎంబీఏ, పీజీడీఎం కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్ష స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

అర్హతలు

ఏదైనా విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అర్హత పరీక్ష ఫైనల్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రవేశ విధానం

ఆయా బీస్కూల్స్ ఎక్స్‌ఏటీ స్కోర్‌తోపాటు గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తాయి.

పరీక్ష విధానం

వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 26 ప్రశ్నలు, డెసిషన్ మేకింగ్ 21, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ 28, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి 20 ప్రశ్నలు అడుగుతారు. మొత్తం 95 ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం 180 నిమిషాలు.

వెర్బల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ విభాగంలో..క్రిటికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్,రీడింగ్ కాంప్రెహెన్షన్(పోయమ్స్, కార్టూన్‌లు, ప్యాసేజెస్‌లు సహా), వొకాబ్యులరీ, గ్రామర్, పారాజంబుల్స్, క్లోజ్ టెస్టు వంటి అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.

డెసిషన్ మేకింగ్ విభాగంలో.. వ్యక్తిగత, వృత్తిగత జీవిత ఘటనల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్‌ను ఉపయోగించి సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది.

క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్ విభాగంలో.. స్కోర్ కోసం అభ్యర్థి అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మెన్సురేషన్, మోడ్రన్ మ్యాథ్స్‌పై పట్టు పెంచుకోవాలి. డేటా ఇంటర్‌ప్రిటేషన్ నుంచి అడిగే ప్రశ్నలు స్పష్టమైన ఇంటర్‌ప్రిటేషన్, సమ్మరైజేషన్, విశ్లేషణ ఆధారంగా సమాధానాలు గుర్తించేలా ఉంటాయి.

జనరల్ నాలెడ్జ్ విభాగంలో.. 8 ప్రశ్నలు స్టాటిక్ జీకే నుంచి, మిగతా 12 ప్రశ్నలు కరెంట్ అఫైర్స్ నుంచి అడుగుతారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులకు చివరి తేది: 05.12.2025
» అడ్మిట్‌కార్డ్ డౌన్‌లోడ్: 20.12.2025
» పరీక్ష తేది: 04.01.2026
» తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, రాజమహేంద్రవరం, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ.
» వెబ్‌సైట్: https://xatonline.in

జాబ్ పాయింట్

ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో 102 గ్రేడ్ ఏ, బీ, సీ పోస్టులు

దులియాజన్(అస్సాం)లోని ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లో.. గ్రేడ్ ఏ, బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 102.
» పోస్టుల వివరాలు: సూపరింటెండింగ్ ఇంజనీర్ (గ్రేడ్ సి)–03, సీనియర్ ఆఫీసర్(గ్రేడ్ బి)–97, కాన్ఫిడెన్షియల్ సెక్రటరీ(గ్రేడ్ ఏ)–01, హిందీ ఆఫీసర్ (గ్రేడ్ ఏ)–01.
» విభాగాలు: ప్రొడక్షన్, అఫిషియల్ లాంగ్వేజ్, కెమికల్, సివిల్, ఎలక్ట్రికల్, పెట్రోలియం, మెకానికల్, ఐటీ, ఫైర్ అండ్ సేఫ్టీ, పబ్లిక్ అఫైర్స్, హెచ్‌ఆర్, లీగల్, జియాలజీ, జియోఫిజిక్స్, హెల్త్ సేఫ్టీ ఇన్విరాన్‌మెంట్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, అకౌంట్స్ అండ్ ఆడిట్, కంపెనీ సెక్రటరీ, సెక్యూరిటీ మొదలైనవి.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/పీజీ, ఎంబీఏ/పీజీడీఎం, సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వేతనం: నెలకు గ్రేడ్ సి పోస్టుకు రూ.80,000 నుంచి రూ.2,20,000, గ్రేడ్ బి పోస్టుకు రూ.60,000 నుంచి రూ.1,80,000, గ్రేడ్ ఏ పోస్టుకు రూ.50,000 నుంచి రూ.1,60,000.
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 26.09.2025.
» సీబీటీ రాతపరీక్ష తేది: 01.11.2025.
» వెబ్‌సైట్: https://www.oil-india.com

పీజీసీఐఎల్‌లో 1543 ఫీల్డ్ ఇంజనీర్, సూపర్‌వైజర్ పోస్టులు

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) ..ఒప్పంద ప్రాతిపదికన ఫీల్డ్ ఇంజనీర్, ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 1543.
» పోస్టుల వివరాలు: ఫీల్డ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–532, ఫీల్డ్ ఇంజనీర్ (సివిల్)–198, ఫీల్డ్ సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్)–535, ఫీల్డ్ సూపర్‌వైజర్(సివిల్)–193, ఫీల్డ్ సూపర్‌వైజర్ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)–85.
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, డిప్లొమా, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» వయసు: 17.09.2025 నాటికి 29 ఏళ్లు మించకూడదు.
» పే స్కేల్: నెలకు ఫీల్డ్ ఇంజనీర్‌కు రూ.30,000 నుంచి రూ.1,20,000, ఫీల్డ్ సూపర్‌వైజర్‌కు రూ.23,000 నుంచి రూ.1,05,000.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 17.09.2025.
» పరీక్ష తేది: వెబ్‌సైట్‌లో త్వరలో ప్రకటిస్తారు.
» పరీక్ష కేంద్రాలు: ఢిల్లీ, భోపాల్, కోల్‌కతా, బెంగళూరు, గువాహటి, ముంబై.
» వెబ్‌సైట్: https://www.powergrid.in

ఐవోసీఎల్‌లో 537 అప్రెంటిస్‌లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్).. దేశవ్యాప్తంగా వివిధ రీజియన్లలో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 537.
» ఖాళీల వివరాలు: ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్–156, వెస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్–152, నార్తర్న్ రీజియన్ పైప్‌లైన్స్–97, సధరన్ రీజియన్ పైప్‌లైన్స్–47, సౌత్ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్–85.
» అర్హత: పదో తరగతి, సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, ఇంటర్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 18 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 29.08.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 18.09.2025.
» వెబ్‌సైట్: https://iocl.com

ఆర్‌సీఎఫ్‌ఎల్‌లో 325 అప్రెంటిస్‌లు

రాష్ట్రీయ కెమికల్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఆర్‌సీఎఫ్‌ఎల్) ముంబై, రాయ్‌గఢ్ యూనిట్లలో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 325.
» ఖాళీల వివరాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–115, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు–114, ట్రేడ్ అప్రెంటిస్‌లు–96.
» అర్హత: ఇంటర్మీడియట్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ/బీఎస్సీ ఉత్తీర్ణతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.
» స్టైపెండ్: నెలకు టెక్నీషియన్ ఒకేషనల్ లేదా ఒకేషనల్ సర్టిఫికేట్ అభ్యర్థులకు రూ.7000, టెక్నీషియన్ డిప్లొమా అభ్యర్థులకు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ అభ్యర్థులకు రూ.9000.
» వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: విద్యార్హతలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 29.08.2025.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 12.09.2025.
» వెబ్‌సైట్: https://www.rcfltd.com

ఎయిమ్స్ రాయ్‌పూర్‌లో 17 పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) రాయ్‌పూర్‌లో ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఫిజిసిస్ట్, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 17.
» పోస్టుల వివరాలు: రేడియేషన్ ఆంకాలజీ–08, న్యూక్లియర్ మెడిసిన్–09.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఇంటర్, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: న్యూక్లియర్ మెడికల్ ఆంకాలజిస్ట్‌కు 35 ఏళ్లు, మెడికల్ ఫిజిసిస్ట్‌కు 40 ఏళ్లు.
» వేతనం: నెలకు మెడికల్ ఫిజిసిస్ట్‌కు రూ.85,000, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్‌కు రూ.45,000.
» దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రిక్రూట్‌మెంట్ సెల్, రెండో ఫ్లోర్, మెడికల్ కాలేజ్ బిల్డింగ్, గేట్ నెం–5, ఎయిమ్స్ రాయ్‌పూర్, జీ.ఈ.రోడ్, తాటిబంద్, రాయ్‌పూర్–492099 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 15.09.2025.
» వెబ్‌సైట్: www.aiimsraipur.edu.in

దక్షిణ రైల్వేలో 3,518 అప్రెంటిస్‌లు

దక్షిణ రైల్వే చెన్నై వివిధ విభాగాల్లో యాక్ట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 3,518.
» ఖాళీల వివరాలు: క్యారేజ్ అండ్ వ్యాగన్స్ వర్క్స్, పెరంబూరు–1394, సెంట్రల్ వర్క్‌షాప్, గోల్డెన్ రాక్–857, సిగ్నల్ అండ్ టెలికమ్ వర్క్‌షాప్ యూనిట్స్, పొడనూర్, కోయంబత్తూర్–1267.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.01.2025 నాటికి 15 నుంచి 24 ఏళ్లు ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.6000 నుంచి రూ.7000.
» ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మెరిట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 25.09.2025.
» వెబ్‌సైట్: https://sr.indianrailways.gov.in

ఇండియన్ నేవీలో 260 ఆఫీసర్ ఉద్యోగాలు

కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీ (ఐఎన్ఏ)లో 2026, జూన్ నుంచి ప్రారంభమయ్యే షార్ట్ సర్వీస్ కమిషన్(ఎస్ఎస్‌సీ) కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి ఇండియన్ నేవీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అర్హత,ఆసక్తి గల అభ్యర్థులు సెప్టెంబర్ 8వ తేదీలోగా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.

» షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఆఫీసర్:
» మొత్తం ఖాళీలు: 260.

బ్రాంచీల వారీగా..

ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్ (జీఎస్ (ఎక్స్)/ హైడ్రో కేడర్)–57, పైలట్– 24, నావల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్ (అబ్జర్వర్స్)– 20, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్– 20, లాజిస్టిక్స్–10, నావల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టరేట్ కేడర్–20, లా–02, ఎడ్యుకేషన్–15, ఇంజినీరింగ్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్)–36, ఎలక్ట్రికల్ బ్రాంచ్ (జనరల్ సర్వీస్)–40, నావల్ కన్‌స్ట్రక్టర్–16

అర్హత

పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీకాం, బీఈ, బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ, లా డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక/ వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి

02.07.2001 నుంచి 01.01.2007 మధ్య జన్మించిన అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.

» వేతనం: నెలకు రూ.1,10,000.
» ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్యసమాచారం

» దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» దరఖాస్తులు ప్రారంభ తేదీ: 09.08.2025.
» దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025.
» వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-జాగ్రఫీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-మెంటల్ ఎబిలిటీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

టీవీలో సంతూర్ సబ్బు ప్రకటన గుర్తుందా.. ఓ పాప మమ్మీ అంటూ పరుగెత్తుకుంటూ తల్లి దగ్గరకు రావడం.. బిడ్డకు తల్లి అయినా వయసు కనిపించడం లేదన్నట్టు ఆ నటుడు ఆశ్చర్యపోవడం! వయసును ఓడించడం ప్రకటనల్లోనే కాదు, నిజ జీవితంలోనూ సాధ్యమేనట! విటమిన్ డి సప్లిమెంట్లను నిత్యం తీసుకోవడం ద్వారా వృద్ధాప్యం దరిచేరదని తాజా పరిశోధనలో తేలింది.

2,000 ఐయూ మోతాదులో విటమిన్–డి3

రోజూ తీసుకుంటే యవ్వనంతో ఉండొచ్చు


హార్వర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధనలో వెల్లడి

వృద్ధాప్యాన్ని డీ కొట్టొచ్చు!?

ప్రతిరోజూ 2,000 ఐయూ (ఇంటర్నేషనల్ యూనిట్స్) మోతాదులో విటమిన్–డీ3 తీసుకుంటే 'టెలోమియర్స్' ఆరోగ్యంగా ఉంటాయని తాజా పరిశోధన వెల్లడించింది. అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ, మరికొన్ని సంస్థలు సంయుక్తంగా చేపట్టిన అధ్యయనం అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైంది. పరిశోధకులు మొత్తం 1,054 మందిపై 5 ఏళ్లపాటు అధ్యయనం చేశారు. వీరిలో 55 ఏళ్లకుపైబడిన మహిళలు, 50–55 ఏళ్ల పురుషులు ఉన్నారు. పరిశోధన ప్రారంభంలో, అలాగే రెండు, నాలుగు సంవత్సరాల తర్వాత వారి టెలొమియర్స్‌ను కొలిచారు. సగం మందికి రోజుకు 2,000 ఐయూ విటమిన్–డీ3 ఇచ్చారు. మిగిలిన సగం మందికి ఎలాంటి విటమిన్ ఇవ్వలేదు. విటమిన్–డి గ్రూపులోని వ్యక్తుల్లో టెలొమియర్స్ సురక్షితంగా ఉన్నట్టు ఫలితాలు వచ్చాయి.

విటమిన్–డీ ఎందుకంటే..

ఎముకల ఆరోగ్యానికి విటమిన్–డీ చాలా అవసరమని అందరికీ తెలిసిందే. ఇది మన శరీరం కాల్షియంను గ్రహించడంలో సహాయపడుతుంది. వయసుతో సంబంధం లేకుండా ఎముకలు దృఢంగా తయారు కావడానికి, ఆరోగ్యంగా ఉండేందుకు ఈ విటమిన్ తగినంత స్థాయిలో అవసరం. రోగనిరోధక వ్యవస్థను సైతం ఇది బలంగా చేస్తుంది. విటమిన్–డి సప్లిమెంట్లు శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను తగ్గించగలవని అధ్యయనంలో తేలింది. రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, కణజాలాలు గట్టిపడడం వంటి ఆటో ఇమ్యూన్ వ్యాధులను నివారించడంలో ఇది సహాయపడుతుందని ప్రారంభ పరిశోధనలు సూచిస్తున్నాయి. శరీరంలోని వాపు ఉంటే టెలొమియర్స్‌ను దెబ్బతీస్తుంది. ఆ వాపును విటమిన్–డి తగ్గిస్తుంది.



ఇంతకీ మోతాదు ఎంత?

విటమిన్–డి ఎంత మోతాదులో తీసుకోవాలన్న అంశంపై ఏకాభిప్రాయం లేదు. హార్వర్డ్ పరిశోధకులు రోజుకు 2,000 ఐయూ మోతాదు ఉపయోగించారు. 70 ఏళ్లలోపు వారికి 600 ఐయూ, ఆపైబడి వయసున్న వృద్ధులకు సిఫార్సు చేసిన 800 ఐయూ కంటే ఇది చాలా ఎక్కువ మోతాదు. అయితే ఇతర పరిశోధనలు కేవలం 400 ఐయూ మోతాదులో రోజూ తీసుకుంటే జలుబును నివారించడంలో సహాయపడతాయని సూచిస్తున్నాయి. ఇప్పటికే శరీరంలో ఉన్న విటమిన్–డి స్థాయిలు, మొత్తం పోషకాహారం, ఇతర పోషకాలతో ఈ విటమిన్ ఎలా కలిసిపోతుందో వంటి అంశాలపై 'సరైన మోతాదు' ఆధారపడి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

తొందరపాటు చర్య!

తాజా పరిశోధనలు ఉత్తేజకరంగా ఉన్నప్పటికీ.. వృద్ధాప్యాన్ని నెమ్మదింపజేయాలనే ఆశతో అధిక మోతాదులో విటమిన్–డి తీసుకోవడం తొందరపాటు చర్యగా కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, కంటి నిండా నిద్ర, ధూమపానం చేయకపోవడం, ఒత్తిడిని జయించడం వంటివి ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి దోహదపడతాయన్నది వారి మాట. ఇవన్నీ సహజంగా టెలొమియర్స్ ఆరోగ్యానికీ తోడ్పడతాయి. అయితే విటమిన్–డి లోపం ఉన్నా, ఎముకల ఆరోగ్యం సరిగా లేకున్నా సప్లిమెంట్లు తీసుకోవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. మొక్కల నుంచి వచ్చే ఆహారాల్లో లభించే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ (వాపు తగ్గించే) సమ్మేళనాలు టెలొమియర్స్‌ను ఆరోగ్యంగా ఉంచుతాయని గతంలో చేపట్టిన పలు అధ్యయనాల్లో తేలింది. అయితే ఆరోగ్యకరమైన బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ), సామాజిక సత్సంబంధాలు కూడా టెలొమియర్స్‌ను రక్షించడంలో సహాయపడతాయి.

సూర్యరశ్మితోనే..: ఎముకల ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, కండరాల పనితీరు, మానసిక ఆరోగ్యానికి అవసరమైన కీలకమైన పోషకం విటమిన్ డి. ఇది సూర్యరశ్మి నుంచే 80 శాతం వరకు లభిస్తుంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

చంపేస్తానని బెదిరించారు

గవర్నర్ జిష్ణుదేవ్ కుమారుడిపై ఫిర్యాదు చేసిన త్రిపుర ఎమ్మెల్యే రెయాంగ్

అగర్తల: తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కుమారుడు పతిక్ దేవ్ వర్మపై త్రిపుర ఎమ్మెల్యే ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను, తన కుటుంబాన్ని జిష్ణుదేవ్ వర్మ కుమారుడు పతిక్ దేవ్ వర్మ చంపుతానని బెదిరించినట్లు తిప్ర మోత పార్టీ (టీఎంపీ) ఎమ్మెల్యే ఫిలిప్ రెయాంగ్ అగర్తలలోని న్యూ క్యాపిటల్ కాంప్లెక్స్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఖజూర్ బగాన్ ప్రాంతంలో ఉన్న ఎమ్మెల్యే హాస్టల్‌లో సోమవారం రాత్రి పతిక్ దేవ్ వర్మ మరో ఇద్దరితో కలిసి వచ్చి అకారణంగా తనతో గొడవ పడ్డారని ఫిలిప్ తెలిపారు. 'హాస్టల్‌లోని నా క్వార్టర్ సమీపంలో మెట్ల వద్ద మా కుటుంబ సభ్యులం మాట్లాడుకుంటుండగా బీజేపీ ఎమ్మెల్యే ప్రమోద్ రెయాంగ్ క్వార్టర్స్ నుంచి పతిక్, మరో ఇద్దరు వ్యక్తులు బయటకు వచ్చి మాతో వాగ్వాదానికి దిగారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని నేను కోరితే.. వాళ్లు మరింత రెచ్చిపోయి బూతులు తిట్టారు. నా గొంతు కోస్తామని బెదిరించారు. 500 మంది బీజేపీ కార్యకర్తలను తీసుకొచ్చి నాతోపాటు నా కుటుంబాన్నంతటినీ చంపేస్తామని హెచ్చరించారు. దీంతో మా ప్రాణాలు కాపాడుకొనేందుకు మరో టీఎంపీ ఎమ్మెల్యే బిశ్వజిత్ కలాయ్ క్వార్టర్స్‌లో తలదాచుకున్నాం. ఈ గొడవ వెనుక పెద్ద కుట్ర ఉంది. అందుకే పోలీసులకు ఫిర్యాదు చేశాను' అని ఫిలిప్ తెలిపారు. ఈ ఘటనపై టీఎంపీ ఎమ్మెల్యేలు మంగళవారం రాష్ట్ర సీఎం మానిక్ సాహాను కూడా కలిసి ఫిర్యాదు చేశారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపుర డీజీపీ అనురాగ్ ధన్‌కర్ తెలిపారు. తెలంగాణ గవర్నర్‌గా నియమితులు కాకముందు జిష్ణుదేవ్ వర్మ త్రిపుర బీజేపీలో కీలక నేతగా ఉన్నారు. ఆ రాష్ట్రానికి ఆయన డిప్యూటీ సీఎంగా కూడా పనిచేశారు.


ఏసీబీ పేరిట డబ్బులు డిమాండ్

బెదిరింపు కాల్స్ నమ్మవద్దని సూచించిన ఏసీబీ డీజీ



సాక్షి, హైదరాబాద్: కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులకు కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏసీబీ అధికారుల పేరిట ఫోన్లు చేసి బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అవినీతి నిరోధకశాఖ డీజీ విజయ్‌కుమార్ తెలిపారు. ఇలాంటి బెదిరింపు కాల్స్‌ను నమ్మవద్దని కోరారు. ఏసీబీ అధికారులు ఈ తరహా ఫోన్ కాల్స్ చేయబోరని ఆయన స్పష్టం చేశారు. 9154893428 మొబైల్ నంబర్ నుంచి ఈ ఫోన్‌కాల్స్ వచ్చినట్టు తెలిపారు. ఇలాంటి ఒక ఘటనపై ఇప్పటికే సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు ఆయన పేర్కొన్నారు. ఏసీబీ అధికారుల పేరిట డబ్బులు డిమాండ్ చేస్తే అవి ఫేక్ ఫోన్‌కాల్స్‌గా గుర్తించాలన్నారు. ఫేక్ ఫోన్‌కాల్స్‌పై ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064లో లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మహిళల్లో కేసులెక్కువ.. పురుషుల్లో మరణాలెక్కువ



దేశవ్యాప్తంగా కేన్సర్ కేసుల్లో కనిపిస్తున్న భిన్న వైఖరి

2015-19 మధ్య నమోదైన గణాంకాల ఆధారంగా తాజా అధ్యయనంలో వెల్లడి

స్క్రీనింగ్ ద్వారా కేన్సర్‌ను ముందే గుర్తించే వీలుండటమే స్త్రీలలో తక్కువ మరణాలకు కారణం

కేన్సర్ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల వ్యాధి ముదిరి మరణిస్తున్న పురుషులు

మారిన ఆహార అలవాట్లు, జీవనశైలి మార్పులే కేసులకు ప్రధాన కారణమంటున్న నిపుణులు

ఈ లెక్కన 2024లో 15.6 లక్షల కేసులు.. 8.74లక్షల మరణాలు నమోదై ఉండొచ్చని అంచనా

సాక్షి, న్యూఢిల్లీ

దేశంలో కేన్సర్ వ్యాధి కేసులు, మరణాల్లో భిన్న వైఖరి కనిపిస్తోంది. మహిళల్లో కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతుండగా పురుషుల్లో మాత్రం కేన్సర్ మరణాలు అధికంగా సంభవిస్తున్నాయి. ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పులు, మారిన ఆహార అలవాట్లు కేన్సర్ వ్యాధికి ఎక్కువగా కారణమవుతున్నాయి. 2015–2019 మధ్య 43 కేన్సర్ రిజిస్ట్రీల్లో నమోదైన గణాంకాలను విశ్లేషించిన ఓ జాతీయ బృందం ఈ ఆందోళనకర వివరాలను బయటపెట్టింది. దీనిప్రకారం 2015–2019 మధ్య 7.08 లక్షల కేన్సర్ కేసులు నమోదవగా 2.06 లక్షల మరణాలు సంభవించాయి. ఈ లెక్కన 2024లో దేశవ్యాప్తంగా 15.6 లక్షల కేసులు నమోదై 8.74 లక్షల మరణాలు నమోదై ఉండొచ్చని అంచనా వేసింది.



మహిళల్లో ఎక్కువ కేసులు

2012–2022 మధ్య జాతీయ కేన్సర్ రిజిస్ట్రీలు పలు ఆసక్తికర అంశాలను తెరపైకి తెచ్చాయి. మహిళల్లో కేన్సర్ కేసులు పురుషుల కంటే ఎక్కువగా నమోదయ్యాయి. ముఖ్యంగా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ కేన్సర్ బాధితులు మహిళల్లో ఎక్కువగా ఉన్నారు. కానీ ఆశ్చర్యకరంగా మహిళల్లో ఈ కేన్సర్ల కారణంగా మరణాల రేటు తక్కువగా ఉంది. మొత్తం కేసుల్లో మహిళల వాటా 51.1 శాతం. కానీ మరణాల రేటు మాత్రం 45 శాతమే. దీనికి ప్రధాన కారణం మహిళల్లో ఎక్కువగా వచ్చే బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్లు. ఇవి స్క్రీనింగ్ ద్వారా ముందే గుర్తించే వీలుండటంతోపాటు ముందస్తుచికిత్సలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. మరోవైపు పురుషుల్లో వచ్చే ఓరల్, లంగ్, లివర్, ఉదర, అన్నవాహిక కేన్సర్లు ఆలస్యంగా నిర్ధారణ కావడంతో మరణాలు అధికంగా నమోదవుతున్నాయని ఐసీఎంఆర్–ఎన్‌సీడీఐఆర్ డైరెక్టర్ ప్రశాంత్ మాథూర్ తెలిపారు.

ప్రాంతాలవారీగా కేన్సర్ కేసుల తీరు: (ప్రతి లక్ష జనాభాకు)

హైదరాబాద్: బ్రెస్ట్ కేన్సర్ అత్యధికం (54)

ఐజ్వాల్: సర్వైకల్ కేన్సర్ అత్యధికం (27.1)


శ్రీనగర్: పురుషుల్లో లంగ్ కేన్సర్ అత్యధికం (39.5)

ఐజ్వాల్ మహిళలు: లంగ్ కేన్సర్ అత్యధికం (33.7)

అహ్మదాబాద్: పురుషుల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (33.6)

శ్రీనగర్: ప్రోస్టేట్ కేన్సర్ అత్యధికం (12.7)

ఈస్ట్ ఖాసీ హిల్స్: మహిళల్లో ఓరల్ కేన్సర్ అత్యధికం (13.6)



పొగాకును నియంత్రించకుంటే మరణాలు తగ్గవు..

- కేన్సర్‌పై పోరులో పురుషుల ప్రవర్తననే పెద్ద శత్రువుగా చూడాలి. పొగాకు నియంత్రణలో కఠిన చట్టాలు అమలు చేయకపోతే మరణాలు తగ్గవు. గ్లోబల్ అడల్ట్ టొబాకో సర్వే ప్రకారం 2009–10లో 34.6% ఉన్న పొగాకు వినియోగం 2016–17 నాటికి 28.6%కి తగ్గింది. అయినా కేసులు పెరగడానికి పొగాకు దుష్ప్రభావాలకు 20 ఏళ్ల తర్వాత బయటపడే గుణం ఉండటమే కారణం. అధిక మద్యపానం కూడా నోటి కేన్సర్ భారాన్ని పెంచుతోంది. మద్యం, పొగాకు రెండూ విడిగా కేన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి. ఇక కలిపి వాడితే మరింత ప్రమాదం పెరుగుతుంది.

- డాక్టర్ ప్రశాంత్ మాథూర్


మరణాలకు కారణం అలవాట్లే..

- పురుషుల్లో ఊపిరితిత్తుల కేన్సర్ కంటే నోటి కేన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. అందుకు ప్రధాన కారణం గుట్కా, జర్దా, బీడీ, సిగరెట్, పొగాకు వినియోగం అలవాట్లేనని అధ్యయనం పేర్కొంది. అలాగే కేన్సర్ లక్షణాలను పురుషులు ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తుండటం వల్ల చికిత్స మొదలుపెట్టే సరికే వ్యాధి మూడు లేదా నాలుగో దశకు చేరుకుంటోందని తెలిపింది. దీంతో చికిత్సలు ఫలితం ఇవ్వడంలేదని అధ్యయనం వివరించింది.

పర్యావరణం, జీవనశైలి ప్రభావం

- అయితే దేశమంతా కేన్సర్ కేసుల తీరు భిన్నంగా ఉంటోంది. ఈశాన్య రాష్ట్రం మిజోరాం (ఐజ్వాల్)లోని పురుషుల్లో ప్రతి లక్ష మంది పురుషుల్లో 269.4 కేన్సర్ కేసులు, అరుణాచల్‌ప్రదేశ్ (పపుంపారే) లోని ప్రతి లక్ష మంది మహిళల్లో 227.5 కేన్సర్ కేసులు నమోదవుతుండగా మహారాష్ట్రలోని బర్షీలో మాత్రం అతితక్కువ కేన్సర్ కేసులు నమోదైనట్లు అధ్యయనం గుర్తించింది. వాయు కాలుష్యం, ఆహార అలవాట్లు, జన్యు కారణాలు మొదలైన అంశాల వల్ల ప్రాంతాలవారీ వ్యత్యాసం కనిపిస్తోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

● టుడేస్ గ్రాఫిక్



కెనడాకు చెందిన ప్రొఫెషనల్ సర్వీసెస్, ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కాలియర్స్ ఇంటర్నేషనల్.. గ్లోబల్ టెక్ మార్కెట్స్ టాప్ టాలెంట్ లొకేషన్స్–2025 పేరుతో ఈ నివేదికను విడుదల చేసింది. మూడు ప్రపంచ విభాగాలు (టాలెంట్ అక్విసిషన్, వెంచర్ కేపిటల్ ఫండింగ్, లేబర్ మార్కెట్ పూల్), రెండు స్థానిక విభాగాల (టాలెంట్ పైప్‌లైన్, ఆర్థిక రంగంలో టెక్నాలజీ రంగం సాగిస్తున్న ఆధిపత్యం) కింద 200కుపైగా గ్లోబల్ మార్కెట్లను విశ్లేషించి ఈ స్కోర్‌లను కేటాయించింది.

- సాక్షి, సెంట్రల్ డెస్క్



వ్యూహ ల్యాబ్‌తో కుదుర్చుకున్న ఎంఓయూతో డీజీపీ జితేందర్, శిఖా గోయల్, శ్రీనిరాజు, సందీప్ శుక్లా తదితరులు

రోజుకు రూ.4-5 కోట్లు కొట్టేస్తున్నారు

రాష్ట్రంలో గతేడాది రూ.1,900 కోట్ల సైబర్ మోసాలు

'వ్యూహ ల్యాబ్' ప్రారంభోత్సవంలో డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో రోజుకు 250 సైబర్ నేరాలు నమోదవుతుండగా.. సగటున రోజుకు రూ.4–5 కోట్లు కొట్టేస్తున్నారని డీజీపీ జితేందర్ తెలిపారు. గతేడాది దేశంలో సైబర్ నేరగాళ్లు రూ.24 వేల కోట్లు దోచేశారని, తెలంగాణలోనే రూ.1,900 కోట్లు లూటీ చేశారని వెల్లడించారు. మంగళవారం ఐఐఐటీ–హైదరాబాద్ 28వ వ్యవస్థాపక దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఐఐఐటీ–హైదరాబాద్‌లో సైబర్ ఇన్నోవేషన్ హబ్ 'వ్యూహ ల్యాబ్'ను డీజీపీ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో హత్యలు, దోపిడీలు, దొంగతనాలు వంటి నేరాలు ఉండేవని.. ఇప్పుడు వీటన్నింటినీ మించి సైబర్ నేరాలు నమోదవుతున్నాయని అన్నారు. గతేడాది రాష్ట్రంలో నమోదైన కేసులలో 20–25 శాతం సైబర్ కేసులేనని చెప్పారు. సైబర్ నేరగాళ్ల బెడదతో తెలియని నంబర్ల నుంచి ఫోన్లు వస్తే తాను లిఫ్ట్ చేయటం లేదని చెప్పారు. సవాళ్లను, సమస్యలను పరిష్కరించేందుకు సాంకేతిక సంస్థలు, ఎన్‌జీఓలు, అకడమిక్ ఇన్‌స్టిట్యూట్లతో భాగస్వామ్యం అత్యవసరమని తెలిపారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ.. 2026 నాటికి ప్రపంచవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు కొట్టేసే సొమ్ము రూ.11.9 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అన్నారు. అమెరికా, చైనా తర్వాత సైబర్ నేరగాళ్లు కొట్టేసే సొమ్మే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐల్యాబ్స్ క్యాపిటల్ చైర్మన్ శ్రీనిరాజు, టీజీసీఎస్‌బీ ఎస్పీ హర్షవర్ధన్, ఐఐటీ–హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కే శుక్లా తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలొస్తున్నాయి.. పిచికారీలొద్దు!

నేటి నుంచి 7వ తేదీ వరకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఐదు రోజుల్లో పలు జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంట పొలాల్లో మందులను పిచికారీ చేయొద్దని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమీ), అధిపతి డాక్టర్ లీలారాణి మంగళవారం తెలిపారు. మూడు రోజులుగా రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ, అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు, అనేక చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పగటి ఉష్ణోగ్రతలు 29 నుంచి 33 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 19 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్యలో నమోదయ్యాయన్నారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం వారు అందించిన సమాచారం ప్రకారం బుధ, గురువారాల్లో రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే సూచనలున్నాయి. తర్వాత మూడు రోజుల్లో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవొచ్చు. పగటి ఉష్ణోగ్రతలు 27 నుంచి 34 డిగ్రీల మధ్య, రాత్రి ఉష్ణోగ్రతలు 21 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదు కావొచ్చని డా. లీలారాణి చెప్పారు.

- చాలా జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, రాష్ట్రంలో చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున. రైతులు పొలాల్లో నుంచి మురుగు నీటిని తీసివేయడానికి కాలువలు చేసుకోవాలి.
- పొలాల్లో నుంచి మురుగు నీటిని వీలైనంత త్వరగా తీసివేయాలి.
- పంట పొలాల్లో మందులను పిచికారీ చేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి.
- ఉరుములు, మెరుపులతో కూడిన వర్ష సూచనలున్నందున రైతులు విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, చెరువులు, నీటి కుంటలకు దూరంగా ఉండాలి. రైతులు చెట్ల కింద నిలబడకూడదు. పశువులు, గొర్రెలు, మేకలను చెట్ల కింద ఉంచకూడదు.
- అలుగు పారుతున్న చెరువుల్లో మట్టి కోతను నివారించడానికి ఇసుక నింపిన సంచులను తాత్కాలిక అడ్డుకట్టలుగా వేసుకోవాలి.
- రోడ్లు/ కల్వర్టు/ వంతెనలపై నీరు పారుతుంటే వాటిపై నుంచి నడవటం లేదా వాహనం నడుపుతూ నీటి ప్రవాహాన్ని దాటే ప్రయత్నం చేయొద్దు.

ఐదు రోజులూ వర్షాలే...
పూర్తి వివరాలు..
- సాక్షి ప్లస్‌లో

దేవ.. దేవా

సాక్షి, హైదరాబాద్: ఇటీవలి భారీ వర్షాలతో బాసర పుణ్యక్షేత్రంలో పారిశుధ్య సమస్య తలెత్తి భక్తులకు తీవ్ర అసౌకర్యం నెలకొంది. అయితే పూర్తిస్థాయి ఆలయ కార్యనిర్వహణాధికారి లేకపోవడంతో పరిస్థితులు చక్కదిద్దుకోలేదు. ఇన్‌చార్జ్ ఈఓ స్థానికంగా లేకపోవటంతో పరిస్థితి మరింత దిగజారింది. దీనిని గుర్తించిన నిర్మల్ జిల్లా కలెక్టరే ఆ దేవాలయానికి ఓ స్పెషలాఫీసర్‌ను నియమించారు. అయితే తమ ప్రమేయం లేకుండా కలెక్టర్ ఎలా అధికారిని నియమిస్తారని ఆగ్రహించిన దేవాదాయశాఖ, ఆ మరుసటి రోజే జిల్లా కలెక్టర్ సుమోటో నియామక ఆదేశాన్ని రద్దు చేసి, కొమురవెల్లి దేవాలయానికి ఎఫ్ఏసీ ఈఓగా ఉన్న అధికారిని బాసర దేవాలయ ఇన్‌చార్జ్ ఈఓగా నియమించింది. ఇంత జరిగినా బాసరకు పూర్తిస్థాయి కార్యనిర్వహణాధికారిని నియమించలేని దుస్థితిలో దేవాదాయ శాఖ ఉంది. దేవాదాయశాఖ వింత, నిర్లక్ష్య పనితనాన్ని తాజాగా జరిగిన ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది.



ఇటీవలి వర్షాలకు బాసర ఆలయానికి వెళ్లే మార్గంలోకి కొట్టుకొచ్చిన చెత్తాచెదారం

పూర్తిస్థాయి అధికారులను నియమించుకోలేని దుస్థితిలో దేవాదాయ శాఖ

భారీ వరదలతో బాసర పుణ్యక్షేత్రం వద్ద పారిశుధ్య లోపం

పరిస్థితి తీవ్రతను చూసి సుమోటోగా ప్రత్యేకాధికారిని నియమించిన నిర్మల్ కలెక్టర్

ఆ నియామకాన్ని రద్దు చేసి ఆగమేఘాల మీద మరో అధికారిని నియమించిన దేవాదాయశాఖ

అభాసుపాలవుతున్న దేవాదాయ శాఖ


ఓ పద్ధతి అంటూ లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ దేవాదాయ శాఖ అభాసుపాలవుతోంది. దాదాపు 15 సంవత్సరాలుగా దేవాదాయ శాఖలో శాస్త్రీయ పద్ధతిలో పదోన్నతులు కల్పించటం లేదు. పదోన్నతుల ఆధారంగా అయ్యే ఖాళీలను ప్యానెళ్ల వారీగా సీనియారిటీ నిర్ధారించి పదోన్నతులు ఇవ్వటం ద్వారా భర్తీ చేయాలి. కానీ అక్రమాలు, ఇష్టారాజ్యం, పారదర్శకత లేమి.. ఇలా సీనియారిటీ జాబితా రూపకల్పన, పదోన్నతుల్లో పద్ధతి అంటూ లేకుండాపోయింది. ఓ ఉన్నతాధికారి మంత్రుల స్థాయిలో తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి కీలక పోస్టు పొందేందుకు పదోన్నతులకు అడ్డుగా మారాడని ఇతర అధికారులు ఆరోపిస్తున్నారు. వ్యవహారం ట్రిబ్యునల్, ఆ తర్వాత హైకోర్టు పరిధిలోకి వెళ్లటంతో ఏళ్లుగా సరైన పదోన్నతులు లేకుండా పోయాయి. సీనియారిటీ ప్యానెల్స్ రూపొందించి దాని ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని ఏడాదిన్నర క్రితం హైకోర్టు ఆదేశించింది. కానీ, చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు దానిని పూర్తి చేయలేదు. ఒక అధికారికి పదోన్నతి లభిస్తే, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్, ఏఈఓ, ఈఓ, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్... ఇలా అన్ని స్థాయిలో పదోన్నతులు లభిస్తాయి. ఇప్పుడా పదోన్నతులు లేకపోవటంతోనే, ఒక్కో అధికారికి మూడునాలుగు దేవాలయాల బాధ్యత అప్పగిస్తున్నారు.

అయినా కళ్లు తెరవని దేవాదాయ శాఖ

తాజాగా బాసర దేవాలయంలో జిల్లా కలెక్టర్– దేవాదాయ శాఖ మధ్య జరిగిన వ్యవహారం తర్వాత కూడా ఆ శాఖ కళ్లు తెరవటం లేదు. ప్రస్తుతం ఈఓగా నియమితులైన అధికారి, దేవాదాయ శాఖ కీలకమైన జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారి కావటం విశేషం. అంటే, మళ్లీ రెండు బాధ్యతలు చూడాల్సిన పరిస్థితి. మరో విశేషమేంటంటే, బాసర జ్ఞాన సరస్వతి దేవాలయానికి డిప్యూటీ కమిషన్ స్థాయి అధికారి కార్యనిర్వహణాధికారిగా ఉండాల్సి ఉంది. కానీ, కొత్తగా నియమితులైన అధికారి అసిస్టెంట్ కమిషనర్ మాత్రమే కావటం విశేషం. ఇందులో మెలిక ఏంటంటే, ఆ అధికారి ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్‌గా ఉన్నా, నిజానికి అంతకంటే రెండు పదోన్నతులు పొంది జాయింట్ కమిషనర్ స్థాయిలో పనిచేయాల్సిన సీనియారిటీ ఉన్న అధికారి. పదోన్నతులు ఇవ్వకుండా దేవాదాయ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడింది. కీసర ఆలయ ఈఓకు బాసర దేవాలయ ఇన్‌చార్జ్ బాధ్యతలా అంటూ, గత జూన్‌లో 'సాక్షి'కథనం వెలువరించింది. పదోన్నతుల వ్యవహారంలో నెలకొన్న గందరగోళాన్ని వెలుగులోకి తెచ్చింది. దీనికి స్పందించిన దేవాదాయశాఖ మంత్రి కార్యాలయం, ఆ కసరత్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. కానీ, స్పందన మాత్రం దాదాపు శూన్యం.

● కేసుల్లోనూ అతిపెద్ద బ్యాంక్

ఎస్‌బీఐపై హైకోర్టు వ్యాఖ్యలు



సాక్షి, హైదరాబాద్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) దేశంలోనే అతిపెద్దది మాత్రమే కాదని, కోర్టు కేసుల్లోనూ పెద్ద బ్యాంక్ అని హైకోర్టు వ్యాఖ్యానించింది. డీఆర్‌టీ ఆదేశాలిచ్చిన ఏళ్ల తర్వాత పిటిషన్ దాఖలు చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన రైతు నర్సిరెడ్డిగారి బాల్‌రెడ్డి, షాపూర్‌నగర్‌కు చెందిన కల్లం మాధవరెడ్డికి అనుకూలంగా 2018లో డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ బ్యాంకు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ట్రిబ్యునళ్ల ఆదేశాలు చట్టవిరుద్ధమని, ఏకపక్షమని బ్యాంక్ తరఫు న్యాయవాది వాదించారు. డీఆర్‌టీ ఆదేశాలు కొట్టివేయాలని కోరారు. పిటిషన్ దాఖలు చేయడంలో ఆలస్యానికి వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేసింది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వైటీడీఏ భూములన్నీ టెంపుల్ సిటీలోనే..

టెంపుల్ సిటీ భూములన్నీ మ్యాపింగ్

- ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ ఆదేశం

సాక్షి, యాదాద్రి: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆస్తులన్నీ టెంపుల్ సిటీలోనే ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెంపుల్‌సిటీ పరిధి నిర్ణయం కోసం.. ఇటీవల యాదగిరిగుట్ట దేవస్థానం అతిథిగృహంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశం జరిగింది. అసెంబ్లీలో చట్టం చేసిన యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ జియోగ్రాఫికల్ ఏరియా హద్దుల నిర్ణయంపై చర్చించారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, దేవస్థానం ఈవో వెంకట్‌రావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావుతోపాటు వివిధ శాఖల అధికారులతో టెంపుల్ సిటీ పరిధిపై చర్చించారు. కేవలం యాదగిరిగుట్ట చుట్టూ ఉన్న భూముల్నే టెంపుల్ సిటీ ఆస్తులుగా గుర్తించిన తీరును ప్రిన్సిపల్ సెక్రటరీ తిరస్కరించారు. దేవస్థానానికి ఉన్న భూముల వివరాలతో నివేదికను సిద్ధం చేయాలని మరికొంత సమయం ఇచ్చారు. ప్రభుత్వం యాదగిరిగుట్ట టెంపుల్ సిటీ ఏర్పాటుకు గత అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేసింది. దీని ప్రకారం యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని ఏర్పాటు చేస్తున్నారు. తిరుమల మాదిరిగా ఆలయ పవిత్రత, సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేవిధంగా టెంపుల్ సిటీ పరిధిని నిర్ణయిస్తున్నారు.



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

ఇందుకోసం యాదగిరిగుట్టలో గతంలో వైటీడీఏ (యాదగిరిగుట్ట టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ) సేకరించిన భూములను సర్వే నంబర్ల వారీగా డీజీపీఎస్ సర్వే చేయించారు. అయితే కేవలం యాదగిరిగుట్ట చుట్టూ ఉన్న భూములు సర్వే నంబర్ల వారీగా టెంపుల్ సిటీ పరిధిని నిర్ణయించి మ్యాప్‌లను సిద్ధం చేశారు. అయితే దేవస్థానం పరిధిలో ఇతర గ్రామాల్లో కూడా ఉన్న వైటీడీఏ భూములను ఇందులో చేర్చలేదు. అయితే భవిష్యత్‌లో భూముల విషయంలో వివాదం తలెత్తకుండా వైటీడీఏ గ్రామాల్లో సేకరించిన అన్ని భూములు, వాటిని ఏయే శాఖలకు కేటాయించారో సమగ్ర వివరాలను పొందపరచనున్నారు. దీంతోపాటు శ్రీస్వామివారికి హైదరాబాద్ బంజారాహిల్స్, భువనగిరిగంజ్‌లో, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం దబగుంటపల్లి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న వందల ఎకరాల భూములు, భవనాలు గుర్తించి వాటికి డీజీపీఎస్ సర్వే చేస్తున్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న దేవాలయాల భూములను డీజీపీఎస్ సర్వే చేయించి హద్దులు నిర్ణయిస్తున్నారు. ప్రధానంగా దేవుని భూములు పలుచోట్ల అన్యాక్రాంతం అయ్యాయి. దేవుని పేరున్న గ్రామాల్లో.. అదే పేరున్న వ్యక్తుల పేరున పట్టాలు అయ్యాయి. పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చాయి. మరికొన్నిచోట్ల క్రయవిక్రయాలు జరిగాయి. ఇలా అన్యాక్రాంతమైన వేలాది ఎకరాల భూముల లెక్కలు తీసే పనిలో దేవాదాయ, రెవెన్యూ అధికారులున్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానం టెంపుల్ సిటీ కోసం వైటీడీఏ సేకరించిన భూమి సుమారు 2252 ఎకరాలు. ఇందులో..

దేవాలయ భూమి	166.07 ఎకరాలు
అటవీశాఖ భూమి	467.06 ఎకరాలు
చెరువులున్న భూమి	174.28 ఎకరాలు
భూసేకరణ చట్టం ద్వారా భూమి	878.39 ఎకరాలు
ప్రభుత్వం కేటాయించిన భూమి	565.07

నేడు ఏఐపై జర్నలిస్టులకు శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై జర్నలిస్టులకు బుధవారం తెలంగాణ మీడియా అకాడమీలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి నమోదు చేసుకున్న జర్నలిస్టులు మాత్రమే హాజరుకావాలని మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు.

ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లా నందపార గ్రామంలో ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరిని మావోయిస్టులు సోమవారం రాత్రి హత్య చేశారు. మావోయిస్టుల సమాచారాన్ని పోలీసులకు అందజేస్తున్నారంటూ గ్రామానికి చెందిన పదం పొజ్జా, పదం దేవేంద్రలను మావోయిస్టులు గతంలో పలుమార్లు హెచ్చరించారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో వారి ఇళ్ల వద్దే గొడ్డళ్లతో నరికి చంపారు. పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా ఎవరు వ్యవహరించినా ఇదే శిక్ష పడుతుందని గ్రామంలో లేఖ వదిలి వెళ్లారు. కాగా, వరుస హత్యలతో మావోయిస్టు ప్రభావిత గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు.

ఐదు రోజులూ వర్షాలే...

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని పలు జిల్లాల్లో బుధవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

- **3వ తేదీ:** ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలివేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో అక్కడక్కడా కురవొచ్చు.
- **4వ తేదీ:** ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు అన్ని జిల్లాల్లో అక్కడక్కడా కురవొచ్చు.



- **5వ తేదీ:** ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, వరంగల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (గాలి వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశముంది. బలమైన ఉపరితల గాలులు (వేగం గంటకు 30–40 కి.మీ.) జనగాం, ఖమ్మం, నల్లగొండ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా వీచే అవకాశం ఉంది.
- **6వ తేదీ:** ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల (వేగం 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశముంది. హనుమకొండ, హైదరాబాద్, జనగాం, జోగుళాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మేడ్చల్–మల్కాజ్‌గిరి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వనపర్తి, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడా బలమైన ఉపరితల గాలులు (వేగం 30–40 కి.మీ.) వీచే అవకాశం ఉంది.
- **7వ తేదీ:** అన్ని జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు (వేగం గంటకు 30–40 కి.మీ.)తో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఆగస్టులో 81 శాతమే..

సింగరేణిలో 38.96 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి

రెండు ఏరియాల్లో మాత్రమే 100 శాతం నమోదు

మిగతా తొమ్మిది ఏరియాలు వెనుకంజ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం (2025–26)లో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో నెలవారీ లక్ష్యాలను కేటాయించగా.. గత ఆగస్టులో సంస్థ వ్యాప్తంగా 81 శాతం ఉత్పత్తి మాత్రమే నమోదైంది. సంస్థ పరిధిలోని 11 ఏరియాల్లో 19 ఓపెన్ కాస్ట్ గనులు, 21 భూగర్భ గనుల్లో 48.13 లక్షల టన్నుల లక్ష్యానికి.. 38.96 లక్షల టన్నుల ఉత్పత్తి మాత్రమే సాధించగలిగారు.

ఓసీల్లో 85, భూగర్భ గనుల్లో 53%

సింగరేణి వ్యాప్తంగా భూగర్భ గనుల్లో గడిచిన ఆగస్టులో 6,20,200 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 3,27,033 టన్నులు (53 శాతం) సాధించారు. ఇక ఓపెన్ కాస్ట్ గనుల్లో 41,92,885 టన్నులకు 35,69,656 టన్నుల (85శాతం) ఉత్పత్తి నమోదైంది. సంస్థ రోజూ 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా.. 1.13 లక్షల టన్నులకే పరిమితమవుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు ఐదు నెలల్లో పరిశీలిస్తే 25.62 మిలియన్ టన్నుల లక్ష్యానికి 24.08 మిలియన్ టన్నులు (94 శాతం)గా ఉత్పత్తి నమోదైంది. అంటే దాదాపు 1.54 మిలియన్ టన్నుల ఉత్పత్తి వెనుకంజలో ఉంది.

రెండు భేష్.. తొమ్మిది బ్యాక్

సంస్థ పరిధిలోని 11 ఏరియాలకు యాజమాన్యం ప్రతీనెల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశిస్తుంది. ఇందులో ఆగస్టు నెలకు ఆర్జీ–1 ఏరియా 110 శాతం ఉత్పత్తితో అగ్రస్థానంలో నిలవగా, ఆర్జీ–2 ఏరియా 108 శాతం సాధించి రెండో స్థానంలో నిలిచింది. ఇక కొత్తగూడెం ఏరియా 98 శాతం, ఆర్జీ–3 ఏరియా 86 శాతం, శ్రీరాంపూర్ 82, మణుగూరు 74, భూపాలపల్లి 72 శాతం, బెల్లంపల్లి 68, ఇల్లెందు 46, మందమర్రి 35, ఆండ్రియాల ఎనిమిది శాతంతో సరిపెట్టుకున్నాయి.

ఐదు నెలల్లో మూడు ఏరియాలు

సింగరేణి సంస్థ వ్యాప్తంగా 11 ఏరియాలు ఉండగా.. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు ఐదు నెలల్లోనూ చాలా ఏరియాలు వెనుకబడ్డాయి. అయిదు మాసాలుగా కొత్తగూడెం ఏరియా 103 శాతం , మణుగూరు ఏరియా 102 శాతం, ఆర్జీ–2 ఏరియా 128 శాతం ఉత్పత్తి సాధించాయి. ఇక ఇల్లెందు 74 శాతం, బెల్లంపల్లి 90, మందమర్రి 61, శ్రీరాంపూర్ 91, ఆర్జీ–1 ఏరియా 88, ఆర్జీ–3 ఏరియా 87, ఆండ్రియాలా 15 శాతం, భూపాలపల్లి ఏరియా 76 శాతం ఉత్పత్తి మాత్రమే సాధించగలిగాయి. ఇక సింగరేణి వ్యాప్తంగా కొత్తగూడెం ఏరియాలోనే అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి నమోదవుతోంది. అయిదు మాసాలుగా 57,74,900 టన్నుల లక్ష్యానికి 58,90,549 టన్నుల ఉత్పత్తి సాధించడం విశేషం.



ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు లోడ్ చేస్తున్న వాహనం

ఏరియాల వారీగా ఆగస్టులో బొగ్గు ఉత్పత్తి వివరాలు

ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	శాతం	ఏరియా	నిర్దేశిత లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	10,41,500	10,21,476	98	ఆర్జీ-2	5,78,400	6,73,732	108
ఇల్లెందు	3,77,885	1,73,180	46	ఆర్జీ-3	4,40,000	3,77,203	86
మణుగూరు	7,58,500	5,63,184	74	బెల్లంపల్లి	2,00,000	1,35,840	68
మందమర్రి	2,04,500	71,755	35	భూపాలపల్లి	1,97,646	1,97,646	72
శ్రీరాంపూర్	4,83,300	3,97,378	82	ఆండ్రియాల	1,60,300	12,168	08
ఆర్జీ-1	2,93,500	3,23,127	110	మొత్తం	48,13,085	38,96,689	81

100 శాతం ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి

ఆగస్టులో సింగరేణి పరిధిలోని జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఈనెల బొగ్గు ఉత్పత్తి 81 శాతానికి పరిమితమైంది. ఇకనుంచి భూగర్భ గనులు, ఓసీల్లో 100 శాతం ఉత్పత్తి నమోదయ్యేలా గనుల వారీగా సమీక్షలు నిర్వహిస్తాం. ఏరియాల వారీగా అధికారులు పర్యవేక్షించేలా సూచనలు చేస్తాం.

– కె.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్)



ప్రభుత్వానికి మంచిపేరు తేవాలి

మంత్రి శ్రీహరి



సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధక శాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వానికి మంచిపేరు తేవాలని.. అధికారులకు మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. సహాయ సంచాలకుల నుంచి.. ఉప సంచాలకులుగా పదోన్నతి పొందిన అధికారుల అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖాళీగా ఉన్న 40 మంది సహాయ సంచాలకులకు కూడా పదోన్నతి కల్పిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారుల సేవా సంఘం అధ్యక్షుడు టి.శ్రీనివాస్, కార్యదర్శులు ఎస్.వెంకట్, విజయభాస్కర్‌రెడ్డి, పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు ఎం.రమేశ్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలతో అందని వైద్యం

బీజేపీ ఎమ్మెల్యే హరీశ్‌బాబు



సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం రోగుల జీవితాలతో ఆడుకుంటోందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఆరోపించారు. ఆయన మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఢిల్లీ వెళ్లడానికి సీఎంకి నిధులున్నాయి గానీ.. ఆరోగ్యశ్రీకి చెల్లించడానికి లేవా? అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మానస పుత్రికని ఆయన గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నామని ప్రకటించి.. కాగితాలకే పరిమితం చేశారని ఆరోపించారు. జర్నలిస్టులు, ఉద్యోగుల హెల్త్ స్కీమ్ దిక్కు లేకుండా పోయిందని, వెల్‌నెస్ సెంటర్లలో కనీసం మందులు లేవని హరీశ్‌బాబు చెప్పారు.

'జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీఎం రేవంత్‌పై విమర్శలు మానుకోవాలి'



సాక్షి, హైదరాబాద్: ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీచేస్తున్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు మానుకోవాలని కేంద్రమంత్రులు బండి సంజయ్, అమిత్‌షాలకు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి హితవు పలికారు. ఎంత విమర్శలు చేస్తే అంత మద్దతు వస్తుందని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేవంత్‌రెడ్డి నక్సలైట్ల సానుభూతి పరుడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ అనడం విడ్డూరమన్నారు.

ఎల్‌ఐసీ అప్పీల్ కొట్టివేత

రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ తీర్పు

సాక్షి, హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్ ఎల్‌ఐసీపై ఒక కీలక తీర్పు వెలువరించింది. ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, ఎల్‌ఐసీ దాఖలు చేసిన అప్పీల్‌ను రాష్ట్ర కమిషన్ కొట్టివేసింది. ఖమ్మం జిల్లా తల్లంపాడు గ్రామానికి చెందిన జిల్లపల్లి దుర్గయ్య భార్య సత్యవతి, 2014లో ఎల్‌ఐసీ పాలసీ (నంబర్ 698885114) తీసుకున్నారు. రూ.2 లక్షల బీమా కోసం తీసుకున్న ఈ పాలసీ ప్రీమియం చెల్లించలేకపోవడంతో లాప్స్ అయింది. తర్వాత, వైద్యుల ధ్రువీకరణతో పాలసీని పునరుద్ధరించుకున్నారు. 2019 మార్చి 15న సత్యవతి క్యాన్సర్‌తో మృతి చెందారు. అనంతరం భర్త దుర్గయ్య క్లెయిమ్ చేసుకున్నారు. కాగా, ఆరోగ్య వివరాలను దాచిపెట్టారంటూ ఇన్సూరెన్స్ సొమ్ము ఇవ్వడానికి ఎల్‌ఐసీ నిరాకరించింది. దీంతో దుర్గయ్య ఖమ్మం జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈమేరకు కమిషన్.. 2021లో ఎల్‌ఐసీ రూ.2 లక్షల ఇన్సూరెన్స్ సొమ్ముతో పాటు రూ.8 వేల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. ఖమ్మం జిల్లా వినియోగదారుల ఫోరం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. ఎల్‌ఐసీ రాష్ట్ర కమిషన్‌లో అప్పీల్ వేసింది. కానీ రాష్ట్ర కమిషన్ స్పష్టంగా ఎల్‌ఐసీ వైఖరిని తప్పుబట్టింది. రోగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా కూడా పాలసీ ఇచ్చారని, ఏజెంట్ల నిర్లక్ష్యాన్ని పట్టించుకోకుండా, తర్వాత క్లెయిమ్‌ను తిరస్కరించడం అన్యాయమని వ్యాఖ్యానించింది. ఖమ్మం జిల్లా కమిషన్ ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర కమిషన్ యథాతథంగా కొనసాగించింది. బాధితుడు దుర్గయ్య.. ఎల్‌ఐసీలో డిపాజిట్ చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా ఉపసంహరించుకునే వీలు కల్పించింది.

అష్ట దిగ్బంధంలో కేసీఆర్ కుటుంబం

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం అష్టదిగ్బంధంలో చిక్కుకుందని, భయంతో కోర్టులకు పరుగులు పెడుతోందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వ్యాఖ్యానించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను చెత్త బుట్టలో వేయాలని, సీబీఐ విచారణను ఆపాలంటూ తెలంగాణ సమాజాన్ని మభ్యపెట్టేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితో కలిసి వీరేశం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీకి రూ.1,000 కోట్ల డిపాజిట్లు, వేల కోట్ల అవినీతి డబ్బు ఉందని, ఆ పంపకాల్లోనే పంచాయితీ వచ్చిందని, కల్వకుంట్ల కుటుంబంలోని పంచాయితీని తమ ముఖ్యమంత్రికి ముడిపెట్టడం వాళ్ల అమాయకత్వమని వీరేశం అన్నారు. కోర్టు ఇచ్చింది బ్రేక్ మాత్రమేనని, కేసీఆర్ నేరాలకు ప్రజలు ఎప్పుడో తీర్పు ఇచ్చారన్నారు. అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీబీఐ విచారణ ఇంకా ప్రారంభం కాకుండానే కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కవిత తేల్చి చెప్పారని పేర్కొన్నారు. హరీశ్‌రావు, సంతోష్‌రావు అవినీతి చేశారని కవిత మొదటి సాక్ష్యం చెప్పారని, కేసీఆర్ డైరెక్షన్‌లోనే హరీశ్‌రావు గతంలో పనిచేశారని, కేసీఆర్ డైరెక్షన్‌లోనే అవినీతి జరిగిందని చెప్పారు.

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ దుష్ప్రచారానికి చెంపపెట్టు

బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరంపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ దుష్ప్రచారానికి చెంపపెట్టు అని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కాళేశ్వరంపై నిజానిజాలు తెలుసుకోవడానికి స్టడీ టూర్ చేశానన్నారు. కాళేశ్వరం ద్వారా గోదావరికి ఎదురీత నేర్పి.. రివర్స్ పంపింగ్ ద్వారా తెలంగాణ బీళ్లకు నీళ్లు మళ్లించారని తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి గండిపేట నీళ్లు తెచ్చేలా చేశారన్నారు. కాళేశ్వరమే లేకపోతే గంధమల్ల రిజర్వాయర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు శంకుస్థాపన చేశారని రాకేశ్‌రెడ్డి ప్రశ్నించారు. కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్ దగ్గర 17 మోటార్లతో నీటిని తరలించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నీళ్లు మళ్లించడంలేదని విమర్శించారు. ఇది కేసులతో కేసీఆర్‌పై చేస్తున్న కుట్ర కాదని, తెలంగాణకు జీవనాడి అయిన కాళేశ్వరం మీద, తెలంగాణ ప్రజల మీద చేస్తున్న కుట్ర అని రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రాధాన్యం

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యమిస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన 4వ సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్–2025 పోటీల్లో విజేతలైన ఆటగాళ్లు, మాస్టర్లను సోమవారం తెలంగాణ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో తెలంగాణ నుంచి పాల్గొన్న క్రీడాకారులు 8 బంగారు, 6 వెండి, 8 కాంస్య పతకాలు సాధించి రాష్ట్ర ప్రతిష్టను నిలబెట్టారని ప్రశంసించారు. ఇటీవలే కియో జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలను విజయవంతంగా నిర్వహించామని గుర్తు చేశారు. 2027లో జరగబోయే ఆసియన్ కరాటే చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జనరిక్ మెడికల్ షాపుల సంఖ్య పెంచాలి

ప్రభుత్వానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు విజ్ఞప్తి

సాక్షి, అమరావతి: పేదలకు నాణ్యమైన మందులను చౌకగా అందించేందుకు జన ఔషధీ మందుల షాపు (జనరిక్ మెడికల్ షాపు)లను కనీసం ప్రతి మండలానికి ఒకటి ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ షాపుల్లో సగభాగం బీసీ నిరుద్యోగ యువతకు కేటాయించాలని కోరారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రులు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్

సాక్షి, అమరావతి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలపై కేబినెట్లో ఆమోదం తెలపాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి. రెడ్డి శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 4న జరిగే కేబినెట్ సమావేశంలో ఇతర అంశాలతో పాటు ఉద్యోగుల ఆర్థిక అంశాలను కూడా అజెండాలో చేర్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్నా మేనిఫెస్టోలో ఉద్యోగులకు ప్రకటించిన హామీలలో ఏ ఒక్కటీ అమలుచేయక పోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి దసరా పండుగ కానుకగా పీఆర్సీ చైర్మన్‌ను నియమించి తాత్కాలిక భృతి 30% ప్రకటించాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన 105 రకాల ఆర్థిక, ఆర్థికేతర అంశాలపై స్పష్టత తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కేబినెట్ సమావేశంలో ఉద్యోగుల పెండింగ్ బకాయిలపట్ల స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోతే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

నాలుగు బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్‌ల నియామకం

సాక్షి, అమరావతి: 4 బోధనాస్పత్రులకు సూపరింటెండెంట్‌లను, 3 ప్రభుత్వ వైద్య కళాశాలలకు ప్రిన్సిపాళ్లను నియమిస్తూ వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులిచ్చారు. కర్నూల్ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు, మచిలీపట్నం జీజీహెచ్‌కు డాక్టర్ జి.సామిని, అనంతపురం జీజీహెచ్‌కు డాక్టర్ సుబ్రహ్మణ్యం, నెల్లూరుకు డాక్టర్ మాధవి, పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిషోర్ నియమితులయ్యారు. విజయనగరం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ దేవి మాధవి, అనంతపురం ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ,, శ్రీకాకుళం ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అప్పలనాయుడును నియమించారు.

ఆ ముగ్గురికి కేబినెట్ ర్యాంక్

సాక్షి, అమరావతి: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ ఆర్.శైలజ, ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్, ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కు కేబినెట్ ర్యాంకు ఇస్తూ సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

11న చిన్నారులకు పోటీలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సేవ్ ది గర్ల్ చైల్డ్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ నెల 11న పాఠశాల స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర కళా పోటీలు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయరామరాజు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. వివిధ యాజమాన్యాల కింద నడిచే అన్ని పాఠశాలల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించాలని మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

సాక్షి,అమరావతి: విద్యుత్ ప్రమాదాల శాశ్వత నివారణే లక్ష్యంగా ఎలక్ట్రికల్ సేఫ్టీ అధికారులు పనిచేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా ప్రమాదాలను తగ్గించే దిశగా కసరత్తు చేయాలని అధికారులను ఆదేశించారు. టోల్ ఫ్రీ నంబర్ 1912ను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఏపీ జెన్‌కో అధికారులతోనూ మంత్రి సమీక్షించారు. గృహ, పారిశ్రామిక అవసరాలకు తగినట్లుగా జెన్‌కో ప్లాంట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగాలని ఆదేశించారు. గత రెండు దశాబ్దాల్లో తొలిసారి శ్రీశైలం హైడల్ పవర్ స్టేషన్ 1,000 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరడంపై అధికారులను అభినందించారు.

అమెరికా టారిఫ్‌ల పెంపుపై 6న నిరసనలు

వామపక్షాల పిలుపు

సాక్షి, అమరావతి: అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న నిరసనలు చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు ఆ పార్టీల రాష్ట్ర కీలక నేతలు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అమెరికా సుంకాల్ని పెంచడంతో ఆక్వా, టెక్స్‌టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని వామపక్ష నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

కాయకల్ప తరువు

- ఆరోగ్య ప్రదాయిని.. కొబ్బరి
- నీటి నుంచి ఆయిల్ వరకు ప్రతిదీ ఔషధమే..
- నీరు, ముక్క, పాలు, వెనిగర్ ఇలా ఎన్నెన్నో!
- అన్నింటా ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో సాగు
- సెప్టెంబర్ 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవం

కొబ్బరి చెట్టును చూస్తే గోదారమ్మ ఒడిలో ఒదిగిన అందాల బిడ్డలా కనిపిస్తోంది. ప్రకృతి అందాల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అదనపు అందాలు అద్దే కొబ్బరి చెట్టు చూసి ముచ్చట పడనివారు ఉండరంటే అతిశయోక్తి కాదు. తోటల్లో పంటగానే కాదు వరిచేలు.. చెరువులు.. రోడ్లు.. కాలువలు.. నదీపాయల వెంబడి.. ఇళ్ల చుట్టూ కనిపించే కొబ్బరి చెట్టు గోదావరి వాసుల నుదుటిన ప్రగతి తిలకం దిద్దుతూ ఇక్కడ వారి జీవనంలో పెనవేసుకుపోయింది. కన్న కొడుకుగా పిలుచుకుంటారంటే.. వారి జీవనంలో కొబ్బరి ఎంత ప్రాముఖ్యమో అవగతమవుతుంది.

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో సాగవుతున్న కొబ్బరి ఒక్క ఉమ్మడి తూర్పులోనే 1.30 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వరి తర్వాత అత్యధికంగా సాగయ్యే కొబ్బరి ఔషధాల గని. కొబ్బరి ఉత్పత్తుల ద్వారా రైతులు, వ్యాపారులు, కార్మికులు ఉపాధి పొందుతుంటే.. ఆయా ఉత్పత్తుల ద్వారా సామాన్యులు సైతం మెరుగైన ఆరోగ్యాన్ని పొందుతున్నారు. లక్షలాది మంది ప్రజలకు ఔషధాలను అందిస్తూ కొబ్బరి ఆరోగ్య వర ప్రదాయినిగా పేరొందింది. సెప్టెంబర్ రెండున ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



కొబ్బరి చెట్టు

మధుమేహ రోగులకు కొబ్బరి కల్పరస



కొబ్బరి జ్యూస్ (నీరా)

కొబ్బరి జ్యూస్ (కల్లు-కల్పరసా) ఆరోగ్యానికి చేసే మేలు అంతాఇంతా కాదు. ఫెర్మంటేషన్ ఆవకుండా ఉత్పత్తి చేసే కొబ్బరి జ్యూస్ (నీరా) నేరుగా తాగినా, దీనిని నుంచి ఉత్పత్తి చేసే పంచదార, బెల్లం, తేనెను ఆహారంగా తీసుకున్నా ఆరోగ్యానికి మంచిది. ఇందులో గ్లైసమిక్ ఇండెక్స్ 25 శాతం మాత్రమే. అందుకే మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా దీనిని ఆహారంగా తీసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

కొబ్బరి పాలతో వర్జిన్ ఆయిల్



వర్జిన్ కోకోనట్ ఆయిల్

కొబ్బరి పాల నుంచి తయారు చేసే కొబ్బరి వర్జిన్ నూనె చర్మాన్ని తేమగా ఉంచడం, జుట్టుకు పోషణ ఇవ్వడం, బరువు తగ్గడంలో సాయపడుతోంది. మెదడు ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు, యాంటీ మైక్రోబయల్ గుణాలను కలిగి ఉంటుంది. తెల్ల రక్త కణాలను వృద్ధి చేస్తోంది. హెచ్ఐవీ రోగులకు ఇది చేసినంత మేలు మందులు కూడా చేయవు. శరీరాన్ని మృదువుగా ఉంచుతోంది. ఇది మంచి సౌందర్య పోషణ.

అమ్మపాలను తలపించే కొబ్బరి పాలు

కొబ్బరి ముక్క నుంచి తీసే పచ్చి పాలలో విటమిన్ సి, విటమిన్ ఇ, బి కాంప్లెక్స్ (బి1,బి3,బి5,బి6), కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు సమృద్ధిగా ఉన్నాయి. లారిక్ యాసిడ్ (ఓ రకమైన కొవ్వు ఆమ్లం) కూడా ఉంది. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఎముకలను బలపరుస్తాయి, కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి, గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొబ్బరి పాలు చర్మానికి, జుట్టుకు కూడా ప్రయోజనకరం.



కోకోనట్ మిల్క్

శక్తినిచ్చే పచ్చి కొబ్బరి



కొబ్బరి ముక్కలు (పచ్చి లేదా ఎండు)లో ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ముక్కలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరానికి శక్తి అందుతుంది. బరువు తగ్గడానికి కూడా సాయపడుతుంది.

← కొబ్బరి ముక్క

గుడ్డుతో సమానంగా పోషకాలు



కొబ్బరి గుడ్డు

కొబ్బరి పువ్వు (గుడ్డు)లో కోడి గుడ్డుతో సమానంగా పోషకాలున్నాయి. దీనిని ఆహారంగా తీసుకోవడం వల్ల అలసట, నీరసం తగ్గుతాయి. ఇందులో ఉండే యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాల వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే, కొబ్బరి పువ్వులో ఫైబర్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సాయపడతాయి, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

వంటకు కొబ్బరి నూనె శ్రేష్ఠం



కొబ్బరి నూనె

కొబ్బరి నూనె ఆహారంగా తీసుకోవడం వల్ల మెదడు పనితీరు మెరుగుపడుతుంది. శక్తి పెరిగి, చర్మానికి తేమ అందుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. కొబ్బరి నూనెలో ఉండే మధ్యస్థ గొలుసు కొవ్వు ఆమ్లాలు శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. హార్మోన్ల స్థాయిలను స్థిరంగా ఉంచి, మానసిక ప్రశాంతతను పెంచుతుంది. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాల వల్ల చర్మ సమస్యలను తగ్గిస్తుంది. కొబ్బరి నూనె జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. చర్మాన్ని మృదువుగా చేస్తుంది. కొబ్బరి నూనెను తలకు పట్టించి.. మర్దన చేయడం వల్ల మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

దివ్యౌషధం.. కొబ్బరి బొండాం

కొబ్బరి బొండాం ఓ దివ్యౌషధం. ప్రకృతి సిద్ధమైన సెలైన్. దీనిలో కార్బోహైడ్రేట్లు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, సోడియం, విటమిన్ సి, బి పుష్కలంగా ఉన్నాయి. శరీరానికి అవసరమైన హైడ్రేట్లు, ఎలక్ట్రోలైట్లు ఉన్నాయి. ఇందులో దాదాపు 95 శాతం నీరుంటుంది. ఇది శరీరాన్ని తేమగా ఉంచడానికి దోహదపడుతుంది. శరీరంలో సులభంగా జీర్ణమయ్యే చక్కెర రూపంలో కార్బోహైడ్రేట్లు ఉంటాయి.



కొబ్బరి బొండాం

ఆనందమీనందమాయె..

- మనసు దోచుకుంటున్న అక్వేరియం కల్చర్
- ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం
- వాస్తు నమ్మకాలూ ఓ కారణం

రాయవరం: ఇంటిని అందంగా అలంకరించుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమిస్తారు. ఇప్పుడు ఇంటి అలంకరణలో అక్వేరియంలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఇంటీరియల్ డెకరేషన్‌లో భాగంగా అక్వేరియం ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తున్నారు. అంతేకాకుండా సంస్కృతీ సంప్రదాయాలను పాటించేవారు, వాస్తుపరమైన నమ్మకంతో తమ సంపాదనను వృద్ధి చేసుకునే వారు, సుఖ సంతోషాలను పొందాలని నమ్మేవారు ఇప్పుడు చేపలను గాజు తొట్టి (అక్వేరియమ్స్)లో ఉంచుతున్నారు.

వ్యాపార సంస్థల్లోనూ..

అక్వేరియంలను ఇంటితో పాటు వ్యాపార సంస్థల్లో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. వ్యాపారాభివృద్ధి కోసం వ్యాపారులు అక్వేరియంలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాపార సంస్థలు, ఇళ్లల్లో స్థలానికి అవసరమైన ప్రమాణంలో అక్వేరియంలు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. అందంతో పాటు, ఆదాయం వృద్ధి చెందుతుందని, వాస్తు దోషాలకు విరుగుడుగా ఉంటుందని నమ్మే వారు వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. అలాగే చిన్నపిల్లలు నీటిలో తిరిగే చేపలను చూడడానికి ఇష్టపడతారు. ఇంట్లో చిన్నపిల్లల కోరికను తీర్చేందుకు కూడా వీటిని ఇంట్లో ఏర్పాటు చేసుకుంటున్నారు.

పెరుగుతున్న ఆసక్తి

అక్వేరియం ఏర్పాటు వెనుక కొన్ని వాస్తు నమ్మకాలు దాగున్నాయి. చైనీస్ వాస్తు ప్రకారం చేపలు అదృష్టానికి, నీరు సంపదకు గుర్తుగా భావిస్తారు. ఈ రెంటినీ కలిపి ఒకే చోట (అక్వేరియంలో) ఉంచుకుని సంపద వృద్ధిని ఆకాంక్షిస్తున్నారు. చేపలు ఎప్పుడూ కళ్లు తెరిచే స్వభావాన్ని కలిగి ఉండడంతో మనకు జరగబోయే ఆటంకాలను ముందుగా గ్రహించి కదలికలతో సమాచారం అందిస్తాయనే నమ్మకం ఉంది. అధిక లాభాలను ఆర్జించవచ్చనే నమ్మకంతో వ్యాపార సంస్థలు సైతం అక్వేరియంలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. అక్వేరియంల పట్ల ప్రజల్లో ఆసక్తి పెరుగుతుంది. అందుకు అనుగుణంగా స్వదేశీ, విదేశీ చేపలు నేడు మార్కెట్‌లో లభిస్తున్నాయి. దేశంలోని చెన్నై, కోల్‌కతా తదితర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర దేశాల చేపలను కూడా వ్యాపారస్తులు విక్రయిస్తున్నారు.



ఉపాధికి మార్గంగా..

అక్వేరియంలో ఉంచేందుకు పలు రకాల చేపలను మార్కెట్‌లో అమ్మకాలు చేస్తున్నారు. స్కాట్‌ఫిష్, గోల్డ్‌ఫిష్, అరోవనా, రెడ్‌క్యాప్, గుప్పీస్, వైట్ ఏంజల్, బెలూన్‌ఫిష్, బ్లాక్‌గోల్డ్ ఫిష్, బ్లాక్ షార్క్, ఫ్లోరాస్, క్రోకడైల్ ఫిష్ వంటి 40 రకాల చేపలు లభిస్తున్నాయి. రూ.10 నుంచి రూ.20 వేల వరకు వివిధ ధరల్లో పలు రకాల చేపలు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. వీటితో పాటు పలు రకాల మోడళ్లలో అక్వేరియంలు కూడా లభ్యమవుతున్నాయి.



ఆకట్టుకుంటున్న అక్వేరియం

సమయం తెలియదు



అక్వేరియంలో చేపల పెంచడం అంటే చాలా ఇష్టం. వాటిని చూస్తుంటే కాలం తెలియదు. వాటిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

– పేకేటి వీరబాబు, వ్యాపారి, రాయవరం, కాకినాడ జిల్లా

అక్వేరియం కల్చర్ పెరిగింది



గత 28 ఏళ్లుగా అక్వేరియంలకు ఫిష్‌లను అమ్ముతున్నాను. సింగపూర్, మలేషియా, థాయ్‌లాండ్, చైనా దేశాల నుంచి చెన్నైకి దిగుమతి అవుతుంటాయి. ఇటీవల కాలంలో అక్వేరియం కల్చర్ పెరిగింది.

– సత్యవోలు శ్రీనివాసరావు,అక్వేరియం షాపు యజమాని, రామచంద్రపురం,కాకినాడ జిల్లా

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన గుజరాత్ సమగ్ర శిక్ష బృందం

సాక్షి, అమరావతి: గుజరాత్ సమగ్ర శిక్ష అధికారుల బృందం రెండురోజుల పర్యటనలో భాగంగా ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని కలపర్రు, కొవ్వలి జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు రెడ్డిగూడెం కేజీబీవీలను సందర్శించింది. మధ్యాహ్న భోజన పథకం, స్టూడెంట్ కిట్‌లను పరిశీలించారు. పాఠశాలల్లో అమలవుతున్న పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ విధానం, డిజిటల్ లెర్నింగ్ టెక్నిక్స్ అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం నాడు–నేడు కింద పాఠశాలల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, సైన్స్ ల్యాబ్స్ బాగున్నాయంటూ కితాబిచ్చారు. గుజరాత్ కేజీబీవీల్లో వసతి ఒక చోట, చదువు మరొక చోట ఉంటుందని, ఏపీలో మాత్రం కేజీబీవీల్లో చదువుకునే చోటే వసతితో పాటు, నిత్యం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు నర్స్, నైట్ డ్యూటీ స్టాఫ్ వంటివి సౌకర్యాలు ఏర్పాటు చేసి బాలికల భద్రతకు భరోసాగా నిలుస్తున్నారన్నారు. సాల్ట్ కార్యాలయాన్ని సందర్శించి, ఎఫ్ఎల్ఎన్ కిట్, కెరీర్ గైడెన్స్ మాడ్యూల్స్, గిరిజన మాతృ భాషల పుస్తకాలను పరిశీలించి బాగున్నాయని కితాబిచ్చారు.

మద్దిలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెంలోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాత సేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్రోత్సవాల్లో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, వాస్తు పూజ, అగ్ని ప్రతిష్ట, వాస్తు హోమం, సూత్ర గ్రహణం, ప్రోక్షణ, గ్రంధి బంధనం, చతుర్వేదాధ్యయనం, ద్వాదశ సూక్త పారాయణ, ఏతత్ ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలు నిర్వహించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆర్‌వీ చందన తెలిపారు.



గజ గణపతి!

కాణిపాకం: చిత్తూరు జిల్లా కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం గజవాహనంపై ఊరేగుతూ స్వామివారు కనువిందు చేశారు. ఉదయం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ మూర్తులను సర్వంగా సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు. తదనంతరం పురవీధుల్లో ఊరేగించారు. రాత్రి అలంకార మండపంలో గణనాథుని ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, పరిమళభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. తర్వాత ఉభయదారులు, ఆలయ అధికారులు ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చి గజ వాహనంపై కొలువు దీర్చారు. సాంస్కృతిక ప్రదర్శనలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల నడుమ ఊరేగింపు చేపట్టారు. గజాధీశుని మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించి భక్తులు ఆనందపరవశులయ్యారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు



తిరుమల : తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,384 మంది స్వామి వారిని దర్శించుకోగా 22,512 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.03 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం అవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

రూ.1.25 కోట్లతో గణనాథుడికి అలంకారం



గుంటూరు రత్నగిరి కాలనీలో కొలువైన వినాయక విగ్రహాన్ని మంగళవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. రత్నగిరి కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మంగళవారం గణనాథుడిని రూ.1.25 కోట్ల కరెన్సీతో అలంకరించి.. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. -నగరంపాలెం (గుంటూరు వెస్ట్)

క్షీరారామలింగేశ్వర స్వామికి శివ సహస్ర నామ పూజలు

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని పంచారామ క్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సప్త సోమవారాల ప్రదక్షిణల్లో పాల్గొని ఏడు సోమవారాలు పూర్తిచేసుకున్న భక్తులు మంగళవారం శివ సహస్ర నామ పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ అభిషేక పండితులు భమిడపాటి వెంకన్న తదితరులు పర్యవేక్షించారు.



జయమంగళ వెంకటరమణ రాజీనామా లేఖపై కౌంటర్ వేయండి

మండలి చైర్మన్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎమ్మెల్సీ పదవికి తాను సమర్పించిన రాజీనామా లేఖ విషయంలో చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకునేలా శాసనమండలి చైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ జయ మంగళ వెంకటరమణ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తదుపరి విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేసేందుకు మండలి చైర్మన్‌కు గడువునిచ్చింది. చైర్మన్ కౌంటర్ దాఖలు చేసిన తర్వాత పూర్తిస్థాయిలో విచారణ జరుపుతామంది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి కృష్ణా జిల్లా , కైకలూరుకు చెందిన జయమంగళ వెంకటరమణ వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్సీ అయ్యారు. గత ఏడాది నవంబర్‌లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ రాజీనామాపై మండలి చైర్మన్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తన రాజీనామా లేఖపై తగిన నిర్ణయం తీసుకునేలా మండలి చైర్మన్‌ను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యం మంగళవారం మరోసారి విచారణకు వచ్చింది.

సాగుబడి

పుబ్బ కార్తె:
సెప్టెంబర్ 13 వరకు



ఫారిన్ నుంచి పొలం బడికి!

యునైటెడ్ కింగ్‌డమ్‌లో పరుగు పందెం వంటి జీవితంతో విసిగిపోయిన రెనాటా, శ్రీధర్ తమ ముగ్గురు పిల్లలను తీసుకొని తమిళనాడు గ్రామీణ ప్రాంతానికి వచ్చి ఐదు దొంతర్ల ఉద్యాన క్షేత్రాన్ని నిర్మించుకున్నారు. శ్రీధర్‌ది తమిళనాడు, రెనాటాది యూకే. వారికి ముగ్గురు పిల్లలు. ప్రకృతికి దూరంగా జీవించటం ఇష్టం లేక... ఐదు గురూ నేరుగా వచ్చి పొలంలోకి కాలు మోపారు. కోవిడ్‌కు ముందే వాళ్ళు ఈ పని చెయ్యటం వారి తెగువకు నిదర్శనం. పిల్లల్ని ఫార్మల్ స్కూల్‌కు పంపకుండా తమ ఫామ్‌లోనే వారికి పాఠాలు నేర్పిస్తున్నారు. పంటలతో పాటు పిల్లలనూ ఆనందంగా తమకు ఇష్టమైన విధంగా పెంచుతున్నారు!



తాము వ్యవసాయం నేర్చుకుంటూనే తద్వారా పిల్లలకు అన్ని సబ్జెక్టులూ బోధిస్తున్నారు. పనిలో పనిగా బంజరు భూమిని చక్కని 'ఆహారపు అడవి'గా మార్చారు. పంటలతో పాటు సహజమైన చదువు కూడా సజావుగా సాగుతోంది!!

ఈ పొలం బడిలో తరగతి గదులు, చాక్‌బోర్డులు ఉండవు. కేవలం విరామాలు.. అర్థవంతమైన కథల ద్వారా నేర్చుకోవటం ఉంటుంది. వారి పిల్లలు సెయిలింగ్ నేర్చుకోవాలని అడిగినప్పుడు, అది తదుపరి పాఠంగా మారింది. కఠినమైన పాఠ్యాంశాలతో కాకుండా ఆసక్తి, అనుభవంతో వారి విద్య రూపుదిద్దుకుంటున్నది.

తమ ఆహారాన్ని తామే పండించుకోవటం ప్రారంభించారు. కొద్ది కాలంలోనే బంజరు భూమి పచ్చని పంటలతో నిండిపోయింది. రసాయనాలు వాడకుండా పండిస్తారు. చేతితో తయారు చేసిన వ్యవసాయ ఉత్పత్తుల శ్రేణిని అమ్మటం ప్రారంభించారు. సాగు నుంచి ప్యాకేజింగ్ వరకు ప్రతిదీ ప్రకృతికి అనుగుణంగా చేతులతోనే చేస్తారు. యంత్రాలు వాడరు. భూమి పట్ల గౌరవంతో ఉంటారు.

పచ్చని ఆహార అడవిలో దొంతర్ల వారీగా అనేక రకాల పంటలు, చెట్లు పెంచారు. అరటి, దానిమ్మతో పాటు మామిడి, పనస, టేకు వంటి ఎత్తైన చెట్లు, తులసి వంటి ఔషధ మూలికలు, తీగజాతి పంటలు, పప్పుధాన్యాలు, పైనాపిల్స్ వంటి నేలపై తక్కువ ఎత్తులో పెరిగే పంటలతో ఆ తోటను నింపేశారు.

దుంప జాతి కూరగాయలను పండిస్తారు. పశువుల ఎరువు, మల్చింగ్ పద్ధతులు, వాన నీటి సంరక్షణ పద్ధతులతో నేలను, పనిలో పనిగా తమ జీవితాలను సుసంపన్నం చేసుకుంటున్నారు.

వీరి పద్ధతులు చూసి మొదట్లో స్థానికులు ఎగతాళి చేశారు. కానీ వారు తమ మార్గంలోనే కొనసాగుతున్నారు. నేడు, వారి పిల్లలు సాంప్రదాయ పాఠశాలకు వెళ్లకుండానే ఆంగ్లం, గణితం తదితర సబ్జెక్టులలో ఈడుకు తగ్గ నిష్ణాతులుగా మారారు.

రెనాటా, శ్రీధర్ భయాన్ని వీడి వట్టి కాళ్లతో వ్యవసాయం నేర్చుకున్నారు. వారు నేర్చుకోవడం కష్టతరమైంది. కానీ పిల్లలు ఏ కష్టం లేకుండా హాయిగా నేర్చుకుంటున్నారు. ఫలితంగా ఆ కుటుంబం శాంతంగా, ఆనందంగా జీవిస్తోంది!

బాగుంది కదూ.. భయాన్ని వదిలితే పోయేదేం లేదు, బాధ తప్ప అని రుజువు చేస్తున్న ఈ ఆదర్శ దంపతులు, ఆదర్శ తల్లిదండ్రులకు జేజేలు!



ఆక్వా రైతుకు బీమా రక్షణ

మన దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ఆక్వా సాగు ఒకటి. చేపలు, రొయ్యలు, సముద్ర మొక్కలు (సీవీడ్స్) వంటి జల ఉత్పత్తులు మానవ ఆహార భద్రతకే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా పునాదిగా నిలుస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో రొయ్యల ఉత్పత్తిలో అగ్రగామిగా ఉండి 'ఆక్వా రాజధాని'గా పేరు తెచ్చుకుంది. అయితే, ఈ రంగం వ్యాధులు, తుఫాన్లు, వరదలు, ఉప్పెనలు, వర్షాభావం వంటి సహజ, అసహజ కారణాల వలన తరచుగా నష్టాలను ఎదుర్కొంటోంది. పెట్టుబడులు భారీగా పెట్టిన రైతులు ఒక్కసారిగా నష్టపోతే వారి జీవనాధారం దెబ్బతింటుంది. ఇలాంటి ప్రమాదాల నుండి రక్షణ పొందడానికి 'ఆక్వాకల్చర్ ఇన్సూరెన్స్ (ఆక్వా సాగు బీమా)' కీలకం.

రోజులను బట్టి ప్రీమియం

రొయ్య పిల్లల సాంద్రత, ఎన్ని రోజులకు బీమా కావాలని అనుకుంటున్నారో దాన్నిబట్టి ప్రీమియం మారుతూ ఉంటుంది.

టైగర్ రొయ్యలు	తెల్లరొయ్య (ఇండికస్)	వెనామీ రొయ్యలు
10 పిల్లలు/ చ.మీ.	40 పిల్లలు/ చ.మీ.	60 పిల్లలు/ చ.మీ.

పీఎంఎంఎస్‌వై ద్వారా బీమా

ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం కింద ఆక్వాకల్చర్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టింది ● ముఖ్యంగా బ్రాకిష్ వాటర్ (ఉప్పునీటి) రొయ్యల రైతులు కవరేజి పొందుతారు ● వ్యాధులు, తీవ్రవాదం, భూకంపం, వర్షం, తుఫాన్లు, ప్రకృతి విపత్తుల కారణంగా జరిగే నష్టాలకు ఆర్థిక పరిహారం అందుతుంది ● ప్రస్తుతం ఈ పథకం ఆంధ్రప్రదేశ్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో అమలవుతోంది ● అమలుకు హైదరాబాద్‌లోని జాతీయ మత్స్యాభివృద్ధి బోర్డు (ఎన్‌ఎఫ్‌డీబీ) ప్రధాన ఏజెన్సీగా వ్యవహరిస్తూ చెన్నైలోని ఐసీఏఆర్–కేంద్రీయ ఉప్పునీటి ఆక్వాకాల్చర్ సంస్థ (సీఐబీఏ) ద్వారా ఈ బీమా స్కీంను అమలు చేయడానికి గుర్తించారు ● పాలసీ గరిష్ట వ్యవధి: సీడ్‌ను స్టాక్ చేసినప్పటి నుండి 130–180 రోజులపాటు ● పాలసీ కేవలం ఇన్‌పుట్ ఖర్చును మాత్రమే కవర్ చేస్తుంది.

ఆక్వా పథకం ముఖ్య విశేషాలు...

● చేపలు, రొయ్యలు, ఇతర జల చరాలకు బీమా రక్షణనిస్తుంది ● ట్యాంకులు, చెరువులు, ఎయిరేటర్లు, పైపులైన్లు మొదలైన మౌలిక సదుపాయాలకు ఆర్థిక మద్దతునిస్తుంది ● 1.5% నుంచి 3% మేరకు తక్కువ ప్రీమియం రేట్లకే పాలసీ ఇస్తారు ● ప్రభుత్వ సబ్సిడీ అందుబాటులో ఉండటం.

ఆంధ్రప్రదేశ్ రైతుల్లో అనాసక్తత

ఆంధ్రప్రదేశ్‌లో రొయ్యల సాగు అత్యంత విస్తృతంగా జరుగుతోంది. అందువల్లే పీఎంఎంఎస్‌వై కింద బీమా పథకాన్ని ఇక్కడ మొదట ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. అయితే, రైతుల్లో బీమాపై ఆసక్తి తక్కువగా ఉంది. దీనికి గల ప్రధాన కారణాలు: 1. ప్రీమియం రేట్లు ఎక్కువగా ఉండటం. 2. క్లెయిం ప్రక్రియ క్లిష్టతరం. 3. బీమా గురించి రైతుల్లో సరైన అవగాహన లేకపోవడం.

ప్రైవేట్ బీమా కంపెనీల పాత్ర

ప్రభుత్వ పథకాలతో పాటు కొన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలు కూడా ఆక్వాకల్చర్ బీమా పాలసీలను ఇస్తున్నాయి.

- కొన్ని కంపెనీలు ఉప్పు మంచినీటి చేపలు, రొయ్యల రైతులకు బీమా ఇస్తున్నాయి.
- పాలసీ కవరేజ్‌లో వ్యాధులు, ప్రకృతి విపత్తులు, ఉత్పత్తి నష్టాలు ఉంటాయి.
- కంపెనీని బట్టి ప్రీమియం రేట్లు, నిబంధనలు మారుతాయి. సరైన ఎంపిక ముఖ్యం.

ఆక్వా బీమా అవసరం ఏమిటి?

1. వ్యాధులు, వాతావరణ మార్పులు, నీటి నాణ్యత సమస్యల వల్ల వచ్చే నష్టాలకు బీమా ఆర్థిక రక్షణ కల్పిస్తుంది
2. మౌలిక వసతులపై రైతుల పెట్టుబడులను కాపాడుతుంది.
3. పెట్టుబడిదారుల్లో ఆక్వా రంగంపై నమ్మకం పెరిగి ఈ రంగంలోకి మరిన్ని పెట్టుబడులు వస్తాయి.
4. అనుకోని నష్టాల నుంచి రైతులు తిరిగి కోలుకోవడానికి సహాయం చేస్తుంది.

ప్రధాన సవాళ్లు

1. ప్రమాదాల అంచనాకు తగినంత నమ్మకమైన గణాంకాలు అందుబాటులో లేకపోవడం.
2. రైతుల్లో బీమా విధానంపై అవగాహన లోపించడం. ప్రయోజనాలను పూర్తిగా అర్థం చేసుకోలేకపోవడం.
3. అధిక ప్రమాదంలో ఉన్న ఆక్వా రైతులే ఎక్కువగా బీమా చేయించుకోవడం వల్ల ప్రీమియం పెరగడం.
4. ప్రీమియం వసూలు, క్లెయిమ్ ప్రాసెసింగ్ సకాలంలో జరగకపోవడం.

క్లెయిమ్ ప్రక్రియ

1. నష్టం జరిగిన 24–48 గంటల్లోనే బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి.
2. క్లెయిమ్ ఫారమ్, సంఘటన వివరాలు, ఫోటోలు సమర్పించాలి.
3. బీమా సంస్థ, ఫిషరీస్ విభాగం అధికారులతో కలిసి సైట్ ఇన్‌స్పెక్షన్ చేస్తుంది.
4. నష్టం అంచనా వేసి ధృవీకరిస్తారు.
5. పరిహారం 15–30 రోజుల్లో రైతు బ్యాంక్ ఖాతాలో జమవుతుంది.

ప్రీమియంపై సబ్సిడీ

● సాధారణ ఆక్వా రైతులు బీమా మొత్తంలో సుమారు 3%–4.5%. కంపెనీని బట్టి కవరేజ్ మారుతుంది ● ప్రభుత్వం 40% వరకు ప్రీమియం రాయితీని భరిస్తుంది ● కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా చెల్లింపులు లేదా బ్యాంక్ బదిలీలకు అవకాశం ఉంది.

రైతులకు సూచనలు

- స్థానిక ఫిషరీస్ శాఖ ద్వారా బీమా పథకం వివరాలు తెలుసుకోవాలి.
- ప్రైవేట్ కంపెనీల పాలసీలను పోల్చి, సరైన దాన్ని ఎంచుకోవాలి.
- ఎన్‌ఎఫ్‌డీబీ, ఎఫ్‌ఏవో, ఎన్జీవోలు నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో పాల్గొనాలి.
- 'సమూహ బీమా' కొనుగోలు ద్వారా ప్రీమియం తగ్గించుకోవచ్చు.
- అయితే, బీమా చేసిన రైతులు అందరూ తప్పనిసరిగా 'ఫామ్ రికార్డులు' సక్రమంగా రాయాలి. చెరువు తయారీ, సీడ్ కొనుగోలు, స్టాకింగ్ సాంద్రత, నీటిగుణాలు, మేత యాజమాన్యం, ఆరోగ్య స్థితి, వ్యాధులు, వాడిన మందులు /రసాయనాలు, వాతావరణ హెచ్చరికలు, తీసుకున్న జాగ్రత్తలు వంటి విషయాలన్నీ నమోదు చేయాలి. ఇది భవిష్యత్తులో మీకు ఎంతో ఉపయోగపడుతుంది.

అర్హత ప్రమాణాలు...

● భారత పౌరులు మాత్రమే అర్హులు ● ఆక్వా సాగులో చురుకుగా నిమగ్నమై ఉండాలి ● సాగు ప్రాంతంపై యాజమాన్యం/లీజు హక్కులను తెలిపే ఆధారాలు ఉండాలి ● శాస్త్రీయ మార్గదర్శకాల ప్రకారం నీటి వనరులు సిద్ధం చేసి ఉండాలి ● స్థానిక ఫిషరీస్ డిపార్ట్‌మెంట్‌లో నమోదు తప్పనిసరి ● సీడ్ వేయటానికి ముందు మాత్రమే బీమా తీసుకోవాలి.

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాకల్చర్ బీమా ఇంకా ప్రయోగాత్మక దశలో ఉన్నప్పటికీ, ఇది రైతులకు భవిష్యత్తులో అత్యంత ఉపయోగకరమైన ఆర్థిక రక్షణ సాధనంగా మారబోతోంది. ప్రస్తుతం అవగాహన లోపం, ప్రీమియం అధికం, క్లెయిమ్ ప్రక్రియలో కష్టాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వం, ప్రైవేట్ కంపెనీలు, రైతుల చురుకైన భాగస్వామ్యంతో ఈ పథకం విస్తృతంగా అమలైతే ఆక్వా రైతులు మరింత ధైర్యంగా, స్థిరంగా సాగు చేయగలుగుతారు. దీనితోపాటు, పెట్టుబడులు పెరిగి, ఆహార భద్రత బలపడే అవకాశం ఉంది. ఈ విధంగా, ఆక్వాకల్చర్ ఇన్సూరెన్స్ భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగానికి ఒక ఆర్థిక భద్రతా కవచంగా నిలుస్తుంది.

మరిన్ని వివరాల కోసం రైతులు సమీప మత్స్య శాఖను గాని, ఎన్‌ఎఫ్‌డీబీని గాని, బీమా ఏజన్సీలను గాని సంప్రదించవచ్చు. బీమా కవరేజి విధానంలో ఉండే అంతర్గత చిక్కుముడుల గురించి రైతులు జాగ్రత్తగా తెలుసుకోవాలి.

– డా. పి. రామమోహన్ రావు (9885144557),
విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్, కాకినాడ

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్



బిజినెస్ రీల్

భారత్‌లో నౌకల తయారీపై మిత్సుయి ఓఎస్‌కే చర్చలు



న్యూఢిల్లీ: జపాన్ షిప్పింగ్ దిగ్గజం మిత్సుయి ఓఎస్‌కే లైనర్స్ (ఎంవోఎల్) భారత్‌లో నౌకల తయారీకి సంబంధించి ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతోంది. అలాగే త్వరలో రైల్వే లాజిస్టిక్స్ విభాగంలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. ఎంవోఎల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ఆఫీసర్ కెప్టెన్ ఆనంద్ జయరామన్ ఈ విషయాలు తెలిపారు. 141 ఏళ్ల చరిత్ర గల ఎంవోఎల్ ప్రస్తుతం భారత్‌లో నాలుగో అతి పెద్ద షిప్‌ఓనర్‌గా కార్యకలాపాలు సాగిస్తోందని, రెండో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా నిర్దేశించుకుందని ఆయన వివరించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్‌కి త్వరలో మధ్య స్థాయి షిప్ ట్యాంకర్ల కోసం ఆర్డర్లు ఇవ్వనున్నట్లు జయరామన్ చెప్పారు. మరోవైపు, భారత్‌లో 3-4 స్టార్టప్స్‌లో కూడా ఎంవోఎల్ ఇన్వెస్ట్ చేసే యోచనలో ఎంవోఎల్ ఉన్నట్లు ఆయన వివరించారు. భారీగా పెట్టుబడులు అవసరమయ్యే నౌకల నిర్మాణం మార్కెట్లో ప్రస్తుతం చైనా, దక్షిణ కొరియా, జపాన్ ఆధిపత్యం ఉండగా, భారత్ వాటా ఒక్క శాతం లోపే ఉంది.

తక్కువ ద్రవ్యోల్బణం, ముందస్తు ఎగుమతుల ఫలితం

జీడీపీ వృద్ధి రేటుపై నోమురా విశ్లేషణ



ముంబై: భారత జీడీపీ జూన్ త్రైమాసికంలో 7.8 % స్థాయిలో బలమైన పనితీరు చూపించడం విధానచర్యల ఫలితంగా భావించరాదని జపాన్ బ్రోకరేజీ సంస్థ నోమురా పేర్కొంది. ద్రవ్యల్బణం కనిష్ఠ స్థాయిలో ఉండడానికి తోడు అమెరికా టారిఫ్‌లు అమల్లోకి రావడానికి ముందుగా చోటుచేసుకున్న ఎగుమతుల వల్ల బలమైన వృద్ధి రేటు నమోదైనట్టు తెలిపింది. ఎగుమతులు, దేశీ డిమాండ్‌ను పెంచేందుకు విధానపరమైన చర్యలు అవసరమని సూచించింది. అలాగే, రెపో రేటును మరో 50 బేసిస్ పాయింట్ల మేర (0.50 శాతం) తగ్గించి 5 శాతానికి తీసుకురావాలని, మరిన్ని దేశాలకు ఎగుమతులను విస్తరించుకోవాలని.. ప్రభావిత ఎగుమతిదారులకు రుణాలు, ఆర్థికపరమైన అండగా నిలవాలని పేర్కొంది. ''భారత ఆర్థిక ప్రగతి చక్రం విషయమై మా దృక్పథంలో ఎలాంటి మార్పు లేదు. అయితే, క్యూ1లో అధిక జీడీపీ నమోదైన నేపథ్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటును 6 శాతం నుంచి 6.6 శాతానికి సవరిస్తున్నాం. క్యూ1లో జీడీపీ 7.8 శాతం వృద్ధి వెనుక బలమైన డిమాండ్ ఉన్నట్టు భావించరాదు. అధిక టారిఫ్‌ల ప్రభావం సెప్టెంబర్ తర్వాతే కనిపించనుంది. 2025-26 క్యూ2లో జీడీపీ వృద్ధి 7.4 శాతానికి, క్యూ3లో 6 శాతానికి, క్యూ4 (మార్చి త్రైమాసికం)లో 5.6 శాతానికి తగ్గుతుంది''అని నోమురా తన నివేదికలో తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-9-2025	
విశాఖ	575-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570-00
విజయవాడ	570-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	1,105.50	2.77
NESTLEIND	1,200.50	2.22
POWERGRID	286	2.2
NTPC	336.65	1.8
TATASTEEL	158.45	1.46

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,250.00	-2.34
M&M	3,238.00	-2.33
ICICIBANK	1,391.00	-1.42
ASIANPAINT	2,538.00	-1.25
CIPLA	1,568.00	-1.21

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,895
ఎన్ఎస్ఈ	93,245
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,62,773
ఎఫ్ఐఐ	- 1,159
డీఐఐ	+ 2,560

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.62	$ 64.01
బ్రెంట్	69.18	$ 68.15

ఐపీవోలకు కంపెనీల క్యూ..!

కొద్ది నెలలుగా జోరు చూపుతున్న ప్రైమరీ మార్కెట్లు మరోసారి కళకళలాడనున్నాయి. ఇందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా 13 కంపెనీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం దోహదపడనుంది. ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ మెయిన్ బోర్డులో 50 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యాయి. వీటిలో అత్యధికంగా 12 కంపెనీలు గత నెల(ఆగస్ట్)లోనే ఐపీవోలు చేపట్టడం గమనార్హం! వివరాలు చూద్దాం..

13 ఇష్యూలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

- జాబితాలో అర్బన్ కంపెనీ, బోట్, మారి టెక్
- జూనిపర్ గ్రీన్, పేస్ డిజిటెక్, అల్‌కెమ్ లైఫ్
- రూ. 15,000 కోట్ల సమీకరణకు ప్రణాళికలు
- ఈ ఏడాది ఇప్పటిదాకా 50 లిస్టింగ్స్



న్యూఢిల్లీ: ఐపీవో చేపట్టేందుకు సెబీ తాజాగా అనుమతించిన సంస్థల జాబితాలో అర్బన్ కంపెనీ, ఇమేజిన్ మార్కెటింగ్, జూనిపర్ గ్రీన్ ఎనర్జీ, జైన్ రిసోర్స్ రీసైక్లింగ్, మారి టెక్, రవి ఇన్‌ఫ్రా బిల్డ్ ప్రాజెక్ట్స్, పేస్ డిజిటెక్, ఓమ్నిటెక్ ఇంజినీరింగ్, కరోనా రెమిడీస్, కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్, అల్‌కెమ్ లైఫ్‌సైన్స్, ప్రయారిటీ జ్యువెల్స్, ఓమ్ ఫ్రైట్ ఫార్వార్డర్స్ చేరాయి. ఈ కంపెనీలన్నీ ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో లిస్టయ్యే ప్రణాళికల్లో ఉన్నాయి.

గత నెలలోనే..

లిస్టింగ్ బాట పట్టిన కంపెనీలన్నీ ఆగస్ట్ 1-29 మధ్య సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. తద్వారా నిధుల సమీకరణకు తాజాగా అనుమతి పొందాయి. మర్చంట్ వర్గాల అంచనాల ప్రకారం ఈ 13 కంపెనీలు ఉమ్మడిగా రూ. 15,000 కోట్లకుపైగా సమీకరించనున్నాయి. ఇష్యూ నిధులను పలు కంపెనీలు రుణ చెల్లింపులకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నాయి. ఆయా కంపెనీలలోని ప్రస్తుత వాటాదారులు ఐపీవోలో షేర్లను ఆఫర్ చేయడం ద్వారా పెట్టుబడులను విక్రయించనున్నారు.

రూ. 1,900 కోట్లపై కన్ను

యాప్ ఆధారంగా బ్యూటీ, హోమ్ సర్వీసులందించే అర్బన్ కంపెనీ పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ. 429 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా ప్రస్తుత ఇన్వెస్టర్లు మరో రూ. 1,471 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ రూ. 1,900 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. వాటాలు ఆఫర్ చేయనున్న సంస్థలలో యాక్సెల్ ఇండియా, ఎలివేషన్ క్యాపిటల్ తదితరాలున్నాయి.

ఇమేజిన్ మార్కెటింగ్

బోట్ బ్రాండుతో ఆడియో, వేరబుల్ ప్రొడక్టులు రూపొందిస్తున్న ఇమేజిన్ మార్కెటింగ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ప్రాస్పెక్టస్ ప్రకారం తద్వారా రూ. 2,000 కోట్లు సమకూర్చుకునే సన్నాహాల్లో ఉంది. కంపెనీ గోప్యతా మార్గంలో ఐపీవోకు దరఖాస్తు చేసింది.

రెనెవబుల్ ఎనర్జీ

పునరుత్పాదక ఇంధన(రెనెవబుల్ ఎనర్జీ) రంగ కంపెనీ జూనిపర్ గ్రీన్ ఎనర్జీ ఐపీవో ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించడంపై కన్నేసింది. ఇందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది.

మెటల్ గ్రూప్ నుంచి

జైన్ మెటల్ గ్రూప్ కంపెనీ జైన్ రిసోర్స్ రీసైక్లింగ్ ఐపీవోకు సిద్ధపడుతోంది. దీనిలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో రూ. 1,500 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. తద్వారా రూ. 2,000 కోట్ల సమీకరణకు తెర తీయనుంది.

ఫార్మా కంపెనీలు

తాజాగా లిస్టింగ్‌కు అనుమతి పొందిన ఫార్మాస్యూటికల్ రంగ కంపెనీల తీరిలా ఉంది. కరోనా రెమిడీస్ ఐపీవో ద్వారా రూ. 800 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఇందుకు వీలుగా ప్రస్తుత వాటాదారులు షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఫార్మా సంబంధ ఏపీఐ, స్పెషాలిటీ కెమికల్స్ తయారు చేసే అల్‌కెమ్ లైఫ్‌సైన్స్ ఐపీవోలో భాగంగా రూ. 190 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు మరో 71.55 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు.

రూ. 1,500 కోట్లకు రెడీ

గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ ఐటీ సొల్యూషన్స్ అందించే మారి టెక్ లిమిటెడ్ లిస్టింగ్ బాటలో సాగుతోంది. ఐపీవోలో భాగంగా రూ. 250 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా రూ. 1,250 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా రూ. 1,500 కోట్లు అందుకోవాలని చూస్తోంది.

విడిభాగాల కంపెనీ

ప్రెసిషన్ ఇంజినీర్డ్ విడిభాగాలు రూపొందించే ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ ఐపీవో ద్వారా రూ. 850 కోట్లు సమీకరించడంపై దృష్టి పెట్టింది. ఇష్యూలో భాగంగా రూ. 520 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 330 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ ఆఫర్ చేయనున్నారు.

ఇతర సంస్థల తీరిలా

నిర్మాణ రంగ కంపెనీ రవీ ఇన్‌ఫ్రాబిల్డ్ ప్రాజెక్ట్స్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 1,100 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. టెలికం ప్యాసివ్ మౌలికసదుపాయాల సంస్థ పేస్ డిజిటెక్ సైతం ఐపీవోలో భాగంగా ఈక్విటీ జారీ(కొత్తగా) ద్వారానే రూ. 900 కోట్లు సమకూర్చుకునే ప్రణాళికలు వేసింది. ఈ బాటలో వైర్ల తయారీ సంస్థ కేఎస్‌హెచ్ ఇంటర్నేషనల్ ఐపీవోలో భాగంగా రూ. 420 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 325 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. తద్వారా రూ. 745 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. బంగారు ఆభరణ తయారీ కంపెనీ ప్రయారిటీ జ్యువెల్స్ ఐపీవో ద్వారా 54 లక్షల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. థర్డ్‌పార్టీ లాజిస్టిక్స్ అందించే ఓమ్ ఫ్రైట్ ఫార్వార్డ్స్ ఐపీవోలో భాగంగా రూ. 25 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు ప్రమోటర్లు మరో 72.5 లక్షల షేర్లను ఆఫర్ చేయనున్నారు.

టాటా క్యాపిటల్ రోడ్‌షోలు షురూ

- దేశ, విదేశాలలో సమావేశాలు
- ఈ నెల 22న పబ్లిక్ ఇష్యూ
- రూ. 17,200 కోట్ల సమీకరణ
- 18 బిలియన్ డాలర్లకు విలువ



న్యూఢిల్లీ: ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూ సన్నాహాలను వేగవంతం చేసింది. అంతర్జాతీయంగా ప్రధాన ఫైనాన్షియల్ కేంద్రాలలో ఇన్వెస్టర్ రోడ్‌షోలకు తెరతీసింది. తద్వారా ఈ నెల 22న ప్రారంభంకానున్న ఐపీవోకు దారిని ఏర్పాటు చేసుకుంటోంది. నిజానికి ఆగస్ట్‌లోనే ప్రారంభించిన రోడ్‌షోలకు దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి పటిష్ఠ ప్రతిస్పందన లభిస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. హాంకాంగ్, సింగపూర్, లండన్, న్యూయార్క్‌సహా దేశీయంగా కీలక నగరాలలో సీనియర్ మేనేజ్‌మెంట్ సమావేశాలను ఏర్పాటు చేస్తోంది. కంపెనీకిగల డైవర్సిఫైడ్ పోర్ట్‌ఫోలియో, పటిష్ఠ ఫైనాన్షియల్స్, డిజిటల్ ఫస్ట్ వృద్ధి వ్యూహాలను రోడ్‌షోలలో ప్రదర్శిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో కంపెనీ విలువ 18 బిలియన్ డాలర్లకు చేరనున్నట్లు అంచనా వేశాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో కంపెనీ ఐపీవోకు దరఖాస్తు చేసినప్పుడు 11 బిలియన్ డాలర్ల విలువను అంచనా వేసిన సంగతి తెలిసిందే.

ఐపీవో వివరాలివీ

ఐపీవోలో భాగంగా టాటా క్యాపిటల్ మొత్తం 47.58 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిలో 21 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుంది. మరో 26.58 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. టాటా సన్స్ 23 కోట్ల షేర్లు, ఐఎఫ్‌సీ 3.58 కోట్ల షేర్లు విక్రయానికి ఉంచనున్నాయి. తద్వారా టాటా గ్రూప్ దిగ్గజం 2 బిలియన్ డాలర్లు(రూ. 17,200 కోట్లు) సమీకరించే యోచనలో ఉంది. నెలాఖరు(30)కల్లా కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానున్నట్లు అంచనా. కంపెనీలో ప్రస్తుతం టాటా సన్స్ వాటా 88.6 శాతంకాగా.. ఐఎఫ్‌సీ 1.8 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను భవిష్యత్ పెట్టుబడి అవసరాలకుగాను టైర్-1 మూలధన పటిష్టతకు వినియోగించనుంది. లిస్టింగ్ విజయవంతమైతే దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద ఐపీవోగా రికార్డ్ నెలకొల్పనుంది. 2023 నవంబర్‌లో టాటా టెక్నాలజీస్ లిస్టయ్యాక, తిరిగి టాటా గ్రూప్ నుంచి మరో దిగ్గజం ఐపీవోకు రానుండటం ప్రస్తావించదగ్గ అంశం! 2022 సెప్టెంబర్‌లో అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీగా గుర్తింపు పొందిన టాటా క్యాపిటల్ ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం 2025 సెప్టెంబర్ లోగా ఐపీవో చేపట్టవలసి ఉంది. ఇప్పటికే అప్పర్‌లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్(హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సంస్థ), బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో కంపెనీ ఆదాయం రూ. 7,692 కోట్లకు చేరగా.. రూ. 1,041 కోట్ల నికర లాభం ఆర్జించింది.

బ్యాంకులు, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ

- ఎన్ఎస్ఈ వీక్లీ డెరివేటివ్స్ కాంట్రాక్టుల గడువు ముగింపు
- జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ప్రారంభం నేపథ్యంలో అప్రమత్తత
- సెన్సెక్స్ 207 పాయింట్ల పతనం; నిఫ్టీ నష్టం 45 పాయింట్లు



ముంబై: ఆఖరి గంటలో బ్యాంకులు, ఆటో షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ సూచీలు మంగళవారం నష్టాలతో ముగిశాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశ ప్రారంభం నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ 207 పాయింట్లు నష్టపోయి 80,158 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 45 పాయింట్లు పతనమై 24,580 వద్ద నిలిచింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 397 పాయింట్లు పెరిగి 80,761 వద్ద, నిఫ్టీ 131 పాయింట్లు బలపడి 24,756 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఎన్ఎస్ఈ వారాంతాపు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు కారణంగా ట్రేడింగ్ చివర్లో లాభాల స్వీకరణతో సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఆసియాలో జపాన్, కొరియా స్టాక్ సూచీలు లాభపడగా, చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు 2-1% పతనమయ్యాయి. అమెరికా సూచీలు ఒకశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- బీఎస్ఈ రంగాల వారీగా ఇండెక్సుల్లో బ్యాంకెక్స్ 0.68%, టెలికమ్యూనికేషన్ 0.59%, ఫైనాన్స్ సర్వీసెస్ 0.44%, టెక్ 0.28%, కన్జూమర్ డ్యూరబుల్స్ 0.13% నష్టపోయాయి. విద్యుత్, వినిమయ, ఎఫ్ఎంసీజీ, మెటల్, రియల్టీ, ఇంధన షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 0.64%, 0.27 శాతం రాణించాయి.

చక్కెర షేర్లకు భారీ డిమాండ్

కేంద్రం నవంబర్‌తో ప్రారంభ మయ్యే 2025-26 మార్కెటింగ్ సంవత్సరం నుంచి చక్కెర మిల్లులు, డిస్టిలరీలు తమ సామర్థ్యానికి తగ్గట్లు ఇథనాల్‌ను ఉత్పత్తి చేసుకునే సదుపాయాన్ని కల్పించడంతో చక్కెర షేర్లకు భారీ డిమాండ్ నెలకొంది. రాజశ్రీ షుగర్స్-కెమికల్స్ 20%, శ్రీ రేణుకా షుగర్స్ 13%, ద్వారికేష్ షుగర్స్ 12%, ధమ్‌పూర్ షుగర్స్ మిల్స్ 10%, శక్తి షుగర్స్ 8%, ర్యాలీ చేశాయి. అవధ్ షుగర్స్-ఎనర్జీ, బలరామ్‌పూర్ చినీ మిల్స్ 5%, బజాజ్ హిందుస్థాన్ షుగర్స్ 4%, మవానా షుగర్స్ 3.50%, ఉత్తమ్ షుగర్ మిల్స్ 2% రాణించాయి.

కొనసాగుతున్న రూపాయి పతనం

- మరో రికార్డు కనిష్టం వద్ద ముగింపు
- 5 పైసలు క్షీణించి 88.15కు చేరిక



ముంబై: రూపాయి కొత్త కనిష్టాల పతనం కొనసాగింది. భారత్-అమెరికాల వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితులు, దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో బలహీనతలతో మంగళవారం డాలర్ అయిదు పైసలు బలహీనపడి తాజా జీవితకాల కనిష్టం 88.15 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 10 క్షీణించి 88.20 వద్ద కనిష్టాన్ని తాకింది. ''రిస్క్ తీసుకునే సామర్థ్యం తగ్గడం, దిగుమతి కమోడిటీ ధరలు పెరగడంతో రూపాయి రోజంతా బలహీనంగా ట్రేడైంది. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ కొనసాగింది. అయితే విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలతో డాలర్లు పరిమితంగా ఉన్నాయి'' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ విశ్లేషకుడు దిలీప్ పార్మర్ తెలిపారు.

రియల్‌మీ నుంచి 15టీ స్మార్ట్‌ఫోన్..

ధర రూ. 18,999 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్స్ బ్రాండ్ రియల్‌మీ తాజాగా 15టీ ఫోన్‌ను ఆవిష్కరించింది. బ్యాంక్, ఎక్స్ఛేంజ్ ఆఫర్ల తర్వాత దీని ధర రూ. 18,999 నుంచి ప్రారంభమవుతుంది. ఇందులో 50 ఎంపీ ఫ్రంట్, రియర్ కెమెరాలు, 7000 ఎంఏహెచ్ టైటాన్ బ్యాటరీ, మీడియాటెక్ డైమెన్సిటీ 6400 మ్యాక్స్ 5జీ చిప్‌సెట్, అమోలెడ్ డిస్‌ప్లే తదితర ఫీచర్లు ఉన్నాయి. ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ వెబ్‌సైట్లలో సెప్టెంబర్ 6 నుంచి అమ్మకాలు ప్రారంభమవుతాయి.

మరో కొత్త గరిష్టానికి బంగారం

ఢిల్లీలో రూ.1,06,070




న్యూఢిల్లీ: బంగారం వరుసగా ఏడో రోజూ లాభపడింది. రూపాయి బలహీనతకు తోడు, పెట్టుబడులకు సురక్షిత సాధనంగా నెలకొన్న డిమాండ్‌తో దేశీయంగా మరో సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు మంగళవారం రూ.400 లాభపడడంతో ఆల్‌టైమ్ గరిష్టం రూ.1,06,070కు చేరుకుంది. 99.5 శాతం స్వచ్ఛత పసిడి సైతం ఇంతే మేర లాభపడి రూ.1,05,200 స్థాయిని తాకింది. మరోవైపు వెండి కిలోకి రూ.100 పెరిగి రూ.1,26,100కు చేరుకుంది. గత మూడు నెలల్లో వెండి కిలోకి రూ.7,100 పెరగడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు 40 శాతం పెరిగింది. గత డిసెంబర్ చివర్లో వెండి ధర రూ.89,700 స్థాయి వద్ద ఉంది. రూపాయి బలహీనపడుతుండడం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుదలతో సురక్షిత సాధనంగా పసిడికి డిమాండ్ పెరిగినట్టు ట్రేడర్లు తెలిపారు. రూపాయి మంగళవారం డాలర్‌తో మరో 8 పైసలు నష్టపోవడం గమనార్హం.

మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం (31 గ్రాములు) 78 డాలర్లకు పైగా పెరిగి 3,594 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. ''భారత్-రష్యా-చైనా మధ్య సంబంధాలు బలపడుతున్న సంకేతాలు అమెరికా పలుకుబడి, డాలర్‌పై ప్రభావం చూపించనున్నాయి. ఇది బులియన్ ధరలకు అనుకూలం''అని అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీఈవో చింతన్ మెహతా తెలిపారు.

అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై చర్చలు

- సాధారణ స్థాయి దిశగా చైనాతో సంబంధాలు
- కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



న్యూఢిల్లీ: ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై (బీటీఏ) అమెరికాతో ఇంకా చర్చలు జరుగుతున్నట్లు కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ తెలిపారు. అలాగే చైనాతో కూడా సంబంధాలు తిరిగి సాధారణ స్థాయి దిశగా ముందుకు సాగుతున్నాయని చెప్పారు. సరిహద్దు సమస్యలు పరిష్కారమయ్యే కొద్దీ, సహజంగానే ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయని పరిశ్రమల సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన వివరించారు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూఏఈ, మారిషస్, బ్రిటన్, ఈఎఫ్‌టీఏతో (యూరప్‌లోని నాలుగు దేశాల కూటమి) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు మంత్రి చెప్పారు.

భారత్ మా వెంటే...: బెసెంట్

అగ్రరాజ్యం మన ఎగుమతులపై భారీగా సుంకాలు ప్రకటించిన నేపథ్యంలో అమెరికా-భారత్‌ల మధ్య మార్చి నుంచి ఇప్పటివరకు అయిదు విడతలు చర్చలు జరిగాయి. ఆరో విడత సంప్రదింపుల కోసం ఆగస్టు 25న అమెరికా బృందం భారత్ రావాల్సి ఉన్నప్పటికీ, ఆగస్టు 27 నుంచి సుంకాలను 50 శాతానికి పెంచేయడంతో, ఆ పర్యటన రద్దైంది. తదుపరి విడత చర్చలకు ఇంకా తేదీలు ఖరారు కాలేదు.

మరోవైపు, ఏది ఏమైనప్పటికీ భారత్ తమ వెంటే ఉంటుందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ధీమా వ్యక్తం చేశారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ పాటించే విలువలు రష్యా కన్నా అమెరికా, చైనాకి చాలా దగ్గరగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. గొప్ప దేశాలైన భారత్, అమెరికా ఈ వివాదాన్ని (సుంకాలు) పరిష్కరించుకుంటాయని బెసెంట్ పేర్కొన్నారు.

ఏఐతో ఉద్యోగాలు పెరుగుతాయ్..

కృత్రిమ మేథ (ఏఐ)తో గణనీయంగా ప్రయోజనాలు ఉంటాయని, పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కూడా పెరుగుతాయని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయుష్ గోయల్ చెప్పారు. ఈ నేపథ్యంలో లేటెస్ట్ ఏఐ, చాట్‌జీపీటీ వెర్షన్లను ఉపయోగించాలని తన కార్యాలయంలోని సిబ్బందికి కూడా తాను సూచించినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడంలో భారత్ ఎల్లప్పుడూ ముందుంటుందని పరిశ్రమ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ఏఐలాంటి టెక్నాలజీలతో ఉద్యోగాలు పోతాయనే వారి గురించి పెద్దగా పట్టించుకోనక్కర్లేదని ఆయన పేర్కొన్నారు. ఏఐని అనైతికంగా ఉపయోగిస్తే తలెత్తే సమస్యలను అరికట్టడానికి మానవ జోక్యం తప్పనిసరిగా అవసరమవుతుంది కాబట్టి, ఆ విధంగా ఉద్యోగాలు పెరుగుతాయని మంత్రి చెప్పారు. కాబట్టి దీన్నొక గొప్ప అవకాశంగా పరిగణించి, అందిపుచ్చుకోవాలని ఆయన వివరించారు. ఏఐని అనైతికంగా ఉపయోగించడం వల్ల స్వల్పకాలికంగా కొన్ని సమస్యలు తలెత్తినప్పటికీ దీర్ఘకాలికంగా భారత్‌కి ఇది మేలే చేస్తుందన్నారు. డేటా, డాక్యుమెంట్ల భద్రత రీత్యా చాట్‌జీపీటీ, డీప్‌సీక్ లాంటి టూల్స్‌ను ఆఫీస్ కంప్యూటర్లు, డివైజ్‌లలో డౌన్‌లోడ్ చేయొద్దని ఫిబ్రవరిలో కేంద్ర ఆర్థిక శాఖ తమ అధికారులకు ఆదేశించింది. అయితే, ఈ కొత్త టెక్నాలజీతో ఒనగూరే ప్రయోజనాలరీత్యా దీని వినియోగంపై ప్రభుత్వ విభాగాల్లో నిషేధమేమీ లేదంటూ మార్చిలో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ రాజ్యసభకు తెలిపారు. కానీ భద్రత, గోప్యనీయతను దృష్టిలో ఉంచుకుని ఉపయోగించాల్సి ఉంటుందని వివరించారు.

14 ఏళ్ల తర్వాత గుజరాత్‌కు...

దేశవాళీ మ్యాచ్‌లు ఆడనున్న హర్షల్ పటేల్



అహ్మదాబాద్: 2025-26 దేశవాళీ క్రికెట్ సీజన్‌లో జట్టు మారుతున్న ఆటగాళ్ల జాబితాలో పేస్ బౌలర్ హర్షల్ పటేల్ కూడా చేరాడు. 2011 నుంచి హరియాణా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన హర్షల్ ఇప్పుడు మళ్లీ సొంత రాష్ట్రానికి రానున్నాడు. ఈ సీజన్‌లో అతను గుజరాత్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు. గుజరాత్‌లోనే పుట్టిన హర్షల్ 2009లో అదే జట్టు తరఫున దేశవాళీ వన్డేల్లో అరంగేట్రం చేశాడు. అయితే రెండేళ్లు ప్రయత్నించినా రంజీ ట్రోఫీ టీమ్‌లో చోటు దక్కకపోవడంతో అతను హరియాణాకు వలస వెళ్లాడు. 2011లో తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడిన అతను పుష్కర కాలంగా హరియాణా ప్రధాన బౌలర్‌గా జట్టుకు ఎన్నో కీలక విజయాలు అందించాడు. 2023-24లో విజయ్ హజారే వన్డే ట్రోఫీ నెగ్గిన హరియాణా జట్టులో హర్షల్ కూడా సభ్యుడు. ఓవరాల్‌గా 74 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లలో అతను 24.02 సగటుతో 246 వికెట్లు పడగొట్టాడు. 34 ఏళ్ల హర్షల్ కుటుంబం ప్రస్తుతం అహ్మదాబాద్‌లోనే స్థిరపడింది. దానిని దృష్టిలో ఉంచుకొనే తన సౌకర్యం కోసం జట్టు మారుతున్నట్లు హర్షల్ వెల్లడించాడు.

పాక్ క్రికెటర్ ఆసిఫ్ అలీ రిటైర్



లాహోర్: పాకిస్తాన్ మిడిలార్డర్ బ్యాటర్ ఆసిఫ్ అలీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. ఫైసలాబాద్‌కు చెందిన 33 ఏళ్ల బ్యాటర్ పరిమిత క్రికెట్‌లో 21 వన్డేలు, 58 టి20లు ఆడాడు. అయితే ఈ రెండింటిలో కలిపి 1000 పరుగులైనా చేయలేదు. అతను రెండు ఫార్మాట్లలో కలిపి 959 పరుగులే చేశాడు. ఇందులో మూడు అర్ధసెంచరీలున్నాయి. తన స్వల్పకాలిక కెరీర్‌లో మూడు ప్రపంచకప్‌లు ఆడటమే అతని కెరీర్‌లో పెద్ద విశేషం. 2021, 2022లలో జరిగిన టి20 ప్రపంచకప్, అంతకుముందు 2019లో జరిగిన వన్డే ప్రపంచకప్ కూడా ఆడాడు. 2018లో వన్డే ఫార్మాట్, 2022లో టి20 ఫార్మాట్‌లలో జరిగిన ఆసియా కప్‌లో బరిలోకి దిగాడు. 2023లో హాంగ్జౌలో జరిగిన ఆసియా క్రీడల్లోనూ ఆసిఫ్ అలీ పాక్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2021 మెగాఈవెంట్‌లో అఫ్గానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 ఓవర్లలో 24 పరుగులు చేయాల్సిన దశలో జట్టును గెలిపించాడు. 19వ ఓవర్లో 4 సిక్స్‌లు బాదడంతో పాక్ సూపర్-12లో విజయం సాధించింది.

క్వార్టర్స్‌లో సహజ జోడీ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ35 మహిళల టోర్నమెంట్‌లో తెలంగాణ అమ్మాయి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. డొమినికన్ రిపబ్లిక్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సహజ (భారత్)-సోఫియా ఎలీనా (వెనిజులా) ద్వయం 6-1, 6-1తో ననారి కత్సుమి (జపాన్)-అమండ కరోలినా (మెక్సికో) జంటపై గెలిచింది. 63 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ-సోఫియా జోడీ తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి జంట సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేసింది. ఇదే టోర్నీ సింగిల్స్ విభాగంలో సహజ మూడో సీడ్‌గా పోటీపడనుంది. తొలి రౌండ్‌లో ఆమె స్పెయిన్‌కు చెందిన సారా డాల్స్‌తో ఆడుతుంది.



ఒలింపిక్ ఓటమి బాధ దూరమైంది!

వరల్డ్ చాంపియన్‌షిప్ కాంస్యంపై చిరాగ్ శెట్టి

పూర్తి ఫిట్‌గా మారాల్సి ఉందన్న షట్లర్

న్యూఢిల్లీ: వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఇటీవలే పారిస్‌లో భారత పురుషుల డబుల్స్ ఆటగాళ్లు సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈ ఈవెంట్‌లో రెండోసారి కాంస్యం గెలిచిన ద్వయం... తద్వారా భారత్ తరఫున ఒకటికంటే ఎక్కువ పతకాలు సాధించిన ఆటగాళ్లుగా పీవీ సింధు (5), సైనా నెహ్వాల్ (2) సరసన నిలిచారు. ఇదే వేదికపై, ఇదే కోర్టులో గత ఏడాది ఒలింపిక్స్‌లో ఓటమిపాలై తీవ్ర నిరాశ చెందిన భారత జంట ఇప్పుడు అక్కడే మంచి విజయాన్ని అందుకుంది. 'గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో పరాజయం పాలైన చోటే వరల్డ్ చాంపియన్‌షిప్ పతకం గెలవడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. ఇది ఒక రకంగా మా పునరాగమనంలాంటిది. దీని వల్ల నాటి ఓటమి బాధ దూరమైంది. సింధు, సైనాలవంటి స్టార్ల జాబితాలో మా పేరు కూడా ఉండటం సంతోషంగా ఉంది. పైగా ఇటీవల మా ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. అలాంటి సమయంలో ఈ పతకం గెలవడం ఈ ఆనందాన్ని రెట్టింపు చేసింది' అని చిరాగ్ శెట్టి అన్నాడు. సెమీస్‌లో సాత్విక్-చిరాగ్ జోడి చైనాకు చెందిన చెన్ బో యంగ్-ల్యూ యి చేతిలో ఓటమి పాలైంది. అయితే అంతకుముందు క్వార్టర్ ఫైనల్లో వీరిద్దరు ఆరోన్ చియా-సో వూకీ (మలేసియా)పై సంచలన విజయం సాధించి కాంస్యాన్ని ఖాయం చేసుకున్నారు. 'వరుసగా రెండు గేమ్‌లలో ఈ మ్యాచ్ గెలవడం మాలో ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచింది. ఆరోన్ ద్వయంపై గెలుపు నిజంగా చాలా అద్భుతంగా అనిపించింది. పతకం సాధించడం మాత్రమే కాదు, మేం సరైన వ్యూహంతో ఆడితే ప్రపంచంలో ఎవరినైనా ఓడించగలమనే నమ్మకం వచ్చింది' అని చిరాగ్ గర్వంగా చెప్పాడు. 'డ్రా' కఠినంగా ఉన్నా సరే, భారత షట్లర్లు అంచనాలకు తగినట్లుగా రాణించడం జట్టుగా సంతృప్తినిచ్చిందన్న చిరాగ్... వరల్డ్ రెండో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్‌పై దాదాపు విజయానికి చేరువగా వచ్చి త్రుటిలో అవకాశం కోల్పోయిన హెచ్‌ఎస్ ప్రణయ్‌ను ప్రత్యేకంగా అభినందించాడు. 2011 నుంచి భారత్ వరుసగా ఏదో ఒక పతకంతో తిరిగి రావడం సానుకూల విషయమని అతను పేర్కొన్నాడు. ముస్ముందు మరిన్ని పెద్ద విజయాలు సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నామన్న చిరాగ్... ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఫిట్‌గా మారడంపై దృష్టి పెట్టినట్లు వెల్లడించాడు. 'గత కొంత కాలంగా మాకు కలిసి రాలేదు. అటు కోర్టులో, ఇటు కోర్టు బయట వ్యక్తిగతంగా కూడా సమస్యలు ఎదుర్కొన్నాం. 100 శాతం ట్రెనింగ్ కూడా చేయలేకపోయాం. అత్యుత్తమ ఫిట్‌నెస్ అందుకోవాలని మొదటి లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ తర్వాత వచ్చే టోర్నీల్లో కనీసం ఫైనల్ చేరి ఆపై టైటిల్ సాధించడం ముఖ్యం. ఈ ఏడాదికి సంబంధించి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్స్‌పై మా దృష్టి ఉంది. ఇప్పుడు సరైన దిశలోనే వెళుతున్నామని భావిస్తున్నాం' అని చిరాగ్ విశ్వాసం వ్యక్తం చేశాడు.





సౌత్ జోన్ బ్యాడ్మింటన్ టోర్నీ షురూ

సాక్షి, హైదరాబాద్: 79వ సౌత్‌జోన్ ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌కు నగరం వేదికైంది. నగర శివార్లలో ఉన్న కన్హ శాంతివనంలోని ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో మంగళవారం ఈ పోటీలు మొదలయ్యాయి. తెలంగాణ ఐటీ శాఖ మంత్రి, తెలంగాణ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక, కేరళ, అండమాన్ నికోబార్ దీవులకు చెందిన సుమారు 250 మంది షట్లర్లు ఈ టోర్నీలో పోటీ పడుతున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తారు. ప్రశాంతతకు మారుపేరైన కన్హ శాంతివనంలో క్రీడాకారులు పోటీ పడటం వారిలో కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని, తమ అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకు ఉపకరిస్తుందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఇక్కడి అకాడమీ బ్యాడ్మింటన్ ఆటగాళ్లను తయారు చేయడంతో పాటు వారిని మెరుగైన వ్యక్తులుగా కూడా తీర్చిదిద్దుతుందని గోపీచంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షుడు రెవరెండ్ దాజీ తదితరులు పాల్గొన్నారు.

భారత్‌తో సిరీస్‌కు కమిన్స్ దూరం



మెల్‌బోర్న్: వెన్నెముక గాయంతో ఆస్ట్రేలియా టెస్టు కెప్టెన్ ప్యాట్ కమిన్స్... భారత్, న్యూజిలాండ్‌లతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌లకు దూరమయ్యాడు. ప్రస్తుతం గాయం నుంచి కోలుకునేందుకు కమిన్స్ పునరావాస శిబిరంలో పాల్గొంటున్నాడని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఒక ప్రకటనలో తెలిపింది. స్వదేశంలో జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌కల్లా అతను కోలుకుంటాడని సీఏ భావిస్తోంది. వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో ఆస్ట్రేలియా మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనాల్సి ఉంది. అక్టోబర్ 1 నుంచి ఈ ద్వైపాక్షిక మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం భారత్ కంగారూ పర్యటనకు వెళుతుంది. అక్కడ అక్టోబర్ 19 నుంచి 25 వరకు మూడు వన్డేలు, తర్వాత 29 నుంచి నవంబర్ 8 వరకు ఐదు టి20లు ఆడుతుంది. ఈ మూడు పరిమిత ఓవర్ల సిరీస్‌లకు కమిన్స్ అందుబాటులో ఉండడని సీఏ వర్గాలు తెలిపాయి.

ఏఐఎఫ్‌ఎఫ్ పర్యవేక్షకుడిగా జస్టిస్ నాగేశ్వరరావు

వాణిజ్య భాగస్వామి ఎంపికను పరిశీలించాలన్న సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) కార్యకలాపాలను సరిదిద్దేందుకు... దేశ అత్యున్నత న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావును నియమించింది. మాస్టర్ రైట్స్ అగ్రిమెంట్ (ఎంఆర్‌ఏ) పునరుద్ధరణ అంశంలో తలెత్తిన వివాదం కారణంగా... ఏఐఎఫ్‌ఎఫ్ కార్యకలాపాలు నిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో ఏఐఎఫ్‌ఎఫ్ వాణిజ్య టెండర్ల ప్రక్రియను పరిశీలించాలని సుప్రీంకోర్టు... జస్టిస్ నాగేశ్వరరావును ఆదేశించింది. ఎంఆర్‌ఏ పునరుద్ధరణపై అనిశ్చితి కారణంగా ఈ ఏడాది జూలై 11 నుంచి దేశీయ టోర్నీల్లో సంక్షోభం తలెత్తింది. దీంతో ఐఎస్‌ఎల్‌లో మూడు క్లబ్‌లు ఆటగాళ్లు, సిబ్బంది జీత భత్యాలు సైతం నిలిపివేశాయి. ఈ ఏడాది ఐఎస్‌ఎల్ సీజన్ సజావుగా సాగుతుందా లేదా అనే అనుమానాల మధ్య... దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక ఆదేశాలిచ్చింది. 'ఐఎస్‌ఎల్ నిర్వహించడానికి దాని వాణిజ్య భాగస్వామిని ఎంపిక చేయడానికి ఏఐఎఫ్‌ఎఫ్ అవసరమైన టెండర్లను ఆహ్వానిస్తుంది. పారదర్శక ప్రక్రియ కోసం మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగేశ్వరరావును నియమించాం. ఈ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా... సమర్థవంతమైన సంస్థను ఐఎస్‌ఎల్ వాణిజ్య భాగస్వామిగా ఎంపిక చేయడంలో ఆయన సహాయపడతారు' అని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియలో సహాయంగా ఒకరిద్దరు నిపుణులను నియమించుకునే అధికారం జస్టిస్ నాగేశ్వరరావుకు న్యాయస్థానం కల్పించింది. 2010లో చేసుకున్న గత ఎమ్ఆర్‌ఏ ఈ ఏడాది డిసెంబర్‌తో ముగియనుంది. దీంతో ఆ స్థానంలో మరో వాణిజ్య భాగస్వామితో ఒప్పంద ప్రక్రియ ఇక వేగవంతం కానుంది.

కేశవ్ మాయాజాలం

మెరిసిన ముల్డర్, మార్క్‌రమ్ ● తొలి వన్డేలో ఇంగ్లండ్‌పై దక్షిణాఫ్రికా విజయం



కేశవ్



మార్క్‌రమ్

లీడ్స్: కేశవ్ మహరాజ్ (4/22), ముల్డర్ (3/33) విజృంభించడంతో ఇంగ్లండ్ పర్యటనలో దక్షిణాఫ్రికా జట్టు బోణీ కొట్టింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన తొలి వన్డేలో దక్షిణాఫ్రికా 7 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 24.3 ఓవర్లలో 131 పరుగులకు ఆలౌటైంది. జేమీ స్మిత్ (48 బంతుల్లో 54; 10 ఫోర్లు) హాఫ్‌సెంచరీ చేశాడు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (12), జో రూట్ (14), జోస్ బట్లర్ (15), బెన్ డకెట్ (5), జాకబ్ బెథెల్ (1), విల్ జాక్స్ (7) ఒకరి వెంట ఒకరు పెవిలియన్‌కు చేరారు. దక్షిణాఫ్రికాపై ఇంగ్లండ్‌కు ఇది నాలుగో అత్యల్ప స్కోరు. ఈ మ్యాచ్ ద్వారా సోనీ బకెర్ (0) ఇంగ్లండ్ తరఫున అంతర్జాతీయ వన్డే అరంగేట్రం చేశాడు. స్పిన్‌కు సహకరించిన పిచ్‌పై కేశవ్, ముల్డర్ తిప్పేయగా... బర్గర్, ఇన్‌గిడి చెరో వికెట్ పడగొట్టారు. ఇటీవల ఐసీసీ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి చేరిన మహరాజ్... కెరీర్‌లో మూడోసారి 4 వికెట్ల ప్రదర్శన నమోదు చేసుకున్నాడు. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 20.5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (55 బంతుల్లో 86; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ షాట్‌లతో రెచ్చిపోయాడు. ఈ క్రమంలో మార్క్‌రమ్ వన్డేల్లో వేగవంతమైన అర్ధశతకం (23 బంతుల్లో) చేసిన దక్షిణాఫ్రికా ఓపెనర్‌గా నిలిచాడు. రికెల్టన్ (59 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు)తో కలిసి మార్క్‌రమ్ తొలి వికెట్‌కు 121 పరుగులు జోడించి జట్టును విజయానికి చేరువ చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 3 వికెట్లు తీశాడు. ఇంగ్లండ్ తరఫున అరంగేట్ర వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన బౌలర్‌గా బకర్ నిలిచాడు. 7 ఓవర్లు వేసిన అతడు 76 పరుగులు సమర్పించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు కలిసి 272 బంతులు మాత్రమే ఆడటం గమనార్హం. కేశవ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య గురువారం లార్డ్స్‌లో రెండో వన్డే జరగనుంది.

రాణించిన వరుణ్, రోహిత్ రాయుడు

- హరియాణా జట్టుకు 272 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించిన హైదరాబాద్
- ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీ





చెన్నై: వరుసగా రెండో ఏడాది ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లేందుకు డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ జట్టు మరో ఎనిమిది వికెట్ల దూరంలో ఉంది. హరియాణాతో జరుగుతున్న నాలుగు రోజుల సెమీఫైనల్ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్‌దే పైచేయిగా ఉంది. హైదరాబాద్ నిర్దేశించిన 272 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన హరియాణా ఆట ముగిసే సమయానికి 4 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 6 పరుగులు చేసింది. హరియాణా చేజార్చుకున్న రెండు వికెట్లు నితిన్ సాయి యాదవ్‌కు లభించాయి. చివరిరోజు బుధవారం విజయం అందుకోవాలంటే హరియాణా మరో 266 పరుగులు చేయాలి. హైదరాబాద్ నెగ్గాలంటే ఎనిమిది వికెట్లు తీయాలి. అంతకుముందు హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ గౌడ్ (41; 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలువగా... హిమతేజ (31; 2 ఫోర్లు), రాహుల్ రాదేశ్ (31; 1 ఫోర్) కూడా రాణించారు. హరియాణా బౌలర్లలో అమిత్ రాణా మూడు వికెట్లు తీయగా... నిఖిల్ కశ్యప్, పార్థ్ వత్స్ రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. హరియాణా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 208 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హిమాన్షు రాణా (75; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. హైదరాబాద్ బౌలర్లు రోహిత్ రాయుడు 65 పరుగులిచ్చి 5 వికెట్లు... వరుణ్ గౌడ్ 27 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టి హరియాణాను కట్టడి చేశారు. 17 పరుగుల స్వల్ప తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ 99.4 ఓవర్లలో 254 పరుగులకు ఆలౌటైంది. వరుణ్ గౌడ్ (91; 4 ఫోర్లు) తొమ్మిది పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకోగా... హిమతేజ (41; 3 ఫోర్లు), అమన్ రావు (35; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. హరియాణా బౌలర్లలో నిఖిల్ కశ్యప్ 80 పరుగులిచ్చి 5 వికెట్లు... పార్థ్ వత్స్ 49 పరుగులిచ్చి 3 వికెట్లు తీశారు.




న్యూజిలాండ్ మహిళల జట్టు బ్యాటింగ్ కోచ్‌గా మెక్‌మిలన్

ఆక్లాండ్: న్యూజిలాండ్ మాజీ ఆల్‌రౌండర్ క్రెయిగ్ మెక్‌మిలన్ ఆ దేశ మహిళల జట్టుకు బ్యాటింగ్, ఫీల్డింగ్ కోచ్‌గా ఎంపికయ్యాడు. ఈ నెలాఖరున భారత్, శ్రీలంక వేదికగా ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ ప్రారంభం కానుండగా... దానికి ముందు 48 ఏళ్ల మెక్‌మిలన్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. న్యూజిలాండ్ జాతీయ జట్టు తరఫున 55 టెస్టులు, 197 వన్డేలు ఆడిన మెక్‌మిలన్ 7 వేలకు పైగా పరుగులు చేశాడు. 2024 టి20 ప్రపంచకప్ సమయంలో సైతం మెక్‌మిలన్ న్యూజిలాండ్ మహిళల జట్టు సహాయ బృందంలో పని చేశాడు. 'మరోసారి న్యూజిలాండ్ మహిళల జట్టుతో కలిసి పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉంది. నైపుణ్యం గల ప్లేయర్లతో కలిసి జట్టు ఆశయాలు సాధించేందుకు నా వంతు కృషి చేస్తా. ఐసీసీ ఈవెంట్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చేందుకు ప్రయతిస్తాం' అని మెక్‌మిలన్ అన్నాడు. 2000లో వన్డే ప్రపంచకప్ గెలిచిన న్యూజిలాండ్ మహిళల జట్టు... ఆ తర్వాత మరో మూడుసార్లు రన్నరప్‌గా నిలిచింది. ఈసారి ట్రోఫీ చేజిక్కించుకోవడమే లక్ష్యంగా... పలువురు న్యూజిలాండ్ ప్లేయర్లు ఇప్పటికే భారత్ చేరుకొని స్పిన్ పిచ్‌లపై ప్రాక్టీస్ సైతం చేశారు. ప్రపంచకప్‌లో భాగంగా అక్టోబర్ 1న ఆస్ట్రేలియాతో న్యూజిలాండ్ తొలి మ్యాచ్ ఆడనుంది.

గాజాలోకి 60 వేల రిజర్వు బలగాలు

మంగళవారం దాడుల్లో మరో 47 మంది మృతి

డెయిర్ అల్-బలాహ్: గాజా నగరంలో సైనిక చర్యను ఇజ్రాయెల్ ఆర్మీ ముమ్మరం చేసింది. ఇప్పటికే నగరంలోని పాలస్తీనియన్లను ఖాళీ చేయాలంటూ పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిన ఆర్మీ తాజాగా 60 వేల మంది రిజర్వు బలగాలను ఆ ప్రాంతంలోకి తరలించడం ప్రారంభించింది. ఇప్పటికే ఇక్కడ 2లవేల బగాలు విధుల్లో ఉన్నాయి. గాజా నగరంలోని శివారు ప్రాంతాలైన జెయిటౌన్, షిజైయాల్లో వీరిని మోహరించనుంది. ఇప్పటికే పలుమార్లు ఈ ప్రాంతంలోని పాలస్తీనియన్లను ఖాళీ చేయించిన ఇజ్రాయెల్ ఆర్మీ మరోసారి వారికి హెచ్చరికలు జారీ చేసింది. జెయిటౌన్‌లో మార్కెట్లు, స్కూళ్లు, క్లినిక్కులు ప్రస్తుతం శిథిలాల దిబ్బలుగా మారాయి. హమాస్ కంచుకోటగా ఉన్న జెయిటౌన్‌ను ప్రమాదకరమైన యుద్ధ జోన్‌గా ఇజ్రాయెల్ ఆర్మీ పేర్కొంటోంది. ఇలా ఉండగా, మంగళవారం గాజాలోనే ఉన్న పాలస్తీనియన్లే లక్ష్యంగా యథేచ్ఛగా దాడులకు పాల్పడింది. గాజా నగరానికి దక్షిణాన ఉన్న మువాసీ తాత్కాలిక శరణార్థుల శిబిరాలపై దాడులను తీవ్రతరం చేస్తామని తెలిపింది. మంగళవారం ఉదయం వరకు వివిధ ప్రాంతాలపై జరిగిన దాడుల్లో కనీసం 47 మంది చనిపోయినట్లు ఆ ప్రాంతంలోని ఆస్పత్రుల సిబ్బంది వెల్లడించారు. ఒక్క గాజా నగరంలోనే 26 మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. టెల్ అల్ హవాలోని నివాసం సముదాయంపై జరిగిన వైమానిక దాడుల్లో 28 మంది గాయపడ్డారని అల్ ఖుద్స్ ఆస్పత్రి పేర్కొంది. మరో ఘటనలో ముగ్గురు చిన్నారులు సహా 15 మంది చనిపోయినట్లు వివరించింది. ఆహార పంపిణీ కేంద్రం సమీపంలో జరిగిన కాల్పుల్లో మరో 15 మంది చనిపోయారని షిఫా ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. గాజా నగరంలోకి రిజర్వు బలగాల తరలింపు నిర్ణయం రాజకీయ ప్రేరేపితమంటూ మంగళవారం టెల్అవీవ్ సమీపంలో కొందరు రిజర్వు సిబ్బంది నిరసనకు దిగారు. దీంతో, వారిని మిలటరీ జైలుకు తరలించారు.



ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సోమవారం ఢిల్లీ శివారులోని గుర్‌గ్రామ్‌లో ఢిల్లీ-జైపూర్ హైవేపై ట్రాఫిక్‌జామ్. వాహనాలు దాదాపు 10 కిలో మీటర్ల మేర బారులు తీరడంతో దాదాపు 8 గంటల పాటు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు

వరద బాధిత రైతులకు ప్రత్యేక ప్యాకేజీ?

- పంట నష్టాలపై కేంద్ర వ్యవసాయ శాఖ వరుస సమీక్షలు
- త్వరలో పంజాబ్, హరియాణాల్లో పర్యటించనున్న వ్యవసాయ మంత్రి
- ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం తొలగించాలని రైతుల డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు మొదలుపెట్టింది. చాలా రాష్ట్రాల్లో సాధారణానికి మించిన వర్షపాతం నమోదైంది. దీంతో వరదలతో నష్టపోయిన రైతుల కోసం ప్రత్యేక ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే అవకాశాలున్నాయని తెలుస్తోంది. రాష్ట్రాలు యూనిట్‌గా ఈ ప్యాకేజీ ఉండే అవకాశముందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పంట నష్టాలపై రాష్ట్రాల వారీగా నివేదికలు అందాక, ప్యాకేజీపై నిర్ణయం ఉంటుందని సమాచారం.

25 లక్షల ఎకరాల్లో పంట నష్టం..

దేశ వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ రంగంపై పడిన ప్రభావాన్ని అంచనా వేయడానికి కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సోమ, మంగళ వారాల్లో వరుస సమీక్షలు చేపట్టారు. వివిధ రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు, పంటలపై వరద ప్రభావం, జలాశయాల్లో ప్రస్తుత నీటి నిల్వలు, రాష్ట్రాల నుంచి వచ్చిన నివేదికలు, వినతులు, పశు సంపదకు వాటిల్లిన నష్టం వంటి అంశాలపై ఆయన సమగ్రంగా చర్చించారు. ప్రాథమికంగా రాష్ట్రాల నుంచి అందిన సమాచారం మేరకు ఒక్క మహారాష్ట్రలోనే 10 లక్షల ఎకరాల మేర పంట నష్టం జరగ్గా, పంజాబ్‌లో 4లక్షలు, హరియాణాలో 3లక్షలు, తెలంగాణలో 2.36లక్షలు, హిమాచల్, ఉత్తరాఖండ్‌లలో 2లక్షల ఎకరాల చొప్పున పంటలకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. మొత్తం 25 లక్షల ఎకరాల్లో పంటల నష్టం వాటిల్లిందని, అన్ని రాష్ట్రాల నుంచి సమాచారం అందితే ఇది మరింత పెరగొచ్చని అధికారులు నివేదించినట్లు తెలిసింది. ఇప్పటికే పంజాబ్‌లో అధిక వర్షాల కారణంగా రూ.60వేల కోట్ల నష్టం వాటిల్లిందని, తమకు తక్షణ సాయంగా రూ.20 వేల కోట్లు ఇవ్వాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్ కేంద్రాన్ని కోరారు. రాజస్థాన్‌లో రైతులు తమకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద చెల్లించాల్సిన ప్రీమియాన్ని తొలగించాలని కేంద్ర మంత్రికి లేఖలు రాశారు. మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సైతం బాధిత రైతులకు తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వరద ప్రభావిత రాష్ట్రాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇవ్వాలని, ముఖ్యంగా రైతులను ఆదుకునేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. వీటన్నింటిపై అధికారులతో చర్చించిన కేంద్రమంత్రి పంటల నష్టం అంచనాలకై తాను స్వయంగా రాష్ట్రాల్లో పర్యటించడంతో పాటు ప్రత్యేక బృందాలను పంపాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి మొదట పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో పర్యటించనున్నారు. అనంతరం మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో పర్యటిస్తారని సమాచారం. తెలంగాణలో సైతం కేంద్ర బృందాలు పర్యటించి పంట నష్టంపై అంచనాలు రూపొందిస్తాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ పర్యటనలు ముగిశాక బాధిత రైతులకు ప్రత్యేక ప్యాకేజీపై నిర్ణయం చేస్తారని తెలుస్తోంది.

బుల్లెట్ ప్రూఫ్ రైలులో చైనాకు కిమ్

బీజింగ్/ప్యాంగ్యాంగ్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ చైనాకు చేరుకున్నారు. ప్రత్యేక బుల్లెట్ ప్రూఫ్ రైలులో రాజధాని ప్యాంగ్యాంగ్ నుంచి సోమవారం రాత్రి బయలుదేరిన ఆయన.. మంగళవారం ఉదయం చైనాకు చేరుకున్నారు. ఆయన వెంట విదేశాంగ మంత్రి చో సన్ హుయ్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులున్నారు. కిమ్‌తోపాటు ఆయన తాత, తండ్రి కూడా విదేశీ ప్రయాణాలకు ఈ రైలునే వాడటం విశేషం. ఈ రైలు గంటలకు 50 కిలోమీటర్ల వేగంతోనే ప్రయాణిస్తుంది. భారీగా సాయుధ కవచాలు ఉండటంతో బరువువల్ల వేగంగా వెళ్లలేదు. రక్షణగా ఉన్న సాయుధ దళాలు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ ఉంటాయి. ఇది లగ్జరీ రైలు. దీనిలో దాదాపు 90 బోగీలుంటాయి. కాన్ఫరెన్స్ రూమ్, ఆడియన్స్ ఛాంబర్, బెడ్‌రూమ్స్, వాటిలో టీవీలు కూడా ఉండుబాటులో ఉంటాయి. రైలులోనే వంటశాల, అందులో రష్యన్, చైనీస్, కొరియన్, జపనీస్, ఫ్రెంచ్ వంటకాలు సిద్ధంగా ఉంచుతారు.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన 80 ఏళ్లవుతున్న సందర్భంగా బుధవారం తియనాన్మెన్ స్క్వేర్‌లో జరిగే 'విక్టరీ డే'పరేడ్‌లో హాజరయ్యేందుకు కిమ్ చైనాకు వస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమానికి రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోపాటు కూడా హాజరుకున్నారు. 2019 తరువాత చైనాలో కిమ్‌ది ఇది తొలి పర్యటన. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ శిఖరాగ్ర సమావేశం కోసం ఇప్పటికే పుతిన్ బీజింగ్‌లో ఉన్నారు. వీరిద్దరి మధ్య సమావేశం జరిగే అవకాశం ఉందని మాస్కో అధికారి యూరి ఉషాకోవ్ తెలిపారు. ఇక, కిమ్, జిన్, పుతిన్ ఒకే వేదికను పంచుకోవడం ఇదే మొదటిసారి. ముగ్గురు నాయకులు గతంలో ద్వైపాక్షికంగా సమావేశమయ్యారు. ఇంకా త్రైపాక్షిక సమావేశం జరగలేదు. ఇటీవలి సంవత్సరాల్లో చైనాతో ఉత్తర కొరియా సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కిమ్ తన దౌత్య సంబంధాల విస్తరణపై దృష్టి పెట్టారు. ఉత్తర కొరియాకు చైనా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. సహాయదాత కూడా. కాబట్టి సంబంధాలను పునరుద్ధరించాలని కిమ్ భావిస్తున్నారు.

మాకు వరదలు కూడా వరమే!

- బాధితులు ట్యూబుల్లో వరద నీరు నిల్వ చేసుకోవాలి
- ప్రజలకు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఉచిత సలహా

ఇస్లామాబాద్: తరుచూ వివాదాస్పద ప్రకటనలు చేస్తూ పరువు పోగొట్టుకొనే పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్.. ఈసారి సొంతదేశ ప్రజల నుంచే చీత్కారాలు ఎదుర్కొనే ప్రకటన చేశారు. భారీ వరదలతో ఇటీవల పాకిస్థాన్‌లో 854 మంది చనిపోగా, 24 లక్షల మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేలమంది సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. దాదాపు వెయ్యి గ్రామాలు నీట మునిగాయి. ఈ పరిస్థితుల్లో ఖవాజా మాత్రం తమ దేశానికి వరదలు కూడా వరమేనని సెలవిచ్చారు. పైగా ఆ నీటిని ట్యూబుల్లో, డబ్బాల్లో నిల్వ చేసుకోవాలని ప్రజలకు ఉచిత సలహా కూడా ఇచ్చారు. పాకిస్తాన్‌కు చెందిన దునియా న్యూస్ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలాంటి అర్థంపర్థంలేని సలహాలెన్నో ప్రజలకు ఇచ్చారు ఖవాజా.

ధాబా యజమానికి కొత్త పల్సర్ బైక్‌ను కొనిచ్చిన రాహుల్

దర్భంగా: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బిహార్‌లో చేపట్టిన ఓటర్ అధికార్ యాత్ర సమయంలో బైక్ పోగొట్టుకున్న ధాబా యజమాని కథ సుఖాంతమైంది. దర్భంగాకు చెందిన శుభమ్‌కు రాహుల్ గాంధీ పల్సర్ 220ను కొని ఇచ్చారు. ఆగస్టు 27వ తేదీన ఓటర్ అధికార్ యాత్ర తన ధాబాకు చేరుకుందని, యాత్రలోని వారి కోరిక మేరకు టీ తయారు చేయడంలో నిమ్నమై ఉన్నట్లు శుభం చెప్పారు. ఈ సమయంలో తన బైక్‌తోపాటు మరికొన్ని వాహనాలను సెక్యూరిటీ సిబ్బంది తీసుకెళ్లారని శుభం చెప్పారు. ఒకటిన్నర కిలో మీటర్ల మేర యాత్ర పూర్తయ్యాక చూడగా తన పల్సర్‌తోపాటు సెక్యూరిటీ సిబ్బంది కనిపించలేదని వివరించారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఆరు వాహనాలు సైతం పూర్తిగా పాడైన స్థితిలో కనిపించాయన్నారు. అందులో తన బైక్ మాత్రం లేదని చెప్పారు. ఘటనను వివరాలను మీడియా ద్వారా తెలుసుకున్న కాంగ్రెస్ నేత దేవేందర్ యాదవ్ సెప్టెంబర్ ఒకటిన తనను పట్నాలో కల్సుకోవాలంటూ ఫోన్ చేసి చెప్పారని శుభం తెలిపారు. ఆ రోజు ఓటర్ అధికార యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త బైక్ తాళం చెవిలను రాహుల్ గాంధీ స్వయంగా అందించారని వెల్లడించారు.



అలవోకగా సర్ఫింగ్ చేస్తున్న జపాన్‌కు చెందిన ఈ పెద్దాయన (89ఏళ్లు) పేరు సెయిటో సనో. లేటు వయస్సులో ఈ ఘనత సాధించిన వ్యక్తిగా గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించాడు



పడవలు మాదిరిగా కన్పిస్తున్న ఇవి వాస్తవానికి సీతాకోక చిలుకలు. మంగళవారం బిహార్‌లోని రాజ్‌గిర్ జూ సఫారీలోని జలాశయం పక్కన ఇలా ఒక్క చోట చేరాయి.

చైనా 'భావి సారథి'తో మోదీ మంతనాలు

జిన్‌పింగ్ కుడిభుజం, చైనా కమ్యూనిస్ట్ పార్టీ అగ్రనేత కై క్వీతో ప్రధాని సుదీర్ఘ చర్చలు

- 'నవ్వని వ్యక్తి'తో మోదీ నెగ్గుకొచ్చారా?
- అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ముమ్మర చర్చ

బీజింగ్: కై క్వీ. కమ్యూనిస్ట్ చైనాలో అత్యంత శక్తివంతమైన నేతల్లో ఒకరు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు కుడిభుజంగా పేరొందిన కై క్వీ అంటే అపరచాణిక్యుడనే పేరు. అటు చైనా కమ్యూనిస్ట్ పార్టీ(సీపీపీ)లో అగ్రగణ్యునిగా కొనసాగుతూనే ఇటు ప్రభుత్వంలోనూ కీలక పదవుల్లో అవలీలగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జిన్‌పింగ్‌కు తల్లో నాలుకలా వ్యవహరిస్తూ జాతీయ, అంతర్జాతీయ వ్యవహారాల్లో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటూ ఎప్పుడూ సీరియస్‌గా కనిపిస్తారు. ఆయన నవ్వడం ఎవరూ చూడలేదని చైనా రాజకీయవర్గాల్లో ఓ మాట వినిపిస్తుంది. విదేశాల నుంచి జిన్‌పింగ్‌ను కలిసేందుకు ఎందరో దౌత్యాధికారులు వచ్చినా తర్వాత కై క్వీని కలిసి ప్రసన్నంచేసుకునేందుకు ప్రయత్నిస్తారు. కానీ ఆయన ఎవరినీ కలవరు. ఇటీవల షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర భేటీ కోసం తియాంజిన్ తీరనగరానికి విచ్చేసిన ఎస్‌సీఓ అగ్రనేతలు, దౌత్యవేత్తలు తనను కలవాలని చూసినా కై క్వీ ససేమిరా అన్నారట. అలాంటి కైక్వీ ప్రత్యేకంగా భారత ప్రధాని మోదీతో 45 నిమిషాలకుపైగా విడిగా మాట్లాడిన వార్త ఇప్పుడు చైనా వ్యాప్తంగా చక్కర్లు కొడుతోంది. చైనాలో జిన్‌పింగ్ శకం ముగిసి కై క్వీ భావ చైనా అధ్యక్షుడు కావొచ్చనే వాదన సైతం మొదలైంది. అందుకే కై క్వీతో మోదీ భేటీని జిన్‌పింగ్ స్వయంగా ఏర్పాటుచేశారని తెలుస్తోంది. గల్వాన్ ఘటన తర్వాత దెబ్బతిన్న భారత్, చైనా బంధాన్ని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడమే లక్ష్యంగా కైక్వీని కలవాలని మోదీకి జిన్‌పింగ్ సూచించినట్లు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరుదేశాల మధ్య బంధాన్ని పటిష్టపర్చి మరింత మెరుగైన ఆర్థిక, దౌత్య సంబంధాల కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు వార్తలొచ్చాయి.

ఎవరీ కైక్వీ?

చైనా కమ్యూనిస్ట్ పార్టీలో అత్యున్నత నిర్ణాయక మండలిలో ఈయన సీనియర్ సభ్యునిగా ఉన్నారు. పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీలో ఐదో అత్యున్నత నేతగా కొనసాగుతున్నారు. జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరొందారు. జిన్‌పింగ్‌కు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గానూ కై క్వీ మరో పదవిలో కొనసాగుతున్నారు. మావో తర్వాత చైనాలో ఇలా రెండు, మూడు పదవుల్లో ఏకకాలంలో కొనసాగుతున్న వ్యక్తి ఈయనే కావడం విశేషం. చైనాలోని అధికార క్రమంలో ఐదో స్థానంలో ఉన్నప్పటికీ జిన్‌పింగ్‌తో ఉన్న అత్యంత దగ్గరి రాజకీయ సాన్నిహిత్యం కారణంగా తదుపరి దేశాధ్యక్షుడు ఇతననే వాదన సైతం బలంగా వినిపిస్తోంది. ఫుజియాన్ ప్రావిన్స్‌లోని యూక్సీ కౌంటీలో జన్మించిన ఈయ తొలిసారిగా 1980వ దశకంలో జిన్‌పింగ్‌ను కలిశారు. 1975లో ఆయన కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. సాన్మింగ్, ఖ్వుజోయూ, హాంగ్‌జోయూ నగరాలకు మేయర్‌గా పనిచేసిన అనుభవం ఉంది. 2016లో బీజింగ్ నగరానికి తాత్కాలిక మేయర్‌గా పనిచేశారు. ప్రస్తుతం చైనా ప్రభుత్వంలో, పార్టీలో ఏ స్థాయి ర్యాంక్‌లో కొనసాగుతున్నారనే కై క్వీ మాట చెల్లుబాటు అవుతుందని తెలుస్తోంది. పార్టీ జనరల్ ఆఫీస్‌కి డైరెక్టర్‌గానూ ఉన్నారు. జిన్‌పింగ్‌ను అందరి ఎదుట కై క్వీ 'అంకుల్', 'బాస్'అని పిలుస్తారు.

దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడే విదేశీయులను వెళ్లగొడతాం

- వీరి కోసం రాష్ట్రాల్లో డిటెన్షన్ క్యాంపులు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

న్యూఢిల్లీ: దేశ వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడుతూ దొరికిపోయిన విదేశీయులను దేశం నుంచి వెళ్లగొడతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గూఢచర్యం, హత్య, అత్యాచారం, ఉగ్ర కార్యకలాపాలు, చిన్నారుల అక్రమ తరలింపు, డ్రగ్స్ స్మగ్లింగ్, మనీ లాండరింగ్, నిషేధిత సంస్థలో సభ్యత్వం ఉన్న వారిని గుర్తించిన వెంటనే దేశం నుంచి వెనక్కి పంపిస్తామన్నారు. ఇటువంటి వారిని గుర్తించి, వెనక్కి పంపించేందుకు వీలుగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు డిటెన్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం-2025ను ఇటీవల పార్లమెంట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిందని మంత్రి గుర్తు చేశారు. భారత్ ఓవర్సీస్ సిటిజన్ గుర్తింపు సహా అన్ని రకాల వీసాలకు దరఖాస్తు చేసుకునే విదేశీయుల నుంచి సంబంధిత అధికారులు బయోమెట్రిక్ నమోదు చేసుకుంటారని అమిత్ షా వివరించారు. అక్రమ వలసదారులను గుర్తించి, వారిని స్వదేశానికి పంపించే వరకు కదలికలను కట్టడి చేసేందుకు డిటెన్షన్ సెంటర్లు ఉపయోగపడతాయన్నారు. అక్రమ వలసలను నివారించే క్రమంలో తీర రక్షక బలగాలు సైతం అప్రమత్తంగా ఉంటాయని ఆయన వివరించారు. సంబంధిత అధికారి అనుమతి లేకుండా దేశంలో ఉద్యోగాలు చేసే విదేశీయులను సైతం బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఫీచర్ ఫిల్మ్, డాక్యుమెంటరీ చిత్రాలు, రియాలిటీ టీవీ షోలు, వెబ్ సిరీస్‌లో పాల్గొనేందుకు ప్రయత్నించే విదేశీయులను సైతం బహిష్కరిస్తామని వెల్లడించారు. దేశంలో పర్వత శిఖరాలను సంబంధిత సంస్థ నుంచి సరైన అనుమతి లేకుండా అధిరోహించే వారిపైనా చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, జమ్మూకశ్మీర్‌లోని కొన్ని నిషేధిత, రక్షిత ప్రాంతాల్లో ప్రవేశించే విదేశీయులు సైతం ముందుస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

కాంగ్రెస్ నేత ఖేడాకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రెండు నియోజకవర్గాల పరిధిలో ఓటు హక్కున్న కాంగ్రెస్ నేత పవన్ ఖేడాకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీసు జారీ చేసింది. ఈ నెల 8వ తేదీ ఉదయం 11 గంటల్లోగా తమకు సమాధానమివ్వాలని జిల్లా ఎన్నికల అధికారి అందులో కోరారు. ఒకటికి మించిన నియోజకవర్గాల్లోని ఓటరు జాబితాలో పవన్ ఖేడా పేరున్నట్లు తమ దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీ, జంగ్‌పురా నియోజకవర్గాల్లో ఖేడా పేరుందని వివరించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1950ను అనుసరించి ఇది నేరమన్నారు. దీని ప్రకారం ఎందుకు చర్యలుతీసుకోరాదో తెలిపాలని కోరారు. అధికార బీజేపీకి అనుకూలంగా ఈసీ వ్యవహరిస్తోందనడానికి ఇది తాజా ఉదాహరణ అని పవన్ ఖేడా మంగళవారం ఎక్స్‌లో ఆరోపించారు. మహదేవపుర నియోజకవర్గంలో కనీసం లక్ష తప్పుడు ఓట్లున్నట్లు తమ నేత రాహుల్ గాంధీ తెలిపినా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆయన ఈసీని ప్రశ్నించారు. అదనంగా నమోదైన ఓటును తొలగించాలంటూ 2016-17లోనే దరఖాస్తు చేసుకున్నా ఈసీ ఇప్పటి దాకా స్పందించలేదన్నారు. తనపై ఆరోపణలు చేసేందుకే దీనిని ఈసీ వాడుకోజూస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నేతల ఓట్ల చోరీని కప్పిపుచ్చుకునేందుకే రాహుల్ గాంధీ బిహార్‌లో ఓట్ల చోరీ జరిగిందంటూ ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ మండిపడింది. తాజా ఆరోపణపై ఈసీ దర్యాప్తు చేపట్టాలని కోరింది.

అసెంబ్లీ నుంచి సువేందు సస్పెన్షన్

టీఎంసీ పాకిస్తాన్ ఏజెంట్ అంటూ వివాదాస్పద వ్యాఖ్యలు

కోల్‌కతా: బెంగాలీ మాట్లాడే వలస కార్మికులపై దాడులను ఖండిస్తూ అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన తీర్మానం అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిపై రాష్ట్ర అసెంబ్లీలో మంగళవారం గలాటా చోటుచేసుకుంది. సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించారనే ఆరోపణలపై ప్రతిపక్ష నేత సువేందు అధికారిని మిగతా అసెంబ్లీ సమావేశాల నుంచి బహిష్కరించారు. 1971లో తూర్పు పాకిస్తాన్‌లో (ఇప్పుడు బంగ్లాదేశ్‌లో) పాకిస్తాన్ సైన్యం చేసిన క్రూరమైన అణచివేతతో నగరంలో టీఎంసీ నిరసన వేదికను ఆర్మీ కూల్చడాన్ని పోలుస్తూ రాష్ట్ర విద్యా మంత్రి బ్రాత్య బసు చేసిన వ్యాఖ్యలు సభలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడంతో స్పీకర్ బిమన్ బెనర్జీ అసెంబ్లీ మిగతా సెషన్ నుంచి ఆయన్ను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. అధికార టీఎంసీ పాకిస్తాన్ ఏజెంట్‌గా పనిచేస్తోందని సువేందు తీవ్ర ఆరోపణలు చేశారు. బెంగాలీ వలస కార్మికులపై బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దాడులను నిరసిస్తూ కోల్‌కతాలోని గాంధీ విగ్రహం సమీపంలో టీఎంసీ ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆర్మీ సిబ్బంది తొలగించడం వివాదానికి కారణమయ్యింది. ప్రభుత్వం ఆర్మీపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. సోమవారం మొదలైన అసెంబ్లీ ప్రత్యేక సెషన్ గురువారంతో ముగియనుంది.

పక్షి ఢీకొనడంతో ఇండిగో విమానం వెనక్కి

నాగ్‌పూర్: టేకాఫ్ తీసుకున్న ఇండిగో విమానాన్ని పక్షి ఢీకొనడంతో నాగ్‌పూర్-కోల్‌కతా విమానం మళ్లీ వెనక్కి మళ్లింది. కనీసం 165 మంది ప్రయాణిస్తున్న ఈ విమానాన్ని ముందు జాగ్రత్తగా తిరిగి నాగ్‌పూర్‌లోనే సురక్షితంగా ల్యాండ్ చేసినట్లు విమానాశ్రయం అధికారులు వెల్లడించారు. అవసరమైన తనిఖీలు చేపట్టాల్సి ఉన్నందున ఈ విమాన సర్వీసును రద్దు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌర్యాన్ని తగ్గించేందుకు వారికి అవసరమైన బస ఏర్పాట్లు చేశామని ఇండిగో తెలిపింది. టికెట్ డబ్బును తిరిగి చెల్లించడంతోపాటు వారు కోరిన విధంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టామంది.

చైనా అధ్యక్షుడితో మునీర్ భేటీ

బీజింగ్: పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ మంగళవారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌ను బీజింగ్‌లో కలుసుకున్నారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలు, ప్రాంతీయ సహకారానికి సంబంధించిన అంశాలపై చర్చలు జరిపారు. టియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీవో శిఖరాగ్రంలో పాల్గొన్న పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ బృందంలో మునీర్ కూడా ఉన్నారు. జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా ఆర్మీ బుధవారం బీజింగ్‌లో చేపట్టే భారీ పరేడ్‌లో షరీఫ్, మునీర్ పాల్గొననున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల మునీర్‌కు అధ్యక్ష భవనం వైట్ హౌస్‌లో విందు ఇచ్చిన నేపథ్యంలో రెండు దేశాల మధ్య సంబంధాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. జూలైలో చైనాలో పర్యటించిన మునీర్ చైనా ఉపాధ్యక్షుడు హన్ జెంగ్‌తో మాత్రమే భేటీ అయ్యారు. తాజాగా, ఆయన మొట్టమొదటిసారిగా జిన్‌పింగ్‌తో సమావేశం జరిపారు. ఇప్పటికే చైనా తయారీ ఆయుధాలతో ఆర్మీని నింపేసిన పాకిస్తాన్..తాజాగా ఆ దేశ ఆయుధ పరేడ్‌లో ప్రదర్శించే అత్యాధునిక ఆయుధాల కొనుగోలుపై ఆసక్తి చూపుతోంది.

విదేశీ నిధుల ఆరోపణలపై ఈడీ కన్ను

బెంగళూరు: కర్నాటకలో ధర్మస్థలలో మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు జరిగిన కుట్రలో విదేశీ నిధులు అందాయన్న ఆరోపణలపై ఈడీ మంగళవారం దర్యాప్తు చేపట్టింది. దీనిపై వివిధ పరిణామాలను, పలు ఎన్‌జీవోలకు చెందిన లావాదేవీల పత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపింది. ఫారిన్ ఎక్స్ఛేంజి మేనేజ్‌మెంట్ చట్టం కింద జరిగిన ఉల్లంఘనలపై ప్రాథమికంగా విచారణ చేపట్టామని ఈడీ పేర్కొంది. 1995-2014 మధ్య ధర్మస్థలలో మహిళలు, చిన్నారులు సహా పలు మృతదేహాలను బలవంతంగా ఖననం చేయాల్సి వచ్చిందని చెన్నయ్య అనే మాజీ పారిశుధ్య ఉద్యోగి చేసిన ఆరోపణలు తీవ్ర సంచలన రేపింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేయడం, విచారణలో తీవ్ర అనుమానాస్పద అంశాలు బయటపడకపోవడం తెల్సిందే.

ఢిల్లీ అల్లర్ల కేసు.. 8 మందికి నో బెయిల్

న్యూఢిల్లీ: 2020నాటి ఢిల్లీ అల్లర్లకు కుట్ర పన్నిన ఆరోపణలెదుర్కొంటున్న హక్కుల కార్యకర్తలు ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమాం సహా 8 మందికి ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. బెయిల్‌కు సంబంధించిన అన్ని పిటిషన్లను కొట్టివేస్తూ మంగళవారం జస్టిస్ నవీన్ చావ్లా, శాలిందర్ కౌర్ స్పష్టం చేశారు. 2020 ఫిబ్రవరిలో సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో 53 మంది చనిపోగా, 700 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఉమర్ ఖాలిద్, షార్జిల్ ఇమాంలపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం ఉపాలోని వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ట్రయల్ కోర్టు సైతం వీరి బెయిల్ దరఖాస్తులను కొట్టివేసింది. 2020 నుంచి నిందితులు జైలులో ఉన్నారు.

ఎస్‌సీవో సభ్యత్వాన్ని భారత్ అడ్డుకుంది

వాషింగ్టన్: పాకిస్తాన్‌తో సన్నిహిత సంబంధాలు నెరుపున్నందుకు భారత్ తమపై కక్ష సాధింపుతో వ్యవహరిస్తోందని అజెర్‌బైజాన్ ఆరోపించింది. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీవో)లో తమ దేశానికి పూర్తి స్థాయి సభ్యత్వం దక్కకుండా భారత్ అడ్డుకుందని విమర్శించింది. బహుళ ధ్రువ దౌత్యానికి భారత్ తూట్లు పొడుస్తోందని పేర్కొంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు అజెర్‌బైజాన్ మద్దతుగా నిలవడం తెల్సిందే. టియాంజిన్‌లో జరిగిన సమావేశంలో పాకిస్తాన్ ప్రధాని షరీఫ్‌తో కలిసి అజెర్‌బైజాన్ అధ్యక్షుడు అలియేవ్ మీడియాతో మాట్లాడారు. భారత్‌పై విజయం సాధించిన పాకిస్తాన్‌ను ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

1400కు చేరిన అఫ్గాన్ భూకంప మృతులు

మరో 3 వేల మందికి పైగా గాయాలు

కాబూల్: అఫ్గానిస్తాన్ భూకంపంలో మరణించిన వారి సంఖ్య మంగళవారం 1,400కు చేరింది. మరో 3 వేల మంది గాయపడ్డారు. పర్వతప్రాంతంలోని గ్రామాలకు గ్రామాలే ధ్వంసం కాగా ప్రభుత్వ సహాయక చర్యలు నామ మాత్రంగానే ఉన్నాయి. వేలాది మంది ప్రజలు ప్రజలు ఇంకా శిథిలాల కిందే చిక్కుకొని ఉంటారని అనుమానిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో ఇంకా సహాయక చర్యలు ప్రారంభం కాలేదు. చాలా ప్రాంతాల్లో ప్రజలు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్న తమవారిని రక్షించుకొనేందుకు మట్టిని తవ్వితీస్తున్నారు. సహాయక చర్యల్లో జాప్యం కారణంగా వీరు ప్రాణాలు కోల్పోయే అవకాశముందని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. సోమవారం రాత్రి సైతం పలుమార్లు భూమి కంపించింది. అధికారులు మంగళవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. మారుమూల గ్రామాల్లో శిథిలాల్లో హెలికాప్టర్లతో అన్వేషణ చేపట్టారు.

పార్టీ ఫిరాయింపుల చట్టం గురించి తెలిపే షెడ్యూల్ ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

ఎన్నికల సంస్కరణలు

భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. సమర్థులు, నిస్వార్థపరులను ప్రతినిధులుగా ఎన్నుకోవడానికి ఎన్నికల సంస్కరణలు అవసరం. నేరచరిత్ర ఉన్న వారిని ఎన్నికల్లో పోటీచేయకుండా నివారించి, ఎన్నికల ప్రక్రియను సులభతరం చేయడానికి ఎన్నికల సంస్కరణలు తప్పనిసరి.

తార్కుండే, టి.ఎన్.శేషన్, జె.ఎం.లింగ్డో, సంపత్ ఎన్నికల కమిషనర్లుగా ఉన్న సమయంలో ఎన్నికల సంస్కరణలను బలోపేతం చేయడానికి ప్రయత్నించారు. ఎన్నికల సంస్కరణలను సూచించడానికి 1974లో తార్కుండే కమిటీ, 1990లో దినేష్ గోస్వామి కమిటీ, 1998లో ఇంద్రజిత్ గుప్తా కమిటీ, 1999లో జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన 15వ లా కమిషన్‌ను నియమించారు. జస్టిస్ వెంకటాచలయ్య అధ్యక్షతన నియమించిన రాజ్యాంగ సమీక్ష సంఘం, వీరప్ప మొయిలీ అధ్యక్షతన నియమించిన రెండో పరిపాలన సంస్కరణల సంఘం కూడా కొన్ని సూచనలు చేశాయి.

వివిధ కమిటీల ముఖ్య సిఫారసులు

1. స్వతంత్ర అభ్యర్థులు మరణిస్తే ఎన్నికను వాయిదా వేయొద్దు. స్వతంత్ర అభ్యర్థులను పోటీకి అనుమతించొద్దు.
2. పార్లమెంటు సభ్యుడికి డిగ్రీ, అసెంబ్లీ సభ్యుడికి ఇంటర్మీడియెట్ కనీస విద్యార్హతగా నిర్ణయించాలి.
3. పార్లమెంటు, అసెంబ్లీకి ఎన్నికైన ప్రతినిధులు తమ ఆస్తుల వివరాలను సభాధ్యక్షునికి, ఎన్నికల సంఘానికి ప్రమాణ స్వీకారానికి ముందే తెలపాలి.
4. కేంద్ర, రాష్ట్ర మంత్రిమండలి సభ్యుల సంఖ్య పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యుల సంఖ్యలో పదో వంతుకు మించొద్దు. దీన్ని 2003లో 91వ సవరణ ద్వారా రాజ్యాంగంలో చేర్చారు.
5. కొత్తగా ఎన్నికైన సభ్యులకు మంత్రి పదవులు ఇవ్వాలంటే ప్రభుత్వ నిర్వహణపై నెలపాటు తర్ఫీదు ఇవ్వాలి.
6. పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలో సభ్యత్వం లేని వ్యక్తిని శాసనసభ నాయకుడిగా ఎన్నుకోవడానికి అనర్హుడిగా ప్రకటించాలి.
7. ఎన్నికల ప్రచారానికయ్యే అభ్యర్థుల ఖర్చును ప్రభుత్వమే భరించాలి.
8. ఎన్నికల ముందు జరిగిన సర్దుబాట్లకు పార్టీ విప్‌ను ప్రయోగించి పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తింపజేయాలి.
9. ఒక నియోజక వర్గంలో పోలైన ఓట్లలో 51 శాతం సాధించిన అభ్యర్థినే విజేతగా ప్రకటించాలి.
10. పార్టీల ఆదాయ వ్యయాలను ఆడిట్ చేయించాలి.
11. వ్యతిరేక ఓటు పద్ధతిని ప్రవేశపెట్టాలి.
12. రాజకీయ అస్థిరత్వాన్ని సృష్టించే చిన్న గ్రూపులు, చిన్న పార్టీలను నిషేధించాలి.
13. లోక్‌సభ, అసెంబ్లీలు పూర్తి కాలంపాటు కొనసాగేలా చూడాలి.
14. రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ సమయంలో రాష్ట్రపతి పాలన విధించాలి.
15. రాజకీయ పదవుల నిర్వహణలో రెండు పర్యాయాల పరిమితిని నిర్దేశించాలి.
16. ముఖ్యమంత్రి పదవికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలి.
17. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల ప్రచార సమయాన్ని గణనీయంగా తగ్గించాలి.
18. అభ్యర్థులు ఒకే సమయంలో ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేయకుండా నిషేధించాలి.
19. లోక్‌సభ, విధాన సభకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలి.
20. ఎన్నికల ప్రవర్తన నియమావళికి చట్టబద్ధహోదా కల్పించి, అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి.
21. ఓటింగ్ యంత్రాలను ప్రవేశపెట్టాలి.

పైన సిఫారసు చేసిన సంస్కరణల్లో కొన్ని అమల్లోకి వచ్చాయి.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం

ప్రస్తుత ప్రజాస్వామ్య ప్రభుత్వాల్లో రాజకీయ పార్టీలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వాల భవిష్యత్తు రాజకీయ పార్టీలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల్లో పోటీచేసి అధికారం చేపట్టేందుకు ప్రయత్నిస్తుంది. ఒక పార్టీ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని నడిపితే, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ లోపాలను ఎండగడుతూ అధికార పార్టీని నియంత్రిస్తాయి. కానీ కొన్ని సందర్భాల్లో అభ్యర్థులు ఒక రాజకీయ పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. ఫలితంగా రాజకీయ అస్థిరత్వం ఏర్పడి ప్రజాభిప్రాయం అభాసుపాలవుతుంది.



ఉదాహరణకు 1967 తర్వాత దేశంలో పార్టీ ఫిరాయింపులు జోరందుకున్న నేపథ్యంలో 'ఆయారామ్ గయారామ్' అనే పదం పాపులర్ అయింది. దీంతో పార్టీ ఫిరాయింపులను నివారించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని రూపొందించారు.

రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని ప్రత్యేకంగా పదో షెడ్యూల్‌లో చేర్చారు. 2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ చట్టాన్ని సవరించారు.

అనర్హత వేటుపడే సందర్భాలు

1. ఒక పార్టీ నుంచి ఎన్నికై మరో పార్టీలో చేరినప్పుడు.
2. పార్టీ విప్‌కు విరుద్ధంగా ఓటు వేసినప్పుడు, ఓటు వేయనప్పుడు.
3. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికై ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.
4. నామినేటెడ్ సభ్యుడు 6 నెలల తర్వాత ఏదో ఒక పార్టీలో చేరినప్పుడు.

రద్దుచేసే అధికారం

1. సభ్యుడిపై అనర్హత వేటు వేసే అధికారం స్పీకర్‌కు లేదా సభాధ్యక్షునికి ఉంటుంది.
2. స్పీకర్ లేదా సభాధ్యక్షుడు ఫిరాయిస్తే నిర్ణయాధికారం సభ ఎన్నుకున్న మరో సభ్యుడికి ఉంటుంది.

మినహాయింపులు

1. ఒక రాజకీయ పార్టీ మరో పార్టీలో విలీనమైనప్పుడు సభ్యుల సభ్యత్వం రద్దు కాదు.
2. ఒక పార్టీలోని మొత్తం సభ్యులు మరో పార్టీలో చేరినప్పుడు సభ్యత్వం రద్దుకాదు.
3. గుర్తింపులేని పార్టీనుంచి వెళ్లితే ఫిరాయింపుల నిరోధక చట్టం వర్తించదు.
4. ఒక పార్టీకి చెందిన మొత్తం సభ్యుల్లో 2/3 వంతు సభ్యులు ఫిరాయిస్తే సభ్యత్వం రద్దుకాదు.

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం - ఉపయోగాలు

1. రాజకీయ సుస్థిరత సాధించవచ్చు.
2. రాజకీయాల్లో అవినీతి, అనైతికతను నివారించ వచ్చు.
3. సంకుచిత, స్వార్థ, అవకాశవాద రాజకీయాలను అరికట్టవచ్చు.

91వ రాజ్యాంగ సవరణ

2003లో 91వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని సవరించారు. ఈ సవరణ ద్వారా..

1. మంత్రిమండలి సభ్యుల సంఖ్య లోక్‌సభ, విధానసభ సభ్యుల సంఖ్యలో 15 శాతానికి మించొద్దు. రాష్ట్ర మంత్రివర్గంలో కనీసం 12 మంది ఉండాలి.
2. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హులుగా ప్రకటించన వారిని మంత్రులుగా నియమించొద్దు.
3. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద అనర్హుడిగా ప్రకటించిన వారిని లాభదాయక పదవుల్లో నియమించొద్దు.
4. పార్టీ ఫిరాయింపు చట్టం ద్వారా చీలిక (1/3వంతు) పదానికి మినహాయింపు ఉండేది. దీన్ని తొలగించారు.

మాదిరి ప్రశ్నలు

1. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేసిన మొదటి రాష్ట్రం?
   ఎ) తమిళనాడు బి) కర్ణాటక
   సి) జమ్మూకశ్మీర్
   డి) ఆంధ్రప్రదేశ్
2. ఫ్లోర్ క్రాసింగ్ అంటే?
   ఎ) అధికార పార్టీకి మద్దతు ప్రకటించడం
   బి) రాజకీయ లబ్ధికోసం అధికార పార్టీలోకి ఫిరాయింపు
   సి) రాజకీయ రంగాన్ని వీడటం
   డి) పైవన్నీ
3. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హతపై అంతిమ అధికారం ఎవరికి ఉంటుంది?
   ఎ) సుప్రీంకోర్టు
   బి) కేంద్ర ఎన్నికల సంఘం
   సి) సభాధ్యక్షులు డి) రాష్ట్రపతి
4. భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ పార్లమెంటు సభ్యుల అనర్హతల గురించి తెలుపుతుంది?
   ఎ) అధికరణ 101
   బి) అధికరణ 102
   సి) అధికరణ 108
   డి) అధికరణ 110
5. ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
   ఎ) కేరళ బి) హర్యానా
   సి) అసోం డి) పంజాబ్
6. 'నోటా' బటన్‌ను తొలుత ఏ లోక్‌సభ ఎన్నికల్లో ప్రవేశపెట్టారు?
   ఎ) 13వ బి) 14వ
   సి) 15వ డి) 16వ
7. పార్టీ ఫిరాయింపుల చట్టం గురించి తెలిపే షెడ్యూల్ ఏది?
   ఎ) 8 బి) 9 సి) 10
   డి) పైవేవీ కావు
8. ఓటరు గుర్తింపు కార్డులను ప్రవేశపెట్టిన మొదటి రాష్ట్రం?
   ఎ) మణిపూర్ బి) మేఘాలయ
   సి) హర్యానా
   డి) హిమాచల్ ప్రదేశ్
9. అభ్యర్థుల ఎన్నికల ప్రచార ఖర్చును ప్రభుత్వమే భరించే దేశం?
   ఎ) పాకిస్తాన్ బి) యూఎస్ఏ
   సి) ఇండియా డి) బ్రిటన్
10. ఓటరు దినోత్సవంగా ఏ రోజును జరుపుకుంటారు?
    ఎ) జనవరి 3 బి) జనవరి 25
    సి) జనవరి 26 డి) అక్టోబర్ 2
11. ఎన్నికల సంస్కరణల సిఫారసుల కోసం వి.పి.సింగ్ ప్రభుత్వం నియమించిన కమిటీ?
    ఎ) తార్కుండే కమిటీ
    బి) దినేష్ గోస్వామి కమిటీ
    సి) ఇంద్రజిత్ గుప్తా కమిటీ
    డి) 15వ లా కమిషన్
12. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించారు?
    ఎ) 52వ రాజ్యాంగ సవరణ
    బి) 73వ రాజ్యాంగ సవరణ
    సి) 91వ రాజ్యాంగ సవరణ
    డి) 61వ రాజ్యాంగ సవరణ
13. ఎన్నికల సంస్కరణలను ప్రవేశపెట్టడానికి కృషిచేసిన ఎన్నికల కమిషనర్?
    ఎ) పేరిశాస్త్రి
    బి) సుకుమార్ సేన్
    సి) టి.ఎన్. శేషన్
    డి) నజీంజైది
14. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ ఎంత కాలంలో నిర్ణయం ప్రకటించాలి?
    ఎ) 3 నెలలు బి) 6 నెలలు
    సి) ఏడాది డి) పైవేవీ కావు

సమాధానాలు

1) సి; 2) బి; 3) సి; 4) బి; 5) ఎ; 6) డి; 7) సి; 8) సి; 9) డి; 10) బి; 11) బి; 12) ఎ; 13) సి; 14) డి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. ఎన్నికల సంస్కరణల అంశాన్ని ఏ కమిటీ ప్రస్తావించింది?
   1) తార్కుండే కమిటీ
   2) గోస్వామి కమిటీ
   3) సంతానం కమిటీ
   4) సబార్ కమిటీ
   ఎ) 1, 2 మాత్రమే బి) 1, 3 మాత్రమే
   సి) 1, 2, 3 మాత్రమే డి) 3, 4 మాత్రమే
2. ఎన్నో రాజ్యాంగ సవరణ ద్వారా మంత్రుల సంఖ్యకు పరిమితి విధించారు?
   ఎ) 87 బి) 86 సి) 91 డి) 73
3. కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ని ఎప్పుడు స్థాపించారు?
   ఎ) 1960 బి) 1961
   సి) 1962 డి) 1964

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి.

ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?

1. భారతదేశం ఏ రకమైన శీతోష్ణస్థితిని కలిగి ఉంది?
జ. ఉష్ణమండల రుతుపవన శీతోష్ణస్థితి
2. మన దేశంలో పశ్చిమ దిశగా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్న నదులేవి?
జ. నర్మద, తపతి, మహి, సబర్మతి
3. దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతం?
జ. రాజస్థాన్‌లోని జైసల్మీర్
4. మనదేశంలో నైరుతి రుతుపవన కాలం?
జ. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు
5. ఈశాన్య రుతుపవనాలు (తిరోగమన రుతుపవనాలు) వీచే కాలం?
జ. సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు
6. నైరుతి రుతుపవనాల వల్ల మొదటగా ఏ రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయి?
జ. కేరళ
7. ఈశాన్య రుతుపవనాలు మొదటగా ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తాయి?
జ. పంజాబ్
8. ప్రస్తుతం హిమాలయాలున్న భూభాగంపై మధ్య మహాయుగంలో ఉన్న సముద్రం?
జ. టెథిస్
9. భారత ద్వీపకల్ప పీఠభూమిని పూర్వం ఏమని పిలిచేవారు?
జ. గోండ్వానా పీఠభూమి
10. హిమాలయాలు ఏ రకమైన పర్వతాలు?
జ. నవీన ముడుత పర్వతాలు
11. సిమ్లా పట్టణం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. ధౌల్‌దార్ శ్రేణి
12. అరుణాచల్‌ప్రదేశ్‌లోని బాహ్య హిమాలయాలను ఏమని పిలుస్తారు?
జ. మిష్మి కొండలు
13. ప్రముఖ వేసవి విడిది కేంద్రమైన డెహ్రాడూన్ ఏ రాష్ట్రంలో ఉంది?
జ. ఉత్తరాఖండ్
14. ప్రపంచంలో రెండో అతి ఎత్తైన శిఖరం ఏ పర్వత శ్రేణిలో ఉంది?
జ. కారకోరం శ్రేణి
15. మడ అడవులు (సుందర వనాలు) ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉన్నాయి?
జ. పశ్చిమ బెంగాల్
16. ఆరావళి పర్వతాల్లో ఎత్తైన శిఖరం?
జ. గురుశిఖర్ పర్వతం (1722 మీటర్లు)
17. ఆరావళి పర్వతాలు ఏ రకాని చెందినవి?
జ. అతి పురాతన ముడుత పర్వతాలు
18. ఛోటా నాగపూర్ పీఠభూమి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. జార్ఖండ్
19. ఆరావళి పర్వత శ్రేణి ఏ రాష్ట్రంలో ఉంది?
జ. రాజస్థాన్
20. ఊటీ ఏ కొండల్లో ఉంది?
జ. నీలగిరి కొండలు (తమిళనాడు)
21. సింధు నది ముఖ్య ఉపనదులు?
జ. జీలం, చీనాబ్, బియాస్, సట్లెజ్, రావి
22. బ్రహ్మపుత్ర నదిని అరుణాచల్‌ప్రదేశ్‌లో ఏమని పిలుస్తారు?
జ. ది హాంగ్
23. అసోం దుఃఖదాయనిగా పేరొందింది?
జ. బ్రహ్మపుత్రా నది
24. కృష్ణా నది జన్మస్థానం?
జ. మహాబలేశ్వర్ (మహారాష్ట్ర)
25. సింధు నది జన్మస్థానం?
జ. మానస సరోవరం (టిబెట్)
26. అమర్ కంటక్ వద్ద జన్మించిన నది?
జ. నర్మద
27. తపతి నది జన్మస్థానం?
జ. ముల్తాయి (బేటల్, మధ్యప్రదేశ్)
28. కోరమండల్ తీరంలో ఏ రుతుపవనాల వల్ల అధిక వర్షం కురుస్తుంది?
జ. ఈశాన్య రుతుపవనాలు
29. కరువుకు గురయ్యే ప్రాంతాల ప్రణాళిక (DPAP)ను ఏ సంవత్సరంలో ప్రవేశపెట్టారు?
జ. 1973
30. మహానది ఏ రాష్ట్రంలో ఎక్కువ దూరం ప్రవహిస్తోంది?
జ. ఒడిశా
31. బెంగాల్ దుఃఖదాయని అని ఏ నదిని పిలుస్తారు?
జ. దామోదర్ నది
32. సుగంధ నూనెలను తయారుచేయడానికి ఉపయోగపడే రూసా గడ్డిని ఏ జిల్లాలో పండిస్తున్నారు?
జ. నిజామాబాద్



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

33. భారతదేశ సగటు అటవీ శాతం?
జ. 20.55%
34. అడవుల విస్తీర్ణం పరంగా మధ్యప్రదేశ్ మొదటి స్థానంలో ఉండగా, చివరిస్థానంలో ఉన్న రాష్ట్రం?
జ. హర్యానా
35. వైశాల్యం పరంగా అత్యధిక శాతం అడవులు ఉన్న రాష్ట్రం?
జ. అరుణాచల్ ప్రదేశ్
36. మృత్తికా క్రమక్షయం అంటే?
జ. సహజ కారణాల వల్ల సారవంతమైన నేలల పైపొర కొట్టుకొని పోవడం
37. ఉష్ణమండల చెర్నోజెమ్ మృత్తికలుగా పేరొందినవి?
జ. నల్లరేగడి నేలలు
38. మౌసమ్ అనేది ఏ భాషా పదం?
జ. అరబిక్ (అర్థం-రుతువు)
39. మన దేశంలో ఇప్పటి వరకూ అత్యల్ప ఉష్ణోగ్రత (–40°C) ఎక్కడ నమోదైంది?
జ. ద్రాస్ (కార్గిల్- కశ్మీర్)
40. అత్యధిక వర్షపాతం (1141సెం.మీ.) నమోదయ్యే మాసిన్‌రామ్ ప్రాంతం ఏ రాష్ట్రంలో ఉంది?
జ. మేఘాలయ
41. తమిళనాడులో అత్యధిక వర్షపాతం సంభవించడానికి కారణమయ్యే రుతుపవనాలు?
జ. తిరోగమన రుతుపవనాలు
42. పత్తి పంటకు అత్యంత అనుకూలమైన నేలలు?
జ. నల్లరేగడి నేలలు
43. భంగర్, ఖాదర్ మృత్తికలుండే నేలలు?
జ. ఒండ్రు నేలలు
44. మృత్తికా పరిరక్షణ పద్ధతులేవి?
జ. కాంటూర్ బండింగ్, ఫర్రోయింగ్, స్ట్రిప్ క్రాసింగ్
45. దక్కన్ లావా నేలలుగా పేరుగాంచినవి?
జ. నల్లరేగడి నేలలు
46. జనసాంద్రత అంటే?
జ. చదరపు కిలోమీటరుకు నివసించే సగటు జనాభా
47. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఏ రోజున జరుపుకుంటాం?
జ. జూలై 11
48. తెలంగాణలో అక్షరాస్యత ఎక్కువగా ఉన్న ఉమ్మడి జిల్లా హైదరాబాద్ కాగా తక్కువగా ఉన్న జిల్లా?
జ. ఉమ్మడి మహబూబ్‌నగర్ (55.4%)
49. తెలంగాణ రాష్ట్ర మొత్తం జనాభా?
జ. 3 కోట్ల 52 లక్షలు
50. రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న ఉమ్మడి జిల్లా రంగారెడ్డి. కాగా, అతి తక్కువ జనాభా ఉన్న జిల్లా?
జ. ఉమ్మడి నిజామాబాద్
51. తెలంగాణలో ఎస్సీ జనాభా తక్కువగా ఉన్న ఉమ్మడి జిల్లా హైదరాబాద్. కాగా, ఎక్కువగా ఉన్న జిల్లా?
జ. ఉమ్మడి కరీంనగర్
52. తెలంగాణలో ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఉమ్మడి జిల్లా ఖమ్మం కాగా, తక్కువగా ఉన్న జిల్లా ఏది?
జ. ఉమ్మడి హైదరాబాద్
53. దేశంలో ఎక్కువగా వ్యవసాయానికి తోడ్పడే నీటి పారుదల వనరు?
జ. బావులు
54. పెరియార్, మెట్టూరు కాలువలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
జ. తమిళనాడు
55. చెరువుల ద్వారా సాగయ్యే భూమి ఏ రాష్ట్రంలో ఎక్కువగా ఉంది?
జ. తెలంగాణ
56. కాలువలు, బావుల ద్వారా సాగయ్యే భూమి అత్యధికంగా ఉన్న రాష్ట్రం?
జ. ఉత్తరప్రదేశ్
57. ఏ రాష్ట్రంలో చాలా వరకు వ్యవసాయమంతా నీటిపారుదల వసతుల కిందే జరుగుతుంది?
జ. పంజాబ్
58. భారీ నీటిపారుదల పథకాల ఆయకట్టు ప్రాంతం ఎంత ఉంటుంది?
జ. 10,000 హెక్టార్ల కంటే ఎక్కువ
59. చిన్నతరహా నీటిపారుదల పథకాల ఆయ కట్టు ప్రాంతం ఎన్ని హెక్టార్లలోపు ఉం టుంది?
జ. 2000
60. తెల్లబొగ్గుగా పిలిచేది?
జ. జలవిద్యుచ్ఛక్తి
61. దేశంలో ఉత్పత్తయ్యే మొత్తం విద్యుచ్ఛక్తిలో జలవిద్యుచ్ఛక్తి వాటా?
జ. 22 శాతం
62. మనదేశంలో జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తికి అత్యంత అనువైన ప్రాంతం?
జ. హిమాలయ పర్వతపాద ప్రాంతం
63. ఏ బహుళార్థసాధక పథకం వల్ల అధికంగా జలవిద్యుచ్ఛక్తి ఉత్పత్తి అవుతుంది?
జ. భాక్రానంగల్
64. మనదేశంలోని ఏకైక అంతర్జాతీయ బహుళార్థసాధక ప్రాజెక్టు
జ. కోసి ప్రాజెక్టు
65. భాబర్ అంటే?
జ. గులకరాళ్లతో కూడిన సచ్ఛిద్ర మండలం
66. టెరాయి అంటే?
జ. చిత్తడి ప్రాంతం
67. భంగర్ అంటే?
జ. ప్రాచీన కాలంలో ఏర్పడిన ఒండలి మైదానం.
68. ఖాదర్ అంటే?
జ. నూతనంగా ఏర్పడిన ఒండలి మైదానం
69. రే/ కల్లార్ అంటే?
జ. చవుడు, లవణీయ, స్ఫటికీయ భూభాగం

బహుళార్థసాధక ప్రాజెక్టు	నది	నిర్మించిన ప్రదేశం	లబ్ధి పొందుతున్న రాష్ట్రాలు
భాక్రానంగల్ ప్రాజెక్టు	సట్లెజ్	భాక్రానంగల్ (హిమాచల్ ప్రదేశ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
బియాస్ ప్రాజెక్టు	బియాస్	పాంగ్ (పంజాబ్)	పంజాబ్, హర్యానా, రాజస్థాన్
దామోదర్ ప్రాజెక్టు	దామోదర్	జార్ఖండ్	పశ్చిమ బెంగాల్, జార్ఖండ్
హిరాకుడ్ ప్రాజెక్టు	మహానది	సంబల్‌పూర్	ఒడిశా
నాగార్జునసాగర్ ప్రాజెక్టు	కృష్ణా	నందికొండ (నల్గొండ, తెలంగాణ)	తెలంగాణ, ఆంధ్రప్రదేశ్
తుంగభద్ర ప్రాజెక్టు	తుంగభద్ర	మల్లాపూర్ (బళ్లారి)	కర్ణాటక, ఆంధ్రప్రదేశ్
కోసి ప్రాజెక్టు	కోసి నది	హనుమాన్ నగర్ (బిహార్)	బిహార్, నేపాల్ (అంతర్జాతీయ పథకం)
చంబల్ ప్రాజెక్టు	చంబల్	మధ్యప్రదేశ్	మధ్యప్రదేశ్, రాజస్థాన్
గండక్ ప్రాజెక్టు	గండక్	వాల్మీకి నగర్ (బిహార్)	బిహార్, ఉత్తరప్రదేశ్, నేపాల్
రామ్‌గంగా ప్రాజెక్టు	రామ్‌గంగా	కాలాగర్	ఉత్తరాఖండ్

పర్వతాలు	రాష్ట్రం
మహాదేవ్ కొండలు	మధ్యప్రదేశ్
రాజ్‌మహల్ కొండలు	జార్ఖండ్
మిష్మి కొండలు, దాఫ్లా కొండలు	అరుణాచల్‌ప్రదేశ్
కచార్ కొండలు	అసోం
పాట్‌కాయ్ కొండలు	నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్
ఖాసీ కొండలు, జాంతియా కొండలు, గారో కొండలు	మేఘాలయ
పళని కొండలు, నీలగిరి కొండలు, షేవరాయ్ కొండలు	తమిళనాడు
యాలకుల (కార్డమమ్) కొండలు, అన్నామలై కొండలు	కేరళ
లూషాయ్ కొండలు	మిజోరాం
గిర్ కొండలు	గుజరాత్

తీరప్రాంత మైదానం	విస్తరించిన రాష్ట్రం
సర్కార్ తీరం	ఆంధ్రప్రదేశ్
ఉత్కల్ తీరం	ఒడిశా
కోరమండల్ తీరం	తమిళనాడు
మలబార్ తీరం	కేరళ
కెనరా తీరం	కర్ణాటక
కొంకణ్ తీరం	గోవా, మహారాష్ట్ర

2011 జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో

మొత్తం జనాభా	121 కోట్లు
జనాభా పెరుగుదల రేటు (దశాబ్దంలో)	17.7%
అక్షరాస్యత	74%
లింగనిష్పత్తి	1000 : 943
జనసాంద్రత	382
పట్టణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	గోవా (62.2%)
గ్రామీణ జనాభా అధికంగా ఉన్న రాష్ట్రం	హిమాచల్ ప్రదేశ్ (90%)

కుడి నుంచి వారి స్థానాలు వరుసగా?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

ర్యాంకింగ్ టెస్ట్

పోటీ పరీక్షల్లో మెంటల్ ఎబిలిటీలో భాగంగా ర్యాంకింగ్ టెస్ట్ అంశం నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా అడుగుతున్నారు. దీనిలో ప్రధానంగా ఒక తరగతిలో లేదా ఒక వరుసలో వ్యక్తుల స్థానాలను (ర్యాంకులను) ఒకవైపు నుంచి ఇచ్చి మరోవైపు నుంచి కనుక్కోవాలని అడుగుతారు. స్థానాలను పరస్పరం మార్చడం ద్వారా కొత్తగా ఏర్పడే వరుసలోని ర్యాంకులను గుర్తించాలని ప్రశ్నలు ఇస్తారు. కొందరి ర్యాంకులను ఇచ్చి సమూహంలోని మొత్తం వ్యక్తుల సంఖ్యను గుర్తించమనడం లాంటి అంశాలపై కూడా తరచుగా ప్రశ్నలు ఇస్తారు. ఇచ్చిన సమాచారాన్ని అవగాహన చేసుకుని సునిశిత పరిశీలన ద్వారా సమాధానాలను సులభంగా గుర్తించవచ్చు. ర్యాంకింగ్ టెస్ట్‌ను ప్రధానంగా 4 రకాలుగా విభజించవచ్చు. అవి



టైప్-1

- ఒక వరుస లేదా తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య, ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు (కుడి లేదా ఎడమ) నుంచి ఇచ్చి రెండోవైపు నుంచి ఆ విద్యార్థి స్థానాన్ని కనుగొనడం.
- ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సమాధానాలను తేలికగా రాబట్టవచ్చు.
- ఒక వరుసలో లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T). ఏదైనా ఒక విద్యార్థి స్థానం ఒక వైపు నుంచి (R_1) అయితే రెండో వైపు నుంచి ఆ విద్యార్థి స్థానం(R_2).
  $R_2 = (T-R_1)+1$

ఉదాహరణ:

- 30 మంది విద్యార్థులున్న తరగతిలో రోహిత్ మొదటి(ఎడమ) నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. అయితే చివరి (కుడి) నుంచి అతడి స్థానం ఎంత?

సాధన: మొత్తం విద్యార్థులు T = 30
మొదటి నుంచి రోహిత్ స్థానం
$R_1 = 12$
చివరి నుంచి రోహిత్ స్థానం R_2 = ?
$\therefore R_2 = (T-R_1)+1$
$R_2 = (30-12)+1 = 18+1 = 19$
∴ చివర నుంచి రోహిత్ స్థానం 19.

టైప్-2

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాన్ని రెండు వైపుల నుంచి ఇచ్చి ఆ వరుస లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య కనుగొనడం.

ఇలాంటి ప్రశ్నలకు కింది సూత్రం ద్వారా సులభంగా సమాధానాలు రాబట్టవచ్చు.

ఒక వరుస లేదా తరగతిలోని ఒక విద్యార్థి స్థానాలు రెండు వైపుల నుంచి R_1, R_2. మొత్తం విద్యార్థుల సంఖ్య T. అయితే
$T = (R_1+R_2)-1$

ఉదాహరణ:

- ఒక తరగతిలో ఒక విద్యార్థి స్థానం మొదటి (ఎడమ) నుంచి 12. చివరి (కుడి) నుంచి 17. అయితే ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య?

సాధన: మొదటి నుంచి స్థానం = R_1
చివర నుంచి స్థానం = R_2
ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య (T)
$= (R_1+R_2)-1$
$= (12+17)-1 = 29-1 = 28$
తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 28


టైప్-3

ఒక వరుస లేదా తరగతిలోని విద్యార్థుల స్థానాలు పరస్పరం మారినప్పుడు వారి స్థానాలను నిర్ణయించడం.

ఉదాహరణ:

- ఒక వరుసలో పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకోగా పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలో మొత్తం బాలికల సంఖ్య?

సాధన:



పద్మ ఎడమ నుంచి 9వ స్థానంలో, పుష్ప కుడి నుంచి 12వ స్థానంలో ఉన్నారు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే పద్మ ఎడమ నుంచి 15వ స్థానంలో ఉంది. ఆ స్థానం ఇంతకు ముందు పుష్పది. కాబట్టి ఆ వరుసలోని మొత్తం బాలికలు.. (15 + 12)–1 = 26


టైప్-4

ఒక వరుస లేదా తరగతిలోని ఇద్దరు విద్యార్థుల స్థానాలు రెండు వైపుల నుంచి ఇచ్చి, వారి మధ్యలో మూడో విద్యార్థి ఉంటే, తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్యను కనుగొనడం.

ఉదాహరణ:

- ఒక తరగతిలో B స్థానం పైనుంచి 9. C స్థానం కింది నుంచి 8. A సరిగ్గా వారిద్దరి మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉంటే, తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య? **(2006-SI)**

సాధన:
A అనే విద్యార్థి B, Cల మధ్య ఉన్నాడు. B, Aల మధ్య నలుగురు విద్యార్థులు ఉన్నారు. కాబట్టి A, Cల మధ్య కూడా నలుగురు విద్యార్థులు ఉంటారు.
∴ B, Cల మధ్యలో 9 మంది విద్యార్థులు ఉంటారు.
B స్థానం పైనుంచి 9.
C స్థానం కింది నుంచి 8.



కాబట్టి ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య = 26

- ఒక తరగతిలో 36 మంది బాలురు, బాలికలు సమాన సంఖ్యలో ఉన్నారు. బాలురు బేసి సంఖ్యల స్థానంలో కూర్చున్నారు. అయితే శ్రీను పై నుంచి 17వ స్థానంలో ఉన్నాడు. అయితే శ్రీను కింద ఎంతమంది బాలురు ఉన్నారు?

సాధన: బాలురు బేసి సంఖ్యల స్థానంలో ఉంటే, బాలికలు సరి సంఖ్యల స్థానంలో ఉంటారు. 36 మంది సమాన సంఖ్యలో ఉన్నారు కాబట్టి బాలురు 18. బాలికలు 18. శ్రీను స్థానం పై నుంచి 17(బేసిసంఖ్య). అంటే అతని ముందు 16 మంది (బేసి, సరి సంఖ్యలు) ఉన్నారు. అందులో శ్రీను పైన 8 మంది బాలురు ఉంటారు. మొత్తం 18 మంది బాలురల్లో 8 మంది పైన ఉంటే కింద (10–1)= 9 ఉంటారు.
∴ శ్రీను కింద ఉండే బాలుర సంఖ్య 9.


మాదిరి ప్రశ్నలు

1. ఒక తరగతిలో పాస్ అయిన విద్యార్థుల్లో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నాడు. 15 మంది పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఐదుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. అయితే తరగతిలో మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?

పాస్ అయిన విద్యార్థులు:
$T = (R_1+R_2)-1$
$T = (18+24)-1 = 42-1 = 41$
ఫెయిల్ అయిన విద్యార్థులు
15+5 = 20
కాబట్టి తరగతి మొత్తం విద్యార్థులు
పాస్ + ఫెయిల్ = 41+ 20 = 61

2. ఒక వరుసలో రవి ఎడమ నుంచి 18వ స్థానంలో, శివ కుడి నుంచి 24వ స్థానంలో ఉన్నారు. ఇద్దరి మధ్యలో వేణు, రవి తర్వాత 14వ స్థానంలో ఉన్నాడు. అయితే ఆ వరుసలో ఎంతమంది ఉన్నారు?

సాధన: ఒక వరుసలో ఎడమ నుంచి రవి వరకు 18 మంది, కుడి నుంచి శివ వరకు 24 మంది ఉన్నారు.
అంటే 18+24 = 42
రవి, శివల మధ్య వేణు, రవి తర్వాత 14 స్థానంలో ఉన్నాడు.
అయితే (14+14–1) = 27
రవి, శివల మధ్య 27మంది ఉన్నారు.
కాబట్టి ఆ వరుసలో మొత్తం విద్యార్థుల సంఖ్య = 42+27 = 69




3. 53 మంది విద్యార్థులు ఉన్న ఒక తరగతిలో ముగ్గురు విద్యార్థులు రోహిత్, శివ, శంకర్ ల స్థానాలు ఎడమ నుంచి వరుసగా 9,12,17. అయితే కుడి నుంచి వారి స్థానాలు ఎంత?

సాధన: మొత్తం విద్యార్థులు (T) = 53
రోహిత్ స్థానం $(R_1) = 9$
$R_2 = (T-R_1)+1$
$R_2 = (53-9)+1$
$R_2 = 44+1 = 45$
∴ కుడి నుంచి రోహిత్ స్థానం 45.
మొత్తం విద్యార్థులు (T) = 53
శివ స్థానం (ఎడమ)$(R_1) = 12$
శివ స్థానం (కుడి) $(R_2) = (T-R_1)+1$
$= (53-12)$
$= 41+1 = 42$
∴ కుడి నుంచి శివ స్థానం 42.
మొత్తం విద్యార్థులు (T) = 53
శంకర్ స్థానం (ఎడమ)$(R_1) = 17$
శంకర్ స్థానం (కుడి)(R_2) = ?
$R_2 = (T-R_1)+1$
$R_2 = (T-R_1)+1$
$= (53-17)+1$
$= 36+1 = 37.$
∴ కుడి నుంచి శంకర్ స్థానం 37.

4. వేప చెట్ల వరుసలో మొదటి, చివరి నుంచి ఒక చెట్టు స్థానం 5. అయితే ఆ వరుసలో మొత్తం చెట్ల సంఖ్య. **(2008 SI)**


సాధన:



(R_1+R_2-1) = Total
$R_1 = 5,\ R_2 = 5$
Total $= (R_1+R_2)-1$
$= (5+5)-1 = 10-1 = 9$
∴ ఆ వరుసలోని మొత్తం వేపచెట్లు 9.

5. ఒక వరుసలో ఎడమ నుంచి గణేశ్ స్థానం 12. కుడివైపు నుంచి రాజన్ స్థానం 15. వారి స్థానాలను పరస్పరం మారిస్తే కుడివైపు నుంచి రాజన్ స్థానం 20. ఆ వరుసలో ఎంత మంది ఉన్నారు. **(2006, SI)**

సాధన: గణేశ్ ఎడమ నుంచి 12వ స్థానంలో, రాజన్ కుడి నుంచి 15వ స్థానంలో ఉన్నాడు. వారిద్దరూ పరస్పరం స్థానాలను మార్చుకుంటే రాజన్ కుడి నుంచి 20వ స్థానంలో ఉన్నాడు. ఆ స్థానం ఇంతకు ముందు గణేశ్‌ది.
కాబట్టి కుడి నుంచి గణేశ్ స్థానం 20, ఎడమ నుంచి 12.
∴ ఆ వరుసలో మొత్తం బాలురు
= (20+12) –1 = 31



What is the code for "earn"

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July 4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D 4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two 4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D 3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions.

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone
Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these

Explanations

(1-7):

March June May Jan July April Feb Aug
A E C B F G H D

1. 4 **2.** 1 **3.** 1 **4.** 5 **5.** 2
6. 3 **7.** 1

(8-12):

Q P S R — Row 2
B C D A — Row 1

8. 4 **9.** 1 **10.** 2 **11.** 5 **12.** 1

(13-18):
time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 **14.** 5 **15.** 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):
The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always
Step VI: 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**